Reffered Journal &
Peer Reviewed Journals

RNI No.
APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Web : www.bhavaveena.com

Vol : 23 Issue No. 09 Monthly September 2026 ISSN No. 2456-4702 Rs. : 15/-



భోయి భీమన్న

(సెప్టెంబర్ 19, 1911 - డిసెంబర్ 16, 2005)

మా తెలుగు తల్లికి మల్లెపూదండ - మా కన్న తల్లికి మంగళారతులు

భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals ISSN No. : 2456-4702 RNI No. : APTEL/2003/12253



135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

BHAVAVEENA
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

ముద్రణ	:	సెప్టెంబర్ - 2026
ప్రతులు	:	500
వెల	:	రూ. 15/-
కాపీలకు	:	డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.
గమనిక	:	ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.
ఎడిటోరియల్ చిరునామా	:	డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.
డి.టి.పి & ప్రింటింగ్	:	తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.

మా తెలుగు తల్లికి మల్లెపూదండ - మా కన్న తల్లికి మంగళారతులు



BHAVAVEENA (భావవీణ)

Journal - Arts, Literature, Culture and Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Founder :

Kolla Sri Krishnarao (Late)

E-mail :

bhavaveena2024@gmail.com

7989781963
9949929674
☎ *7989088274*

 # 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

Vol. 23 - Issue. 09-September 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. 15/-
| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253|

EDITORIAL BOARD

Honourable Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy)., M.Ed., M.Phil(Edu), Ph.D.

Chief Editor

Dr. PAYARDA NAGAIAH

M.A.(Tel), M.A(Pol-Sci)., M.Ed., Ph.D.

 # 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

ADVISORY COMMITTEE

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Former Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hyderabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil. (Computational Linguistics) Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, University of Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A.(Tel)., M.A(San)., M.A (Ling)., PhD.
   HOD, Dept. of Telugu
   Sri A.S.N.M. Govt. Degree College,
   Palakollu, West Godavari Dist., A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
   Principal,
   St. Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

ASSOCIATE EDITORS

1. **Prof. N.R. Sadaisva Reddy,** M.A., M.Phil, PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V. Sankara Rao,** M.A., M.Phil, PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHU BABU,** M.A., M.Phil, PhD.
Associate Professor, Dept. of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. LAVANYA,** M.A., M.Phil, PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. **Prof. N.V. KRISHNA RAO,** M.A., M.Phil, PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University.
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda, Warangal, Telangana.
7. **Prof. J. VENKATA RAMANA,** M.A., M.Phil, PhD.
Dept. of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.
8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.
9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil, PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.
10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.
11. **Dr. P. Vijaya Kumar,** M.A., M.Phil, PhD.
Associate Professor, Dept. of Telugu,
Central University, Gachibowli, Hyderabad,
Telangana.
12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil, PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar,
Telangana.

ADVISORY COMMITTEE

Pitta Sundara Babu, M.A., B.L.,

Advocate, Narasapur.

DTP & PRINTING

Sree Ganesh Graphics, Guntur., Cell : 9951578128.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet,
Guntur - 522 002, Andhra Pradesh., Cell : 7386529274, 7989781963,
E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002., Ph : 94 94 660 509.

బోయి భీమన్న

(సెప్టెంబర్ 19, 1911 - డిసెంబర్ 16, 2005)

తెలుగు సాహిత్యాన్ని, దళిత అస్తిత్వ చైతన్యాన్ని తన రచనల ద్వారా సుసంపన్నం చేసిన ప్రసిద్ధ మహాకవి, జాతీయవాది. తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో ఒక పేద దళిత (హరిజన) కుటుంబంలో జన్మించారు. జననం, తల్లిదండ్రులు: 1911 సెప్టెంబరు 19న పుల్లయ్య, నాగమ్మ దంపతులకు జన్మించారు. వీరిది పంచపాండవుల వలె ఐదుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్న కుటుంబం. భీమన్న తండ్రి మగపిల్లలకు ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అని పేర్లు పెట్టారు. 1935లో బి.ఎ. మరియు 1937లో బి.ఇడి. పూర్తి చేశారు. విద్యాభ్యాసం తర్వాత ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా సేవలందించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. 1978 నుండి 1984 వరకు శాసనమండలి సభ్యుడిగా (MLC) కూడా పనిచేశారు.

బోయి భీమన్న సుమారు (70) కు పైగా గ్రంథాలను తెలుగు, ఇంగ్లీష్ భాషలలో రచించారు.

గుడిసెలు కాలిపోతున్నాయ్ : ఇది ఆయనకు అత్యంత పేరు తెచ్చిన ప్రసిద్ధ వచన కవితా సంపుటి / ఖండకావ్యం.

ఇతర రచనలు : 'పాలేరు' (నాటకం), 'నాకు తెలిసిన జాషువా', 'రాజకీయ వీరుడు డాక్టర్ ఖాన్', 'పిల్లి శతకం', మరియు ఆత్మకథ 'పాలేరు నుండి పద్మశ్రీ' మొదలైనవి.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు :

'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథానికి లభించింది. పద్మశ్రీ (1973) మరియు పద్మభూషణ్ (2001) పురస్కారాలను భారత్ ప్రభుత్వం నుండి అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు, మరియు 'కళాప్రపూర్ణ' బిరుదు పొందారు.

సామాజిక అసమానతలను, అంటరానితనాన్ని ఎదిరిస్తూ, మానవతావాదాన్ని చాటిన భీమన్న 2005 డిసెంబర్ 16న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన స్మృత్యర్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయంలో 'బోయి భీమన్న సాహిత్య పీఠం' ఏర్పాటు చేసింది.

తెలుగు సాహిత్యంలో స్థిరస్థాయి ముద్ర వేసుకున్న వ్యక్తి బోయి భీమన్న సదా చరస్మరణీయులు

★ ★ ★

Contents (విషయ సూచిక)

1.	తెలుగులో టెస్టిమోనియా సాహిత్య పరిచయం	– డా. ఆచార్య భూక్య తిరుపతి	7
2.	ఎండ్లూరి సుధాకర్‌గారి కథలు – దళిత ఉద్యమ ప్రభావం	– డా. టి. వెంకటస్వామి	13
3.	గోసంగి కవిత – పాతాళ ప్రశ్నలు పరిశీలన	– డా. మామిడి లింగయ్య	22
4.	మిట్టపల్లి సురేందర్ 'గేయ' సాహిత్యం – సామాజిక సంవేదన	– డా. జరుపుల రమేష్	30
5.	ప్రకృతి వాది ఎండ్లూరి సుధాకర్	– డా. ఎల్మల రంజీత్ కుమార్	40
6.	బహుజన సమాజ ప్రతిబింబాలు పెద్దింటి అశోక్...	– డా. లక్ష్మీగళ్ళ మహిపాల్	44
7.	"విషప్పురుగు" గిరిజన సంచార తెగల కథలు – సమాలోచన	– డా.బి.లచ్చయ్య	48
8.	బాల భక్తుడు ధ్రువుడు – దృఢ సంకల్పం	– డా. తోట రామకృష్ణ	54
9.	తెలుగు సాహిత్యంలో – సద్విమర్శ కొరత	– పూసాల. సత్యనారాయణ	59
10.	చౌడూరి గోపాలరావు సాహిత్య విశ్లేషణ	– బి. జమున	63
11.	వైద్యం వెంకటేశ్వరాచార్యుల–వచన రచనలు పరిశీలన	– రాచపూడి జయసుశీల	66
12.	పాఠశాల విద్యార్థులు – నైతిక విలువల బోధన ఆవశ్యకత	– కె. నర్సోద్దిన్	71
13.	శ్రీమద్విరాట పర్వం – వ్యక్తిత్వ వికాసం	– డా. గుబ్బల సత్యశ్రీ	75
14.	రాయలసీమ సాంఘిక నాటకాలు – చారిత్రక అధ్యయనం	– పి. భార్గవి ప్రియదర్శిని	81
15.	బాల సుధాకర్ మౌళి కవిత్వం – కళింగాంధ్ర అస్తిత్వం	– యర్రంశెట్టి మణికంఠ – ఆచార్య జర్రా అప్పారావు	86
16.	వి. ప్రతిమ సాహిత్యం – పరిశీలన – స్త్రీలు సమస్యలు	– గుండాల నరేంద్రబాబు	91
17.	నిజ జీవిత కథలు – డా. కొండపల్లి నీహారిణీ గారి రాచిప్ప కథలు	– పి. మృదుల	99
18.	దాట్ల దేవదానం రాజు కథలు – సామాజిక చిత్రణ	– పి. జ్యోతి లక్ష్మి	102
19.	తెలంగాణ కథా సాహిత్యంలో కుమ్మరి జీవన చిత్రణ	– డా. సి.హెచ్. శేఖర్	105
20.	దెంచనాల జ్వలిత జీవితం, సాహిత్యం – కథల పరామర్శ	– బి. ప్రవల్లిక	110
21.	తెలంగాణ వృత్తి జీవన కథలు – సామాజిక వైవిధ్యాల పరిశీలన	– డా. వెంకట్ బాలగోని	115
23.	జాతీయ స్వాతంత్ర్యోద్యమ గీతాలు – జాతీయత	– దాసరి విజయ కుమారి	122
24.	తెలంగాణ చరిత్ర – సామాజిక పరివర్తనకు ప్రతిబింబాలు – పి.వి. నరసింహారావు 'గొల్ల రామవ్వ' నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం' కథల తులనాత్మక పరిశీలన	– చేరాల సూర్యనారాయణ	135
25.	స్వర్ణయుగంగా ప్రకాశించిన సాహితీ జీవనం	– సుండు శ్రీనివాస్	141
26.	**తెన్నేటి సుధాదేవి కవిత్వంలో స్త్రీల అస్తిత్వం**	– భూక్య సంధ్య	145
27.	IMPORTANCE OF THE MOTHER TONGUE IN THE NEW EDUCATION POLICY NEP 2020 - CHALLENGES	– కె. రమాదేవి	155

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

తెలుగులో టెస్టిమోనియో సాహిత్య పరిచయం

ఆచార్య భూక్య తిరుపతి
తెలుగు శాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
హైదరాబాద్–500046
చరవాణి: 94413 35123

****

ప్రస్తావన:

ఆధునిక తెలుగు సాహిత్యంలో అణగారిన, అంచులకు నెట్టబడిన, ఆధిపత్య చరిత్రలో తగిన స్థానం పొందని సమూహాల జీవితానుభవాలు విభిన్న ప్రక్రియల ద్వారా వ్యక్తమవుతున్నాయి. ఈ రచనలను టెస్టిమోనియా (Testimonio) అనే సైద్ధాంతిక భావనతో పరిశీలించడం తెలుగు సాహిత్య విమర్శలో ఒక కొత్త అధ్యయన మార్గాన్ని ఏర్పరుస్తుంది. 'టెస్టిమోనియా' అంటే సాక్ష్యం, వాంగ్మూలం, ప్రత్యక్ష అనుభవ ప్రకటన అనే అర్థాలు ఉన్నప్పటికీ, సాహిత్య సిద్ధాంతంలో ఇది వ్యక్తిగత అనుభవం ద్వారా సామూహిక అణచివేతను, సామాజిక వాస్తవికతను, చారిత్రక జ్ఞాపకాన్ని, అస్తిత్వాన్ని, ప్రతిఘటనను వ్యక్తీకరించే కథన రూపంగా పరిణమించింది.

జాన్ బెవర్లీ టెస్టిమోనియాను సామాజిక–రాజకీయంగా ఆవేశభరితమైన 'నారేటివ్ ఆఫ్ విట్‌నెసింగ్'గా చర్చించాడు. అతని "టెస్టిమోనియో ఆన్ ది పాలిటిక్స్ ఆఫ్ ట్రూత్" అనే గ్రంథం ఈ ప్రక్రియకు సంబంధించిన రాజకీయ, నైతిక, ప్రాతినిధ్య సమస్యలను విస్తృతంగా చర్చిస్తుంది. తెలుగు టెస్టిమోనియాను ఒక నిర్దిష్ట దిగుమతి చేసుకున్న ప్రక్రియగా కాకుండా, స్థానిక సామాజిక అనుభవాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సాధనంగా చూడాలి. తెలుగు టెస్టిమోనియా సాహిత్యాన్ని ప్రధానంగా ఐదు విభాగాలుగా విభజించవచ్చని నా అభిప్రాయం.

(1) దళిత టెస్టిమోనియా
(2) దళిత స్త్రీ టెస్టిమోనియా
(3) ఆదివాసీ గిరిజన టెస్టిమోనియా
(4) బహుజన టెస్టిమోనియా
(5) మైనారిటీ టెస్టిమోనియా.

సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ఎక్కువకాలం ఆధిపత్య వర్గాల అనుభవాలు, వారి విలువలు, వారి సాంస్కృతిక దృక్పథాలు సాహిత్య నిర్మాణంలో ప్రధానంగా నిలిచిన విషయం గమనించవచ్చు. అయితే ఆధునికత, ప్రజాస్వామిక చైతన్యం, సామాజిక ఉద్యమాలు, దళిత ఉద్యమం, స్త్రీవాద ఉద్యమం, ఆదివాసీ హక్కుల ఉద్యమాలు, బహుజన ఉద్యమాలు, మైనారిటీ అస్తిత్వ ఉ ద్యమాలు బలపడటంతో సాహిత్యంలో కొత్త స్వరాలు ప్రవేశించాయి. ఈ కొత్త స్వరాల ప్రత్యేకత ఏమిటంటే అవి ఇతరులు తమ గురించి రాసిన కథనాలను మాత్రమే స్వీకరించకుండా, "మా జీవితాన్ని మేమే చెబుతాం" అనే హక్కును ప్రకటించాయి. టెస్టిమోనియా రచనలో వ్యక్తి తన అనుభవానికి సాక్షి, తన సమాజానికి ప్రతినిధి, తన చరిత్రకు వ్యాఖ్యాత, తన అస్తిత్వానికి ప్రకటనకర్తగా పరిణమిస్తాడు. తెలుగు దళిత సాహిత్యంలో ఈ లక్షణాలు ప్రత్యేకంగా స్పష్టంగా కనిపిస్తాయి. ది ఆక్స్ ఫర్డ్ ఇండియా ప్రచురించిన "తెలుగు దళిత రచనల సంకలనం"లో దాదాపు శతాబ్దపు తెలుగు దళిత రచనను పాటలు, కవితలు, కథలు, నవలల భాగాలు, వ్యక్తిగత కథనాలు, వ్యాసాలు, చారిత్రక ఆర్కైవ్‌లతో కలిపి పరిచయం చేస్తుంది. ఈ సంకలనంలో యెండ్లూరి సుధాకర్, జి. కళ్యాణరావు, వేముల ఎల్లయ్య, జూపాక సుభద్ర, గోగు శ్యామల తదితరుల రచనలు ఉన్నాయి.

'టెస్టిమోనియో' అనే పదానికి మూలం స్పానిష్ భాష. దీనికి సాక్ష్యం, వాంగ్మూలం, సాక్ష్యప్రకటన అనే అర్థాలు ఉన్నాయి. లాటిన్ అమెరికాలో సామాజిక–రాజకీయ అణచివేతను ఎదుర్కొన్న ప్రజల అనుభవాల నుంచి ఈ రచనా విధానం అమలులోకి వచ్చింది. బెవర్లీ ప్రకారం టెస్టిమోనియా కేవలం వ్యక్తిగత కథనం కాదు; అణగారిన సామాజిక వ్యక్తులను ప్రతిబింబించే కథన రూపం. తెలుగు సాహిత్యంలో 'టెస్టిమోనియా' అనే పదం విస్తృతంగా స్థిరపడకపోయినా, దాని లక్షణాలు ఆత్మకథలు, జీవితకథలు, వ్యక్తిగత కథనాలు, జ్ఞాపక రచనలు, దళిత కథలు, దళిత స్త్రీల రచనలు, జానపద గీతాలు, మౌఖిక చరిత్రలు, ఆదివాసీ కథనాలు, బహుజన వృత్తి కథనాలు, మైనారిటీ అస్తిత్వ రచనా రూపాల్లో కనిపిస్తాయి. వ్యక్తిగత జీవితం ఒక సామాజిక వర్గం అనుభవానికి సాక్ష్యంగా మారినప్పుడు, రచయిత 'నేను' అనే పరిధిని దాటి 'మనం' అనే సామూహిక అస్తిత్వాన్ని వ్యక్తీకరించినప్పుడు టెస్టిమోనియల్ స్వభావం బలపడుతుంది.

1) దళిత టెస్టిమోనియా:

తెలుగు టెస్టిమోనియా సాహిత్యంలో దళిత టెస్టిమోనియా అత్యంత బలమైన విభాగం. కులవ్యవస్థ, అంటరానితనం, సామాజిక బహిష్కరణ, వృత్తి ఆధారిత వివక్ష, విద్యలో అసమానత, భూహక్కుల సమస్య, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలు దళిత టెస్టిమోనియాలో ప్రధానంగా కనిపిస్తాయి. దళిత టెస్టిమోనియాలో రచయిత తన అనుభవాన్ని చెబుతాడు. అయితే ఆ అనుభవం వ్యక్తిగతమైనదిగానే ఆగిపోదు. ఉదా: పాఠశాలలో కుల వివక్షను ఎదుర్కొన్న వ్యక్తి యొక్క వ్యక్తిగత సంఘటన, కులవ్యవస్థ, సామాజిక నిర్మాణం, సామూహిక బాధ గా విస్తరిస్తుంది. అందువల్ల దళిత టెస్టిమోనియా వ్యక్తిగత అనుభవాన్ని సామాజిక సాక్ష్యంగా మారుస్తుంది.

దళితుల జీవితానికి సంబంధించిన అనేక అనుభవాలు సంప్రదాయ చరిత్రలో నమోదు కాలేదు. దళిత టెస్టిమోనియా వాటిని నమోదు చేస్తుంది. దీని వల్ల అధికారిక చరిత్రకు–ప్రజా చరిత్ర, లిఖిత చరిత్రకు–మౌఖిక చరిత్ర, ఆధిపత్య స్వరానికి–అణగారిన స్వరం అనేవి ప్రత్యామ్నాయాలుగా ఏర్పడతాయి. యెండ్లూరి సుధాకర్ రచనలో వ్యక్తిగత జీవితం, దళిత అస్తిత్వం, విద్య, సామాజిక చైతన్యం పరస్పర సంబంధం కలిగి ఉన్న విషయాలు చూడవచ్చు. ఆయన "ఆటోబయోగ్రఫీ"ని ఆక్స్ ఫర్డ్ ఇండియా సంకలనంలో వ్యక్తిగత కథనంగా చేర్చబడింది. టెస్టిమోనియా దృష్టిలో ఇది జీవితం, జ్ఞాపకం, అనుభవం,సాక్ష్యం, సామాజిక అవగాహన అనే నిర్మాణాన్ని సూచిస్తుంది.

2) దళిత స్త్రీ టెస్టిమోనియా:

దళిత స్త్రీ టెస్టిమోనియా అనేది సంక్లిష్టమైనది. ఎందుకంటే దళిత స్త్రీ అనుభవం కేవలం కుల వివక్షతోనూ, కేవలం లింగ వివక్షతోనూ వివరించలేం. ఆమె అనుభవంలో కులం, లింగం, వర్గం, ఉపకులం, ప్రాంతం, శ్రమ, భాష అన్నీ పరస్పరం పనిచేస్తాయి. జూపాక సుభద్ర, గోగు శ్యామల సంపాదకత్వంలో వెలువడిన "నల్లరేగడి సాళ్లు: మాదిగ ఉపకులాల స్త్రీలకథలు" అనేది మాదిగ ఉపకుల స్త్రీల అనుభవాలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుంది. జూపాక సుభద్రను తెలంగాణకు చెందిన మాదిగ స్త్రీగా చూస్తే ఆమె అస్తిత్వం కులం, ఉపకులం, వర్గం, లింగం, భాష, ప్రాంతం వంటి అనేక పొరలతో నిర్మితమైందని చెప్పవచ్చు. విమర్శాత్మక అధ్యయనం పేర్కొంటుంది. ఆమె ఉపయోగించే భాష తెలంగాణ మాదిగ శ్రామిక స్త్రీల భాషతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుంది.

దళిత స్త్రీ టెస్టిమోనియాలో భాషకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రామాణిక భాషలో తన అనుభవాన్ని చెప్పడం కంటే, తన సహజమైన మాండలికంలో చెప్పడం ద్వారా రచయిత నా జీవితం మాత్రమే కాదు; నా భాష కూడా గౌరవించబడాలి అని ప్రకటిస్తుంది. కనుక మాండలికం, సాంస్కృతిక జ్ఞాపకం, అస్తిత్వం అనే సంబంధం ఏర్పడుతుంది. మాదిగ స్త్రీల జీవనానుభవాల్లోని స్థానిక వైద్యపద్ధతులు, కళలు, శ్రమజ్ఞానం, ఆచారాలు, జీవనపద్ధతులు కూడా జ్ఞానంగా గుర్తించబడాలని సుభద్ర రచనల ద్వారా అర్థమవుతుంది. టెస్టిమోనియా కేవలం బాధను నమోదు చేయదు; అణగారిన సమాజపు జ్ఞానాన్ని కూడా పునరుద్ధరిస్తుంది.

3) ఆదివాసీ గిరిజన టెస్టిమోనియా:

తెలుగు ప్రాంతాల ఆదివాసీ గిరిజన జీవితాన్ని టెస్టిమోనియా దృష్టితో పరిశీలించినప్పుడు అడవి, భూమి, నీరు, వనరులు, స్థానిక సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం, భాష, వలస/నిర్వాసితత్వం, అభివృద్ధి పేరుతో జరిగే స్థానచలనం, అడవిపై హక్కులు, సామాజిక అస్తిత్వం అనే అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. దళిత టెస్టిమోనియాలో కులం ప్రధాన సమస్య అయితే, ఆదివాసీ గిరిజన టెస్టిమోనియాలో భూమి–అడవి అస్తిత్వానికి కేంద్రంగా నిలుస్తాయి. కనుక భూమి కోల్పోవడం, జీవనాధారం కోల్పోవడం, సంస్కృతి కోల్పోవడం, అస్తిత్వ సంక్షోభం అనే సమీకరణం ఏర్పడుతుంది.

ఆదివాసీ గిరిజన సమాజాల్లో జ్ఞానం తరతరాలుగా మౌఖికంగా సంక్రమించినందున పాటలు, పురాణాలు, సామూహిక కథలు, వేట, వ్యవసాయ అనుభవాలు, ప్రకృతి జ్ఞానం టెస్టిమోనియల్ మూలాలుగా పనిచేయగలవు. అందువల్ల ఆదివాసీ గిరిజన టెస్టిమోనియాను కేవలం ముద్రిత సాహిత్యంలోనే కాకుండా మౌఖిక సాంస్కృతిక జ్ఞాపకంలో కూడా అన్వేషించాలి. అభివృద్ధి చరిత్రలో ఆనకట్ట, రహదారి, గనులు, పరిశ్రమ వంటి అంశాలు పురోగతికి సూచికలుగా కనిపించవచ్చు. కానీ అదే సంఘటనను ఆదివాసీ గిరిజన సమాజం స్థానచలనం, జీవనాధార నష్టం, అడవి నష్టం, సంస్కృతి నష్టంగా అనుభవించవచ్చు. ఈ విభిన్న దృష్టికోణాన్ని నమోదు చేయడం ఆదివాసీ గిరిజన టెస్టిమోనియా ప్రధాన కర్తవ్యం.

తెలుగు సాహిత్యంలో ఆదివాసీ గిరిజన టెస్టిమోనియాకు ఉదాహరణగా ఆదివాసీ జీవనాన్ని, వారి భూమి–అడవి సంబంధాన్ని, దోపిడీని, నిర్వాసనాన్ని ప్రతిబింబించే కథనాలను తీసుకోవచ్చు. ఉదా: గోగు శ్యామల సంపాదకత్వంలోని నల్లపొద్దు వంటి అంచుల జీవితాల అనుభవ కథనాలను ఈ దృక్కోణంలో పరిశీలించవచ్చు. ఒక ఆదివాసీ వ్యక్తి తన అనుభవాన్ని ఇలా చెబుతున్నాడని భావించినట్లయితే – మా అడవి మాకు కేవలం చెట్లు కాదు. అక్కడే మా ఇల్లు, మా పొలం, మా దేవతలు, మా పండుగలు ఉన్నాయి. అడవిని వదిలి వెళ్లిన రోజు మా జీవితం కూడా మాతో రాలేదు. ఇక్కడ ఇది కేవలం ఒక వ్యక్తి వ్యక్తిగత జ్ఞాపకం కాదు. అతని ద్వారా మొత్తం ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న భూమి కోల్పోవడం, అడవి నుంచి

నిర్వాసనం, జీవనాధారం దెబ్బతినడం, సంస్కృతి కోల్పోవడం వంటి సమస్యలు వ్యక్తమవుతున్నాయి. కనుక వ్యక్తిగత అనుభవం, ఆదివాసీ గిరిజన సమూహ అనుభవం, సామాజిక సాక్ష్యం, అస్తిత్వ ప్రకటనగా మారినప్పుడు దాన్ని ఆదివాసీ గిరిజన టెస్టిమోనియాగా గుర్తించవచ్చు. అంటే "నా అడవి" అనే వ్యక్తిగత జ్ఞాపకం "మా అస్తిత్వం" అనే సామూహిక సాక్ష్యంగా మారడమే ఆదివాసీ గిరిజన టెస్టిమోనియా ప్రత్యేకత అని చెప్పవచ్చు.

4) బహుజన టెస్టిమోనియా:

'బహుజన' అనే భావన చాలా విస్తృతమైనది. కులవ్యవస్థలో వివిధ శ్రామిక, ఉత్పత్తి, వృత్తి ఆధారిత సమూహాలు తమ జీవనానుభవాలను సాహిత్యంగా వ్యక్తీకరించినప్పుడు వాటిని బహుజన టెస్టిమోనియా దృష్టితో పరిశీలించవచ్చు. ఇందులో ప్రధానంగా కమ్మరి, కుమ్మరి, మత్స్యకారులు, చేనేత కార్మికులు, గొల్ల-కురుమలు, వడ్డెర్లు, నాయీ బ్రాహ్మణులు, ఇతర వృత్తి సమూహాలు వంటి సమాజాల జీవన అనుభవాలను పరిగణనలోకి తీసుకోవచ్చు.

బహుజన టెస్టిమోనియాలో అత్యంత ముఖ్యమైన అంశం వృత్తి జ్ఞానం. ఒక వృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాదు. దీనిలో సాంకేతిక జ్ఞానం, సామూహిక అనుభవం, సంస్కృతి, భాష, సంప్రదాయం అనేవి నిక్షిప్తమై ఉంటాయి. కానీ ఆధిపత్య జ్ఞాన వ్యవస్థలు ఈ వృత్తిజ్ఞానాన్ని చాలాసార్లు 'స్థానిక' లేదా 'తక్కువ స్థాయి' జ్ఞానంగా పరిగణించాయి. కనుక 'బహుజన టెస్టిమోనియా' అనేది ఆ జ్ఞానానికి గౌరవాన్ని పునరుద్ధరిస్తుంది. బహుజన సాహిత్యంలో శ్రమకు ఒక ప్రత్యేక సౌందర్యం ఉంది. పొలం, పనిముట్లు, చెమట, వృత్తి, ఉత్పత్తి, మార్కెట్, కుటుంబం వంటి అంశాలు జీవన అనుభవాలుగా వస్తాయి. కనుక బహుజన టెస్టిమోనియా "ఉత్పత్తి చేసే చేతులకు చరిత్రలో స్థానం ఎక్కడ?" అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. బహుజన వృత్తి సమాజాల్లోని పాటలు, సామెతలు, వృత్తి కథలు, పండుగ పాటలు, పని పాటలు వారి సామూహిక జ్ఞాపకాలను భద్రపరుస్తాయి. ఇవి లిఖిత సాహిత్యానికి వెలుపల ఉన్నప్పటికీ టెస్టిమోనియా అధ్యయనానికి విలువైన మూలాలు అని భావించవచ్చు.

బహుజన టెస్టిమోనియాకు కులవృత్తులు, శ్రమ, పేదరికం, సామాజిక వివక్ష, విద్యా అవకాశాల లేమి, అస్తిత్వ పోరాటం వంటి అనుభవాలను వ్యక్తిగత జీవితం ద్వారా సామూహిక అనుభవంగా వ్యక్తీకరించే రచనలు ఉదాహరణగా నిలుస్తాయి.

ఉదా: ఒక బహుజనవృత్తి జీవి తన అనుభవాన్ని మా తాత మగ్గం నడిపాడు. మా నాన్న కూడా మగ్గం నడిపాడు. నేనూ అదే పని చేస్తున్నాను. మా చేతులతో బట్టలు తయారవుతున్నాయి; కానీ మా ఇంట్లో మాత్రం సరైన బట్టలు ఉండేవి కావు. ఇది ఒక వ్యక్తి కుటుంబ అనుభవంలా కనిపించినప్పటికీ, దాని వెనుక వృత్తి ఆధారిత శ్రమ, ఆర్థిక అసమానత, కులవృత్తులపై ఆధారపడిన జీవనం, శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లేకపోవడం వంటి విస్తృతమైన బహుజన సమాజ సమస్యలు ఉన్నాయి. కనుక వ్యక్తిగత అనుభవం, వృత్తి సమూహ అనుభవం, సామాజిక వాస్తవికత, బహుజన అస్తిత్వ సాక్ష్యం గా పరిణామం చెందుతుంది. కనుక ఒక వ్యక్తి తన శ్రమజీవితాన్ని చెప్పడం మాత్రమే కాకుండా, తనలాంటి అనేకమంది బహుజనుల జీవన వాస్తవికతకు ప్రతినిధిగా ఆ అనుభవాన్ని వ్యక్తం చేసినప్పుడు అది బహుజన టెస్టిమోనియాగా రూపుదిద్దుకుంటుందని చెప్పవచ్చు.

5) మైనారిటీ టెస్టిమోనియా:

మైనారిటీ టెస్టిమోనియా అనేది మత, భాషా, సాంస్కృతిక లేదా సామాజిక మైనారిటీ సమూహాలు తమ అనుభవాలను వ్యక్తీకరించే కథనాలను సూచించడానికి ఉపయోగించవచ్చు. తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా ముస్లిం మైనారిటీ రచనల్లో

మతపరమైన అస్తిత్వం, సామాజిక అపోహలు, పేదరికం, విద్య, స్త్రీ అనుభవం, మతసామరస్యం, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అనుమానం, సాంస్కృతిక గుర్తింపు వంటి అంశాలు కనిపిస్తాయి. మైనారిటీ టెస్టిమోనియాలో "నేను ఈ సమాజంలో భాగమేనా? లేక ఎప్పటికీ పరాయివాడిగానే చూడబడుతున్నానా?" అనేది ప్రధాన సమస్య వ్యక్తిగత అనుభవం నుంచి సామాజిక గుర్తింపు సమస్యగా విస్తరిస్తుంది.

ది ఆక్స్ ఫర్డ్ ఇండియా సంకలనంలోని తెలుగు దళిత రచనలో "వేర్ డు ముస్లీమ్స్ స్టాండ్ టుడే" అనే బి. శ్యామసుందర్ రచనను చారిత్రక ఆర్కైవ్ విభాగంలో చేర్చడం గమనార్హం. ఇది దళిత సంకలనమే అయినప్పటికీ, తెలుగు సామాజిక–రాజకీయ రచనల విస్తృత పరస్పర సంబంధాన్ని చూపిస్తుంది. మైనారిటీ టెస్టిమోనియా దృష్టిలో మతాన్ని కేవలం ఆధ్యాత్మిక అంశంగా కాకుండా సామాజిక గుర్తింపు, పౌరత్వం, సంస్కృతి, జ్ఞాపకం వంటి అంశాలతో కలిపి చూడవలసిన పరిస్థితి. మైనారిటీ టెస్టిమోనియా అంటే ఒక మైనారిటీ సమూహానికి చెందిన వ్యక్తి తన ప్రత్యక్ష జీవితానుభవం ద్వారా ఆ సమూహం ఎదుర్కొంటున్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక లేదా మతపరమైన సమస్యలకు సాక్ష్యంగా నిలిచే కథనం. ఒక ముస్లిం కుటుంబానికి చెందిన వ్యక్తి తన అనుభవాన్ని ఇలా చెప్పాడు. మా పండుగలు, మా ఆచారాలు మా ఇంట్లో ఎంతో సహజమైనవి.కానీ బయట మా పేరును బట్టి మమ్మల్ని అనుమానంగా చూసిన సందర్భాలు ఉన్నాయి. మా గురించి మాకు తెలియని వాళ్లు నిర్ణయాలు తీసుకోవడం బాధ కలిగించింది. ఇది కేవలం ఒక వ్యక్తి అనుభవం కాదు. అతని అనుభవం ద్వారా మైనారిటీ గుర్తింపు, సామాజిక అపోహలు, వివక్ష, సాంస్కృతిక అస్తిత్వం వంటి విస్తృతమైన సమస్యలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత అనుభవం, మైనారిటీ సమూహ అనుభవం, సామాజిక సాక్ష్యం, అస్తిత్వ ప్రకటనగా మారినప్పుడు అది మైనారిటీ టెస్టిమోనియా అవుతుంది అంటే ఒక మైనారిటీ వ్యక్తి తన జీవితానుభవాన్ని చెప్పడం ద్వారా తనలాంటి సమూహం ఎదుర్కొంటున్న వివక్ష, గుర్తింపు, సంస్కృతి, అస్తిత్వ సమస్యలకు సాక్ష్యంగా నిలిచే కథనమే మైనారిటీ టెస్టిమోనియా అని చెప్పవచ్చు.

ఈ ఐదు విభాగాలు పరస్పరం పూర్తిగా వేరుగా ఉండవు. ఒక వ్యక్తి ఒకేసారి దళితుడు, స్త్రీ, కార్మికుడు, ప్రాంతీయ సమాజానికి చెందినవాడు కావచ్చు. కాబట్టి టెస్టిమోనియా అధ్యయనంలో అంతర్ సంబంధిత అస్తిత్వాలు అనే భావన అవసరం అవుతుంది.

ముగింపు:

తెలుగు సాహిత్యంలో టెస్టిమోనియా ఒక విస్తృతమైన, ఇంకా పూర్తిగా సిద్ధాంతీకరించబడని అధ్యయన క్షేత్రం. తెలుగు సమాజంలోని కులవ్యవస్థ, ఉపకుల అస్తిత్వాలు, లింగ వివక్ష, ఆదివాసీ భూమి, అడవి సమస్యలు, వృత్తి ఆధారిత సామాజిక నిర్మాణాలు, మైనారిటీ గుర్తింపు సమస్యలు వంటి స్థానిక వాస్తవాల ఆధారంగా దీనికి స్వదేశీ విమర్శా నమూనాను నిర్మించాలి. ఈ ఐదు విభాగాలు తెలుగు టెస్టిమోనియా సాహిత్యానికి విస్తృతమైన రూపాన్ని ఇస్తాయి. దళిత టెస్టిమోనియా అనేది కుల అణచివేతకు సాక్ష్యం అయితే దళిత స్త్రీ టెస్టిమోనియా అనేది కులం, లింగం, ఉపకులం, శ్రమకు సాక్ష్యం. అలానే ఆదివాసీ టెస్టిమోనియా అనేది భూమి, అడవి, ప్రకృతి, సంస్కృతికి సాక్ష్యంగా నిలుస్తుంది. బహుజన టెస్టిమోనియా అనేది శ్రమ, వృత్తి, ఉత్పత్తి జ్ఞానానికి సాక్ష్యం కాగా మైనారిటీ టెస్టిమోనియా అనేది గుర్తింపు, పరాయీకరణ, సాంస్కృతిక అస్తిత్వానికి సాక్ష్యం అవుతుంది. అంతిమంగా తెలుగు టెస్టిమోనియా సాహిత్యాన్ని అణగారిన వ్యక్తి తన జీవితానికి తానే సాక్షిగా నిలిచి, తన అనుభవాన్ని సామూహిక జ్ఞాపకంగా, సామూహిక జ్ఞాపకాన్ని ప్రత్యామ్నాయ చరిత్రగా, ప్రత్యామ్నాయ చరిత్రను అస్తిత్వ ప్రకటనగా, అస్తిత్వ ప్రకటనను సామాజిక ప్రతిఘటనగా పరిణమింపజేసే సాహిత్య ప్రక్రియే తెలుగు టెస్టిమోనియా సాహిత్యం. అని నిర్వచించవచ్చు.

ఆధార గ్రంథాలు:

1. పురుషోత్తం, కె. గీతా రామస్వామి, గోగు శ్యామల (సంపా.) ది ఆక్స్ ఫర్డ్ ఇండియా సంకలనం తెలుగు దళిత రచన. న్యూఢిల్లీ: ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 2016.
2. జూపాక సుభద్ర, గోగు శ్యామల, సంపాదకులు. నల్లరేగడి సాళ్లు: మాదిగ ఉపకులాల స్త్రీల కథలు.
3. ఎండ్లూరి సుధాకర్ – మల్లెమొగ్గల గొడుగు.
4. డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, వినిర్మాణం, కవిత, తెలంగాణ రీసెర్చ్ & రెఫరాల్ సెంటర్, హైదరాబాద్, 2021.
5. జి. కళ్యాణరావు – అంటరాని వసంతం.
6. వేముల ఎల్లయ్య – కక్క.
7. బోయి భీమన్న – పాలేరు.
8. డా॥ భూక్య తిరుపతి, కాళోజి రచనల్లో సమాజం, భాష, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2017.
9. అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అస్తిత్వవాదం, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

ఎండ్లూరి సుధాకర్‌గారి కథలు - దళిత ఉద్యమ ప్రభావం



- డా. టి. వెంకటస్వామి
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రచురణల విభాగం
ద్రావిడ విశ్వవిద్యాలయం
కుప్పం-517426
చరవాణి: 9492631323

1. పరిచయం :

తెలుగు సాహిత్యంలో దళిత అనుభవాన్ని అంతర్భాగంగా చేసుకుని, దళితుల సామాజిక చరిత్రను, సాంస్కృతిక అస్తిత్వాన్ని, అవమానాలను, ఆత్మగౌరవాన్ని, ప్రతిఘటనను సృజనాత్మకంగా ప్రతిపాదించిన రచయితల్లో ఎండ్లూరి సుధాకర్‌ది ప్రత్యేకమైన స్థానం. ముఖ్యంగా మల్లెమొగ్గల గొడుగు కథాసంపుటి తెలుగు దళిత కథా సాహిత్యంలో ఒక విశిష్ట మలుపును సూచిస్తుంది. ఈ సంపుటిలోని కథలు కేవలం వ్యక్తుల దుఃఖగాథలు కావు; అవి మాదిగ సమాజపు జీవన విధానం, వృత్తి సంస్కృతి, కుటుంబ సంబంధాలు, కులపీడన, ఆర్థిక అసమానత, మతపరమైన భావజాలం, పురాణాల పునర్వ్యాఖ్యానం, విద్య ద్వారా వచ్చిన మార్పు, వలస, రాజకీయ చైతన్యం, దళిత అస్తిత్వాన్వేషణ వంటి అనేక అంశాలను సమగ్రంగా ప్రతిబింబిస్తాయి. ఎండ్లూరి సుధాకర్ కథలను కేవలం దళిత జీవిత చిత్రణగా చూడటం పరిమిత దృష్టి. వాటి వెనుక 1980ల నుంచి బలపడిన దళిత సాహిత్య చైతన్యం, అంబేద్కర్ భావజాల ప్రభావం, దళిత ఉద్యమాల ద్వారా ఏర్పడిన ఆత్మగౌరవ స్పృహ, ముఖ్యంగా మాదిగ దండోరా ఉద్యమం వంటి సామాజిక-రాజకీయ పరిణామాల ప్రభావం కనిపిస్తుంది. అయితే ఆయన కథలు ఏదో ఒక ఉద్యమానికి ప్రచారపత్రాలుగా మారిపోవు. ఉద్యమ నినాదాలను జీవితంలోని సూక్ష్మమైన అనుభవాలుగా, కుటుంబ సంబంధాలుగా, గ్రామీణ సామాజిక నిర్మాణంగా, భాషగా, జ్ఞాపకంగా, పురాణ పునర్వ్యాఖ్యానంగా మార్చడం ఆయన కథనకళ ప్రత్యేకత.

ప్రస్తుత వ్యాసం మల్లెమొగ్గల గొడుగులోని 'జాంబమంతుడూ–పిచ్చిమామా!', 'ఆరంజోతి', 'కూటికి కులముంటదా?', 'సెప్పులు మా కులదేవతలు', 'గొడ్డల్లకి పదునుయెట్టాల', 'వలస', 'బానిస బతుకు బతకబళ్లే!', 'మల్లెమొగ్గల గొడుగు', 'మానకీ గొడ్డుకీ తేడా ఏముంది...' మొదలైన కథలను కేంద్రంగా చేసుకుని దళిత ఉద్యమ ప్రభావాన్ని విశ్లేషిస్తుంది. కథానిలయం నమోదు ప్రకారం ఈ కథలు ప్రధానంగా 1996–97 మధ్య ప్రచురితమై, తరువాత మల్లెమొగ్గల గొడుగు కథాసంపుటిలో చోటుచేసుకున్నాయి.

సాహిత్యం సమాజానికి అద్దం అనే సాధారణ నిర్వచనాన్ని దాటి, అణచివేయబడిన వర్గాల అనుభవాలను సామాజిక జ్ఞానంగా మార్చే శక్తిగా పరిణమించినప్పుడు అది ఉద్యమ సాహిత్యానికి దగ్గరవుతుంది. భారతీయ సమాజ నిర్మాణంలో కులవ్యవస్థ శతాబ్దాలుగా వ్యక్తి సామాజిక స్థానాన్ని, వృత్తిని, నివాసాన్ని, ఆహారాన్ని, సంబంధాలను, విద్యను, మతపరమైన హక్కులను నిర్ణయిస్తూ వచ్చింది. ఈ వ్యవస్థలో అత్యంత అణచివేయబడిన వర్గాల అనుభవాలు ప్రధాన సాహిత్య ప్రవాహంలో చాలాకాలం పరాయి చూపుతోనే ప్రతిఫలించాయి. తెలుగు సాహిత్యంలో దళితుల జీవిత చిత్రణకు సుదీర్ఘ చరిత్ర ఉన్నప్పటికీ, దళితులు తమ స్వీయ అనుభవాన్ని, తమ స్వరాన్ని, తమ భాషను, తమ సంస్కృతిని కేంద్రంగా చేసుకుని రాయడం 1980ల తరువాత మరింత బలపడింది. దళిత సాహిత్యం కేవలం 'దళితుల గురించి' రాసిన సాహిత్యం కాదు; దళితుల సామాజిక అనుభవం నుంచి పుట్టిన ప్రత్యామ్నాయ దృక్పథం. దళిత సాహిత్య విమర్శలో కూడా ఈ స్వీయ అనుభవం, అస్తిత్వం, ప్రతిఘటన ప్రధాన ప్రమాణాలుగా మారాయి. ఈ పరిణామంలో ఎండ్లూరి సుధాకర్ రచనలు ప్రత్యేకమైనవి. ఆయన కవి మాత్రమే కాకుండా కథకుడు, విమర్శకుడు, పరిశోధకుడు, అధ్యాపకుడు. 1959 జనవరి 21న జన్మించిన ఆయన 2022 జనవరి 28న మరణించారు. తెలుగు దళిత సాహిత్యంలో మాదిగ అనుభవాన్ని ప్రత్యేక స్వరంగా వినిపించిన ప్రముఖ రచయితగా ఆయనను సాహిత్య విమర్శ గుర్తించింది. ఆయన రచనల్లో దళితత్వం కేవలం బాధకు ప్రతీక కాదు. అది ఒక జీవన ప్రపంచం. ఆ ప్రపంచంలో పేదరికం ఉంది; అవమానం ఉంది; కులవివక్ష ఉంది; అదే సమయంలో పాట ఉంది, డప్పు ఉంది, శ్రమ ఉంది, ప్రేమ ఉంది, బంధుత్వం ఉంది, హాస్యం ఉంది, పురాణ జ్ఞాపకం ఉంది, తిరుగుబాటు ఉంది. ఈ సమగ్ర జీవన దృక్పథమే సుధాకర్ కథలకు ప్రత్యేకతను అందిస్తుంది.

2. తెలుగు దళిత సాహిత్య ఉద్యమ నేపథ్యం:

తెలుగు దళిత సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న సామాజిక ఉద్యమాల చరిత్రను పరిశీలించాలి. స్వాతంత్ర్యానికి ముందే కులవ్యవస్థపై విమర్శలు సాహిత్యంలో కనిపించాయి. గుఱ్ఱం జాషువా వంటి రచయితలు అంటరానితనం, కుల అసమానత, మానవ గౌరవం వంటి అంశాలను ప్రధానంగా ముందుకు తెచ్చారు. అయితే 1980ల తరువాత దళిత సాహిత్యం ఒక సమగ్ర సామాజిక–సాంస్కృతిక ఉద్యమ రూపాన్ని సంతరించుకుంది. దళిత పాంథర్స్ ఉద్యమం భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో దళిత సాహిత్యానికి కొత్త రాజకీయ భాషను అందించినప్పటికీ, తెలుగు దళిత సాహిత్యాన్ని కేవలం దాని ప్రభావంతోనే వివరించడం సరైంది కాదని విమర్శకులు సూచించారు. తెలుగు దళిత సాహిత్యానికి స్థానిక సామాజిక ఉద్యమాలు, అంబేద్కర్ భావజాలం, కుల వ్యతిరేక పోరాటాలు, గ్రామీణ అణచివేత అనుభవాలు ముఖ్యమైన పునాదులుగా ఉన్నాయి.

1990ల నాటికి దళిత సాహిత్యం మరింత స్పష్టమైన అస్తిత్వ స్వరాన్ని పొందింది. 'మేమెవరం?', 'మా చరిత్ర ఏమిటి?', 'మా సంస్కృతి ఏమిటి?', 'మా బాధను ఎవరు నిర్వచించాలి?', 'మా విముక్తికి మార్గం ఏమిటి?' వంటి ప్రశ్నలు

సాహిత్యానికి కేంద్రంగా మారాయి. ఈ దశలోనే మాదిగ దండోరా ఉద్యమం ప్రాధాన్యం సంతరించుకుంది. దళిత వర్గీకరణ ప్రశ్నను సామాజిక న్యాయ సమస్యగా ముందుకు తెచ్చిన ఈ ఉద్యమం మాదిగ సమాజంలో ప్రత్యేక అస్తిత్వ చైతన్యాన్ని పెంపొందించింది. ఎండ్లూరి సుధాకర్ కవిత్వంలో ఈ ఉద్యమంతో ఆయనకున్న సంబంధం స్పష్టంగా కనిపించినప్పటికీ, ఆయన కథల్లో ఉద్యమం నేరుగా నినాదంగా కాకుండా జీవన అనుభవాల రూపంలో కనిపిస్తుంది. ఒక విమర్శకుడి అభిప్రాయం ప్రకారం, మల్లెమొగ్గల గొడుగు దండోరా ఉద్యమాన్ని కేవలం నినాదంగా కాకుండా జనజీవిత సంబంధాలు, సంఘర్షణల ద్వారా అర్థం చేసుకునే సాంస్కృతిక కృషిగా నిలుస్తుంది.

ఎండ్లూరి సుధాకర్ రచనలను ఆయన సామాజిక నేపథ్యం నుంచి విడదీసి చూడటం సాధ్యం కాదు. ఆయన రచనా ప్రపంచానికి మాదిగ సమాజపు జీవనానుభవం ప్రధాన ఆధారం. ఆయన కవిత్వంలోనూ, కథల్లోనూ, పరిశోధనా రచనల్లోనూ కులవ్యవస్థపై విమర్శ, దళిత ఆత్మగౌరవం, చారిత్రక పునర్వ్యాఖ్యానం కనిపిస్తాయి. ఆయన ప్రముఖ రచనల్లో వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి మొదలైనవి ఉన్నాయి. సుధాకర్ రచనల్లో ఒక ముఖ్యమైన లక్షణం 'లోపలి చూపు'. దళిత జీవితాన్ని బయట నుంచి పరిశీలించే రచయితకు కనిపించని అనేక అంతర్గత సంబంధాలు ఆయన కథల్లో కనిపిస్తాయి. కుటుంబంలోని పెద్దలు, మహిళలు, పిల్లలు, వృత్తిదారులు, డప్పువాళ్లు, గ్రామంలోని అణగారిన వర్గాలు, భూస్వాములు, మధ్యవర్తులు మొదలైన పాత్రల ద్వారా ఒక పూర్తి సామాజిక ప్రపంచాన్ని ఆయన నిర్మించారు.

3. మల్లెమొగ్గల గొడుగు - కథా సంపుటి ప్రత్యేకత :

మల్లెమొగ్గల గొడుగు 1990ల దళిత కథా సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్యమైన సంపుటుల్లో ఒకటి. కథానిలయం నమోదు ప్రకారం ఈ సంపుటిలోని కథలు 1996–97 కాలంలో వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి; సంపుటి 1999లో పుస్తకరూపంలో వచ్చింది. ప్రధానంగా ఈ సంపుటిలో 27 కథలున్నాయి. కథలన్నీ వేర్వేరు సంఘటనలను చెప్పినప్పటికీ, వాటి వెనుక ఒకే సామాజిక ప్రపంచం ఉంది. రావిగుంటపాలెం, లింగారెడ్డిపల్లె, అలవలపాడు, బల్లేపల్లి, మార్కాపురం వంటి ప్రాంతాల జీవన అనుభవాలు కథలకు నేపథ్యంగా నిలుస్తాయి. సుధాకర్ తండ్రి దేవయ్య ద్వారా విన్న అనుభవాలు, కుటుంబ జ్ఞాపకాలు, గ్రామీణ సామాజిక చరిత్ర ఈ కథలకు ఆధారమయ్యాయని సమీక్షలు సూచిస్తున్నాయి. ఈ కథల్లోని కథనం పూర్తిగా కల్పితమైనదిగా కాకుండా అనుభవం, జ్ఞాపకం, మౌఖిక చరిత్ర, కుటుంబ కథనం, సామాజిక పరిశీలనల మిశ్రమంగా కనిపిస్తుంది. అందుకే మల్లెమొగ్గల గొడుగు కథలు చదివినప్పుడు ఒకే కుటుంబం లేదా ఒకే వ్యక్తి జీవితాన్ని చదువుతున్న అనుభూతి కాకుండా మొత్తం మాదిగ సమాజపు ఒక కాలాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది.

దళిత ఉద్యమం ప్రధానంగా 'మా అస్తిత్వాన్ని మేమే నిర్వచించుకుంటాం' అనే స్వీయ ప్రతిపాదనకు దారితీసింది. సుధాకర్ కథల్లో ఈ అస్తిత్వ చైతన్యం అత్యంత బలంగా వ్యక్తమవుతుంది. మాదిగ సమాజాన్ని కేవలం చర్మకారులుగా, డప్పువాళ్లుగా, గ్రామ సేవకులుగా లేదా 'అంటరానివారిగా' చూడటాన్ని ఆయన కథలు తిరస్కరిస్తాయి. ఒక సమాజానికి వృత్తి మాత్రమే గుర్తింపు కాదు; ఆ సమాజానికి చరిత్ర ఉంది, పురాణం ఉంది, సంస్కృతి ఉంది, కళ ఉంది, కుటుంబ వ్యవస్థ ఉంది, సామూహిక జ్ఞాపకం ఉంది. 'సెప్పులు మా కులదేవతలు' వంటి కథ శీర్షికే దీనికి ఒక ఉదాహరణ. (మల్లెమొగ్గల గొడుగు, పుట–125) సాధారణ సామాజిక దృష్టిలో చెప్పులు తయారు చేయడం 'తక్కువ' వృత్తిగా కనిపించవచ్చు. కానీ మాదిగ జీవన ప్రపంచంలో అది నైపుణ్యం, శ్రమ, జీవనాధారం, సంప్రదాయం. కాబట్టి వృత్తిని అవమానంగా కాకుండా

అస్తిత్వ గుర్తింపుగా పునర్నిర్వచించడం ఈ కథలలోని అంతర్లీన రాజకీయ చైతన్యం. దళిత సాహిత్యంలో ఆత్మగౌరవం అంటే కేవలం 'మమ్మల్ని గౌరవించండి' అనే అభ్యర్థన కాదు. 'మేము ఎవరో మేమే చెబుతాం' అనే సాంస్కృతిక స్వాతంత్ర్యం. సుధాకర్ కథలు ఈ సాంస్కృతిక స్వాతంత్ర్యాన్ని బలపరుస్తాయి.

4. మల్లెమొగ్గల గొడుగు కథలు - దళిత ఉద్యమ ప్రభావం:

సుధాకర్ కథల్లో కులవివక్ష పెద్ద సంఘటనల రూపంలో మాత్రమే కనిపించదు. అది రోజువారీ జీవితంలోని చిన్నచిన్న ప్రవర్తనల్లోనూ వ్యక్తమవుతుంది. ఎవరితో కూర్చోవాలి? ఎక్కడ తినాలి? ఎవరికి ఏ పని? ఎవరికి ఏ వృత్తి? ఎవరిని ఇంట్లోకి రానివ్వాలి? – ఇలాంటి ప్రశ్నల ద్వారా కులవ్యవస్థ రోజువారీ జీవితాన్ని ఎలా నియంత్రిస్తుందో ఆయన చూపిస్తారు. 'కూటికి కులముంటదా?' అనే కథా శీర్షికలోనే ఒక గంభీరమైన సామాజిక ప్రశ్న ఉంది. ఆకలికి కులం ఉండదనే మానవీయ సత్యాన్ని కులవ్యవస్థ ఎందుకు అంగీకరించదు? అన్న ప్రశ్నను కథ ముందుకు తెస్తుంది. ఆహారం వంటి అత్యంత ప్రాథమిక మానవ అవసరానికే కులాన్ని అంటగట్టడం భారతీయ కులవ్యవస్థలోని అమానవీయతను వెల్లడిస్తుంది. అందువల్ల సుధాకర్ కథల్లో కులవిమర్శ సిద్ధాంతపరమైన ఉపన్యాసంగా కాకుండా 'బతుకు'గా వ్యక్తమవుతుంది (మల్లెమొగ్గల గొడుగు, పు. 79).

దళిత సాహిత్య ఉద్యమం ఒక ముఖ్యమైన పని చేసింది: ప్రధాన స్రవంతి పురాణాలను దళిత దృష్టితో తిరిగి చదవడం. 'జాంబమంతుడూ–పిచ్చిమామా!' కథలో జాంబవంతుని పురాణ వారసత్వాన్ని మాదిగ సమాజ అస్తిత్వంతో అనుసంధానించే ప్రయత్నం కనిపిస్తుంది. విమర్శకుల ప్రకారం, ఈ కథలో త్రిమూర్తులు జాంబవమునిని తక్కువ కులంగా పరిగణించడంలో ఉన్న నేపథ్యాన్ని రచయిత ప్రశ్నిస్తాడు. ఇది సాధారణ పురాణ పునర్వ్యాఖ్యానం కాదు. పురాణాల్లో ఎవరు కేంద్రంగా నిలిచారు? ఎవరు అంచుకు నెట్టబడ్డారు? ఎవరి కథను పవిత్రంగా పరిగణించారు? ఎవరి చరిత్రను అపవిత్రంగా మలిచారు? అనే ప్రశ్నలను ఈ కథ ముందుకు తెస్తుంది. దళిత ఉద్యమం చరిత్రను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతుంది. అదే విధంగా సుధాకర్ పురాణాన్ని కూడా తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తారు.

'ఆరంజోతి' కథలో అరుంధతి పాత్రను మాదిగ సామాజిక చరిత్రతో అనుసంధానిస్తూ ఒక ప్రత్యామ్నాయ పురాణ దృక్పథాన్ని సుధాకర్ నిర్మిస్తారు. విమర్శకుల విశ్లేషణ ప్రకారం, ఈ కథలో అరుంధతిని తక్కువ కులంగా పరిగణించడానికి జరిగిన కుట్రను కథనం వెలికి తీస్తుంది. ఇక్కడ రచయిత పురాణాన్ని అక్షరాలా చారిత్రక సత్యంగా నిరూపించాలనే ప్రయత్నం చేయడం కంటే, పురాణ నిర్మాణంలో కులాధిపత్యం ఎలా పనిచేస్తుందో ప్రశ్నిస్తున్నాడు. దళిత ఉద్యమ ప్రభావం ఈ సందర్భంలో స్పష్టమవుతుంది. ఎందుకంటే దళిత ఉద్యమం సామాజిక చరిత్రను మాత్రమే కాదు, జ్ఞాన నిర్మాణాన్ని కూడా ప్రశ్నించింది. 'ఎవరు చరిత్ర రాశారు?', 'ఎవరి దృష్టితో పురాణం ఏర్పడింది?', 'ఎవరిని పవిత్రుడిగా, ఎవరిని అపవిత్రుడిగా నిర్ణయించారు?' అనే ప్రశ్నలు ఉద్యమ చైతన్యంలో భాగమయ్యాయి. సుధాకర్ కథల్లో పురాణ పునర్వ్యాఖ్యానం ఈ ప్రశ్నలకు సాహిత్య రూపం.

దళిత సమాజాలపై కులవ్యవస్థ విధించిన ప్రధాన నియంత్రణల్లో ఒకటి వృత్తి. పుట్టుక ఆధారంగా వృత్తి నిర్ణయించబడటం, ఆ వృత్తిని సామాజికంగా 'తక్కువ'గా గుర్తించడం, కానీ అదే వృత్తి లేకుండా గ్రామీణ సమాజం నడవకపోవడం భారతీయ కులవ్యవస్థలోని ప్రధాన వైరుధ్యం. మాదిగ సమాజానికి చర్మకళ, చెప్పుల తయారీ, డప్పు వాయిద్యం వంటి వృత్తులు చారిత్రకంగా అనుసంధానమై ఉన్నాయి. సుధాకర్ ఈ వృత్తులను అవమానానికి చిహ్నాలుగా కాకుండా నైపుణ్యం, జీవనోపాధి, సాంస్కృతిక గుర్తింపులుగా చూపిస్తారు. కుల సంబంధాల నిరంతర పునర్వ్యవస్థీకరణ ఈ కథల

అంతర్భాగంగా ఉందని ఆ పరిచయం సూచిస్తుంది. అందువల్ల సుధాకర్ కథల్లో శ్రమ ఒక సామాజిక–రాజకీయ అంశంగా మారుతుంది. మాదిగ సమాజానికి డప్పు ఒక వృత్తి సాధనం మాత్రమే కాదు; అది ఒక సామూహిక సాంస్కృతిక చిహ్నం. గ్రామంలో వార్త ప్రకటించడానికి, పండుగలకు, మరణాలకు, ఉత్సవాలకు, సామాజిక కార్యక్రమాలకు డప్పు ఉపయోగించబడుతుంది. అంటే గ్రామీణ సామాజిక జీవితంలో డప్పు కేంద్ర పాత్ర పోషిస్తుంది. అయితే డప్పు వాయించే వ్యక్తికి మాత్రం అదే సమాజం అంటరానితనం విధిస్తుంది. ఇది ఒక తీవ్రమైన సామాజిక వైరుధ్యం. సుధాకర్ ఈ వైరుధ్యాన్ని వెలుగులోకి తెస్తారు. డప్పును అవమానానికి గుర్తుగా కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీకగా మలుస్తారు. అందువల్ల డప్పు ఒక 'వాద్యం' నుంచి 'వాణి'గా మారుతుంది. (మల్లెమొగ్గల గొడుగు, పు.22)

దళిత సాహిత్యాన్ని కేవలం బాధా సాహిత్యంగా చూడటం ఒక అపోహ. సుధాకర్ కథలు దీనిని బలంగా నిరూపిస్తాయి. మల్లెమొగ్గల గొడుగులో కుటుంబ బంధాలు, తల్లిదండ్రులు, పిల్లలు, మామలు, అత్తలు, తాతలు, అమ్మమ్మలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు వంటి సంబంధాలు విస్తృతంగా కనిపిస్తాయి. సమీక్షకుల ప్రకారం, ఈ కథల్లో అనేక పాత్రలు కథ నుంచి కథకు కొనసాగుతూ మూడు తరాల జీవనాన్ని ఒక సమగ్ర సామాజిక చిత్రంగా రూపొందిస్తాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం దాగి ఉంది. దళిత జీవితం అంటే కేవలం 'పీడన' కాదు. అందులో ఆనందం ఉంది. హాస్యం ఉంది. పండుగ ఉంది. పాట ఉంది. ప్రేమ ఉంది. బంధుత్వం ఉంది. ఆహారం ఉంది. పిల్లల ఆటలు ఉన్నాయి. మరణం ఉంది. సామూహికత ఉంది. ఈ జీవన సమగ్రతే సుధాకర్ కథలకు వాస్తవికతను ఇస్తుంది.

కుల అణచివేతతో పాటు లింగ అణచివేతను కూడా దళిత సాహిత్యం ప్రశ్నించింది. దళిత మహిళ ఒకేసారి కులం, వర్గం, లింగం అనే మూడు రకాల అసమానతలను ఎదుర్కొంటుంది. సుధాకర్ కథల్లో మహిళ కేవలం బాధితురాలు కాదు. కుటుంబాన్ని నిలబెట్టే శక్తి, శ్రమించే వ్యక్తి, సామాజిక జ్ఞాపకాన్ని మోసుకెళ్లే వ్యక్తి, నిర్ణయం తీసుకునే వ్యక్తిగా కూడా కనిపిస్తుంది. మాదిగ కుటుంబాల జీవనంలో మహిళల శ్రమ కీలకమైనది. ఇంటి ఆర్థిక వ్యవస్థను, పిల్లల సంరక్షణను, కుటుంబ సంబంధాలను, సామాజిక ఆచారాలను వారు నిర్వహిస్తారు. ఈ దృశ్యాలు దళిత జీవితాన్ని ఒక సమగ్ర సామాజిక వ్యవస్థగా చూపిస్తాయి. ఇది కూడా దళిత ఉద్యమ ప్రభావంతో వచ్చిన 'ప్రతినిధిత్వ' మార్పులో భాగమే. అగ్రవర్ణ పురుషుడి చూపు ద్వారా దళిత మహిళను చిత్రించకుండా, దళిత జీవన ప్రపంచంలోని అంతర్భాగంగా ఆమెను చూపించడం సుధాకర్ కథనంలోని విశిష్టత.

దళిత ఉద్యమాల ప్రభావంతో విద్య దళిత సమాజంలో విముక్తి సాధనంగా బలంగా ప్రతిష్ఠించబడింది. అంబేద్కర్ ప్రసిద్ధ నినాదమైన 'విద్య, సంఘటితం, పోరాడు' అనే భావజాలం దళిత సామాజిక చైతన్యంపై లోతైన ప్రభావాన్ని చూపింది. సుధాకర్ స్వయంగా విద్య ద్వారా ఎదిగిన రచయిత. అందువల్ల ఆయన కథల్లో విద్య, చదువు, ఉద్యోగం, గ్రామం–పట్టణం మధ్య ప్రయాణం వంటి అంశాలు సామాజిక మార్పుకు సంకేతాలుగా కనిపిస్తాయి. చదువు వచ్చిన దళిత వ్యక్తి పాత కుల సంబంధాలను కొత్తగా ప్రశ్నిస్తాడు. అయితే విద్యతో కులం పూర్తిగా అంతరించిపోదు. ఈ వైరుధ్యాన్ని సుధాకర్ రచనలు గుర్తిస్తాయి. అంటే – విద్య సామాజిక చలనం కలిగిస్తుంది; కానీ కుల నిర్మాణం సామాజిక చలనాన్ని అడ్డుకుంటుంది. ఈ ద్వంద్వమే ఆధునిక దళిత జీవితంలోని ప్రధాన సమస్యల్లో ఒకటి. దళితుల వలస కేవలం ఆర్థిక అవసరం వల్ల జరిగేది కాదు. అది కుల అవమానాల నుంచి బయటపడాలనే ఆకాంక్షతోనూ సంబంధం కలిగి ఉంటుంది. 'వలస' వంటి కథల ద్వారా గ్రామీణ సామాజిక నిర్మాణం నుంచి బయటకు వెళ్లే ప్రయత్నం కనిపిస్తుంది. అయితే కొత్త ప్రదేశంలోకి వెళ్లినా కుల గుర్తింపు పూర్తిగా వెనుకబడిపోదు. ఇది దళిత ఆధునికతలోని ఒక ప్రధాన వైరుధ్యం. గ్రామాన్ని విడిచిపెట్టినంత మాత్రాన

కులాన్ని విడిచిపెట్టడం కాదు. చదువుకోవడం వలన వివక్ష అంతరించిపోదు. ఉద్యోగం పొందడమనేది అస్తిత్వ సమస్యకు పరిష్కారం కాదు. పట్టణీకరణవలన సమానత్వం దొరకదు. సుధాకర్ కథలు ఇటువంటి సంక్లిష్టతను చూపిస్తాయి.

'బానిస బతుకు బతకబళ్లే!' అనే కథా శీర్షికలోనే తిరుగుబాటు స్వరం వినిపిస్తుంది. దళిత ఉద్యమం వ్యక్తిని 'బాధితుడు' నుంచి 'ప్రతిఘటించే వ్యక్తి'గా మార్చింది. బానిసత్వం కేవలం శారీరక బంధనం కాదు. అది: కుల నియంత్రణ, ఆర్థిక ఆధారపడటం, భూహీనత, వృత్తి బంధనం, సామాజిక అవమానం, అక్షరాస్యత లేకపోవడం, రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం – వంటి అనేక రూపాల్లో ఉంటుంది. సుధాకర్ కథలు ఈ బానిసత్వపు రోజువారీ రూపాలను బయటపెడతాయి. అదే సమయంలో 'ఇలాగే బతకాల్సిందే' అనే విధివాదాన్ని తిరస్కరిస్తాయి. ఈ తిరస్కరణే దళిత ఉద్యమం అందించిన అత్యంత ముఖ్యమైన మానసిక మార్పు.

సుధాకర్ కథలను ప్రత్యేకం చేసేది కేవలం అగ్రకుల ఆధిపత్యంపై విమర్శ కాదు. దళిత సమాజంలోని అంతర్గత వైరుధ్యాలను కూడా ఆయన చూపిస్తారు. దళిత సమాజం ఏకరూపమైన సమూహం కాదు. మాల, మాదిగ వంటి వర్గాల మధ్య చారిత్రక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యత్యాసాలు ఉన్నాయి. దళిత సాహిత్యంలో ఈ అంతర్గత వైవిధ్యాన్ని ఎండ్లూరి సుధాకర్ వంటి రచయితలు స్పష్టంగా చిత్రించారని విమర్శకులు పేర్కొన్నారు. ఇది దళిత ఉద్యమానికి వ్యతిరేకత కాదు. నిజానికి ఇది ఉద్యమాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం. 'దళితుడు' అనే ఒకే పదం లోపల అనేక సామాజిక అనుభవాలు ఉన్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తించడం వల్లే మాదిగ అస్తిత్వం, మాదిగ చరిత్ర, మాదిగ సంస్కృతి వంటి ప్రత్యేక ప్రశ్నలు ముందుకు వచ్చాయి.

ఎండ్లూరి సుధాకర్ రచనలను మాదిగ దండోరా ఉద్యమం నుంచి పూర్తిగా వేరుచేసి చూడటం కష్టం. అయితే కథల్లో ఉద్యమ నినాదాలు నేరుగా కనిపించకపోవచ్చు. వాటి స్థానంలో ఉద్యమం సృష్టించిన కొత్త ప్రశ్నలు కనిపిస్తాయి. అవి– మాదిగలు ఎవరు? మాదిగల చరిత్ర, మాదిగ సంస్కృతి, మాదిగల శ్రమకు విలువ లేకపోవడం? దళిత వర్గీకరణలో న్యాయం ఎలా పొందాలి? దళిత సమాజం లోపల సమానత్వం ఉందా? ఇలాంటి ప్రశ్నలకు సాహిత్యరూపం ఇవ్వడంలో సుధాకర్ కీలక పాత్ర పోషించారు. ఒక విమర్శకుడి ప్రకారం, మల్లెమొగ్గల గొడుగు కథలు దండోరా ఉద్యమాన్ని నినాదంగా వినిపించడం కంటే దానిని జీవన సంబంధాలు, సంఘర్షణల ద్వారా 'జీవితంగా' ప్రదర్శిస్తాయి. అందువల్ల దళిత ఉద్యమ ప్రభావం సుధాకర్ కథల్లో 'ఉద్యమ సాహిత్యం' అనే సంకుచిత అర్థంలో కాకుండా 'ఉద్యమ చైతన్యం'గా కనిపిస్తుంది. ఇతరుల దయ మీద ఆధారపడకుండా స్వీయ గౌరవంతో జీవించాలనే భావన. దళిత సాహిత్య చరిత్రలో అంబేద్కర్ ప్రభావం విస్తృతంగా గుర్తించబడింది. ముఖ్యంగా 1990ల తరువాత రాజ్యాంగం, అంబేద్కర్ ఆలోచనలపై కొత్త చైతన్యం దళిత రచయితలలో బలపడిందని సాహిత్య పరిశీలనలు పేర్కొంటాయి. సుధాకర్ కథల్లో రాజ్యాంగం గురించి ప్రత్యక్ష ప్రస్తావన ప్రతి కథలో ఉండకపోయినా, సమానత్వం, హక్కు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం వంటి విలువలు కథల నిర్మాణంలో అంతర్లీనంగా ఉన్నాయి.

దళిత సాహిత్యానికి భాష అత్యంత కీలకమైన అంశం. ప్రామాణిక సాహిత్య భాషలో దళిత జీవితం చెప్పినప్పుడు, అనుభవానికి ఒక దూరం ఏర్పడే ప్రమాదం ఉంది. సుధాకర్ దీనికి బదులుగా మాదిగ సమాజం మాట్లాడే జీవద్భాషను కథలోకి తీసుకువచ్చారు. ఈ భాషలో ప్రాంతీయ మాండలికం, సామెతలు, జానపద పదాలు, వృత్తి పదజాలం, కుటుంబ సంబోధనలు, స్థానిక పలుకుబడులు, మౌఖిక కథనశైలి – వంటివి ఉన్నాయి. ఈ భాష కేవలం శైలీ ప్రయోగం మాత్రమే

కాదు. భాష కూడా అస్తిత్వమే. అగ్రవర్ణ ప్రామాణిక భాషకు వెలుపల ఉన్న పలుకుబడిని సాహిత్యంలో గౌరవప్రదంగా ప్రతిష్ఠించడం ద్వారా సుధాకర్ భాషా ప్రజాస్వామ్యాన్ని సాధించారు. ఆయన కథల్లో జీవద్భాష కథలకు 'ప్రాణశక్తి'గా పనిచేస్తుందని విమర్శకులు పేర్కొన్నారు. దళిత సమాజాల చరిత్రలో చాలా భాగం లిఖిత రూపంలో కంటే మౌఖిక రూపంలో నిలిచింది. తాత చెప్పిన కథ, అమ్మ చెప్పిన జ్ఞాపకం, తండ్రి చెప్పిన సంఘటన, గ్రామ పెద్ద చెప్పిన పురాణం, డప్పు పాట, జానపద గాథ ఇవన్నీ ఒక సమాజపు చరిత్రను మోస్తాయి. మల్లెమొగ్గల గొడుగులో ఈ మౌఖిక చరిత్రకు సాహిత్య రూపం లభించింది. అందువల్ల ఇది కేవలం కల్పిత కథా సంపుటి కాకుండా ఒక సామాజిక జ్ఞాపక భాండాగారంగా కూడా చదవదగింది. మల్లెమొగ్గల గొడుగు కథలను మాదిగ జానపదం, మౌఖిక చరిత్రకు సంబంధించిన జీవన చిత్రాలుగా గుర్తిస్తుంది. ఇది దళిత ఉద్యమంలోని 'చరిత్రను తిరిగి రాయాలి' అనే భావనతో సంబంధం కలిగిన ప్రక్రియగా చెప్పవచ్చు.

సుధాకర్ కథల్లో పురాణం ఒక స్థిరమైన పవిత్ర కథగా ఉండదు. అది రాజకీయంగా పునర్వ్యాఖ్యానించ బడుతుంది. జాంబవంతుడు, అరుంధతి, కర్ణుడు వంటి పురాణ వ్యక్తుల ద్వారా దళిత చరిత్రకు కొత్త వంశావళిని నిర్మించాలనే ప్రయత్నం కనిపిస్తుంది. ఇది దళిత ఉద్యమంలో కనిపించే 'సాంస్కృతిక ప్రతిఘటన'కు ఉదాహరణ. సాంప్రదాయ సామాజిక నిర్మాణం ఒక వర్గాన్ని 'అపవిత్రం'గా నిర్వచిస్తే, దళిత సాహిత్యం దానికి ప్రత్యామ్నాయ పవిత్రతను నిర్మిస్తుంది. అంటే అవమానంగా భావించిన వృత్తి గౌరవంగా భావించడం, చివరన ఉన్న పాత్ర ప్రధాన పాత్రగా మారడం, మౌఖిక జ్ఞాపకం చరిత్రగా మారడం, స్థానిక భాష సాహిత్య భాషగా పరిణమించడం దళితుల బాధ అనేది ప్రతిఘటనగా మారుడం అనేవి సుధాకర్ కథలలో దళిత ఉద్యమ ప్రభావం యొక్క ప్రధాన రూపాంతరం.

దళిత కథ గురించి ఏర్పడిన ఒక సాధారణ అపోహ 'దళిత సాహిత్యం అంటే బాధను వర్ణించడం' అనేది. సుధాకర్ కథలు ఈ అభిప్రాయాన్ని ఖండిస్తాయి. బాధ ఉన్నప్పటికీ, దానితో పాటు జీవనోత్సాహం, హాస్యం, ప్రేమ, స్నేహం, బంధుత్వం, శ్రమగౌరవం, కళ, సాంస్కృతిక సృజన, ప్రతిఘటన ఉన్నాయి. అందువల్ల ఆయన కథలు దళిత జీవితాన్ని విషాదానికి పరిమితం చేయకుండా సమగ్ర మానవ జీవితంగా చిత్రిస్తాయి. ఇదే ఆయన కథల సౌందర్యశాస్త్రం.

సుధాకర్ కథల కథన పద్ధతిలో జ్ఞాపకం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కథకుడు కేవలం బయట నిలబడి సంఘటనను చెప్పడు. కథలోని సామాజిక ప్రపంచానికి అతను ఒక భాగం. ఈ కారణంగా కథనం ఒకేసారి: ప్రత్యక్ష అనుభవం, మౌఖిక కథనం, కుటుంబ చరిత్ర, సామాజిక పరిశీలన, వ్యాఖ్యానంగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో కథకుడు పాత్రగా ఉంటూనే పరిశీలకుడిగా కూడా కనిపిస్తాడు. దీనివల్ల కథకు ఆత్మకథాత్మకతతో పాటు సామాజిక విశ్లేషణాత్మకత ఏర్పడుతుంది. సుధాకర్ కథల్లో వాస్తవికత కేవలం బాహ్య వర్ణన కాదు. అది సామాజిక సంబంధాల అంతర్గత నిర్మాణాన్ని బయటపెట్టే పద్ధతి. కులం ఒక సిద్ధాంతంగా కథలోకి రాదు. అది భోజనంలో, ఇంటి నిర్మాణంలో, వృత్తిలో, పెళ్లిలో, సంభాషణలో, గ్రామ సంబంధాల్లో, శ్రమలో, ఆస్తిలో, విద్యలో కనిపిస్తుంది. అందువల్ల ఆయన కథల్లో కులం 'విషయం' మాత్రమే కాదు; అది కథా ప్రపంచాన్ని నిర్మించే సామాజిక శక్తి.

ఇప్పటివరకు చేసిన పరిశీలనను ఆధారంగా చేసుకుని ఎండ్లూరి సుధాకర్ కథల్లో దళిత ఉద్యమ ప్రభావాన్ని క్రింది అంశాలుగా విభజించవచ్చు. సుధాకర్ గారి కథలను పరిశీలించినట్లయితే అవి ప్రతి సందర్భంలో 'ఉద్యమ కథలు' కావు. మాదిగ దండోరా ఉద్యమ నినాదాలు కథల్లో ప్రత్యక్షంగా వినిపించకపోవచ్చు. కానీ ఉద్యమం సృష్టించిన ప్రశ్నలు మాత్రం కథల నిర్మాణంలో కనిపిస్తాయి. అంటే ప్రభావం ప్రత్యక్ష రాజకీయ ప్రచారం రూపంలో కాకుండా పరోక్ష సామాజిక చైతన్యం

రూపంలో ఉంది. ఉదా: ఒక చెప్పుల తయారీదారుడి జీవితాన్ని రాయడం ఒక సాధారణ కథ కావచ్చు. కానీ ఆ వృత్తికి గౌరవం కల్పించడం, ఆ వృత్తి వెనుక ఉన్న నైపుణ్యాన్ని చూపించడం, దాన్ని కుల అవమానంతో అనుసంధానించడం, ఆ అవమానాన్ని ప్రశ్నించడం, మాదిగ చరిత్రతో దాన్ని కలపడం దళిత అస్తిత్వ రాజకీయంగా మారుతుంది. అందువల్ల సుధాకర్ కథల్లో ఉద్యమం 'నినాదం'గా కాకుండా 'దృష్టికోణం'గా ఉంది.

కులవివక్ష పూర్తిగా అంతరించిపోయిందని చెప్పలేని భారతీయ సమాజంలో సుధాకర్ కథలు ఇప్పటికీ ప్రాసంగికంగా ఉన్నాయి. విద్య పెరిగినా కులం ఎందుకు కొనసాగుతోంది? పట్టణీకరణ జరిగినా కుల గుర్తింపులు ఎందుకు నిలిచాయి? రాజ్యాంగం సమానత్వాన్ని ప్రకటించినా సామాజిక జీవితంలో అసమానత ఎందుకు కొనసాగుతోంది? వృత్తికి గౌరవం ఎందుకు దక్కడం లేదు? దళిత సమాజం లోపల కూడా అసమానతలు ఎందుకు ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సుధాకర్ కథలు తక్షణ రాజకీయ సమాధానాలు ఇవ్వకపోయినా, వాటి సామాజిక మూలాలను అర్థం చేసుకోవడానికి అవసరమైన అనుభవ ప్రపంచాన్ని అందిస్తాయి. అందువల్ల ఆయన కథలు చరిత్రకు మాత్రమే చెందినవి కావు. అవి సమకాలీన సమాజాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఉపయోగపడతాయి.

ముగింపు:

ఎండ్లూరి సుధాకర్ కథల్లో దళిత ఉద్యమ ప్రభావాన్ని ఒకే పదంతో నిర్వచించడం సాధ్యం కాదు. అది అనేక స్థాయుల్లో పనిచేస్తుంది. అస్తిత్వం, ఆత్మగౌరవం, కులవ్యతిరేకత, శ్రమగౌరవం, సాంస్కృతిక పునరుజ్జీవనం, పురాణ పునర్వ్యాఖ్యానం, చరిత్ర పునర్నిర్మాణం, భాషా స్వాతంత్ర్యం, విద్యా చైతన్యం, సామాజిక న్యాయం వంటి అనేక అంశాల్లో అది వ్యక్తమవుతుంది. ప్రత్యేకంగా మల్లెమొగ్గల గొడుగు దళిత కథాసాహిత్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ సంపుటి మాదిగ జీవితాన్ని కేవలం దుఃఖగాథగా కాకుండా ఒక సంపూర్ణ మానవ ప్రపంచంగా చిత్రిస్తుంది. ఇందులో పేదరికం ఉంది; అదే సమయంలో జీవనోత్సాహం ఉంది. కులపీడన ఉంది; అదే సమయంలో ప్రతిఘటన ఉంది. అవమానం ఉంది; అదే సమయంలో ఆత్మగౌరవం ఉంది. వృత్తి ఆధారిత అణచివేత ఉంది; అదే సమయంలో శ్రమకు గౌరవం కల్పించే సాంస్కృతిక ప్రయత్నం ఉంది.

'జాంబమంతుడూ–పిచ్చిమామా!' మరియు 'ఆరంజోతి' వంటి కథల్లో పురాణ పునర్వ్యాఖ్యానం ద్వారా దళిత చరిత్రను పునర్నిర్మించాలనే ప్రయత్నం కనిపిస్తుంది. 'కూటికి కులముంటదా?' వంటి కథల్లో కులం రోజువారీ జీవనాన్ని ఎలా నియంత్రిస్తుందో తెలుస్తుంది. 'సెప్పులు మా కులదేవతలు' వంటి కథా దృక్పథంలో మాదిగ వృత్తి, శ్రమ, నైపుణ్యం అస్తిత్వ గౌరవంగా మారతాయి. 'వలస', 'బానిస బతుకు బతకబల్లే!' వంటి కథల ద్వారా సామాజిక–ఆర్థిక బంధనాల నుంచి విముక్తి ఆకాంక్ష వ్యక్తమవుతుంది. కథలన్నింటినీ కలిపి చూస్తే మాదిగ సమాజపు ఒక సామూహిక జీవనచిత్రం రూపొందుతుంది. సుధాకర్ కథల గొప్పతనం ఏమిటంటే అవి దళిత ఉద్యమాన్ని కేవలం నినాదంగా మార్చలేదు. ఉద్యమాన్ని జీవితంలోకి తీసుకువచ్చాయి. ఒక వ్యక్తి అవమానాన్ని సామాజిక ప్రశ్నగా, ఒక కుటుంబ అనుభవాన్ని చారిత్రక జ్ఞాపకంగా, ఒక వృత్తిని సాంస్కృతిక గుర్తింపుగా, ఒక మాండలికాన్ని సాహిత్య భాషగా, ఒక పురాణ పాత్రను ప్రత్యామ్నాయ చరిత్రగా మార్చాయి. అందువల్ల ఎండ్లూరి సుధాకర్ కథల్లో దళిత ఉద్యమ ప్రభావాన్ని 'ఉద్యమ నినాదాల ప్రతిబింబం'గా కాకుండా 'దళిత అస్తిత్వ దృష్టి నిర్మాణం'గా నిర్వచించడం సముచితం. ఆయన కథలు దళితుడిని ఇతరులు నిర్వచించే స్థితి నుంచి, దళితుడు తనను తాను నిర్వచించుకునే స్థితికి తీసుకువెళ్తాయి. అదే ఆయన కథాసాహిత్యంలోని రాజకీయ సౌందర్యం. అదే ఆయన సాహిత్యంలోని

మానవీయత. అదే తెలుగు దళిత కథా చరిత్రలో ఎండ్లూరి సుధాకర్ ప్రత్యేకత. ఎండ్లూరి సుధాకర్ కథలు తెలుగు దళిత కథా సాహిత్యంలో మాదిగ అస్తిత్వానికి ప్రత్యేక స్వరాన్ని అందించాయి. మల్లెమొగ్గల గొడుగు కేవలం కథాసంపుటి కాకుండా మాదిగ సమాజపు సామాజిక-సాంస్కృతిక జ్ఞాపక పత్రంగా కూడా చదవదగినది. దళిత ఉద్యమ ప్రభావం ఆయన కథల్లో ప్రత్యక్ష రాజకీయ నినాదాల కంటే సామాజిక దృష్టికోణంగా ఎక్కువగా కనిపిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. ఎండ్లూరి సుధాకర్. మల్లెమొగ్గల గొడుగు. హైదరాబాద్: దండోరా ప్రచురణలు, 1999.
2. ఎండ్లూరి సుధాకర్. కొత్త గబ్బిలం. రాజమండ్రి: మానస ప్రచురణలు, 1998.
3. ఎండ్లూరి సుధాకర్. నల్లద్రాక్ష పందిరి. సికింద్రాబాద్: మానస ప్రచురణలు, 2002.
4. ఎండ్లూరి సుధాకర్. వర్గీకరణీయం. రాజమండ్రి: మానస ప్రచురణలు, 2003.
5. ఎండ్లూరి సుధాకర్. వర్తమానం. కవితా సంపుటి; 1992.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

గోసంగి కవిత – పాతాళ ప్రశ్నలు పరిశీలన



డా. మామిడి లింగయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు తెలుగుశాఖధ్యక్షులు,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
ఇ.నెం. 55-2-430, భీమారం, హసన్‌పర్తి,
హనుమకొండ - 506 009
సెల్ నెం : 9949107318

"సంగీతఫలంబున గోసంగీ సగమైన దయపొసఁగనీవేబీ మీన్
మ్రింగిన గ్రుక్కన్వారిధి? కిం గొఱఁతయె? కొదయె విష్ణుకీర్తన కనినన్"

తాత్పర్యము :- ఓయీ దాసరీ! (ఈ మాటలను జాగ్రత్తగా విను) చేప మ్రింగిన గ్రుక్కెడు నీటిచే సముద్రము తక్కువ పడనట్లు ఏకదినగీత ఫలములో సగము నాకిచ్చుటచే నీ యపార హరికీర్తన ఫలము తగ్గదుబీ కావున దయచేసి నేనడిగిన దినగీత ఫలార్ధమును నాకు ఒసంగుము. అని దాసరి గీతఫలంలో సగం ఇవ్వమని బ్రహ్మరాక్షసుడు కోరాడు.

అందుకు ఆ దాసరి చెప్పిన సమాధానం

ఏలా నొంచె దదేహ? మి ట్లడిగి, యెంతేబాసమేనం బలం
బో లీలావటు గీత కీర్తన ఫలంబో, నీయెడనున్ను పా
తాళ ప్రశ్నలు మాని మే ల్గొనుముబీ బేతాళచ్ఛలోక్తిన్ రుషం
దూలింపందలఁతేని, పుట్టుమణి నూతుల్దవ్య బేతాళముల్

తాత్పర్యము :- ఓయి రక్కసుడా! నీవు నా దేహముకంటె వేదొకటి యడుగుట సరిపడదు. మొదట నీవు నన్ను హరికీర్తనమునకు పోనిచ్చినప్పుడు నాచే చేయించుకొన్న ప్రతిజ్ఞ నాదేహము నిచ్చెదననియేగాని గానఫలమిచ్చెదననిగాదు. నీవు ఈ లోతు ప్రశ్నలు మాను, నా దేహమును పుచ్చుకొమ్ము. నీవు పిశాచ జాతికి సులభమైన ఛలవచనములచేత నాకు కోపము తెప్పించిన ఆ కోపాన నేను గీతఫలము ఇచ్చినచోఁ గొనం జూచుచున్నావా యేమి? ఆ పక్షమున బావి త్రవ్వఁగా

భూతము వెలువడినట్లగునే గాని, నీ యుక్తి మాత్రము ఫలింపదు.

ప్రాచీన సాహిత్యంలో గాఢమైన పరిచయమున్నవారికి ఈ సంవాదము ఎక్కడిదో సులువుగానే స్ఫురిస్తుంది. అంతగా పరిచయం లేని వారికి ఈ సంవాదములో ఒక దాసరి, ఒక రాక్షసుడున్నారని అర్థమవుతుంది. వారి మధ్య ఒక ఒప్పందం ఉందని తెలుస్తుంది. బ్రహ్మరాక్షసుడికి దాసరి మాట ఇచ్చాడని, ఆ మాట ప్రకారమే తన దేహాన్ని భక్షించ వలసిందిగా రాక్షసుడిని దాసరి అడుగుతున్నాడని బోధపడుతుంది. అయితే ఆ రాక్షసుడు దాసరి దేహాన్ని కాక సంగీతఫలాన్ని కోరుతూ ఉన్నాడని, అందుకాదాసరి అంగీకరించడంలేదని కూడా తేలికగానే గ్రహింపుకొస్తుంది. ఈసంవాదము శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద' అనే ప్రౌఢ ప్రబంధములోది. ఆరవ ఆశ్వాసములోని 'మాలదాసరికథ' గా ప్రసిద్ధమైన ఉపాఖ్యానం లోది. ఈ ప్రబంధానికి ఆంధ్రమల్లినాథ సూరిగా ప్రసిద్ధిపొందిన వేదము వేంకట రాయశాస్త్రి 'సంజీవని' పేరిట వ్యాఖ్యానం రాశారు. వేదము వారి వ్యాఖ్యానము 1927లో ప్రథమ ముద్రణ పొందింది. 1964లో ద్వితీయ ముద్రణను వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, 4, మల్లికేశ్వరస్వామి గుడి సందు, లింగశెట్టి వీధి, మదరాసు-1 వారు అందించారు. వెల 30 రూపాయలు. పైన ఉదహరించిన పద్యతాత్పర్యం యథాతథంగా వేదం వారి వ్యాఖ్యానం నుండి గ్రహించిందే.

'వర్తమానకవి,' 'కొత్తగబ్బిలం అందించిన కవి,' 'వర్గీకరణకవి,' 'నల్లద్రాక్షపందిరి'కవి 'ఆటాజనిగాంచెకవి' 'జనరంజక ప్రసంగి' అంతిమంగా దళిత చేతన గల కవి ఎండ్లూరి సుధాకర్ 'గోసంగి' పేరిట ఒక దీర్ఘకవితను రాసి ఆంధ్రజ్యోతి దినపత్రిక 'వివిధ' సాహిత్య పేజీలో 5-7-2010న ప్రచురించారు. దీనిని ఆయన 'కృష్ణదేవరాయల కాలంనాటి దళిత దాసరి గోస' అన్నారు. ఆ ముక్తమాల్యదకు 'సంజీవని' వ్యాఖ్యకూర్చిన వేదము వేంకటరాయశాస్త్రి గోసంగికథను మాలదాసరికథగా పేర్కొన్నారు. ఈ కవితను ప్రచురించే సందర్భంలో నిమ్నటిప్పణి (లఘుటిప్పణికాదు)లో ఒక వివరణ ఇచ్చారు "శ్రీ కృష్ణ దేవరాయలు తన 'ఆముక్తమాల్యద' ప్రబంధం ఆరవ ఆశ్వాసంలో 'గోసంగి' కులాన్ని మొదటిసారి గుర్తించాడు 'మహాత్మా' అని సంబోధించాడు. కృష్ణదేవరాయలు తన విజయయాత్రలో భాగంగా తెలంగాణలో విస్తృతంగా పర్యటించాడు. ఇక్కడే రాయలవారు 'గోసంగి'ని చూసి ఉంటాడు. లేదా ఆ కులంపేరు విని ఉంటాడు. 'మాలదాసరి కథ' వేదం వేంకటరాయశాస్త్రి ఆముక్తమాల్యద వ్యాఖ్యానంలో చేసిన కల్పన, మూలంలో 'మాల' శబ్దం ఎక్కడా లేదు. రాయలువారు ప్రయోగించలేదు. గోసంగులు ప్రత్యేక అస్తిత్వం ఉన్న పౌరాణిక దళితులు"- అని పేర్కొన్నారు. ఈ గోసంగి కథ ఆధారంగా సుధాకర్ తెలుగు సాహిత్యంలో అందునా ప్రబంధయుగ సాహిత్యానికి సంబంధించి నంతవరకు 'పాతాళ ప్రశ్నలు' వేస్తున్నారు. కొత్తనూతులు తవ్వలేదు కానీ, 16వ శతాబ్దపు సాహిత్యపు బావుల పూడిక తీయడానికి సంకల్పించు కున్నారు. ఈ పూడికతీతలోనూ 'కుల బేతాళాలు' కొన్ని పుట్టవచ్చు. పుట్టి ఉన్నవే దర్శనమీయవచ్చు. 'గోసంగి' కవితకు ఆధార భూతమనదగిన ఆముక్త మాల్యదను, మరి ఇతర ప్రబంధ సాహిత్యాన్ని దళితదృక్పథం నుంచి చదివి వ్యాఖ్యానించుకొని సరిచేసుకోవలసిన వాటిని గుర్తించాలని సుధాకర్ ఆశిస్తున్నట్లుగా భావించవచ్చు.

వేదం వారి దృష్టిలో మాలదాసరికథ' అయినా సుధాకర్ దృక్పథంలో 'దళితదాసరిగోస' అయినా ఆ కథ తెలుసుకోకుండా గోసంగిని అర్థం చేసుకోవడం ఆత్మలేని దేహాన్ని తాకిచూడటమే అవుతుంది. అందువల్ల ఆ ముక్తమాల్యదలోని ఆవిష్ణుభక్తుడి కథను రేఖామాత్రంగానైనా తెలుసుకోవటం ఉత్తమం.

ఆముక్తమాల్యదకు తెలుగు పంచమహాకావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి ఉంది. ఇది కృష్ణదేవరాయల పాండిత్యప్రకర్షకు, లోకపరిశీలనా శక్తికి, రచనా వైదుష్యానికి, ఉత్కృష్ట వర్ణనా పటిమకు, విశిష్టాద్వైత తత్వనిరూపణకు పెట్టిందిపేరు. ఎంతటి నాస్తికుడినైనా ఆస్తికుడిగా మార్చేయగల శక్తిగలది. యామునాచార్యుల కథ, ఖాండిక్యకేశి ధ్వజసంవాదము, మన్ననారు విష్ణు చిత్తుని అనుగ్రహించుట, మత్స్యధ్వజుడు మధురాపురవర్ణన, ఋతువర్ణనలు, శాస్త్రచర్చలు, రాజనీతి, స్వమతస్థాపన, పరమత

ఖండనలు మొదలైనవి ఒకదానితో ఒకటి పోటీపడినిలిచేవి. వీటికి తోడుగా గోదాదేవి ఉండనే ఉంది. ఆమె శ్రీరంగంలోని రంగనాథుని సేవించటం, గోదా శ్రీరంగనాథుల వివాహవైభవం తదితరాలతో మహత్పూర్ణమైన ఈ ప్రబంధంలోకి దళితదృక్పథంతో ఆగంతకుడిలా చొచ్చుకొచ్చాడు. సుధాకర్. కథలోని దాసరిలాగా కాకుండా తనముద్రతో ప్రవేశించాడు. అయితే ఈ ఆగమనానికి ఒక సందర్భం ఉంది. కృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవ పంచశతాబ్ది వేడుకలు అటు కర్ణాటక ఆంధ్ర రాష్ట్రాలలో ఘనంగా జరిగిన నేపథ్యంలో, ఒకానొక ఉత్సవ ద్వారాన గేట్పాస్ లేకుండా అంటుగోడలున్నాయంటూ దండోరా వేస్తున్నాడు. ఆ సాహితీ సమరాంగణ చక్రవర్తినే నేరుగా అడుగుతున్నాడు.

"నన్ను గుర్తు పట్టలేదా కృష్ణరాయా!
నేనయ్యా దాసరిమాలను
మంగళ కైశికీ రాగవేదిక మీద
నర్తించిన సింహక్ష్వేళను
నేను ప్రభూ! చర్మకారుణ్ణి
భూ దిగంతరాల ప్రతిధ్వనించిన
జంబూద్వీప ఆది స్వరాన్ని
శ్రీరంగధాముని ముందు
సంగీత స్వర సముద్ర ఘోషని
మంగళ కైశికీ రాగ గోసంగిని" అంటూ తనని తాను పరిచయం చేసుకుంటున్నాడు.

ఎవరీ మాలదాసరి / దళిత దాసరి : ఒక్కమాటలో చెపితే విష్ణుభక్తుడు. పరమభాగవతోత్తముడు. ఆముక్తమాల్యదలో ఇతని కథ ఎందుకు చెప్పవలసివచ్చిందో డా॥ జి.నాగయ్య తన తెలుగు సాహిత్యసమీక్ష రెండవ సంపుటంలో ఈ విధంగా పేర్కొన్నారు. "గోదాదేవి విరహము అర్థము కాక ఆమె తండ్రియైన విష్ణుచిత్తుడు శ్రీరంగనాథునితో మొరపెట్టుకొనగా ఆయన మాలదాసరి కథను విష్ణుచిత్తునికి చెప్పినాడు. మూలమున వరాహమూర్తి భూదేవికి మాలదాసరి కథను చెప్పినట్లున్నది. భూదేవి మాలదాసరి కథలోని కైశికీగాన మహాత్మ్యము వినినది. భూదేవియే గోదాదేవిగా జన్మించినది. భూదేవి గోదాదేవి జన్మించుటకిది హేతువుగా కృష్ణరాయలు నిక్షేపించినాడు. అందువలన మాలదాసరి కథకు గోదాదేవి కథకు ఒక సంబంధమేర్పడుచున్నది. కైశికీ గానమహాత్మ్యము వివరించి అట్లే తానును స్వామిని పాడవలెనని భూదేవి గోదాదేవిగా అవతరించెనని మూలమున లేని కల్పనను కృష్ణరాయలు చేసినాడు" (తెలుగు సాహిత్య సమీక్ష – ద్వితీయ సంపుటం–పుట : 33) ఆముక్త మాల్యదలో వస్వైక్యము లోపించిందన్న విమర్శకుల భావనను పూర్వపక్షం చేసేందుకు, ఉపాఖ్యానాలు. ప్రధానకథకు దోహదకారులుగా నిలుస్తూ గోదాదేవి శ్రీరంగనాథుల వివాహములో అంతర్భవిస్తున్నాయని నిరూపించేందుకు ఆయన పూనుకొన్నారు. అయితే చండాల, బ్రహ్మరాక్షస సంవాదము వరాహ పురాణాంతర్గతమని పేర్కొని "ఇది కూడ వైష్ణవ మతోత్కర్షను స్థాపించుట కొరకే ఆముక్తమాల్యదయందు చెప్పబడినది. విష్ణుభక్తికీర్తన ప్రభావము వలననే బ్రహ్మరాక్షసునకు కూడ పూర్వపాపవిమోచనము కలిగి విష్ణుసాయుజ్యము లభించినది" (తె.సా.స పుట : 34) అని తేల్చారు. అదేవిధంగా ఆయన "మాలదాసరి బ్రహ్మరాక్షసునకు తన కైశికీ గాన ఫలమును దానముగా నొసగి అతని తరింపజేసెను. కనుక ఇచట దానవీరము" అని తెలిపారు. దీనిని బట్టి గోసంగి ఎలియాస్ మాలదాసరి ఉరఫ్ దళిత దాసరి, దానవీరుడని అర్థం అవుతున్నది. ఆముక్తమాల్యదలోని మాలదాసరి కథను బెనారస్ పట్టుచీరగా విశ్వనాథ పేర్కొన్నారని 'తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ" చేసిన డా॥ పిల్లల మర్రి రాములు తెలిపారు.

దానవీరుడైన గోసంగి ఆముక్త మాల్యదలో ఎట్లా చిత్రించబడ్డాడు అనేది ఆసక్తిని కలిగించే విషయం.

మాలదాసరికథ :-

వామనావతార రూపుడైన హరి నివసిస్తూ ఉన్న పుణ్యాశ్రమానికి మూడామడల దూరానగల ఒక గ్రామంలో ఒకానొక చెప్పరాని జాతివాడైన భక్తుడున్నాడు. 'కలడొకరుండు పేరుకొనగాని కులంబు' అనే మాటను మాలదాసరిగా పేర్కొన్నారు. వేదము వేంకటరాయశాస్త్రి. ఆ భక్తుడు ఎంతో భక్తి శ్రద్ధాసక్తులు గలవాడు. ప్రతినిత్యం బ్రాహ్మముహూర్తంలో లేచి మంగళకైశికీ రాగంతో ఎంతో శ్రావ్యంగా హరిని గూర్చి గానం చేసేవాడు. శ్రీవామనమూర్తి నివసించిన దివ్యదేశమునకు అరవమున 'కురుంగుడి' అనే పేరుందని సంజీవని వ్యాఖ్య వివరిస్తోంది.

అయితే తన గోసంగి కవితలో శ్రీకృష్ణదేవరాయలను సంబోధించడం, అతనికి తనగోడు వినిపింటం చూస్తే సుధాకర్ రాయలపాత్రను కాదంటున్న సూచనలేమీ లేవు. 16వ శతాబ్దం మీద, ఆమాటకొస్తే మొత్తం ప్రబంధయుగ సాహిత్యం మీద సుధాకర్కు తీవ్ర ఆక్షేపణలున్నాయని గోసంగిని చదివితే అర్థమవుతుంది.

కృష్ణరాయా కీర్తికాయా!
నీభువన విజయంలో నా కవనం కనబడుతుందా?
నీ ప్రబంధాలలో, నా జాతి అందం ప్రతిబింబిస్తుందా?
అష్టాదశ వర్ణనల్లో, అస్పృశ్య వర్ణం నిషిద్ధం
కవిలోక కావ్యాల్లో! వాడనాయకుడు నిషిద్ధం
నీ భువన విజయంలో మేం కాలుమోపి వుంటే
అష్టదిగ్గజాలేం కర్మ
వేల దిగ్గజాలు గండపెండేరాలతో ఘల్లుమనేవి
నీ సైన్యంలో మేముంటే
నీ కీర్తి పతాక హిమాలయాన్ని ముద్దాడేది
ఈ అంటరానితనం మమ్మల్ని
ఒంటరిని చేసింది"

అని వాపోతున్నాడు. తాను లేని స్థలాలను, తనకు స్థానంలోని ఆస్థానాలను వెతికి మరీ చూపుతున్నాడు. తనని తాను "వేదం గుర్తించనిమహాత్ముణ్ణి" అనీ "పదహారో శతాబ్దపు పీడకలని' అనీ అంటున్నాడు.

పదహారో శతాబ్దం
నా జాతికి పెద్దవిషాదం
పదహారో శతాబ్దం

నా జన్మకు ప్రారబ్దం" అంటూ పదే పదే అదే శతాబ్దమంతటా కలదిరిగాడు. కలత చెందుతూ సంచరించాడు. వర్తమాన చరిత్రను గతానికి తగిలించి ఆ గతాన్ని ఒక ఆగతం కోసం ముందుకు తెస్తూ ఉన్నాడు.

సుధాకర్కు 16వ శతాబ్దంలో వచ్చిన ప్రబంధ సాహిత్యం మీద ఎంతో ఆక్షేపణ ఉన్నదో, అంతే అభ్యంతరం వేదము వేంకటరాయశాస్త్రి వ్యాఖ్యానం మీద కూడా ఉంది. తన వ్యాఖ్యానానికి ఉపోద్ఘాతములో ఆయనిలా రాశారు "ఆముక్త మాల్యదా గూఢార్థ ప్రకాశనకై అత్యంతమయిన కృషి కావించిన మహావిద్వాంసులలో కీర్తిశేషులు మద్గురువర్యులు వర్తమాన శతాబ్ది నన్నయాచార్యులవారు శబ్దరత్నాకర నిఘంటు నిర్మాణ కర్మఠులు శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులవారు.

మఱియు, ఏ మత తత్త్వమును నెలకొల్పుటకై మహాభినివేశముతో ఈ కావ్యము నిర్మితమో ఆ విశిష్టాద్వైత తత్త్వమును ఈ పూర్వ వ్యాఖ్యానములలో తడవమింజేసి ఆ మతమును సరిగా వివరించుటకే ఈ మదీయ వ్యాఖ్య ఆవశ్యకమయినది" అని పేర్కొన్నారు. ఆముక్తమాల్యద ప్రౌఢ ప్రబంధం కనుక సంజీవని పూర్వం వెలువడిన వ్యాఖ్యలు ఆసమగ్రమని ఆయన భావించారు. దీనిని బట్టి చూస్తే విశిష్టాద్వైత తత్త్వనిరూపణార్థమే ఆముక్తమాల్యద రాయబడిందని, సంజీవని వ్యాఖ్యకు ముందు వచ్చిన వ్యాఖ్యానాలేవీ ఆ విషయాన్ని తడమక పోవటం చేత, ఆలోప పరిహరణార్థమే తన వ్యాఖ్యానావశ్యకత ఏర్పడిందనేది స్పష్టం. అదే ఉపోద్ఘాతంలో ఆయనిలా పేర్కొన్నారు" నేను ఈ వ్యాఖ్యను ఇప్పటికి పది పండ్రెండు, సంవత్సరములకు ముందే నిర్మింప నారంభించితిని. ఈ వ్యాఖ్య ఈ పాటి విపులమగునని ఆదిలో నేను ఊహించుకొనలేదు. రెండశ్వాసములకు వ్రాసి చూడగా, బావిత్రవ్వఁగా బేతాళములు వెలువడినట్టు' లయినది. ఈ గ్రంథమునకెల్ల జీర్ణోద్ధారమే కావలసి వచ్చినది. అందులకై సమగ్ర సంస్కరణ – సాధుపాఠనిర్ధారణ – కువ్యాఖ్యా విషహరణ సమంజసార్థావిష్కరణ పూర్వక విపుల వ్యాఖ్యానమును వ్రాయనుద్య మించితిని" అన్నారు. ఇందులో తక్కిన విషయాల మాట ఎట్లా ఉన్నప్పటికీ 'సాధు పాఠనిర్ధారణ', కువ్యాఖ్యావిషహరణ,"సమంజసార్థావిష్కరణ' అంటే ఏమిటో వేదము వారు ఎక్కడా చర్చించినట్లు లేదు. ఈ మూడు మాటలను గోసంగి కవితాపరంగా అన్వయించి చూడవలసినవి. సుధాకర్ అభ్యంతరాక్షేపణలు వేదంవారి వ్యాఖ్యలోని సామంజస్యాన్ని ప్రశిస్తున్నాయి. అదేవిధంగా బావి త్రవ్వగా బేతాళములు వెలువడినట్టుల' కావటమంటే ఏమిటో, వేదం వారి ఉద్దేశం ఏమిటో స్పష్టపడటం లేదు. అయితే సుధాకర్ మాత్రం 'గోసంగి' అన్న పదానికి వేదంవారు ఇచ్చిన అర్థ, తాత్పర్యాదులతో ఏకీభవించడం లేదు. 'గోసంగులు ప్రత్యేక అస్తిత్వం ఉన్న పౌరాణిక దళితులు' అంటున్నాడు సుధాకర్. వారి సంస్కృతి గురించి కవితలో ఎంతో ఉద్వేగ భరితంగా, హృద్యంగా, కవితాత్మకంగా ప్రస్తావించాడు. రాయలవారు గోసంగిని ఏప్రాంతంలో చూశాడు? వారి అస్తిత్వం, సాంస్కృతిక జీవితాస్తిత్వం ఏమిటనేది చారిత్రక ఆధారాలతో నిరూపింపబడవలసిన విషయం. అయితే సుధాకర్కు వేదము వేంకటరాయశాస్త్రి 'దళితదాసరి'ని పట్టుకుని మాలదాసరిగా పేర్కొనటం పట్ల తీవ్ర అభ్యంతరమే ఉంది. ఒక ప్రత్యేక అస్తిత్వం గల కులాన్ని వ్యాఖ్యాత మాల, మాదులుగా లేదా భేదం పాటింపనవసరంలేని కులంగా అర్థం చేసుకోమనటం ఆ ప్రత్యేక అస్తిత్వం గల గోసంగులకు జరిగిన అన్యాయంగా భావిస్తున్నాడు. గోసంగి పదానికి విపులవ్యాఖ్యానార్థియైన వేదము ఇచ్చిన వివరణతో సుధాకర్ సంతృప్తి చెందడం లేదు. వేదము వారు వివరణ ఈ విధంగా ఉంది.

1. గోసంగి ఆ సాది గోసంగి మాదిగ గూబరియన మాతంగుడఁగు" ఆం.భా అని నిఘంటువున నున్నను గోసంగి పదము మాలినికిం గవులు ప్రయోగింతురు.

2. ఓరోరి రాచవాఁడా, రారా, నావెంటఁదిరుగు రాగోసఁగివై పోరాడి మాడలిచ్చెదఁ? గోరా నీ యప్పుదీర్చుకోరా పెలుచన్పై ఉదాహరణలు చూపి ఇంకొంత వివరణ కూడా ఇచ్చారు. "ఈ దాసరినే దివ్యసూరి చరితమందు" "శ్వపచం కైశికగాన లమ్పటమ్" అని తడవి యున్నారు. అమరమందును "చణ్ణాల ప్లవ మాత్గ దివాకీర్తి మా" అని చండాల (=మాల), మాతంగ(=మాదిగ) పదములును, పర్యాయములుగానుం బఠితములు. ఇందువలన ఆ రెండు జాతుల భేదము ప్రకృతమున అవివక్షితమనియేనియుం దలంపనగు'ను అన్నారు. నిజానికి 'గోసంగి' అన్న శబ్దానికి ఇంత వివరణ ఇవ్వకుండా కులవిశేషపదమని, జాతి విశేష పదమనిగానీ చెప్పి ఉంటే సరిపోయేదేమో! నిజానికి ఆయన ఏం చేస్తే బాగుండేదో అని ఆలోచించటం కన్నా, చేసిన దానిగురించి మాట్లాడటమే మంచిది. అయితే ఇక్కడ ఒక విషయం స్పష్ట పరచుకోవలసి ఉంది. మూలంలో 'మాలదాసరి' అనే పదంలేనిమాట వాస్తవమే. కృష్ణదేవరాయలు 'గోసంగి' అన్న శబ్దాన్నే ప్రయోగించాడన్నది సత్యమే. కానీ 'మాలదాసరి' అని గోసంగి కథకు వేదము వేంకటరాయశాస్త్రి పెట్టారా ఆయనకు ముందు ఆముక్తమాల్యదకు

వ్యాఖ్యానాలు ఉన్నాయి కదా! ఒకవేళ ఈ కల్పన క్రియకు ఆయనే పాల్పడి ఉంటే సుధాకర్ చెప్తున్న విషయం వాదానికి నిలుస్తుంది. పూర్వ వ్యాఖ్యాతలను, వ్యాఖ్యానాలను పరిశీలించ కుండా ఆక్షేపించడం తొందరపాటవుతుంది. వేదము వేంకటరాయశాస్త్రి తన సంజీవని వ్యాఖ్యాప్రసక్తిలో కొన్ని వివరాలను ఇచ్చారు. "మదరాసు ప్రాచ్యలిఖిత భాండాగారములో ఆముక్తమాల్యదం గూర్చి వ్యాఖ్యలును సూచికలును కొన్ని కలవు. అవి యన్నియు కొన్ని భాగములకే వివరణోద్యమములు. ఈ ప్రబంధరాజమును సుబోధము చేయుటకై ఆధునికులలో అత్యుత్తమ కృషి గావించినవారు మచిలీబందరుజిల్లా జడ్జి సి.పి.బ్రౌన్ దొరగారు. వారికి తోడ్పడిన మహాపండితులు, మనువస్వాది ప్రబంధ వ్యాఖ్యాత జూలూరి అప్పయ్యపంతులువారు" అంతేకాకుండా ఆయనిలా అంటున్నారు "మఱిలోకులకు కడచిన 40–50 సంవత్సరము లలో ఈ మహాప్రబంధపుఁదత్త్వము కీర్తిశేషులైన వావిళ్ల రామశాస్త్రి గారిచే ప్రెసిడెన్సీ కాలేజీలో ఆంధ్ర పండితులుగానుండిన చదలవాడ సీతారామ శాస్త్రులు అను విద్వద్వరేణ్యుల తోడ్పాటున ముద్రిత ప్రకాశితమైన పుస్తకము వలన, ఉపలబ్ధమగు చుండినది. వారికి ప్రథమ ముద్రణార్థము వ్రాఁత ప్రతి దొరకిన ప్రకారము గ్రంథము ప్రణీతమైన నన్నూఱు వత్సరములు అప్పుడప్పుడు వ్యాఖ్యలు కూడ పండిత నిర్మితమగుచుండినవి" అని పేర్కొన్నారు. ఇట్లా పండిత నిర్మితములయ్యే సంజీవని పూర్వ వ్యాఖ్యానాలలో ఎక్కడైనా గోసంగి శబ్దానికి 'మాలదాసరి' అనే మాటను ఏవ్యాఖ్యాత అయినా వాడారో లేదో పరిశీలించాల్సి ఉంది. మాల, మాదిగ పదాలను పర్యాయ పదాలుగానే పఠించాలని, ఆ రెండు జాతులు భేదము ప్రస్తుతము 'అవివక్షిత' మని భావించవలసినదిగా వేదం సూచనపట్ల సుధాకర్ అభ్యంతర పడుతున్నారా అనేది కూడా ఆలోచించాలి. ఏది ఏమైనా సుధాకర్ గోసంగి దీర్ఘకవిత అనేక 'బేతాళ ప్రశ్నలకు ఆస్పదం కావటం అటు దళిత సాహిత్యానికి, ఇటు తెలుగు సాహిత్యానికి మేలు చేసేదిగానే భావించాలి. సుధాకర్ వాదనలో ఒక వాస్తవం మాత్రం ఉంది. వేదము వేంకటరాయశాస్త్రి మాల, మాదిగ శబ్దాలను ఇప్పటి ప్రత్యేకతలతో చూసే అవకాశం మాత్రంలేదు. అయితే ఇది వేదము వేంకటరాయశాస్త్రి కల్పనగానే భావించడానికి అవకాశం ఆయనే ఇచ్చారు. ఇదే ఆశ్వాసములో 6వ పద్యములో 'సురిమాళు వైష్ణవుండు' అనే శ్రీకృష్ణదేవరాయల ప్రయోగానికి విష్ణుభక్తుడైన యా మాలవాడు (మాలదాసరి యనుట) అని అర్థం చెప్పారు ప్రజా వాగ్గేయ కారుడు, ప్రకృతి కవి గోరటి వెంకన్న సురిమాళు వైష్ణవుడంటే మాలదాసరి అనే అర్థాన్నే సమర్థిస్తున్నాడు. 'గోసంగి' అనే మాట ఎక్కడో 64వ పద్యంలో వాడగా, అంతకు ముందే వాడిన పదం ఈ 'సురిమాళు వైష్ణవుండు' అనేది కావటం గనునార్హం నిజానికి ఈ కల్పన వేదము వారిదేనని నిర్ధారించడానికి ఇంకొన్ని ఆధారాలు అవసరమవుతా యనిపిస్తుంది. ఆరవ ఆశ్వాసములోనే 'మాతంగుడు', 'మాతంగతనువు' 'దాస', దాసరి అనే పదాలను కూడా శ్రీకృష్ణదేవరాయలు ప్రయోగించాడు. ఆయా సందర్భాల్లో సముచిత అర్థ నిర్ణయమే ఆయన చేశారని చెప్పడానికి మరింత లోతయిన పరిశీలన అవసరం. అయితే ఈ దివ్య మహాప్రబంధానికి వేదము వేంకటరాయశాస్త్రి తగు మెలకువతోనే వ్యాఖ్యానం రాశారని ఆయన ఉపోద్ఘాతములో రాసిన మాటలు తెలుపుతున్నాయి. "ఈ ప్రబంధమున ప్రౌఢియు పాండిత్యమును అలోకసామాన్యములు, ఎంతటి ప్రతిభావంతులనియు దీనిని గ్రహించి వివరించుటలో కొఱంతలు గల్గుట వింతగాదుబీ కావున ఈ వ్యాఖ్యాదుల యందు నా యజ్ఞత చేతను బుద్ధి జాడ్యము చేతను గల్గు దోషములకు పెద్దలు మన్నింతురు గాక" అని కోరారు. వేదము వారిది బుద్ధి జాడ్యమేనని నిర్ణయించి సంతృప్తి పడటం వల్ల ప్రయోజనం లేదు. అయితే సుధాకర్ తన కవితద్వారా కొన్ని వాస్తవాలు వెలుగు చూడాలని ఆశిస్తున్నాడు. ఎందుకంటే "వాస్తవాలు పందులో గింజవంటివి. వ్యాఖ్యానం గింజ చుట్టూరా ఉన్న గుజ్జు వంటిది. అది వివాదాస్పదమైంది" అని సర్ జార్జ్ క్లార్క్ అన్నట్లుగా, గింజకన్నా గుజ్జు రుచికరంగా ఉండటంతో గింజను విస్మరించాం. ఆ విస్మరించిన గింజ గురించి రుంజ మ్రోగించి చెపుతున్నాడు సుధాకర్. అష్టదిగ్గజాలు, అనంత ప్రబంధసాహిత్యం ఇదంతా సరే అందులో కులవ్యవస్థ సంగతేంటని అడుగుతున్నాడు. పంచమహాకావ్యాల్లోని పంచముల విషయం ఏమిటని కూడా ప్రశ్నిస్తున్నాడు కవి.

నా కన్నీటి లందలో నేనే చర్మాన్ని
మనువు కట్టిన బొందలో
మగ్గుతున్న ధర్మాన్ని" అని చెపుతున్నాడు.

దళితభాష, సంస్కృతి, సాహిత్యం, మొదలైనవాటి గొప్పదనాన్ని చాటుతున్నాడు. 'భువన విజయం'లోకి ప్రవేశాన్ని అడుగుతున్నాడు. కాని, వెలవాడల కవులకవి బలివాడలవుతాయని సుధాకర్కు తెలియనిదేమీ కాదు.

ఈ మొత్తం గోసంగిలో సుధాకర్ అడుగుతున్నదేమిటి? 'ఆత్మకు ఇంపైన భోజనం', నివాస యోగ్యమైన ఇల్లు (ఇందిరమ్మ ఇల్లుకాకపోవచ్చు) ఏ చెఱువు / బావి నీళ్ళైనా వాడుకోగల స్వేచ్ఛ, వీటన్నిటికీ మించి 'సామాజిక గౌరవం' భౌతిక దాడులు లేని సమాజం, గాయాలు లేని చరిత్ర, నిషిద్ధాక్షరాలు లేని సమవర్ణ, సహవర్ణకోశం, నలువైపులా స్పృశ్యగీతికలు ఇవి ఉండాలని కోరుతున్నాడు.

'మా వీధులు వేశ్యావాటికలు కావు' అని ప్రకటించడం సబబే కాని, అప్సరసల వక్షోజాల ప్రసక్తి ఎందుకనిపిస్తుంది ఇందులో. ఈ 'వక్షోజ ప్రియత్వం' కూడా ఇంకొక రూపంలోని ఆధిపత్యమే కదా! ఒక ఆధిపత్యం సంస్కృతిని నిరసిస్తూ, నిరాకరిస్తూనే వారు అప్సరసలే కదా! అని తాకి చూడటమెందుకు? అలాగే 'మాశీలాన్ని / ఏ శ్రీనాథుని సంతలోకి కొలుకియ్యలేదు' ఈ శీలప్రసక్తి. సుశీలులైన వారికి అవసరమా అనికూడా అనిపిస్తుంది. దళితస్త్రీల మట్టి వాసనల ఔన్నత్యం చెప్పడానికి అప్సరసలతో పని ఏమి? పోలికలు లేని, పోటీలు లేని, ఆధిపత్యాలు కొనసాగని ఒక వ్యవస్థను కోరుకోవటం అవసరం.

ఆముక్తమాల్యద విశిష్టాద్వైత ప్రతిపాదనను ప్రధానీకరించిన గ్రంథం, ఆంధ్రదేశంలో వైష్ణవమతం క్రీ.శ. 12వ శతాబ్దినుండి అనుసరింపబడుతూ ఉన్నది. క్రీ.శ 6వ శతాబ్దం నుండి తొమ్మిదవ శతాబ్దం వరకూ తమిళదేశంలో విష్ణుభక్తులుగా ఆళ్వారులు వైష్ణవమత భావాలను ప్రచారం చేశారు. భగవత్సార్ధనలో ఒక గాఢత ఆళ్వారులనుండి, వచ్చిందే 'ఆళ్వారు' అంటే లోతుకుపోయినవాడు, లోతును ఎరిగినవాడు అనే అర్థం ఉంది. ఆళ్వారుల గీతాల ఆధారంగానే రామానుజాచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించటం జరిగింది" భక్తుడు తన అస్తిత్వాన్ని గుర్తిస్తూ పరమపురుషుడైన భగవంతునిలో సంలీనమవడానికి సాధన చేసి సాయుజ్యం పొందడమే విశిష్టాద్వైతం" (డా॥ పిల్లలమర్రి రాములు – తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ పుట : 106).

రామానుజాచార్యులు ఉదార భావాలున్న వ్యక్తి బ్రాహ్మణేతరుడైన మహాపూర్ణుడిని గురువుగా అంగీకరించాడు. శూద్రవర్ణానికి చెందిన నమ్మాళ్వారును కీర్తించాడు. విష్ణువును అర్చించడంలో బ్రాహ్మణేతరులకు అవకాశం కల్పించినవాడు. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదకమైన ఆముక్తమాల్యద కాని తత్కర్త శ్రీకృష్ణదేవరాయలు కానీ, వర్ణవివక్షను చూపినారా? అనే సందేహం సహజంగా కలుగుతుంది.

"కృష్ణరాయా!
నిన్నిప్పుడు ప్రశ్నవేయ
సముచితమో కాదోగానీ
నీ కీర్తి కిరీటంలోని కలికితురాయి
అంటరానిదేనని గుర్తించలేకపోయాను
జోహార్ మూరురాయరగండ
నీవైపే చూస్తున్నది
నీవు జయించలేకపోయిన

అంటరాని కొండ

చరిత్రలో మచ్చగానే ఉండిపోయింది" అని తేల్చిన సుధాకర్ అటు చాపకూడుపెట్టిన బ్రహ్మనాయుడిని, ఇటు అన్నమయ వైష్ణవతత్వాన్ని అంగీకరిస్తున్నాడు. ఈ అంటరానికొండ కృష్ణదేవరాయ కృతమా? అన్యకర్తృత్వమా అనేది శోధించి తేల్చాల్సిందే.

దళిత కవిత్వం పని ఇక ముగిసిపోయిందని భావిస్తున్న సాహిత్య సందర్భంలో సమీప గతంలోకి కాకుండా సుదూర గతంలోకి వెళ్ళి వర్ణవ్యవస్థ, కులాధిక్యతల జాడను చూపుతున్నాడు. ఈ దిశగా ప్రాచీనసాహిత్యంలో కులవిషయంగా వ్యక్తపరచిన కవుల భావాలను, భావజాలాలను అటుసృజనాత్మకంగానూ, ఇటు పరిశోధనా పూర్వకంగా చర్చించడానికి ఒక స్వరం విప్పాడు సుధాకర్. ఒక చరిత్ర పుటను వెనక్కి తిప్పాడు. కొత్తపుటను తెరిచే దారిలో దళితకవిత్వం ఉందని సూచిస్తున్నాడు.

ఆధార గ్రంథాలు :

1. అముక్త మాల్యద – శ్రీకృష్ణదేవరాయలు
2. తెలుగులో భక్తి కవిత్వం – సామాజిక విశ్లేషణ – డా॥ పిల్లలమర్రి రాములు
3. తెలుగు సాహిత్య సమీక్ష – డా॥ జి. నాగయ్య

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

మిట్టపల్లి సురేందర్ 'గేయ' సాహిత్యం - సామాజిక సంవేదన



- డా. జరుపుల రమేష్
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
కాకతీయ ప్రభుత్వ కళాశాల, (స్వయం ప్రతిపత్తి),
హనుమకొండ.
చరవాణి: 9618944654,
Email: ramesh.jarupula@gmail.com

వ్యాస సంగ్రహం :

పాలగుమ్మి విశ్వనాథం "పాట' అనే పదం ఎప్పుడు పుట్టి ఉంటుందో చెప్పడం కష్టమే. కానీ మానవ పరిణామ చరిత్రలో, మానవ జీవితాన్ని అంటి పెట్టుకునే పెరిగింద 'పాట'. మానవుని సుఖదు:ఖాలు వెళ్ళబోసుకునే సాధనం పాట" (బి.ఎస్.రాములు. పాట పుట్టుక. పుట:106) అని అభిప్రాయ పడ్డారు. మానవ పరిణామ క్రమంలో తన అంతరంగంలోని ఆవేదనను, అనుభూతిని వ్యక్తపరచడానికి ప్రకృతిని అనుకరిస్తూ పుట్టిన అద్భుత ప్రక్రియ 'పాట'. ఆది మానవుడి అడుగులతో మొదలైన ఈ పాట, కాలగమనంలో ఎన్నో రూపాలను సంతరించుకుని, తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక అస్త్రమై నిలిచింది. అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారుల ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూనే.. ఆధునిక కాలంలో గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజుల సరసన నిలబడగలిగిన గొప్ప కవి మిట్టపల్లి సురేందర్. ఆయన సాహిత్యం కేవలం పదాల కూర్పు కాదు, అది సామాజిక అసమానతలపై సంధించిన బాణం. నిరుపేదల కష్టాలను, గ్రామీణ జీవన సౌందర్యాన్ని, సంస్కృతిని తన వాడుక భాషా సొబగులతో ఆయన అద్భుతంగా చిత్రించారు. సరళమైన పదాలతోనే లోతైన మానవీయ విలువలను, ప్రేమను, సహానుభూతిని రంగరించి, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడంలో ఆయన పాటలు కీలక పాత్ర పోషించాయి. సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తూ, తెలంగాణ మట్టి వాసనను, మనుషుల మనసులను ప్రతిబింబించే సురేందర్ గేయ సాహిత్యం నేటి తరానికి దిక్సూచిగా నిలుస్తోంది. ఆయన సాహిత్యంలో వాడుకభాషా సౌందర్యం, సామాజిక బాధ్యత మరియు ప్రజా చైతన్యంలో ఆయన పాటలు పోషించిన కీలక పాత్రను విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

కీలక పదాలు:

మిట్టపల్లి సురేందర్, సామాజిక సంవేదన, శ్రమ జీవుల వేదన, మానవత్వం, తెలంగాన ఉద్యమ సాహిత్య, సామాజిక ఆధ్యాత్మికత, ప్రజా చైతన్యం.

పరిచయం:

వినీలాకాశంలో 'సృజన' అనేది అందమైన, అద్భుతమైన ప్రక్రియ. ప్రకృతిలో తొలి మానవుడు ఏ రోజు బాధతో, ఆనందంతో కేరింతలు వేసిండో, ఆ కేరింతల్లో ఏదో ఆర్ద్రత, నిర్వేదం, ఆనందం దాగి ఉందని గమనించాడు. వాటిని తర్వాతి తరాలకు అందించాలని ఆరాట పడ్డాడు. వాటిని కాలగర్భంలో కలిసిపోకుండా నిత్యం పాడుతూ వచ్చాడు. కాలాలు మారుతూ, చరిత్రలో రాజరికాలు రావడం మొదలైనాయి. మానవుడు మెల్లమెల్లగా చరిత్రను అక్షరంగా మార్చుకున్నాడు. అక్షరమే చరిత్రకు పునాదిగా చేశాడు. ఆ అక్షరం మనుసు గాయాలను పసికట్టింది. ఆనందంలో ఎగిరి వేసిన కేకలు తర్వాత కాలంలో పాటగా మారింది. చరిత్ర అందించిన మాటతో కూడిన పాటను భద్రంగా లిఖితం చేశాడు. అలా మౌఖిక, లిఖిత సాహిత్యంలో పాట ప్రస్థానం మొదలైంది. సాహిత్యం కంటే ప్రాచీనమైనది, విశిష్టమైన ప్రక్రియ గేయం.ఆ తర్వాత పాట ఎలాంటి పాత్ర పోషించిదో అందరికీ తెలిసిందే.

తెలంగాణ నేల చైతన్యానికి, సంస్కృతికి మరియు పోరాటాలకు నిదర్శనం. వాటికి సంబంధించిన చరిత్రను తెలుసుకోవాడానికి గేయ సాహిత్యం ప్రధాన ఆధారం. చరిత్రకారుల కంటే ముందే తెలంగాణ ప్రాంత చరిత్రను, ఇక్కడి కష్టాలను గేయ సాహిత్యం కళ్లకు కట్టినట్లు వివరించింది. ఇది కేవలం పాట మాత్రమే కాదు, ఒక ప్రాంతపు ఆత్మకథ. తెలంగాణ భౌగోళిక పరిస్థితులు మరియు ఇక్కడి ప్రజల జీవనశైలి ఈ సాహిత్యానికి వెన్నెముకగా నిలిచాయి. ఎంతోమంది కవులు, కళాకారులు తమ కలం ద్వారా, గళం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పారు. ఇది ఒక తరం నుండి మరో తరానికి వారసత్వంగా అందుతూ, జనపద సాహిత్యం గా రూపాంతరం చెందుతూ వచ్చింది.

తెలుగు సమకాలీన సాహిత్యంలో మిట్టపల్లి సురేందర్ ఒక ప్రత్యేకమైన స్వరంతో గుర్తింపును సంపాదించుకున్న లిరిక్ రచయిత. ఆయన సాహిత్యం కేవలం వ్యక్తిగత అనుభూతుల వ్యక్తీకరణగా మాత్రమే కాక, సమాజంలోని అసమానతలు, అన్యాయాలు, రైతులు ఆకలి మరణాలు, నకలి విత్తనాలు, స్త్రీల పై జరుగుతున్న దోపిడీలు, మానవీయ విలువల పతనం వంటి అనేక అంశాలపై గాఢమైన స్పందనతో పాటలు రాశాడు. ఆయన పాటల్లో కనిపించే ప్రత్యేకత. ఒక సమాజం మార్పు పొందుతున్నప్పుడు కొత్త గొంతును కోరుకుంటుంది. అలా తెలంగాణలో గద్దర్, గోరేటి, సుద్దాల, జయరాజ్ లాంటి గొప్ప వాగ్గేయకారులను ఈ సమాజం అందించింది. ఆ దారిలోనే వారి వారసత్వం అందిపచ్చుకొని నిత్యనూతనమైన ఐడింటింటితో, అస్తిత్వంతో, గొంతుతో వచ్చిన నవయువ తెలంగాణ పాటల ముద్దుబిడ్డ మిట్టపల్లి.

మిట్టపల్లి సురేందర్ పాటల్లో సామాన్యుడ్ని తరపున ప్రశ్నించడం, తల్లి విలువలను ఈ సమాజానికి తెలియజేయడం, అణగారిన వర్గాల ఆవేదనలు దర్శనమిస్తాయి. ఆయన పాత్రలు కల్పితమైనవిగా కాక, మన చుట్టూ కనిపించే నిజమైన మనుషుల్లా అనిపిస్తాయి. అందువల్ల పాఠకుడు ఆ రచనలతో తేలికగా అనుసంధానం కాగలుగుతున్నాడు. ఆయన పాటల్లో వాడే భాషా, సరళత, ప్రయోగించే ప్రతీకలు, ఉపమానాలు అలంకారభరితమైన పదజాలం కంటే గాఢతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్లే అది ప్రజల పాటగా కీరిటం దక్కించుకుంది.

ఇలాంటి లక్షణాలు కల్గిన మిట్టపల్లి సురేందర్ 'నర్సయ్య, మధునమ్మ' అనే పుణ్యదంపతలకు నలుగురు సంతంనలో చిన్నవాడుగా పుట్టాడు. భూపలపల్లి జిల్లా, వెల్లంపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి పదవ తరగతి వరకు చదువుకున్నారు.

తండ్రి ద్వారా పాటలు వినే లక్షణాలు అలవర్చుకున్న మిట్టపల్లి చిన్నప్పటి నుండి ఎదో ఒకటి చేయాలనే కలలు కంటూ వచ్చిరాని పదాలతో పాటలు అల్లడం చేసేవాడు. అలా మెల్లమెల్లగా పాటలు అల్లుతూ, గ్రామం అనుభవించిన అనేక సామాజిక ఒడిదుడుకులను, సామాజిక బాధ్యతలకు ఒక రూపం ఇవ్వాలనుకున్నాడు.

మెల్లమెల్లగా ఎదిగి చదువు వైపు దృష్టి పెట్టకుండా, సమాజానికి చదువుతూ పద సంపదను పెంచుకొని, పాటల ప్రపంచంలోకి ప్రవేశించాడు. వారు రాసిన 'నవమాసాలు మోసిన తల్లి ప్రేమకే నేను దూరమా' అనే తొలపాట ద్వారా ఈ ప్రపంచంలో అడుగుపెట్టాడు. దాదాపు 300 పై చిలుకు సామాజిక గీతాలు, 50 కి పైగా సినిమా పాటలు రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011 సం.లో 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా' పాటకు ఉత్తమ గేయ రచయితగా చిన్న వయస్సులోనే 'నంది అవార్డు' అందుకున్నారు. వీరికి 2009 సం.లో 'జానపద రత్న అవార్డు' 2012 సం.లో 'దాశరథి అవార్డు', 2014 సం.లో 'సదాశివ అవార్డు', 2022 సం.లో 'మ్యూజికల్ మిర్చి అవార్డు' లాంటివి వరించాయి. మిట్టపల్లి రాసిన పాటల్లో సామాజిక సందేదనలు, సామాజిక చైతన్యాన్ని పరిశీలించడానికి, మనస్సుతో పాడుకోవడానికి ఒకసారి వ్యాసంలోకి ప్రవేశిద్దాం.

మిట్టపల్లి గేయాలు – స్పృశించిన కోణాలు:

మిట్టపల్లి సురేందర్ గేయ సాహిత్యం సమాజానికి అద్దం పట్టడమే కాకుండా, సమాజాన్ని చైతన్యపరిచే దిక్సూచిగా నిలిచింది. ఆయన రాసిన ప్రతి అక్షరం సామాన్యుడి గొంతుకగా మారి, అణచివేతకు గురైన వర్గాల పక్షాన నిలిచి ప్రశ్నించింది. ఆధ్యాత్మికతను అంధ విశ్వాసంగా కాకుండా, తోటి మనిషిని ప్రేమించే సామాజిక సంస్కృతిగా ఆయన మలిచారు. పల్లెప్రాణం, మట్టి మమకారం మరియు మనుషుల మధ్య అంతరిస్తున్న అనురాగాల పట్ల ఆయన వ్యక్తం చేసిన సంవేదన అమూల్యమైనది. ఒక్క మాటాలంటే చెప్పాలంటే మిట్టపల్లి సురేందర్ సాహిత్యం ఒక తరాన్ని ఆలోచింపజేసింది.

గూడ అంజయ్య బి.యఫ్. రాములు రాసిన 'పాట పుట్టుక' అనే పుస్తకానికి ముందుమాట రాస్తూ పాట గురించి ఇచ్చిన నిర్వచనాన్ని గమనిస్తూ "పాట ఒక దిక్సూచి. పాట ఒక తిరుగుబాటు. పాట ఒక తుపానులాంటిది. పండితుల నుండి పామరుల వరకు చిన్నపిల్లల నుండి ముసలి వారి వరకు ఒక ఉత్తేజాన్ని తెచ్చేంది పాట. పాటకు ఎల్లలు లేవు. దిక్కులు లేవు. భాష తెల్వదు. భావం ఒక్కటే పాటలకు తెలుసు. పాటను బంధించలేరు, ఉరితేయలేరు. పాట ఒక శబ్దం. పాట అణుబాంబు కంటే శక్తివంతమైనది. అది మహాసముద్రంలో బడబాగ్నులను చెలరేపుతుంది. భూమి పై భూప్రకంపనలను తెస్తుంది. విప్లవాలను సృష్టిస్తుంది, మానవ సమాజ అభివృద్ధికి ముందు వరుసలోని నిలుచుంటుంది. అణగారిన వర్గాల చేతిలో పాట ఒక ఆయుధమవుతుంది. విత్తనమై భూమిలో పడి మొలకెత్తుతుంది,తరం నుండి తరానికి వారసత్వానిది పాట"(బి.ఎస్.రాములు. పాట పుట్టుక. పుట:18) ఈ తరతరాల ప్రాంతీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న మిట్టపల్లి తెలుగు గేయ సాహితీ చరిత్రలో సామాజిక స్పృహ కలిగిన ఒక బలమైన సంతకంగా మనతో మాట్లాడూతూ, పాడూతూ అనేక కోణాలను స్పశిస్తున్నారు. వాటిలో ప్రధానంగా సామాజిక సంవేదనలు, శ్రమజీవుల వేదన, మానవత్వం, సామాజిక ఆధ్యాత్మికత, ప్రజా చైతన్యం, తెలంగాణ ఉద్యమం...ఇలా ఎదైనా సమస్య వచ్చినా వాటి పై స్పందించి, తన అక్షరాలతో పాటగా మలచడంలో ఆయనకు ఆయనే సాటి. వాటిలో కొన్నింటిని చూద్దాం.

మిట్టపల్లి గేయాలు –సామాజిక సంవేదన:

జీవితం గతానుగతికమై, అర్థరహితమైన సంప్రదాయాలు కేవలం దు:ఖానికి, వేదనకు హేతువులుగా మారి, ఆచారాలు ఆత్మహత్య సదృశ్యంగా పరిణమించినప్పుడు, నూతనత్వాన్ని అన్వేషించడం మానవ సహజ ప్రవృత్తి. అటువంటి క్లిష్ట సమయాల్లో ఎదురయ్యే సవాళ్లను మనిషి ఎదుర్కొనే తీరును బట్టే మానవ పునర్జీవనం సాధ్యమవుతుంది. ఈ పరిణామ క్రమం నూతన సృష్టికి, జీవితానందానికి, నవచైతన్య విలాసానికి బాటలు వేస్తూ, అంతిమంగా ఒక నవ సమాజ నిర్మాణానికి పునాది

వేస్తుంది. ఈ క్రమంలో ఉద్భవించే మత, సమాజిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలన్నీ పునర్జీవనానికి నిలువెత్తు రూపాలు. వీటిని విడివిడిగా పరిశీలించినా లేదా ఒకదానితో ఒకటి పెనవేసుకున్న పరస్పర ఆశ్రీత భావనలుగా విశ్లేషించినా మానవ వికాస పరిణామంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నది సుస్పష్టం.

సమాజంలో జరుగుతున్న మార్పులు, ఎదురవుతున్న సమస్యలు, అణచివేతకు గురవుతున్న వర్గాల బాధలను చూసి చిత్రించడం మరియు వాటి పట్ల స్పందించి పరిష్కారం కోసం ప్రయత్నించే గుణాన్ని 'సామాజిక సంవేదన' అంటారు.

సమాజంలో ఒక వ్యక్తి తన స్వంత ప్రయోజం కంటే భిన్నంగా ఇతర వ్యక్తుల భావాల కోసం, అవసరాల నిమిత్తం సామాజిక స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేసి, అందుకు అనుగుణంగా సామాజిక బాధ్యతను, స్పృహను కలిగిస్తాడు.

అంతే కాకుండా ఎదుటివారి కష్టాల్ని చూసి, అది తన కష్టంగా భావించుకొని, సమాజంలో జరిగే వివక్షను, అవినీతిని లేదా అరాచకాన్ని చూసి మౌనంగా ఉండకుండా, తన గొంతును లేదా కలం ద్వారా నిరసనను తెలియజేస్తాడు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా మానవత్వాన్ని గౌరవించడంతో పాటు, పాతబడిన, అర్థరహితమైన ఆచారాలు మనిషికి సంకెళ్లుగా మారినప్పుడు వాటిని ఎండగడుతూ, ఒక మెరుగైన సమసమాజ నిర్మాణం కోసం తపిస్తాడు.

సాహిత్యకారులకు ఈ సంవేదన అనేది ఒక ఊపిరి వంటిది. మిట్టపట్టి సురేందర్ వంటి కవులు సమాజంలోని నిశ్శబ్ద రోదనను తమ పాటల ద్వారా వినిపించారు. మిట్టపల్లి కలం నుండి జాలువారిన అత్యంత శక్తివంతమైన భావోద్వేగ భరితమైన పాట 'రాతి బొమ్మలోన'.

పల్లవి: "రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా
రక్తబంధం విలువ నీకు తెలియదురా
నుదిటి రాతలు రాసె ఓ బ్రహ్మ దేవా
తల్లి కొడుకుల ప్రేమ నీవు ఎరుగవురా
తెలిసుంటే చెట్టంత నాకొడుకుని
తిరిగి తెచ్చియ్య గలవా నీ మహిమలు

చ. పువ్వులో పువ్వునై నీ పూజ చేశాను
నీరునై నీ అడుగు పాదాలు కడిగాను
ఒక్క పొద్దులు ఉంటు ముడుపు చెల్లించాను
దిక్కునీవని మొక్కి ధీమాగా ఉన్నాను
తొలుసూరు కొడుకని ఈశ్వరా నీ పేరు పెట్టుకుంటే శంకరా
అందుకే వేశావా ఈ శిక్షను అమర వీరుణ్ణి చేసావా శ్రీకాంతును

చ. శివరాత్రి నీ శిలకు నైవేద్యమైనాను
దీపమారనీక పడిగాపులున్నాను
కళ్ళలో వేకువ దీవెననుకున్నాను
కడుపులో పేగును కోస్తవనుకోలేదు

నీ ఆజ్ఞ లేనిదే ఈశ్వరా చిన్నచీమైనా కుట్టదురా శంకరా
నీ సతికి గణపతిని ఇచ్చావురా నా కొడుకుపై నీ మతి ఏమైందిరా

చ. ఆడజన్మలో ఉన్న అర్ధాన్ని వెతికాను
ఆమ్మానే పిలుపుకై అల్లాడి పోయాను
తొలిసారి నాకొడుకి అమ్మాఅని పలికితే
ఆడజన్మను నేను గెలిచానుకున్నాను
పురిటి నొప్పుల బాధ ఈశ్వరా నీ పార్వతిని అడగరా శంకరా
తల్లిగా పార్వతికి ఒక నీతినా ఈతల్లి గుండెల మీద చితిమంటనా"

(పాట సేకరణ: మిట్టపల్లి సురేందర్ ఆల్బమ్ నుండి)

సమాజం దేవుడిని సర్వజ్ఞుడిగా, కరుణామయుడుగా భావిస్తుంది. కానీ ఇక్కడ కవి ఆ దైవత్వాన్ని 'రాతి బొమ్మ'తో పోల్చడం ద్వారా, మనిషి పడే ప్రాణసంకటంతో స్పందించని ఏ శక్తియినా జడ పదార్థంతో సమానమని తేల్చి చెప్పారు. ఇది ఒక తల్లి ఆవేదన.

మరొక అడుగు ముందుకేసి తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో శ్రీకాంతాచారి, బొజ్జ, కిష్టయ్య మొదలైన వెయ్యి మందికి పైగా యువకులు తమ ప్రాణాన్ని పణంగా పెట్టారు. "అమరవీరుని చేశావా శ్రీకాంతును" సమాజం వారిని 'అమరవీరులు'గా కొనియాడుతుంది. కానీ, ఆ బిడ్డను కోల్పోయిన తల్లికి కలిగే శోకం సామాజికంగా ఎంత పెద్దదో ఈ పాట చెబుతుంది.

ఇక్కడ 'అమరవీరుడు' అనే గౌరవం కంటే 'నా కొడుకు నాకు కావాలి' అనే సహజమైన తల్లి ప్రేమను కవి ఎంచుకున్నారు. దేశం కోసం లేదా రాష్ట్రం కోసం జరిగే పని దానాల్లో వెనుక ఉన్న కుటుంబ విధ్వంసాన్ని ఇది ఎత్తిచూపుతుంది.

భారతీయ సమాజంలో భక్తి అనేది ఒక బలమైన నమ్మకం. ఒక సామాన్య మహిళ దేవుడు నిన్ను నమ్మి చేసే ఉపవాసాలు, ముడుపులు, పూజలు ఆమెలోని అమాయకత్వానికి ఆశకు ప్రతీకలుగా నిలుస్తాయి.

"ఒక్క పొద్దులు ఉంటూ ముడుపు చెల్లించాను...దిక్కు నీవని మొక్కి ధీమాగా ఉన్నాను" కానీ, ఆ నమ్మకం ఒమ్ము అయినప్పుడు కలిగే ఆవేదన సమాజంలోని అంతిమ నిస్సహాయతను ప్రతిబింబిస్తుంది. దేవుడు పేరు పెట్టుకున్న కొడుకుని దేవుడు తీసుకెళ్లడం అనేది వ్యవస్థలోని అత్యంత క్రూరమైన వ్యంగ్యాన్ని సూచిస్తుంది. అందుకే కవి ఈ గేయంలో శివుడిని ప్రశ్నిస్తూనే, పార్వతి స్త్రీతత్వాన్ని సాక్ష్యంగా కోరుతారు.

"పురిటి నొప్పుల బాధ ఈశ్వర... నీ పార్వతిని అడగరా శంకర" ఒక పురుష దైవానికి (శివునికి) పురిటినోప్పుల విలువ, కన్న ప్రేమ విలువ తెలియదని, అది కేవలం ఒక తల్లికి (పార్వతి/ ఆడజన్మకు) మాత్రమే తెలుస్తుందని అనడం ద్వారా కవి ఈ సృజనలోని గొప్పతనాన్ని, తల్లి త్యాగాన్ని శిఖర స్థాయిలో నిలబెట్టారు.

"తల్లిగా పార్వతికి ఒక నీతినా...ఈ తల్లి గుండెల మీద చితిమంటనా" దేవుడి భార్యకు ఒక న్యాయం, సామాన్య తల్లికి ఒక న్యాయమా? అని ప్రశ్నించడం ద్వారా సామాజిక అసమానతలను, విధి వైపరీత్యాన్ని నిలదీశారు. తన కొడుకు 'అమ్మ' అని పిలిచినప్పుడు పొందిన విజయం, చితిమంటల్లో కాలిపోయి సర్వస్వాన్ని కోల్పోయిన సందర్భాన్ని అత్యంత దయనీయంగా చిత్రించారు. అందుకే కవి కేవలం సమస్యను చెప్పడం కంటే, ఆ సమస్య వల్ల కలిగే గుండె కోతను సమాజం చేత అనుభవింప చేయడంలో సఫలమయ్యారు. సాంప్రదాయక భక్తికి మరియు సామాజికతకు మధ్య జరిగిన అంతర్గత యుద్ధమే ఈ పాట.

ఉద్యమ సాహిత్యం - ప్రాంతీయ చైతన్యం:

ఉద్యమ సాహిత్యం అనేది సమాజంలో మార్పు కోసం, అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచే శక్తివంతమైన సాధనం. మిట్టపల్లి సురేందర్ పాటలు కేవలం వినోదం కోసం కాకుండా, ప్రజలను చైతన్య పరచడానికి, అన్యాయాలను ప్రశ్నించడానికి, స్వాభిమానాన్ని పెంపొందించడానికి, సామూహిక పోరాటానికి ప్రేరేపించడానికి ఉపయోగపడ్డాయి.

మిట్టపల్లి సురేందర్ రాసిన 'అదిగదిగో తెలంగాణ సమరభేరి మోగే' గేయం తెలంగాణ మలిదశ ఉద్యమ ఆరంభంలో ప్రజలను యుద్ధోన్ముకులు చేసిన ఒక 'సమర గీతం'. చారిత్రక స్పృహ, ప్రాంతీయ ఆవేదన, మరియు విప్లవ స్ఫూర్తి కలగలిసిన ఈ పాటలోని ప్రతి చరణం ఒక సామాజిక అస్త్రం.

పల్లవి: "అదిగదిగో తెలంగాణ సమరభేరి మోగే అన్నలారా రండి
దగా పడ్డ బతుకులకై దండు కదిలినాదో తమ్ములార లెండి
అరవై తొమ్మిది నుండి రెండువేల ఆరు వరకు
దళారుల పాలనలో నలుగుతుంది తెలంగాణ

చ. పద్యమల్లె ఉద్యమాన్ని పలుకుతున్న ఓరుగల్లు
ఖిల్లగోడ ఇటుకలు తొడ గొట్టేర తమ్మి
సాయుధ పోరాటంలో ఆయుధాలకాహుతైనా
అమరుల రక్తం పిడికిలి బిగించె మల్లి
తెలంగాణ స్వేచ్ఛకై పోరాడిన వీరుల
త్యాగాలను తలుచుకొని మళ్ళీ పోరాడమంటు

చ. ఆదివాసీ హక్కులకై ఆదిలాబాదు కదంతొక్కి
కథనరంగమందు నేడు కదిలేర తమ్మి
బల్లెమెత్తి బరిశెలెత్తి విల్లమ్ములనెక్కుపెట్టి
అడవి జాతులన్నీ సవాల్లిసురుతున్నయి
సావైనా బ్రతుకైనా కొట్లాడితే సాధ్యమని
ప్రాణమున్న శవాలోలె ఈ బతుకులు ఎందుకని

చ. నిజాంబాద్ జిల్లాలోని ఊడల మర్రి నేను
ఉరులుబొయ్య ఉడలిస్త నడవమందిరా
కరిమినగరు కత్తిదూసి ఖమ్మంమెట్టు కాలుదువ్వి
నిప్పుకణికలేళ్లగక్కి రగులుతోందిరా
పోయే ప్రాణం కోసం స్వార్థం ఎందుకు తమ్మి
పొందే లాభం కోసం పోరాటం చెయ్యమని

చ. తిరుగుబాటు తప్పనిసరి చేయకుంటే తప్పదు ఉరి
వేరు తెలంగాణకే ఇద్దాము ఊపిరి
పరిపాలన ఎరిదైనా పాలకుడు ఎవ్వడైనా
అందరు చేసే మోసం ఒక్కటే మరి
యుద్ధంలో వెను దిరిగితే మరణం తప్పదు తమ్మి
తలవంచక పోరాడితే అంతిమ విజయం మనదని"

(పాట సేకరణ: మిట్టపల్లి సురేందర్ ఆల్బమ్ నుండి)

'అరవై తొమ్మిది నుండి రెండువేల ఆరు వరకు/ దళారుల పాలనలో నలుగుతుంది తెలంగాణ' దగా పడ్డ బతుకుల విముక్తి కోసం సాగే సమిష్టి పోరాటం. 1969 నుండి సాగుతున్న వివక్షను, దళారుల పాలనలో నలిగిపోతున్న తెలంగాణ ఆవేదనను కవి ఇందులో అక్షయకరించారు. 'పద్యమల్లె ఉద్యమాన్ని పలుకుతున్న ఓరుగల్లు ఖిల్లగోడ ఇటుకలు తొడ కొట్టేర తమ్మి' వరంగల్ ఖిల్లా గోడల వీరత్వాన్ని, అదిలాబాద్ ఆదివాసుల ఆత్మగౌరవ పోరాటాన్ని ఉదాహరణగా చూపిస్తూ, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి అన్ని జిల్లాలు ఏకతాటిపైకి వచ్చి నిప్పుకణికల్లా రగలాలని ఆయన ఆకాంక్షించారు.

ముఖ్యంగా "ప్రాణమున్న శవాలోలె ఈ బతుకులు ఎందుకని" అని ప్రశ్నించడం ద్వారా బానిసత్వంలోని బతకడం కంటే, హక్కుల కోసం పోరాడి మరణించడమే మిన్న అనే ఉన్నతమైన సామాజిక సంవేదనను ప్రజల్లో నింపారు. చివరికి పాలకులెవరైనా మోసం ఒకటేనని హెచ్చరిస్తూ "యుద్ధంలో వెనుతదిరిగితే మరణం తప్పదు తమ్మి... తలవంచక పోరాడితే అంతిమ విజయం మనది" అంటూ ఓటమి భయాన్ని వీడి గెలుపు లక్ష్యంగా సాగాలని ఒక బలమైన రాజకీయ దిశా నిర్దేశం చేశారు.

మిట్టపల్లి గారి ఈ పాట 'ప్రాంతీయ చైతన్యానికీ ఒక మానిఫెస్టో' లాంటిది. ఈ పాటలోని 'తమ్మి' 'అన్నలారా' వంటి పదాల ద్వారా ప్రజలతో మమేకమై గుణాన్ని కలిగి ఉంది. ఇలాంటి పాటలు "ఒక్కరా ఇద్దరా విద్యార్థి వీరులు/వేరు తెలంగాణ పోరులో నేల రాలినాతారలు/ పొద్దుపొడుపులు పొత్తికడుపులు/ పోరులో పదునెక్కి పోయినాయుధాలు/" అంటూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల ఆత్మ బలిదానాలను గుర్తు చేస్తూ సాగే ఈ పాట ఎంతో చైతన్యాన్ని నింపి, వారి జ్ఞాపకాలను నెమరేసుకొనేటట్టు చేస్తుంది.

'యువ తరమంటే నేలతల్లి లాంటి వాళ్ళురా / జాతి భారాన్నంత భుజాన మోసేటోళ్లురా / విద్య దశనుండే విశ్వ విజేతలవుతారురా/ ప్రశ్నకు బదులు మీఉ బదులుకు ప్రశ్న మీరు / ప్రశ్న జవాబులతో ప్రణాళికలు రాసెటోల్లు/ బలిదానాలు చేస్తూ బూడిద కావొద్దురా అంటూనే.."నడిపించేటోళ్లు మీరే తూలి పడితే ఎట్లారా... స్వరాష్ట్ర సాధనకు యోధునివై కదలరా" అని విశ్వవిద్యాలయంలో చదువుకునే విద్యార్థులను రేపటి తలరాతాలను మార్చే యోధులని తీర్చిదిద్దుతాడు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం పై రాసిన పాటను చూస్తే...

పల్లవి: "ఓ యుద్ధం పుడితే ఓయూ నిలువుటద్దం పట్టేరా
ఆ యూద్దంలొ ప్రతి విద్యార్థి ప్రతి బింబమాయెరా
ప్రతి బింబామాయేరా పోరు ఆరంభమాయెరా
ఆరంభమాయెరా ఆరని మంటలాయెరా
ఆరని మంటల్లో ఆశ బూడిదాయెరా ... ఓ యుద్ధం

చ. క్యాంపస్ గోడలే బంధీఖానై కాకి తుపాకీ చుట్టూ గోడై
కాపల కాస్తూ ఉన్నాగాని ఆగని ఆరాటం అది చేసేర పోరాటం.
హాస్టల్ మెస్సుకు తాళం వేసి తాగే నీళ్లను కట్టడి జేసి
నానా హింసలు పెట్టిన గాని వీడని వీరత్వం
అది మన విద్యార్థి తత్వం
వారసత్వ ఉద్యమాల ఉస్మానియా గడ్డమీద

చ. ఏ ఆయుధమన్నది వాడని స్థలం
మేధా శక్తే లక్షల బలం
రంగులు మార్చే రాజకీయాలకు
లొంగిపోని లోకం
ఇక్కడ అందరు ఏకం

విద్యతో పాటే విప్లవ గానం
వినిపించడమే ఓయూ నైజం
సంగం కోసం సమిధలైన
వీరుల సందేశం అది మన అందరికాదర్శం
చైతన్యం గుండెల్లో చెలరేగే జ్వాలల్లో
ఏ యుద్ధం పుట్టిన ఓయూ నిలువుటద్దం పట్టునురా
ఆ యుద్ధంలో ప్రతి విద్యార్థి ప్రతిబింబంమవునురా"

(పాట సేకరణ: మిట్టపల్లి సురేందర్ ఆల్బమ్ నుండి)

ఈ గేయంలో విద్యార్థి ఉద్యమాల ఆత్మను ఎంతో ప్రభావవంతంగా ప్రతిబింబించారు. కవి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యుద్దాల నిలువుటద్దంగా చూపిస్తూ పోరాట పటిమను, విద్యార్థుల త్యాగనిరతిని ఆవిష్కరించిన తీరు అద్భుతం. ఈ పాటలో ప్రతి అక్షరం "విద్యాక్షేత్రం విప్లవ క్షేత్రంగా మారిన తీరు" అద్భుతంగా వర్ణించారు. ఏ యుద్ధం మొదలైనా ఓయూ దానికి నిలువుటద్దంలా నిలుస్తుందని, ప్రతి విద్యార్థి ఆ పోరాటంలో ఒక ప్రతిబింబమై నిలుస్తాడని కవి అభివర్ణించారు. క్యాంపస్ గోడలు బంధీఖానాలుగా మారి, తుపాకులు చుట్టుముట్టినా, హాస్టల్ మెస్సులు మూసివేసి నీటి సరఫరాను నిలిపివేసి ప్రభుత్వం ఎన్ని హింసలకు గురిచేసినా, విద్యార్థులు తమ వీరత్వాన్ని వీడలేదని కవి అత్యంత సామాజిక సంవేదనతో చిత్రించారు. "మేధా శక్తే లక్షల బలం" అని పేర్కొంటూ, రాజకీయ రంగులు మార్చే నాయకులకు లొంగని నైజం విద్యార్థులదని, విద్యతో పాటు విప్లవ గానాన్ని వినిపించడమే ఓయూ వారసత్వమని ఈ గేయం చాటిచెబుతోంది. సమాజం కోసం సమిధలైన వీరుల సందేశం రేపటి తరానికి ఆదర్శమని చెప్తూ, విద్యార్థి లోకాన్ని చైతన్య పరిచే ఒక నిప్పుకణికలా ఈ పాట సాగుతుంది.

తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో పాటనే ఆయుధంగా మలచుకున్న ప్రజా వాగ్గేయకారుడు మిట్టపల్లి సురేందర్. అస్తిత్వ చైతన్యమే ప్రాణంగా జాలువారిన ఆయన కలం, తెలంగాణ మట్టి వాసనను మరియు ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని

ప్రపంచానికి చాటిచెప్పింది. సామాన్యుడి గుండె చప్పుళ్లను జానపద బాణీలతో మేళవించి, నీళ్లు–నిధులు–నియామకాల ఆవశ్యకతను తన పాటల ద్వారా పల్లెపల్లెకూ చేరవేశారు. ముఖ్యంగా, ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించే పదాలతో ప్రజల్లో నిద్రాణమై ఉన్న పోరాట స్ఫూర్తిని రగిలించి, వారిని సామాజికంగా మరియు రాజకీయంగా జాగృతం చేయడంలో ఆయన పరిపూర్ణ విజయం సాధించారు. "రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా" వంటి చిరస్మరణీయ గీతాలతో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఆయన ఊపిరి పోశారు.

మిట్టపల్లి సాహిత్యం – సినిమా పాట:

మిట్టపల్లి సురేందర్ గారి సాహిత్యం పల్లె పొలిమేరలు దాటి వెండితెరపై కూడా తనదైన ముద్ర వేసింది. జానపద బాణీలలోని మట్టి వాసనను, సామాన్యుడి వేదనను సినిమా పాటకు అన్వయించడంలో ఆయన ప్రతిభ అసమానమైనది. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతిని, భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఆయన రాసిన పాటలు సినిమాల్లోకి రావడం వల్ల ఆయా చిత్రాలకు సహజత్వం తోడైంది. "రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా" వంటి పాటలు సినిమా మాధ్యమం ద్వారా కోట్లాది మంది హృదయాలను తాకి, ఒక సామాజిక చైతన్యాన్ని కలిగించాయి. తన కలంలోని వాడిని తగ్గకుండానే, సినిమా రంగానికి కావాల్సిన ప్రజాదరణ పొందిన శైలిని అలవర్చుకుంటూ మిట్టపల్లి గారు తన సాహిత్య ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

2005లో తేజు దర్శకత్వంలో వచ్చిన 'ధైర్యం' సినిమాలో సినీగీత రచయితగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇందులో "బైపీసీ బద్మాష్ పోరి బాగుంది యామె" అంటూ యువ హృదయాలను కొల్లగొట్టుతూనే, 'కత్తిలాంటి పోరిరో ఖతర్నాక్ ప్యారిరో' లాంటి తెలంగాణ జీవన సంస్కృతితో ఎందరో హృదయాలతో చిందులు వేయించారు. ఆ తర్వాత 'పోరు తెలంగాణ' 'రాజన్న' 'జై తెలంగాణ' మొదలైన సినిమాలతో తన ప్రయాణం మొదలుపెట్టి నేటి 'రాంబాయి నీ మీద నాకు మనసాయినే' అనే పాట వరకు అద్భుతమైన పాటలు రాసి ప్రజలను, శ్రోతలను మెప్పించిన ఈతరం జానపద కవిగాయక వాగ్గేయకారుడు మిట్టపల్లి.

కేవలం 'సినిమా' పాటలే కాకుండా జానపద పాటలు, లలిత గేయాలు, ప్రణయ గీతాలు, ఉద్యమ పాటలు ఇలా అన్ని గేయ ప్రక్రియలో తన బాణిని వినిపించారు. వారు రాసిన ఒక్కొక్క పాట ఒక్క ఆణిముత్యంలో ఉంటుంది.

ముగింపు:

"కవిత్వం భావవ్యక్తీకరణలో ఒక ప్రక్రియ. భావాన్ని ఎంత బలంగా ఆకర్షణీయంగా వ్యక్తం చేస్తే అంతగా కవిత రూపం దరిస్తుంది. కవిత్వానికి పాట, పద్యం, లలిత గీతం, వచన కవిత, గజల్స్, మినీ కవిత,దీర్ఘ కవిత వంటి అనేక రూపాలు అని" బి ఎస్ రాములు అన్నట్టు మిట్టపల్లి గేయంలో భావాన్ని ఎంతో బలంగా ఆకర్షణీయంగా చెప్పడం, రాయడం వల్ల పాఠకులు వారి వెంట పరుగెత్తి ఆ పాటలో లీనమవుతుంటారు. అందుకే 'కవిత్వం' 'పాట' ప్రభావాన్ని చూపినట్టుగా మిగతా ప్రక్రియలు చూపవు.

మిట్టపల్లి సురేందర్ గారి కలం నుండి జాలువారిన అద్భుతమైన గేయ సాహిత్యం, వారిని పాటల ప్రపంచంలో ఒక ధ్రువతారగా నిలబెట్టింది. నిజానికి ఒక కవిని కానీ, రచయితను కానీ సమాజమే సృష్టిస్తుంది; ఆ క్రమంలోనే నాటి తెలంగాణ సామాజిక పరిస్థితులు, ఉద్యమ ఆకాంక్షలు మిట్టపల్లిని ఒక గొప్ప ప్రజా కవిగా తీర్చిదిద్దాయి. నేడు ఆ పాటలు కేవలం ఆయనవి మాత్రమే కావు, అవి యావత్ ప్రజా బాహుళ్యానికి అంకితమైన ప్రపంచ ఆస్తి. ఒక రచయిత కేవలం నిమిత్తమాత్రుడే అని నిరూపిస్తూ, ఈ నేల తనే ఆయన చేత పాటలు రాయించుకుంది. అంతేకాకుండా, పాటను ఒక శక్తివంతమైన ప్రక్రియగా మలచి, వేలాది మంది కొత్త కవులకు, గాయకులకు మరియు కళాకారులకు దిక్సూచిగా నిలవడంలో

మిట్టపల్లి సాహిత్యం విశేషమైన కృషి చేసింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. రాములు, బి.ఎస్. పాట పుట్టుక పాటల అలంకార శాస్త్రం. హైదరాబాద్: విశాల సాహిత్య అకాడమీ, 2011.

2. సురేందర్, మిట్టపల్లి. యూట్యూబ్ ఆల్బమ్.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

ప్రకృతి వాది ఎండ్లూరి సుధాకర్



డాక్టర్ ఎల్మల రంజిత్ కుమార్
తెలుగు శాఖాధ్యక్షులు
ప్రభుత్వ స్నాతక (డిగ్రీ) కళాశాల, నిర్మల్ (జిల్లా)
స్వర చరం : 9849808757

ఎండ్లూరి సుధాకర్ ఒక ప్రకృతి వాది, అవును తను ప్రకృతి నుంచి జీవితపు అనుభవాలను పొందిన వాడు. అనుభవంతో అడుగడుగునా చైతన్యాన్ని నింపుకున్న మహా కవి ఎండ్లూరి సుధాకర్.

ప్రకృతిని చూసి పరవశించని వారు ఎవరు ఉండరు. అద్భుతమైన దృశ్యాలను వీక్షించి నప్పుడు ఆలోచనల్లో మార్పులు రావడం సహజం ఎలాగంటే

"ఆకు పచ్చని సూర్యుడై
మంచు వసంతాన్ని తెస్తాడేమో
ఒక పులికూనలా వస్తాడేమో
కొదమ సింహమై
కదన కుతూహల రాగమై
ఉదయిస్తాడేమో !"

ప్రకృతికి మూలాధారం సూర్యుడు. ప్రకృతంతా పచ్చగా మారడానికి మనలో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నవ వసంతాల్ని స్పృశించడానికి ఆ తేజస్సు పరిడవిల్లడానికి ప్రకృతే కారణం. ఉద్యమం ఎప్పుడైనా ఒకరితో మొదలై విశ్వ వ్యాప్తమై విస్తరిస్తుంది.

" తుపాకీ కొనమీద తుమ్మెదై వాలాడో
తూటాల ఆటలో నేలకే ఒరిగాడో
బిడ్డ జ్ఞాపకాల దిగులు దారాలు
బొడ్డు తెగిన మాతృత్వానికి
ఏడుపు ముడులేస్తుంటాయి
చిన్నప్పటి మిలటరీ వేషంలో కొడుకు ఫోటో
ఒక వీర దరహాసపు లేతకళ్ల వేకువ కాలం
ఏ కబురు అందిస్తుందో ఒక క్షేమ మేఘుం
కడుపు తీపిపై చల్లగా వాలుతుందో.
హఠాత్తుగా శవపేటికై
గర్భ గంగలో నిమజ్జనమవుతుందో
బొమ్మా బొరుసుల కదన రంగంలో
అమ్మలకెవరు భరోసా ఇస్తారు ?"

బిడ్డల్ని కోల్పోయిన అమ్మ కన్నీళ్ల ను తుడవాలంటే గుండె ధైర్యం కావాలి. మాతృభూమి కోసం మరణాన్ని సైతం ఎదిరించే సైనికులు వీరులై శూరులై మాతృభూమి రుణాన్ని తీర్చుకుంటున్నారు. వాళ్లను కమ్మ కన్న తల్లి రుణాన్ని ఎన్ని జన్మలెత్తినా మనం రుణాన్ని తీర్చుకోలేము. ప్రకృతిలో ఎండిన ఆకులు మాత్రమే చెట్టును వదిలి రాలిపోతుంటాయి కానీ జీవితంలో ఎదిగిన పిల్లల్ని కోల్పోవడం తల్లికి తీరని మనోవేదనను రగిలిస్తూనే ఉంటుంది వారికి భరోసా ఎవ్వరు ఇవ్వలేరు. అమ్మ మనసును అర్థం చేసుకోవాలంటే ప్రకృతిని మాత్రమే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది అమ్మ ప్రకృతి ఒక్కటే. ఇంకా ప్రకృతిని వీక్షిస్తే మనకు ఎన్నో అద్భుతాలు తారసపడుతాయి.

"ఈ పంచభూతాల తోలు వొలిచి
ఆకాశానికో మేకు పాతాళానికో మేకు
సప్త సముద్రాల మీద చర్మాన్ని నానబెట్టిన నీకు
ఆ సూర్యచంద్రులు చెరోచెప్పు కావాలిసిందే !
ఆకలితోనో అవమానంతోనో తలవొంచుకొని
నీ చర్మపు జోళ్లు కుట్టుకుంటున్న తాతా !
ఈ ప్రపంచం ఉంగటంగా మారి
నీ ముంగాలి బొట్టినేలిని
ముద్దు పెట్టుకోవాలని
కలలు గంటున్నాను."

కష్టజీవులకు ఉన్నతమైనటువంటి బ్రతుకును ఈ సమాజం ఇవ్వాలి కష్టాలను అర్థం చేసుకునే వారే కష్టజీవులకు అండగా ఉండాలి, అర్థం చేసుకోవాలి, వారి జీవితాన్ని తీర్చిదిద్దాలి అలాంటి ఒక గొప్ప మార్పు ఈ సమాజంలో జరగాలి ఇంకెంతకాలం అవమానాలు భరించాలి. అందరూ సమానమనే భావన సమాజంలో కలగాలి.

గోదావరి ఎంతో పవిత్రమైనది కానీ దానికి కూడా బాధలు తప్పవు. ఎలాగో "ఎండాకాలపు గోదావరి నీటికొవ్వు

కరిగిపోతూ పలచబడుతున్న జలచర్మంతో ఎనీమియా పేషెంటులా ఎంతో జాలి గొలుపుతుంది."అంతేకాదు "వానాకాలం రౌడీరాణిలా నకరాలు చేసి ఇప్పుడు అతి వినయంతో తలొంచుకుని పోతుంది." ఇంకా "గ్రీష్మ గోదావరి పాలిపోయిన దిగులు కళ్ళతో –నీటి మంచం మీద నిస్త్రాణగా పడివుంది నడినెత్తిన సూర్యుడు నిప్పుబాణాల్ని సంధిస్తూ అస్తమయం వరకు అదే పనిగా వెంటాడుతుంటాడు." అయినా " గొప్పగా మీసాలు మెలేసిన గోదావరి రొయ్యలు ఆఖరి క్షణంలో గుంపులు గుంపులుగా లొంగిపోతుంటాయి.""అప్పుడు ఆకాశం గోదావరి కోసం వెన్నెల బిచానా పరుస్తుంది.పొద్దున్నే గోదావరి నీటి ఒడిలో గిరిజన బాలలు రాజహంసల్లా జలకాలాడుతుంటారు.తడిసిన అందంతో అర్ధవివృత ఆచ్ఛాదనతో గూడెం పిల్ల గుండెల్లోకి దూరి కళ్ళమీద కలర్ ఫోటోలా కూచుంటుంది.జీవితం రుతువులుగా మారిపోయిన వాళ్ళకి కాలంతో కాపురం చెయ్యక తప్పదు ఏసీ గదులూ, ఏ సౌకర్యాలూ లేని వాళ్లకి గోదావరి పెంపుడు తల్లై ప్రేమగా సేద దీరుస్తుంది." గోదావరి ని సైతం నమ్ముకున్న వాళ్ళ బతుకులు గోదావరి అంత స్వచ్ఛమైనవి. వారి బతుకు దెరువు కూడా గోదావరి లాగే ఉంటుంది. కాలం తో పాటు గుణపాఠం కూడా నేర్పుతుంది. దాంతో పాటు గొప్ప అనుభవాలు నేర్పుతుంది.

చెరువులేని ఊరులో ఎన్నో సమస్యలు ఉంటాయి. ప్రజలకు అనుభూతి అందదు. జ్ఞాపకాలు వుండవు. చెరువు లేని ఊరు ఎలావుంటుందంటే "అమ్మలేని అనాథలా మా వూరికి చెరువు లేదు చిన్నప్పుడు చెరువు చెక్కిళ్ళని ముద్దుపెట్టుకున్న నీటి జ్ఞాపకాలు కానీ నీటి మైదానంలో దిసమొలతో పరుగెత్తిన గాఢస్మృతులు కానీ జలవృక్షమెక్కి అలల ఆకుల నడుమ పిందెలా కదిలిన బాల్యానుభూతులు కానీ లేవు."ఎందుకంటే బాల్యం లో ఆటలాడుటకు చెరువులు లేకపోవడం వల్ల చెరువు ఎలా ఉంటుందో దానితో గల బంధం, స్మృతులు శూన్యం.

నీటితో సమాజానికి ఉన్న అనుబంధం అద్భుతమైనటువంటి అనుభవాన్ని మనకు ఇస్తూ ఉంటుంది మీరు లేకపోతే నాగరికత లేదు నాగదికుడైనటువంటి మనిషి నీరు లేక జీవించలేడు ప్రతి దినం ప్రతిక్షణం నీళ్లు మన జీవనాధారం నీళ్లు లేకపోతే జీవించడం కూడా కష్టం.

"చెరువు పలకమీద జలాక్షరాలు దిద్దుకోవాలని చిన్నప్పుడు ఎంత పలవరించామో" కానీ అవి అన్నీ ఊహలే అయ్యాయి. ఎందుకంటే చెరువు తెలియదు. దాని మధుర స్మృతులు తెలియవు. జీవితం లో ఎన్నో అనుకుంటాం అవన్నీ పొందాలని ఏమిలేదు, చెరువు వల్ల ఎన్ని లాభాలు చవిచూడడం కావాలి.

మనం చిన్న పిల్లల్లా వున్నప్పుడు పని మరియు చదువు సమయాన్ని ఆటల కోసం వెచ్చిస్తాం అలాగే "మబ్బుల ఊరేగింపు బయలుదేరినప్పుడల్లా ఉరుములతో గొంతుకలిపి ఆరుబయట నీటి నినాదాలు చేసేవాళ్ళం. జలజలా రాలే తొలకరి చినుకుల్ని మట్టినాల్కలు చాపి పిప్పరమెంటు బిళ్ళల్లా చప్పరించే వాళ్ళం." ఉల్లాసంగా ఉత్సాహం గా ఆన చినుకుల్లో ఆటలాడు కున్నాం ఆ జ్ఞాపకాలు ఇంకా మెదడు లో మెదులుతూనే వున్నాయి..

" చెరువు మా బాల్య జలస్వప్నం ఆకాశం కొలిమిగా మారిన అగ్ని రుతువులో ఒక చెరువు కోసం ఒక చెలమ కోసం బొబ్బలెక్కిన కాళ్ళతో కాందిశీకులమయ్యే వాళ్ళం బెత్తిక లెత్తి దూపగొన్న మా బతుకులకు గుక్కెడు మంచినీళ్లు కూడా దొరికేవికావు మా గురయ్యతాత కళ్ళగుంటల్లా 'రెండు' దిగుడుబావులు మాత్రం దిగులు దిగులుగా కనబడుతుండేవి".
నీళ్లు లేక నీళ్లు దొరుకక చిన్నప్పుడు పడ్డ కష్టాలు అవి ఒక గిలాసెడు నీళ్ల కోసం ఎంతో దూరం నుంచి తెచ్చుకొనే పరిస్థితి ఉండేదే ఊరు చివర చెలిమెలు ఎన్నెన్నో తోడేవాళ్ళం కానీ బురుద తప్ప ఇంకేం కనపడలేదు.

"ఆకాశంవైపు చేతులు మోడ్చి మాకో చెరువు నియ్యమని ప్రార్థించాం భగీరథులమై జలాగ్రహం చేశాం." కానీ మా

మాట ఎవరింటారు మేమే అప్పుడు దేవుళ్ళం ఇంకా మా ప్రార్ధనలు ఎవరు వినగలరు. శాపనార్తాలు పెట్టాం మన్ను దీసి ఆకాశం అంచుల ద్దాక పోసాం అదంతా వెర్రి తనం అని ఇప్పుడు నాలోనేను నవ్వు కున్నాను.

"ఆకాశంలోకి విల్లుసారించి మేఘ భాండాల్ని బద్దలు చేయాలనుకున్నాం రోకళ్ళకి కప్పలు కట్టి నీటి పూజలు చేస్తే వర్షం పడుతుందనుకునే వెర్రిబాల్యం మాది" కానీ కొన్నిసార్లు పడచ్చు ఇంకొన్ని సార్లు పడక పోవచ్చు అయినా ఆ కాలం లో అలా చేసాం. అనుకోకుండా " ఎప్పుడయినా వర్షమొచ్చిన పొద్దు మా వూరు జలప్రవాహపు జాతరవుతుంది.

మళ్ళీ మరునాటికి బురద మొహంతో నెర్రలు తీస్తుంది ఒకే ఒక్క కుంభవర్షపు తుఫాను రాత్రి నిజంగానే మా వూరు చెరువయ్యింది." "గుడిసెల మెడలదాకా వూరు మునిగినా చెరువు ఉయ్యాలలో తేల్తూ మా కడుపుల్ని చెరువు చేసుకున్నాం." అప్పుడు తినడానికి తిండి కరువైయ్యింది. ఎటు చూసిన కప్పల బెకబెకలు మా కడుపులో ఆకలి లుకలుకలు ఆ రోజులు మళ్ళీ రాకుండా వుంటే అంతే చాలు అనుకున్న.

" నిండునీటిలో మేమంతా తాబేళ్ళమయ్యాం కొరమీనులమయ్యాం చందమామ బేడిస చేపలమయ్యాం నెమ్మది నెమ్మదిగా చెరువెండిపోతుంటే అమ్మ దగ్గర పాలైపోయినట్లు మూగవోయాం మా వూరు గుర్తు కొచ్చి నా బాల్యం వీపు నిమిరినప్పుడల్లా నా తాతముత్తాతల నాటి మెట్ట పొలం కళ్ళల్లో కదిలినప్పుడల్లా చెరువులేని నా పల్లె రూపం నన్ను నిలువెల్లా నీరుగా మార్చేస్తుంది నన్ను చెరువుగా మారమని మట్టిగొంతుతో నినదిస్తూ వుంటుంది." విషాద బాల్యం, విపత్తు గ్రామం, చెరువులు లేని లోటు, కరువు తో కడుపు ఇవి అవి కాదు పుట్టుకే సమస్యల వలయం గా మారింది ఏం జరుగుతుందో ఎందుకు జరుగుతుందో తెలియని పసి హృదయం లో అయోమయం.

ముగింపు :

మధుర మైన భావాలు, జ్ఞాపకాలు బాల్యం తోనే ముడిపడి ఉంటాయి. మనిషి ప్రకృతితోనే మనుగడ సాగిస్తుంటాడు. అనుభవాలు ఆలోచనలు ఆచరణ అవన్నీ కూడా జీవితంలో పొందడం అనేది ప్రకృతితో ఆత్మీయమైన అనుభూతిలా భావించాలి. అలాగే ఎండ్లూరి సుధాకర్ ప్రకృతి వాది లా అవతరించి అగుపిస్తున్నారు.

ఆధార గ్రంథసూచి:

నల్ల ద్రాక్ష పందిరి – ఆచార్య ఎండ్లూరి సుధాకర్.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

బహుజన సమాజ ప్రతిబింబాలు పెద్దింటి అశోక్ కుమార్ 'గుండెలో వాన' కథలు



డా॥ లక్ష్మీగళ్ళ మహిపాల్
అధ్యాపకులు,
ప్రభుత్వ జూనియర్ కళాశాల, పఠాన్ చెరువు
మొబైల్ నంబర్: 9701695932

****

రచయిత పరిచయం

రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం, భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన పెద్దింటి అశోక్ కుమార్ 1999 నుండి కథలు రాయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు 300 కథలకు పైగా రాసారు. వాటిని 10 కథా సంపుటాలుగా వెలువరించారు. భిన్నమైన ఇతివృత్తాలతో కూడిన ఏడు నవలలను, వందకుపైగా సాహితీవ్యాసాలను, ఐదు నాటకాలను రాసారు. దాదాపు ఎనిమిది, తొమ్మిది సినిమాలకు మాటలు-పాటలు రాశారు. ఉపాధ్యాయుడుగా, రచయితగా, నాటక కర్తగా, మాటల రచయితగా, నటుడిగా, ఒక సామాజిక కార్యకర్తగా విభిన్న కోణాల్లో చిత్రీకరించిన కథల ద్వారా వైవిధ్యభరితమైన రచయితగా పెద్దింటి అశోక్ కుమార్ మనకు దృశ్యమానం అవుతున్నారు. తెలంగాణ గ్రామీణుల బతుకు పోరాటాలకు వీరి కథలు ఆనవాళ్ళుగా నిలుస్తాయి. ఆకట్టుకునే శైలి, చక్కటి కథా శిల్పంతో రాసిన కథలను చదవడం వలన పాఠకుల్లో మంచి అనుభూతికి, ఆలోచనలకు ఊపిరిపోస్తున్నాయి.

వ్యాస సంగ్రహం

జీవితాన్ని గెలుచుకోగలం అన్న ఆత్మ విశ్వాసాన్ని కలిగించే కథలు రాయడం నేటి కథకులకు అవసరం. బాధలు, కన్నీళ్ళు, ఆత్మహత్యలు, ఆకలి చావులు మాత్రమే జీవితం కాదు. జీవితంలో ఓడిపోయే క్రమాన్ని చిత్రించి సానుభూతి పంచడం ఒక్కటే చాలదు. వాళ్ళు ఆ స్థితి నుండి తిరిగి జీవితాన్ని గెలుచుకునే విధంగా స్ఫూర్తినిచ్చే విధంగా చిత్రించాలి. కథల్లో మంచితనం, మానవ విలువలు, పరోపకారం, ఉన్నత సంస్కృతి చిత్రించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే వాస్తవిక జీవితం చిత్రించడంతో పాటు ఓ జీవితం ఎలా ఉంటే బాగుంటుందో అనే విధంగా కూడా చిత్రించాలి. ఈ పుస్తకంలోని

కథలూ వస్తువులో దేనికదే భిన్నంగా ఉంటాయి. పేదరికం, వలస, మహిళలూ, బహుజనుల కష్టాలు, ప్రపంచీకరణ ప్రభావం వీటిల్లో కన్పించే అంశాలు.

ఉపోద్ఘాతం

తన చుట్టూ ఉన్న సమాజాన్ని అధ్యయనం చేసి, అది అలా ప్రవర్తించడానికి మూలమైన ప్రత్యక్ష పరోక్ష కారణాలను ప్రభావవంతంగా అక్షరీకరించే కథకుల్లో పెద్దింటి అశోక్ కుమార్ ఒకరు. వ్యవసాయంలోని సాధక బాధకాలను రెండే రెండు పాత్రలతో, చదివేవారి గుండెల్లో దాగున్న ఆర్ద్రత పెల్లుబికేలా రాసిన 'గుండెలో వాన'ను తన కథా సంకలనానికి శీర్షికగా ఎంచుకోవడం ఔచిత్యంతో కూడింది. పెద్దింటి అశోక్ కుమార్ కథలు గుండెను తడిచేసే సామర్థ్యంగలవి. మనుషుల్లోని గుండె తడి దృశ్యాలకు 'గుండెలో వాన కతలు' అద్దం పడుతాయంటే ఏ మాత్రమూ అతిశయోక్తి కాదు. రచయిత సామాజికపరమైన పరిశీలనకు మచ్చుతునకలు ఈ కథలు. 20 కథలున్న 'గుండెలో వాన' కథా సంపుటిలో ప్రతి కథ ఒక ప్రత్యేకమైన వస్తువుతో కూడుకుని ఉన్నది.

విషయ విశ్లేషణ

'గుండెలో వాన' కథా సంపుటిలోని ఒక్కో కథ ఒక్కో సామాజిక సమస్యను, మానవీయ కోణాన్ని స్పృశిస్తుంది. ఇందులో భాగంగా ప్రతి కథలో ఉన్న ఇతివృత్తాన్ని, సమాజంపై అది చూపే ప్రభావాన్ని బాధలు, నైరాశ్యం మాత్రమే కాకుండా జీవితాన్ని గెలుచుకునే ఆత్మవిశ్వాసాన్ని నింపేలా సాగిన ఈ కథా సంపుటిలోని ప్రధాన కథల అంతరంగాన్ని కింది విధంగా విశ్లేషించవచ్చు. 'జలగండం' కథ నీళ్ళ మీద రాసిన కథ మనుమడిని కాపాడుకోవాలనే ఒక నానమ్మ ప్రయత్నాన్ని కథనంలో చక్కగా చెప్పుకొస్తారు. జలగండమంటే నీళ్ళల్లో పడి చనిపోవడం కదా అనిపిస్తుంది మనకు. కాని రచయిత అసామాన్యమైన ప్రతిభ మనకిక్కడ అబ్బురపరుస్తుంది. తన భర్తకు జలగండం వుందంటే ఏమో అనుకున్నది కాని నీళ్ళ కోసం బోరుబావులు వేసి, వ్యవసాయం చేసి అప్పులపాలు కావడంతో తీర్చలేక, ఆ అప్పుల్లోనే మునిగి చావడమని తెలిసిందని, చదువుకున్న కొడుక్కు ఉద్యోగం రాకపోయినా, ఊళ్లోకి వచ్చిన కంపెనీలకు భూములను అమ్ముకుంటే వచ్చిన డబ్బులతో చేసిన అప్పులు తీర్చాను. ఈ భూముల్లో వెలిసిన కంపెనీలో కొడుక్కు ఉద్యోగం వచ్చిన కూడా జలగండం వెంటాడుతూనే ఉండేదని, ఫ్యాక్టరీల నుండి వెలువడిన రసాయనాలు తాగే నీళ్ళల్లో కలవడం వలన చనిపోయాడని, జలగండం ఈ రూపంలో వచ్చిందని, ఇప్పుడు తన మనువడికి కూడా జలగండముందని, మీరు రచయిత కాబట్టి ఎట్లా రక్షించుకోవాలో చెప్పండని ఆమె అడుగుతుంది. ఆమె పేరు సుశీల. ఇది సుశీల సమస్య మాత్రమే కాదు ఇది మనందరి సమస్య. తరిగిపోతున్న నీటి వనరులు, పెరుగుతున్న కాలుష్యం నుండి మనుషులను ఎట్ల కాపాడుకోవాలో తెలియని స్థితి వచ్చింది. సమాధానం కోసం వచ్చిన సుశీలకు చెప్పడానికి నీళ్ళ మీద నవల రాసిన రచయిత దగ్గర సమాధానం మాత్రం లేదని కథను ముగిస్తాడు రచయిత. ఇది మనందరం ఎదురుక్కుంటున్న అతి ముఖ్యమైన సమస్య. అంతేకాదు, 'ముందు ముందు ఇంకా ఏ రూపంలో జలగండం దాపురిస్తుందో?' అని ఇందులోని పాత్ర ద్వారా ప్రశ్న వేయిస్తారు. ఈ కథ ఎంతో ఆలోచనాత్మకంగా సాగుతుంది. ఇదే కథసంపుటిలో నీళ్ల గురించి ఉన్న మరో కథలో 'తిండి కోసం కూలీనాలి చేయొచ్చు, కానీ నీళ్ల కోసం ఏం జేస్తం?' అనే ప్రశ్నను రేకెత్తిస్తూ, నీటి కరవులో పిల్లల దూప తీర్చడానికి ఓ తల్లి పడే కష్టం 'బిందెడు నీళ్లు' కథ ద్వారా తెలియజేశారు రచయిత. ఈ కథ చదివితే ఆ నాటకీయత చాలా అబ్బురపరుస్తుందని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు పెద్దింటి. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం లేకపోవడం వలన తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యను చూసి చలించిపోతాడు. మాతృభాషలో బోధన మీద ప్రజల్లో ఆదరణ తగ్గుతున్నదని, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీషు మీడియం ప్రారంభం కాకపోతే పాఠశాలలు మూతపడుతాయనే దిగులుతో రాసిన కథ 'చుక్కలు

రాని ఆకాశం'. ఇప్పుడైతే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్ మీడియం తరగతులు మొదలైనవి. ఈ కథలో ఉపాధ్యాయుల మధ్య జరిగిన సంభాషణలు విలువైనవి. ప్రజలు కోరుకున్నది మనము ఇవ్వాలే కానీ పిల్లల ఎదుగుదల సరిగ్గా ఉండదని అనుకుంటారు. ఏదిఏమైన కానీ గొప్ప సమాజాన్ని నిర్మించాల్సిన తరగది గది వెలవెలబోవడం పట్ల ఆవేదన చెందుతారు.

'పురుగు' కథను కూడా ఉపాధ్యాయుల గూర్చే రాసారు. ఒక కథలో ఉపాధ్యాయుడు పిల్లల కోసం తాపత్రయ పడుతుంటే ఈ కథలో పాఠం చెప్పాల్సిన సమయంలో వ్యక్తిగతమైన లావాదేవిలతో గడుపుతున్న సమయాన్ని వివరిస్తారు. వృత్తి ధర్మంలోని తేడాను గమనిస్తాము మనము. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ప్రభుత్వమే అందించాలనే ఉద్యమానికి శ్రీకారం చుట్టిన కథ 'కొత్తసాలు'. ఈ కథ వర్తమాన పరిస్థితులకు అద్దంపట్టిన కథ.

'కొన్ని చేపలు ఒక గాలం' కథలో రోజు ఎండలో కంకులు కాల్చుకుంటు జీవితీస్తున్న వాళ్ళు ఆర్థికంగా ఎట్లా మోసపోతున్నారో, వీళ్ళ యొక్క అమాయకత్వంతో వ్యాపారం చేస్తున్న వాళ్ళ గుట్టును విప్పిచెప్పిన కథ ఇది. ఈ సంపుటిలోని మరో మంచి కథ 'ఆకలి'. వజ్రమ్మ ఒక అనాథ వృద్దురాలు. ఆమె ఇంటి పక్కనే ఒక ఉపాధ్యాయుని కుటుంబం ఉంటుంది. ఆ వృద్ధురాలు వాళ్ళ ఇంటికి వచ్చి అతని భార్యతో మాట్లాడుతుంటే జాగ్రత్తగా ఉండాలని అంటాడు. ఆమె ఎప్పుడు నోరు తెరిచి ఇది కావాలి అని అడుగదు. వాళ్ళ ఇంట్లో నుండి వచ్చే వాసనలకు వజ్రమ్మ ఆకలి పెరుగుతుంది. వాళ్ళు కూడా ఎప్పుడు ఆమెకు పెట్టరు. ఒకసారి ఆ ఉపాధ్యాయుడు పటాన్‌కోట్‌కు వెళ్తాడు. మధ్యలో తుఫాను వలన రైలు ఆగిపోతుంది. ఎక్కడ తినడానికి దొరకదు. విజ్ఞానయాత్రకు వెళ్ళిన విద్యార్థులకు, బాధ్యతగా తీసుకెళ్ళిన ఉపాధ్యాయలు ఎప్పటికప్పుడు భోజనాలు అందిస్తుంటారు. వాళ్ళతో మాటలు కలిపినా కూడా అతనికి భోజనం దొరకదు. ఆకలి బాధను అనుభవిస్తాడు.ఆ సయమంలో ముసలమ్మ బాధ గుర్తుకు వస్తుంది. తాను చేసిన తప్పేమిటో అతనికి అర్థం అవుతుంది. ఇంటికి రాగానే ఆమె కోసం చికెన్ తెచ్చి భార్యతో వండిస్తాడు. స్వయంగా తానే తీసికెళ్ళి ఆ ముసలమ్మకు ఇస్తాడు. ఆమె వద్దని అంటుంది. తెల్లారే సరికి ముసలమ్మ చనిపోతుంది. తాను ఇచ్చిన క్వారియర్ మూత కూడా ఆమె తీయదు. ఆకలికి మించిన రోగం ఏముంటుంది. ఆకలి తీర్చుకోవడానికి మనిషి దేనికైన దిగజారుతాడని చెప్పిన కథ. కొందరు మాత్రం ఆత్మాభిమానంతో చావనైన చస్తారు కాని చేతులు మాత్రం చాచరని చెప్పకనే చెప్పిన కథిది.

ఈ సంపుటికి పేరు పెట్టిన కథ 'గుండెలో వాన'. నిజంగానే ఈ కథను చదివితే గుండెలో దు:ఖపు వాన కురవాల్సిందే. సహజసిద్ధమైన సాదాసీదా పాత్రలతో నడిపించిన కథ. ఒకరు బట్టలు కుట్టేవారు. మరొకరు కుట్టించుకునే ఆమె. అంతే వాళ్ళ రోజువారి జీవితంలోని సంఘటనలే ఈ కథ. తెలంగాణ పల్లెల్లోని వ్యవసాయ కుటుంబాలు వాణిజ్య పంటలు వేసి, వాటికి గిట్టుబాటు ధరలు రాక, కాలం కలిసిరాక, అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న తీరు కళ్ళకు కట్టినట్టుగా చిత్రీకరించారు పెద్దింటి. బతుకమ్మ పండుగకు కుట్టించుకున్న చీర, జాకెట్టు అక్క శవం మీదికి పోతాయి. 'ఎవుసలంల మన్ను వడ. ఆర్నెలు జేత్తె ముల్లు గట్టె మిగులక పాయె. బిడ్డ అరిగోస ఎల్లదీసె. వానల మన్నువాడ, నిన్న వాన గొట్టకపోతె ఇంత బెంగట్లిలక పోవు. పత్తి వెట్టి పత్తి వెట్టి పత్తి మందే తాగి సచ్చె. మన గతి ఎంతకుందో..' అన్న మాటలు నేటి రైతుల దుస్థితిని తెలియజేస్తున్నాయి.

'బహుజన దృక్పథంలో వర్గ సమస్యలున్నా, దేశీయవాస్తవిక సామాజిక దృష్టి వల్ల కులం ప్రాధాన్యాన్ని వహిస్తుంది. వర్గ వివక్షనీ, కులవివక్షనీ పక్క పక్కనే పెట్టి చూస్తే, కుల వివక్ష మానసిక క్షోభను కలిగిస్తూ, ఆత్మగౌరవ సమస్యని ముందుకి తెస్తుంది. అందువల్ల కేవలం వర్గ సమస్యతో మాత్రమే సాహిత్యాన్ని చూస్తే, దాంట్లోనూ భౌతికదృష్టి ఉన్నా, సాహిత్యం సమాజ వాస్తవికతను ప్రదర్శించడంలో పాక్షికకోణమే ప్రదర్శితమౌతుంది. అందు వల్ల వర్గ, కుల సమస్యల సమ్మేళనంతో సాహిత్యాన్ని విశ్లేషించేది సాహిత్యంలో బహుజనదృక్పథమవుతుంది. – అని అంటారు సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు

డా.దార్ల వెంకటేశ్వరరావు. (1)

అలా ఈ సంపుటిలో 'నింద, చీమా చీమా ఎందుకు పుట్టావ్, ఈ పాప(శీ) ఎవరిదీ?, దారి చూపినవాడు, బిందెడు నీళ్ళు, ప్లాసెంటా, మర మనిషి, దగడు, ఆనాటి వానచినుకులు, స్కావెంజర్, తీపి చావు, మూడోకన్ను, ఇప్పుడే అందిన వార్త, ఆట' వంటి అలోచనీయమైన కథలున్నాయి. ప్రసిద్ధ కథకులు శిరంశెట్టి కాంతారావు గారు 'వర్తమాన సమస్యల వాస్తవ దృశ్యాలను పట్టిచూపే కథలు' అని అర్థవంతమైన ముందుమాటను రాసారు. పెద్దింటి కథాసాహిత్యంపై తన అభిప్రాయాన్ని ఈ వాక్యాల్లో వ్యక్తం చేశారు. 'ఉపాధ్యాయుడంటే కేవలం తరగతి గదిలో నాలుగ్గోడల మధ్య పిల్లలకు పాఠాలు బోధించడం మాత్రమే కాదు. సమాజ రుగ్మతలను గుర్తించాలి. వాటి నుండి ఏ విధంగా బయటపడాలో ప్రజలకు వివరించాలి. అందుకు సరైన వాహిక సాహిత్యం మాత్రమే. అందుకే పెద్దింటికి సాహిత్యం ప్రవృత్తిగా మారిపోయింది. అందుకే మనం పెద్దింటి వృత్తి ప్రవృత్తులను సమానంగా గౌరవించాల్సి వుంది'.

అందరు చదవాల్సిన ఉత్తమమైన కథా సంపుటి ఇది. ఆయుర్వేదం అంటే ప్రజలు నమ్మరన్న కారణంతో, మంత్రించి మందులు ఇచ్చి యథాశక్తిగా సేవ చేయాలనుకున్న రెండు తరాల వైద్యులకు ఎదురైన చేదు ఫలితాన్ని వివరించే కథ 'నింద'తో ప్రారంభమై 20వ కథ 'ఆట' వరకు ఈ సంకలనం పాఠకులను విరామం లేకుండా చదివిస్తుంది. అద్దె గర్భం తల్లులకు ఎదురయ్యే చేదు అనుభవాలు, సరోగసీ వికృత పోకడలపై ఆలోచింప చేసే కథ 'ఈ పాప(శీ) ఎవరిది'.

తెలంగాణ పలుకుబడులకు, జన జీవనానికి పెద్దపీట వేస్తూ పాత్రల స్వభావ చిత్రణ, సన్నివేశ కల్పన, కథల ఎత్తుగడ, కొనసాగింపు, ముగింపును సమర్థంగా నిర్వహిస్తూ కూర్చిన కథల సంకలనమే 'గుండెలో వాన'. వర్తమాన బహుజన సమాజానికి ప్రతిబింబంగా నిలిచే 'గుండెలో వాన' సంపుటి ప్రతి ఒక్కరూ చదవదగింది.

ముగింపు

భారతదేశంలో బహుజనుల జీవితాల్లో పురాణేతిహాసాలకు మించి లోతైన యదార్థ గాథలుంటాయి. ఎవరి జీవితాల్ని కదిలించినా కథలు కెరటాలై పోటెత్తుతాయి. అవేవీ కాలక్షేపానికో, వ్యాపకం కోసమో చెప్పుకునే వట్టి కథలు కాదు. బహుజన బతుకుల ఎతలు, కథలన్నిటి నుండి పచ్చి కన్నీటి వాసన మనల్ని చుట్టుముడుతుంది. కనుక ఏ బహుజనుడి ఇంటి కడపను తడిమినా కథలు కట్టలు తెగి ఉబికి వస్తాయి. ప్రపంచీకరణ కడుపుతో ఉండి ప్రసవించిన రచయిత పెద్దింటి అశోక్ కుమార్. పెద్దింటి పేరు చెప్పగానే ఒక 'మాయిముంత', 'జుమ్మేకి రాత్ మే', 'ఆ ఇల్లు మూతవడ్డది', 'ప్లాసెంట', 'ఆకలి', 'కాగుబొత్త', 'ఊటబాయి'... ఇలా ఎన్నో కథలు సగటు తెలుగు పాఠకుని మనో ఫలకంపై వచ్చి వాలుతాయి. తెలంగాణ మట్టిని తవ్వి మైలపడిన జీవితాలనెన్నింటినో నెత్తికెత్తుకున్న బహుజన కథకుడు పెద్దింటి. అలాంటి బహుజన జీవితాల వాస్తవాలను చిత్రించిన కథలు 'గుండెలో వాన– కథలు. ఇంకా అనేక విషయాలు ఈ కథాసంపుటిపై చర్చించవచ్చు. కానీ, వ్యాస పరిమితి దృష్ట్యా కొన్ని విషయాలకే పరిమితం కావాల్సివచ్చింది.

పాద సూచికలు:

1. డా॥ దార్ల వెంకటేశ్వరరావు బహుజన సామాజిక దృక్పథం వ్యాసం నుంచి..

ఉపయుక్త గ్రంథ సూచి :

1. గుండెలో వాన కథ సంపుటి – పెద్దింటి అశోక్ కుమార్
2. కథా శిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

"విషప్పురుగు" గిరిజన సంచార తెగల కథలు - సమాలోచన



డా.జి.లచ్చయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
జహీరాబాద్, సంగారెడ్డి జిల్లా.

పరిచయం:

గిరిజనులు అడవులపై ఆధారపడి జీవిస్తుంటారు. కాని ప్రస్తుతం అనేకానేక కారణాల వలన మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు. గిరిజన, సంచార తెగల జీవితాలను ప్రతిబింబించే కథలను రాసానిగారు చాలా హృద్యంగా చిత్రించారు. విషప్పురుగు గిరిజన, సంచార తెగల కథల సంపుటి ప్రజాశక్తి బుక్ హౌస్ వారి ద్వారా 2017వ సంవత్సరంలో ప్రచురింపబడింది. ఈ కథల సంపుటిలో మొత్తం 13 కథలు ఉన్నాయి. గిరిజన, సంచార తెగల జీవితాలను రచయిత ఎలా ప్రతిఫలింపచేశాడో ఈ వ్యాసంలో విశ్లేషణ చేస్తాను.

1.కీడు:

ఎండాకాలం మండుతున్న ఎండలలో నెలలు నిండిన రత్నమ్మకు పురిటినొప్పులు రాగానే మంత్రసాని కాన్పు చేయడానికి ప్రయత్నిస్తే బిడ్డ అడ్డం తిరగడం వల్ల కాన్పు కష్టమని చెప్తుంది. చేసేదేమిలేక మూడు మైళ్ళ దూరంలో ఉన్న ఆసుపత్రికి ఎడ్లబండిలో నిండు గర్భిణిని రాళ్ళూ, రప్పలూ, గుంతలూ ఉన్న తోవలో నడపమని కుదుపులకు ప్రసవం వెంటనే అయిపోతుందనే నమ్మకం, ఆచారం గ్రామాలలో ఉండడాన్ని తెలియజేశాడు కాని అలా చేయడం వల్ల అసలుకే మోసం వచ్చి ప్రసవం కాకుండానే నిండు గర్భిణీ తనువు చాలిస్తుంది. అయితే చనిపోయిన గర్భిణీ శవాన్ని అలాగే పూడ్చివేస్తే ఊరికరిష్టం, కీడు తగులుకుంటుంది. కలిగ్గెం మునిగిపోతుంది. తల్లినీ, బిడ్డనూ రెండుగా చేసి పూడ్చాల్సిందేనని యానాది మిట్ట నుంచీ

మొండోన్ని తీసుకొస్తే, గాజు పెంకుతో శవం గర్భం నుంచీ మరణించిన శిశువును బయటకు తీశాడు మొండోడు. తరువాత మొండోడు శవం గుంత మీద కూర్చోని " నేను మొండోన్ని గదాసామీ. నేనింత పంజేసినా గదా నాకు ఓ పంచెగుడ్డో నా బిడ్డకొగ సొక్కాయి గుడ్డో ఏదో వొగటియ్యల్ల. లేకుంటే నేను లెయ్యను" నిక్కచ్చిగా చెప్పేశాడు...సామే, మిమ్మల్నే నమ్ముకొని బతికేటోళ్ళం. మీరియ్యాల మేం తినాల కట్టుకోవాల. ఏదో మాకడుపాత్రం. దినొమ్ము అడగలా గదా! మీ బిడ్డెకు, మీకూ కీడు లేకుండా జేసినా. సల్లని తల్లి నేరుగా సొర్గానికే పోతాది అపీలేలే. మొండోడి మాట తప్పదు" (50,51) నిండు గర్భిణీ సచ్చిపోతే పీనిగిను నా చేతకోయించి తల్లిని, బిడ్డను వేరు చేయించి పూడ్చేసిన ఈళ్ళు మడుసులే. పొట్టకూటి కోసం ఎవరూ సెయ్యనిపని పీనిగిని కోసీ బతికే నాలాంటోళ్ళు మడుసులే....కీడు ఎట్లా పోతుంది. అసలు ఆ కీడు ఎవరికి తగిలింది. కనలేక సచ్చిన ఆమేకా? ఆమెను కోయించిన జనాలకా? కోసిన నాకా? ఏమో....అని కథను ముగించాడు.

2.అదృశ్య విధ్వంసం:

ప్రపంచీకరణ జాతుల జీవనకళనూ సంస్కృతులను ధ్వంసం చేస్తూ వాళ్ళ యొక్క మనుగడను ఏ విధంగా ప్రశ్నార్థకం చేస్తున్నదో తెలియజేస్తున్న కథ ఇది."అమ్మా! ఆకలే! ముద్ద తిని రెండ్రోజులయింది. నువ్వు పోసిన గెంజి నీళ్ళు సాలడంలా. కండ్లు తిరుగుతుండాయి" (111) అన్న మాటలు వాళ్ళ జీవితం ఎలా ఉందో తెలియజేస్తున్నాయి. టేపు రికార్డులో పాటలు ఆన్ చేసి వెంకటస్వామి, లచ్చుము హీరో హీరోయిన్‌గా సినిమా పాటలకు డ్యాన్సులు వేశారు మొదట ప్రేక్షకులు ఎవరు రాలేదు. రోడ్డుపై మాత్రం వాహనాల రణగొణ ధ్వని అలాగే ఉంది. ఎవరికి పట్టని వాళ్ళ "ఆకలి" లాగా. వెంకటస్వామి తండ్రి అయిన మల్లయ్య కులవృత్తి అయిన దొమ్మరాటలో రెండు కాళ్ళు పోగొట్టుకొని పొట్టకూటి కోసం తన కొడుకు, కోడలు, మనవడు, మనవరాలు ఆడుతుంటే డోలు కొడుతూ ఉండే మల్లయ్య దొమ్మరాటకు తగ్గుతున్న ఆదరణను గురించి ఈ విధంగా ఆవేదన చెందుతాడు. అందుకే తన కళను గురించి ఈ విధంగా తెలియజేస్తాడు.

జాటీతో ఒంటిపై పెళ పెళ మని కొట్టుకోవడం, ఇనుపకడ్డినీ గొంతుకు ఆనించి యు ఆకారంలో ఆ ఇనుపకడ్డినీ వంచడం, వెంకటస్వామి మీద భార్య, కొడుకు, కూతురు ఎక్కితే వాళ్ళ ముగ్గురి బరువును ఆపుకొని సర్కస్ ఫీట్లు చేయడం, తల దూరెంత ఎడంగా ఉన్న ఇనుపరింగులో నుండి పిల్లలు తమ శరీరాలను తీయడం, ఒక ఇనుపరింగులో నుండి అతికష్టంగా ఇద్దరూ పిల్లలు దూరడం, లచ్చుము నేలపై పడుకొని ఉండగా ఆమె గుండెలపై బండరాయి పెట్టి సమ్మెటతో కొట్టి బండను ముక్కలు చేయడం. తాడుపైన పొడవాటి వెదురుకర్రను పట్టుకొని నడవడం, పొడవాటి కర్రమీద ఎక్కిన జయ తన పొట్ట మధ్యన చేర్చుకొని కాళ్ళు చేతులు బార చాచి కదలకుండా ఉండిపోవడం. ఇదంతా ఆకలి తీర్చుకోవడం కోసమే బాబులూ! ఇదే మా వృత్తి...మిమ్మల్ని సంతోషపెట్టడమే పని. మీరు తోచింది యివ్వండి. మా ఆకలి తీర్చండి" అని దీనంగా అడుక్కొనే పరిస్థితులు ప్రపంచీకరణ వలన కులవృత్తులు లేకుండా పోవడానికి కారణమని ఆవేదనను వ్యక్తపరచడం ద్వారా వృత్తుల వాళ్ళు ఎలా చిన్నాభిన్నం అయ్యారో తెలియజేశారు.

3.పొగిడింపు:

సచ్చిపోయిన వాళ్ళను తలుచుకుంటూ పాడిపించుకొనే పొగిడింపు పాటనే ఆ కళాకారులకు చివరిదైపోయింది. అంతా ఏడుపే అంతా బాధే. పొగిడింపు పాడిచ్చుకున్న వాళ్ళు పోయిన వాళ్ళను కలకాలం గుర్తు పెట్టుకొని జీవిస్తారు. వాళ్ళ జ్ఞాపకాలను శాశ్వతం చేసి పాటలు పాడిన మనల్ని ఎవరూ గుర్తు పెట్టుకోరని గుండప్పతో చెప్పించిన తీరు వాళ్ళ జీవితాలు ఎలా ఉన్నాయో తెలియజేస్తుంది.

అన్ని సంబంధాలు, అన్ని కళలు వ్యాపారమై పోయిన తీరును చెబుతూ మన కళలూ వ్యాపార స్థాయికి ఎదగలేదని, వ్యాపార విలువలను అందుకోలేదని కాబట్టి మన కళలు కనుమరుగైపోతున్నాయని చెప్పడం అక్షరసత్యం... మాయకాలంలో

కళలు తేలిపోయి, ఆదరణ తగ్గి టివీలు, సోషల్ మిడియాల ప్రభావం పెరగడంతో ఆచార సంప్రదాయాలు కనుమరుగై పోతున్నాయని మనతో పాటు ఈ కళ కడేనేమొ? అని ఆవేదన చెందడం ద్వారా రాబోయే తరాల వాళ్ళకు ఈ కళలు, కళాకారులు గురించి తెలియదేయో? కళలు అంటే వింతగా చూసే రోజులు వస్తాయేయో? అని ఆవేదనాభరితంగా చిత్రికరించాడు. బుడిగెజంగమోడొచ్చి బుర్రకథ చెప్తా వుండాడంటే చాట్ల నిండా ధాన్యమిచ్చేవాళ్ళు" (150) ఇంటి ముందుకు వచ్చిన కళాకారులకు ఒకప్పుడు చాటలనిండా ధాన్యాలు పోసేవారని ఇప్పుడు దోసెట్లలో పోస్తున్నారని ఆవేదనా చెందడం.వర్షాలు లేక రైతులకు పంటలు సరిగా పండట్లేదని చెప్పడం వెనుక ప్రకృతి వినాశనం ద్వారా సమయానికి వర్షాలు పడక, పొలాలు ఎండిపోయి ధాన్యం పండకపోవడమనే కారణాన్ని కూడా రచయిత చాలా చక్కగా వివరించాడు.

4.కుబుసాలు:

కరువు కాటకాల వలన పంటలు పండకపోవడంతో ఆ పంట పొలాలలో ఉండే పాముల్ని, ఎలుకల్ని పట్టి బతికే ఇర్లోళ్ళ పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారయిన పరిస్థితిని వివరిస్తూ రచయిత ఈ కుబుసాలు కథను రాశారు.

తినడానికి తిండి దొరక్క పస్తులున్న పరిస్థితులలో కనీసం పొట్ట పోసుకోవడానికి చిందు వేషం వేసుకొని ఊర్లో అడుక్కోవాలని నిర్ణయించుకున్న వెంకటస్వామి లక్ష్మినరసింహస్వామి వేషం, నారిగోడు చెంచిత వేషం, మెడకు డోలు దుముకును జిల్లల్ని పట్టుకొని నాగడు, దుముకుని పట్టుకొని ఇర్లోడు బయలుదేరి వెళుతున్న వాళ్ళకు రాళ్ళ కుప్పలో నుండి తీండ్ర పొదలోకి వెళ్తున్న పాము కనిపిస్తుంది. " అది గమనించిన ముసిలిగోడు "అద్దో పాము" అన్నాడు ఉత్సాహంగా. పోతే పోనీలే పద" అన్నాడు నాగడు. మిగలిన వాళ్ళూ దాన్ని గమనించినా ఏమీ ఎరగనట్లే మౌనంగా నడుస్తున్నారు. మామూలుగా అయితే పాము కనిపిస్తే చాలు ఇర్లోళ్ళకు పండగే. ఎట్లోకట్ల దాన్ని పట్టి చర్మం తీసి అమ్ముకునిందాకా నిద్రపోరు...ఏమిరా నాగా! ఇర్లోళ్ళ బతుకులు యిట్టయిపాయ. పామును చూసి కూడా గొమ్మున పోయే కాలం దాపరించ" వాళ్ళ మౌనాన్ని భంగపరుస్తూ అన్నాడు ఇర్లోడు...గవర్నమెంటు రూలు పున్నెమాని పాములు బట్టి ఆడించే విద్దె మాతోనే కడైపాయ. అదిపోయినాక...ఎప్పుడో పూర్వీకుల నుంచీ వస్తావుండె....ఈ చిందయినా జీవనాధారమైతుందనుకుంటే...పొగలంతా తిరిగినా పది రూపాయలు రాలా....ఏం బతుకులో...దుముకుని ఎగేసుకుని ఆలోచిస్తూనే నడుస్తున్నాడు ఇర్లోడు" (88) పాములను పట్టడం స్మగ్లింగ్ కేసు కింద వస్తుందని, దొంగ వ్యాపారమని వచ్చిన కొత్త చట్టాలు పాములు పట్టే ఇర్లోళ్ళ కులవృత్తిని ఏ విధంగా నాశనం చేసిందో ఈ కథ తెలియజేస్తుంది.

5.వేట: అభివృద్ధి పేరిట రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా ఎప్పటినుంచో నివసిస్తున్న యానాదులను తమ ఇండ్లు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని అధికారులు ఆదేశిస్తారు. మేం ఎక్కడికి వెళ్ళాలి ఎంతో కష్టపడి కట్టుకున్న ఇండ్లను వదిలిపెట్టి ఎక్కడికెళ్ళాలో, ఎందుకు వెళ్ళాలో చెప్పండని అమాయక గిరిజనులు ప్రశ్నిస్తే సరియైన సమాధానం అధికారుల వద్ద లేదు. పక్కా ఇళ్ళు కట్టిస్తామన్నారు కొందరికి మాత్రమే ఇచ్చారు. కట్టిచ్చిన ఇళ్ళు సరైన గాలి, వెలుతురు లేని కారణంగాను, నాసిరకంగాను ఆ ఇళ్ళు కట్టడంతో ఎప్పుడు కూలి నెత్తి మీద పడతాయో అనే భయంతో ఆ ఇళ్ళలోకి పోవడానికి చాలా భయపడేవారు. ఆ విధంగా అవి కొందరికి వచ్చిన అందులో పోయిన వాళ్ళు ఎవరు లేరు. సహాయం చేసే ప్రభుత్వాలు అరకొర వసతులు కల్పించి, చేతులు దులుపుకొని అమాయకులైన యానాదులు ఉంటున్న గుడిసెలను జేసిబిలతో కూల్చివేసి రోడ్డున పడేసిన చిత్రాన్ని కళ్ళకు కట్టినట్లుగా చెప్పాడు రచయిత.

టీచర్ ఇంట్లో పాచి పని చేస్తున్న యానాది వెంకటస్వామి కూతురు శాంతమ్మను "మీరేమిటోళ్ళు అని అడిగింది. 'మేం యానాదోళ్ళం' అని తటపటాయిస్తూనే చెప్పింది శాంతమ్మ. ఆ మాట వినగానే ఆయమ్మ "యానాదోళ్ళు కక్కసులెత్తే వోళ్ళు. వాళ్ళను యింట్లోకి రానియ్యం. అట్టాంటిది యానాది పిల్ల చేత పని చేయించుకొని, అది ముట్టుకున్న బోకుల్లో యెట్లా

అన్నం వండుతా వుండారు? కంచాల్లో యెట్లా తింటావుండారు" తు..తు..వాక్" అనిందట. అంతే దెబ్బతో శాంతమ్మను యింటికి పంపించేశారు" (54, 55) ఇంట్లో పనిమనిషిగా చేరిన శాంతమ్మ చాలా చురుకుగా, వేగంగా పనిచేస్తున్నదని పొగిడిన టీచర్ బంధువు, శాంతమ్మ కులం తెలియగానే ఇంట్లో నుంచి తరిమి వేయించడం కులాధిపత్య సమాజంలో బతకడం ఎంత కష్టమో ఈ కథ తెలియజేస్తుంది.

6. నల్లపూసలు :

వెయ్యి నుంచి రెండు వేల రూపాయలను ఒక పందిపిల్లను ఇచ్చి అందరికి కల్లు తాగిస్తే గువ్వళోళ్ళ ఆచారంలో "ఓలి" ఇచ్చినట్లుగా భావిస్తారు. అలా ఓలి ఇచ్చి ఆడపిల్లలను పెళ్ళిళ్ళు చేసుకొనే పద్ధతిని అవలంభిస్తూ ఉంటారు. అయితే నాంచారీకి మొట్టమొదటగా యాదన్నతో వివాహమౌతుంది. కాని పిల్లలు పుట్టకపోవడంతో ఆ తరువాత ఆజప్పను ఇష్టపడి పెళ్ళిచేసుకుంటుంది. యాదన్న ఇచ్చిన ఓలిని ఆజప్ప చెల్లించడంతో తమ ఆచారం ప్రకారం రెండవ వివాహం అవుతుంది. కొన్నాళ్ళు గడిచిన తరువాత ముచ్చటగా మూడవ పెళ్ళి అవుతుంది. ముగ్గురు మగవాళ్ళను మనువాడిన కాని జీవితం పూర్తి కాలేదని నాంచారీ! ఆవేదన చెందుతుంది. "మా కులంలో మొల్తాడు గట్టిన పెతి మొగ నా కొడుకూ ఆడదాన్ని వొగ వస్తువు మాదిరి సూస్తాడు. మాసి పోతానే వదిలేసే కట్టు గుడ్డ మాదిరి, కట్టుకున్న దాన్ని వదిలేస్తాడు. మొలకు మొల్తాడు మార్చుకున్నిటఇయగానే ఇంట్లో ఆడదాన్ని మార్చేస్తాడు. ఇట్టే వుంటే మా బతుకులెప్పుడు బాగపడతాయో ఏమో. మొగోడి సేతిలో ఆడది ఇట్ట ఎన్ని దినాలని అణగారి బతకాల్నో ఏమో? సెప్పండబ్బయా సెప్పండి. ఇట్ట ఎన్ని దినాలు? ఎన్ని తరాలు? (73) గువ్వళోళ్ళు తమ సంస్కృతి, ఆచారాలను పాటించడం వలన ఆ జాతి స్త్రీలు ఒక వస్తువుగా మారిపోయిన దీనగాథను ఈ కథ తెలియజేస్తుంది.

7. నేరం:

రాయలసీమ ప్రాంతంలో ఉండే కరువు కాటకాల వలన తినడానికి తిండిలేక అల్లాడిపోతున్న గిరిజనులు తమ బిడ్డల ఆలనపాలన చూసుకోవడంలో విఫలమవుతున్న తీరును ఈ కథలో వివరించారు. "సార్, ఎట్టయినా సరే. మా వాణ్ణి మళ్ళీ ఆ హెూం లో పడేటట్టు చూడండి సార్" చంద్రనాయక్ అభ్యర్థిస్తున్నాడు...ఎట్టయ్య వాడేమీ తప్పు చేయందే ఎట్లా ఇప్పటికే రెండుసార్లు ఆ పిల్లోన్ని అన్యాయంగా పంపించాను. ఇంక నా వల్ల కాదు" ఖచ్చితంగా అన్నాడు సిఐ నరసింహం...అట్టంటే ఎట్ల సామి. గంపెడు సంసారం. ఈ కరువుకు వారానికి ఒక తూరన్నా కడుపునిండా తినలేకపోతున్నాం. వాణ్ణి లోపలికి పంపిస్తే వాడన్నా అంత తింటాడని ఆశ? చేతులు కట్టుకొని ఎంతో వినయంగా వంగి చెబుతున్నాడు నాయక్ మామ" (148) అసలే పేదరికం పై గా భయంకరమైన కరువు ఈ పరిస్థితిలో కన్నబిడ్డలను సాకలేక చేయని నేరానికి జైలుకు పంపించిన తీరును ఈ కథలో తెలియజేశారు. కన్నబిడ్డలను కడుపు తీపిని పక్కన పెట్టి తన బిడ్డ కడుపుకు ఇంత తిండి దొరికితే చాలు అని భావించిన తండ్రి ఆ బిడ్డను మళ్ళి మళ్ళి జైలుకు పంపించిన తీరు కరువు కాటకాలతో అల్లాడిపోతున్న సుగాలీ కుటుంబంలోని పిల్లల పరిస్థితి ఏ విధంగా ఉన్నదో కళ్ళకు కట్టినట్లుగా వివరించాడు.

8.ఎన్‌కౌంటర్: ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ నక్కలోళ్ళు బతకడం కోసం తలా రెండు ఎకరాలు అడవి భూమిని చదును చేసుకోవడానికి అవకాశం ఇచ్చి దానికి పట్టాలు కూడా ఇచ్చింది. అడవిని కొట్టుకొని చదును చేసి పొలంగా మార్చుకొని దొంగ పట్టాలను ఇతరుల పేరు మీద చేయించుకున్న గ్రామ సర్పంచైన దొర పొలం పక్కనే నక్కలోళ్ళకు భూమి ఇవ్వడంతో, కూటికి లేని వాళ్ళు నా పొలం పక్కన ఉండడమా? అని కన్నెర చేసి నక్కలోళ్ళకు సాయం చేస్తున్నట్లుగా నటించి వారికి మంచి చేస్తున్నట్లుగా నమ్మబలికి వేలిముద్ర వేయించుకొని ఆ భూమిని దొర కాజేస్తాడు. ఇది అన్యాయమని ఎదురు తిరిగి న్యాయం కోసం పోరాటం చేస్తున్న నక్కల గంగజ్జను ఎలాగైనా చంపాలని ఆలోచించి పోలీసుల చేత అరెస్టు చేయిస్తాడు. వేటకు

పోయిన గంగజ్జు ఏమైపోయాడో తెలియక, ఎక్కడ వెతకాలో తెలియని నక్కలోళ్ళు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకొని ముసలితండ్రి వెంకజ్జు, భార్య వల్సమ్మ పోలీసులందరి కాళ్ళు పట్టుకున్న కనికరించరు. తుపాకీతో అడవిలో ఒక కుందేలు కొట్టుకొని వస్తుంటే ఇద్దరూ పోలీసులు మీద పడి ఈ తుపాకీకి లైసెన్సు ఉందా అని అడిగి లోపలేశారని అంటాడు గంగజ్జు. ఏం తప్పు చేయని మనల్ని ఎందుకు హింస పెడుతున్నారోనని వల్సమ్మ ఏడుస్తుంటే "ఇదంతా ఆ సౌదరిగాడే సేయించినట్టు తెలిసిందిలే. నిన్న ఆడుండే పోలీసోళ్ళు మాట్టాడుకుంటావుంటే యింటి. ఆయప్పే నన్ను లోపలేసి ఇరగొట్టి పంపించండి అంటా దుడ్డిచ్చినాడంట" అసలు కారణం వివరించాడు గంగజ్జు" (140) ఆ విధంగా దొరకు ఎదురు తిరిగినాడని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళిన పోలీసులు గంగజ్జును లాకప్ డెత్ చేసి చివరకు నక్సలైట్‌గా ముద్రవేసి ఎన్‌కౌంటర్‌లో చంపబడ్డాడని అందరిని నమ్మించిన తీరును ఈ కథ తెలియజేస్తుంది.

9. విషపురుగు :

ప్రపంచీకరణ ప్రభావం స్వేచ్ఛగా బతికే గిరిజనుల మధ్య ఏ విధంగా చిచ్చుపెట్టిందో ఈ కథలో తెలియజేసాడు రచయిత. వ్యాపార ప్రపంచంలో పూడుబాములకు, నక్షత్ర తాబేళ్ళకు ఉండే గిరాకి, డిమాండ్ వాటిని ఉపయోగించి తయారు చేసే వస్తువులకు సంబంధించిన అవగాహన గిరిజనులకు అసలే ఉండదని, ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని మధ్య దళారులు, స్మగ్లర్లు గిరిజనులను ఏ విధంగా దోచుకుంటున్నారో తెలియజేసాడు.

10. నాలుగో నాటకం :

గొర్రెలు కాసే కురవకులం, గొరవయ్యకులం, ఎలుగొడ్డోళ్ళు అనే మూడు యాచక కులాల మధ్య నడిచిన ఇతివృత్తమే ఈ కథ. అడవిలో ఉన్న ఒక బండపైన గేరిలో నివసించే ఎలుగోడ్డోని వారంతా క్వారి రూపంలో వాళ్ళను నిరాశ్రయులను చేసి, వాళ్ళ జీవితాలను ఆగం చేసిన తీరును, ప్రపంచీకరణ ప్రభావం వలన ప్రసార మాధ్యమాలు జానపద, యాచక కళలను ఎలా మింగేసిందో ఈ కథ ద్వారా రచయిత తన ఆవేదనను తెలియజేస్తున్నాడు.

11. తిరిగిరాని తిరుమల :

అడవిపై ఆధారపడి నివసించిన సుగాలీలు కాలక్రమంలో అడవులు అంతరించి మైదాన ప్రాంతాలకు దగ్గరకు నివసిస్తున్న వారిపై నిత్యం కరువుకాటకాలతో అలమటించే అనంతపురం జిల్లావాసులకు వలసపోతూ ఉండే పరిస్థితిలో సుగాలి కుటుంబానికి చెందిన మద్దిలేటి కరువుకు భయపడి చిత్తూరు జిల్లాకు వలస వచ్చి బిక్షాటనతో బతుకుతూ చనిపోతాడు. అతని భార్య వేరోక వ్యక్తితో వెళ్ళిపోతుంది. మద్దిలేటి మొదటి భార్య కొడుకు తిరుమల అనాథ అవుతాడు. అయితే లారీ డ్రైవరు సుబ్బరాయుడు తిరుమలను ఆదరించగా, శెట్టి అంగడిలో చేయని తప్పుకు పోలీసులు, సుబ్బరాయుడు కూడా కొట్టడంతో ఆ ఇంటిని వదిలేసి వెళ్ళిపోయిన తిరుమల తిరిగి రాలేదు. వలస జీవితాలు ఎంత దుర్భరంగా ఉంటాయో ఈ కథలో రచయిత కళ్ళకు కట్టినట్లుగా చిత్రించాడు.

12. నిప్పు :

తిరుమల శేషాచల అడవుల్లోని గంధపు చెట్లను దోచుకునే ముఠాలు ఏ విధంగా ఆ అడవులను నాశనం చేస్తున్నాయో తెలియజేసిన కథ ఇది. ఎర్రచందనం, గంధపుచెట్లను స్మగ్లింగ్ చేసే సత్యవేలు కూలీలను పంపించి మాసలామణి సాయంతో తిరుమల అడవుల్లోని విలువైన గంధపుచెట్లను నరికి రాత్రికి రాత్రే తరలిస్తాడు. కాని ఎక్కడో తమిళనాడు నుండి వచ్చిన వాళ్ళు మన సంపదను దోచుకోవడం ఏమిటి అని స్థానిక స్మగ్లర్లు ఎదురు తిరిగి తమిళనాడు కూలీలను చంపి జైలు పాలు చేసి కకావికలం చేయడంతో, జీర్ణించుకోలేని సత్యవేలు విలువైన అడవి సంపదకు నిప్పు పెట్టించి అడవి అంతా కాలి బూడిద అయ్యేటట్లు చేస్తాడు. అతనికి సహకరించిన మాసలామణి మాత్రం "అడవిని కాల్చిన నిప్పునార్పినారు మనుషులు అడవి

చల్లారింది. కానీ నిజమైన నిప్పు మనిషి గుండెల్లో వున్న స్వార్థం, అవినీతే గదా! దాన్ని మనుషులు ఆర్పగలరా? మనిషి పెట్టిన నిప్పు ఈ కొండలో కొంత భాగాన్నే కాల్చగలిగింది. కానీ మనిషిలో వుండే అవినీతి నిప్పే ఎప్పుడో ఒకప్పుడు ఈ లోకాన్ని కాల్చేస్తుంది.(97) అని మాసలామణితో వాస్తవాన్ని చెప్పించడం ద్వారా వ్యక్తుల అవినీతికి విలువైన సంపద, సమాజం ఏ విధంగా నాశనమవుతున్నాయో తెలియజేశారు.

ముగింపు:

గిరిజన, సంచార తెగల వెతలను అక్షరీకరించి అద్భుతమైన కథన విధానంతో రచయిత చెప్పిన తీరు చాలా హృద్యంగా ఉంది. ఎందుకంటే సమాజంలో ఎవరు పట్టించుకోని అర, సంచార తెగల జీవితాలు ఎంత దుర్భరంగా గడుస్తున్నాయో ఈ కథలు వివరిస్తున్నాయి. ముఖ్యంగా సంచార తెగల వాళ్ళు జానెడు పొట్ట నిండడం కోసం తమ జీవితాలను కూడా పణంగా పెడుతున్న వైనాన్ని ఎంతో దగ్గరగా చూస్తే తప్ప రాయలేని విషయాలను రచయిత చెప్పడం సమాజంలో ఉన్న అసమానతలను తెలియజేస్తుందనడంలో సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1.తిరుమలరావు జె. జీవన్: ఇప్పపూలు (గిరిజన సంచార తెగల కథలు) ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం, 2009.

2.దక్షిణామూర్తి, పోరంకి: తెలుగు కథానిక స్వరూప స్వభావాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం. హైదరాబాదు, 1997.

3.రమేష్ నారాయణ, పి: గిరిజన సంస్కృతి, సాహిత్యం. అనంతపురం, 2015.

4.రాసాని వి.ఆర్. విషప్పురుగు గిరిజన, సంచార తెగల కథలు ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ, 2017.

5.వెంకటసుబ్బయ్య, వల్లంపాటి: కథాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాదు, 2000.

6.హోస్‌నైన్, నదీం: భారతీయ గిరిజనులు, ఓరియంట్ లాబ్మన్, హైదరాబాదు, 1995.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

బాల భక్తుడు ధ్రువుడు - దృఢ సంకల్పం



- డాక్టర్ తోట రామకృష్ణ
స్కూల్ అసిస్టెంట్, తెలుగు,
మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల,
పుల్లాయిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా,
ఫోన్ 7569518663.

సంక్షిప్త పరిచయం:

బాల్యం నుంచే భక్తిప్రవత్తులను వుణికివుచ్చుకున్న ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి భక్తుల ఉపఖ్యానాలు శ్రీమద్భాగవత పురాణంలోనే పరమోత్కృష్టమైనవి. బుడిబుడి అడుగుల నాడే బాలల మనస్సు భగవంతుడు వైపునకు మరలితే, వారితో పాటు వారి తల్లిదండ్రులే కాదు తరతరాల జనులు ధన్యులైపోతారు. ఆ సత్యాన్ని నిరూపించడానికి భగవంతుడు ఆ ఇద్దరి చరితలకు చిరస్థాయిని కల్పించాడు. వారి కథాకథన ఆవిష్కరణలో అటు వ్యాస మహర్షి, ఇటు బమ్మెర పోతనలు కూడా ప్రముఖ పాత్రల్ని పోషించారు. ఆ క్రమంలో తొలుత వచ్చే కథాంశమే ధ్రువోపాఖ్యానం. విష్ణు, అగ్ని పురాణాధికావ్యాల్లో కూడా మహర్షులు ఈ ఉపఖ్యానాన్ని ప్రస్తావించటం విశేషం. పెద్దల ప్రవర్తన పిల్లల మనస్సులపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో చెప్పటానికి ధ్రువుడి కథే దృష్టాంతం.

కీలకపదాలు:

అంతరాత్మ, హితవాక్యాలు, అనురక్తి, పక్షపాతం, ఉబలాటం, కఠినాత్ములు, దురాత్ములు, ఉద్రేకాలు, కఠువైన మాటలు, ధృడదీక్ష, పశ్చాత్తాపం, తపోఫలం మొదలగునవి.

విశ్లేషణ:

చతుర్ముఖ బ్రహ్మ కుమారుడైన స్వయంభువ మనువు సుపుత్రులు ప్రియా వ్రతుడు, ఉత్తాన పాదుడు. వీరిరువులో రెండవ కుమారుడైన ఉత్తాన పాదున్ని పరిచయం చేస్తూ తెలుగు భాగవతంలో పోతనా మాత్యులు.....

వినుము సునీతయు సురిచియు
నను భార్యలు గలరు, వారి యందును ధ్రువునిం
గనిన సునీతియు న ప్రియమును
సురుచియు ప్రియము నగుచు నున్నట్టి యెడెన్... ఆన్నాడు.

ఉత్తానుపాదునికి సునీతి, సురుచి అనే ఇద్దరు భార్యలు. సునీతపై రాజుకు ప్రీతి లేదు. సురుచి అంటే రాజుకు మిక్కిలి మక్కువ. సునీతి కొడుకు ధ్రువుడు. సురుచి కొడుకు ఉత్తముడు. సాధారణ మానవ మనస్తత్వానికి ప్రతినిధి ఉ త్తానపాదుడు. నిజానికి మనమందరం కూడా ఉత్తానపాదులమే! అందుకే మన ప్రవృత్తి కూడా చాలాసార్లు అతడి ప్రవృత్తినే తలపిస్తూ ఉంటుంది. అందుకే ఆయనలా అత్యధికులు మంచి కన్నా చెడుకే ఎక్కువ ఆకర్షితులవుతూ ఉంటారు.

అంతరాత్మ చెప్పే నీతి బోధల్ని తోసిపుచ్చటం, హిత వాక్యాల కన్నా ప్రియ వాక్యాల వైపే మొగ్గు చూపటం మానవ సహజ స్వభావం. ఫలితంగానే చాలాసార్లు జీవితంలో ఎన్నో పొరపాట్లు చేసి, ఎప్పుడూ పశ్చాత్తాపపడుతూ ఉంటారు. అయినా చేదుగా ఉండే మంచి మాటలకన్నా, తీపిగా ఉండే చెడ్డ మాటలే ఆలకించటానికి అత్యధికులకు అనురక్తి.

తండ్రి పక్షపాతం...

ఇలాంటి నేపథ్యంలో ఒకనాడు ఆ మహారాజు ఆనందంగా రెండవ భార్య సురుచి కుమారుడైన ఉత్తముణ్ణి తొడపై కూర్చుండ బెట్టుకుని ముద్దాడుతున్నాడు. అప్పుడే అక్కడికి వచ్చిన ధ్రువుడు తాను కూడా తండ్రి ఒడిలోకూర్చుంటానని ఉబలాటపడ్డాడు. కానీ ఆ జనకుడు ధ్రువుడని దగ్గరకు తీసుకోలేదు. ఆప్యాయంగా ఆదరించనూ లేదు. ఇంతలో ఆ పక్కనే నిలుచున్న సురుచి అహంకారంగా సవతి కొడుకు అయినా ధ్రువుడిని ఉద్దేశించి 'నా కడుపున పుట్టిన వాడే తండ్రి ఆదరణకు అర్హుడు. ఆ సునీతి గర్భాన పుట్టిన నీకు తండ్రి ఒడిలో కూర్చునే అదృష్టం ఎలా కలుగుతుంది?' అని నిష్కారంగా పలికింది. ఆ తండ్రి కూడా ఏమి మారుమాట్లాడకుండా, సురుచిని సమర్థిస్తున్నట్లే స్తబ్దంగా ఉండిపోయాడు. ఆ ఇద్దరి ప్రవర్తనకు ధ్రువుడు ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకున్నాడు. భర్త మద్దతును చూసుకుని ఆమె ఆ బాలుడితో మరింత కటువుగా...

అది గాన నీ వధోక్షజు
పద పద్మము లాశ్రయింపు పాయక హరి నా
ఉదరమున పుట్టచేయును
వదలక యట్లయిన ముధము వడిసెద వనఘా!

'నీవు విష్ణు దేవుని పాదాలను ఆశ్రయించు, ఆయన నిన్ను నా కడుపున పుట్టేటట్లు అనుగ్రహిస్తాడు. అప్పుడు నీ కోరిక నెరవేరుతుంది'అని అంది. సురుచి ములుకుల్లాంటి మాటలకు ధ్రువుడు బిగ్గరగా ఏడుస్తూ కన్నతల్లి దగ్గరకు పరిగెత్తాడు.

సాధారణంగా చాలామంది తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో తెలిసో, తెలియకో చేస్తున్న పొరపాటే ఇది! నిజంగా కన్నవారికి పిల్లల్లో ఎవరిపైన పక్షపాతం లేకపోయినా, కొన్ని సమయాల్లో ప్రేమను ప్రదర్శించే తీరులో వివక్షను చూపుతూ ఉ ంటారు. ఇది పిల్లల మనసుపై విపరీతమైన వ్యతిరేక ప్రభావాన్ని చూపుతోందని ఆధునిక మానసిక విశ్లేషకులు కూడా ఆందోళన పడుతున్నారు. అదేవిధంగా చదువులో చురుగ్గా ఉండే పిల్లలతో పోలిస్తూ, చదవని పిల్లల్ని దుర్భాషలాడటం లాంటివి కూడా చిన్నారుల హృదయాలపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. ఈ రకమైన ప్రవర్తన చదవని పిల్లల్లో ఆత్మ న్యూనతకు, బుద్ధి మాంద్యానికి దారి తీయడమే కాక, వారికి తోబుట్టువులపై అకారణ శత్రుత్వ భావనల్ని పెంచుతాయి. చిన్నారులతో సున్నితంగా ప్రవర్తించకపోతే, భవిష్యత్తులో వారు కఠినాత్ములుగానో, దురాత్ములుగానో మిగిలిపోతారు. ముఖ్యంగా తమ

నడవడికను పిల్లలు నిశితంగా గమనిస్తారు కాబట్టి పెద్దలు అప్రమత్తంగా ఉండాలి. పరాకుగానైనా వారి విషయంలో పక్షపాత వైఖరితో ప్రవర్తించకూడదని తెలుసుకోవాలి.

దుఃఖమునకు పనిలేదు.....

ధ్రువుడు సునీతి సుపుత్రుడు కావటం ఆ బాలుడు అదృష్టం. ఆ సాధ్వి కుమారుడికి కలిగిన అవమానానికి తనదైన రీతిలో ప్రతిస్పందించి, అనువైన పద్ధతిలో ఓదార్చింది. భర్త, సురుచి చేసిన దానికి తన మనసులో కుమిలిపోయిన కొడుకుకు మాత్రం కన్నీళ్లు పెట్టుకోవద్దని ధైర్యాన్నిచ్చింది. ఎవరిని నిందించ వద్దని, ప్రతీకారానికి పూనుకోవద్దని హితవు పలుకుతూ...

అనఘా! యీ దుఃఖమునకు, పనిలే ధన్యులకు సోలయ బలవంతంబై
తన పూర్వ జన్మ ఘనకర్మము వెంట నంటగా నెవ్వలనన్

'ఓ పుణ్యాత్మా! దీనికి దుఃఖించవలసిన పనిలేదు. గత జన్మలో ఇతరులను బాధించిన దుష్కృతాల కర్మఫలం ఏదో మనల్ని వెంటాడుతోంది! అది చాలా బలీయమైంది' అని ఆదర్శవంతమైన తల్లిలా అనునయించింది. పిల్లలు అవమానాలతో, ఆత్మ న్యూనతతో కుమిలిపోతున్నప్పుడు అత్యంత ఆత్మీయంగా అక్కున చేర్చుకుని, వారి ఉద్రేకాలనీ ఉపశమింప చేయాల్సిన బాధ్యత కన్నవారిది! ఎక్కడ సమర్థించాలో, ఎక్కడ సరిదిద్దాలో కన్నవారికి తెలియాలి. అలాంటి పాత్రను సమర్థంగా పోషిస్తూ, పుత్రుడు ధ్రువుడు మనసును పరమాత్మ వైపునకు మరలించింది సునీతి. ఏకాగ్రమైన చిత్తంలో శ్రీమన్నారాయణని నిలిపి ఆరాధించు, నీ దుఃఖాన్ని తొలగింపగలిగినవాడు అతడొక్కడేనని ఉద్ఘటిస్తూ...

కరతల గృహీత లీలాం, బురుహ యగుచు పద్మగర్భముఖ గీర్వాణుల్
పరికింపం గల లక్ష్మీ, తరుణీమణిచేత వెదకదగు పరమేశున్...

'బ్రహ్మదేవుడు తదితర దేవతలు వెతికినా కనిపించని లక్ష్మీదేవి, తన కరతలంలో లీలా కమలాన్ని ధరించి ఆ కమలాక్షుని కోసం వెదుకుతూ ఉంటుందని వర్ణించింది. ఆ తల్లి సునీతి మాటను తలదాల్చి ధ్రువుడు పట్టణము విడిచి, అచ్యుతుని అన్వేషణలో బయటకు నడిచాడు.

సుఖదుఃఖాలు దైవవశంబులు

అప్పుడు ఆ బాలుడు వృత్తాంతాన్నంతా దివి నుంచి నారద మహర్షి తన దివ్య దృష్టి చేత అవలోకించాడు. ఆ మరుక్షణమే ధ్రువుడి ముందు ప్రత్యక్షమై పాప పంకిలాన్ని ప్రక్షాళన చేసే తన చల్లని హస్తముతో ఆ బాలుడి శిరస్సును స్పృశించి ఆశీర్వదించాడు. అనంతరం ఆ బ్రహ్మ మానస పుత్రుడు బహు ప్రేమతో 'నాయనా! సకల సంపదలు కలిగిన ఇంటిని విడిచి ఒంటరిగా ఎక్కడికి వెళుతున్నావు?' అని ప్రశ్నించాడు. అప్పుడు ధ్రువుడు దయనీయంగా 'మహాత్మా! నా సవతి తల్లి పలికిన కటువైన మాటలకు నా మనసు గాయపడింది. ఆ గాయాన్ని భగవత్ధ్యానమనే ఔషధం చేత నయం చేసుకుందామని వెళుతున్నాను' అన్నాడు. ఆ మాటలు విని నారద ముని, ఆటపాటలతో గడపాల్సిన వయసులో ఈ గౌరవ, అగౌరవాల గురించి పట్టించుకోవద్దని హితువు పలుకుతూ....

కాన మనమున తద్విపేకంబు నీకు
కలిగినేనియు సంతోష కళితు లయిన
పురుషు లాత్మీయకర్మ విస్ఫురణ జేసి
వితత సుఖ దుఃఖము లనుభవింతు రెపుడు...

మీకు ఒకవేళ మానావమానాల వివేచన శక్తి కలిగితే, సంతోషంగా జీవించే వాళ్లంతా సుఖమైనా, దుఃఖమైనా తమ

కర్మఫలమే అని భావించి అనుభవిస్తారని తెలుసుకోమని ఉద్బోధించాడు. తండ్రి దరి చేరనివ్వలేదన్న బాధతో రాజప్రాసాదం విడిచిన ధ్రువుడికి ఇదే తీరులో నారదుడు గుండె ధైర్యాన్నిస్తూ, "నాయనా! హరిని ఆరాధించడం చాలా కష్టం ఎందరో యోగేంద్రులు ఎన్నో జన్మల్లో నిస్సంగులై తీవ్రమైన సమాధి యోగాన్ని అభ్యసించారు. అయినా ఆ దేవదేవుని స్వరూపాన్ని తెలుసుకోలేకుండా ఉన్నారు. వ్యర్థమైన ప్రయత్నాన్ని విరమించుకో! ఆనందమైనా, ఆవేదనైనా ఆ సర్వేశ్వరుడి సంకల్పం వల్లనే కలిగాయని తెలుసుకొని విమల విజ్ఞానివై ఆలోచించు" అన్నాడు. ధ్రువుడి దృఢదీక్షను తన పలుకులతో పరీక్షించాడు. ఆ తరువాత మనస్సు నిలకడగా ఉండే మార్గాన్ని, అసూయను, అహంకారాన్ని వీడే విధానాన్ని తేటపరిచాడు. గుణవంతుని చూసి సంతోషించాలని, గుణహీనుని చూసి జాలిపడాలని, తనతో సమానమైన వారితో స్నేహం చేయాలని, ఇలా ప్రవర్తిస్తే ఎలాంటి విభేదాలు కూడా పొడచూపవని నారద ముని విస్పష్టం చేశాడు.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

అనంతాత్ముడు దర్శనం కోసం వ్యాకుల పడుతున్న ధ్రువుడికి నారద మహర్షి మధువనం వైపు మార్గం చూపాడు. ఓంకారంతో కూడిన 12 అక్షరాల మహిమాన్వితమైన వాసుదేవ మంత్రాన్ని నిష్ఠగా జపిస్తే ఆ దేవదేవుడు సాక్షాత్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు. మహర్షి మంత్రోపదేశంతో ధ్రువుడు సమస్త పుణ్యాలకు అలవాలమైన మధువనం చేరుకున్నాడు. ఉపవాస దీక్షతో, ఏకాగ్రచిత్తుడై భగవంతున్ని ధ్యానింప సాగాడు. ప్రాణం వాయువును నిరోధించి పరమాత్మతో అనుసంధించాడు. అలా ఆ బాల భక్తుడు శ్వాసను నిరోధించటంతో ఆ శ్రీహరి పంపించాడు. ఆయన కశేపించగానే అఖిల లోకాలు ప్రకంపించాయి. చూడటానికి భయంకరమై, లోకాలకు సంభవించిన ఆ మహావిపద్దశను ఆలోకించి అష్టదిక్పాలకులు తదితర లోక పాలకులందరూ లోక రక్షకుడైన పుండరీకాక్షుని శరణుజొచ్చారు.

దేవతలు విన్నపాన్ని విన్న నారాయణుడు వారిని ఓదారుస్తూ, 'బాల భక్తుడైన ధ్రువుడు నాయందు మనస్సును సంధానపరిచి తపస్సు చేస్తున్నాడు. అందుకే మీకు ప్రాణ నిరోధం కలిగింది. తపస్సు నుంచి ఆ బాలుని విరమింప చేస్తాను భయపడకండి' అని దేవతలకు అభయమిచ్చాడు. అనంతరం ఆ శ్రీహరి గరుడ వాహనం ఎక్కి మధువనంలో ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు ధ్రువుడు తన ముందు సాక్షాత్కరించిన కరుణామూర్తిని తిలకించి ఆనంద భాష్పాలతో పులకించాడు. అనంతరం తన కనుదోయతో స్వామి సౌందర్యాన్ని తాగుతున్నట్లు, ముఖంతో స్వామిని ముద్దాడుతున్నట్లు, తన కరములతో స్వామిని కౌగిలించుకున్నట్లు అనుభూతి చెందుతూ ధ్రువుడు సాష్టాంగ నమస్కారం చేశాడు.

ధ్రువుడి దిగులు....

ఆ దివ్యాత్ముడు అత్యున్నతమైన పదవిని, పదాన్ని ప్రసాదించిన, దేవుడికి తను చేసిన తప్పిదం స్ఫురించింది. ఏది అర్థించాలో అది అర్థించక అల్పమైంది అడిగానని అతనికి అర్థమైంది. అదే పరివేదనతో ఆ భక్త వరేణ్యుడు తన మనసులో 'జితేంద్రియలూ, మహాత్ములూ అయినా సనక సనందనాదులు మిక్కిలి భక్తితో ఎన్నో జన్మల సమాధి యోగం ద్వారా ఏ మహానుభావుని చరణ కమలాలను దర్శింప గలుగుతారో అటువంటి అమేయుడు, అవికారుడు, అజేయుడు, ఆధ్యుడు, పరమేశ్వరుడు అయిన శ్రీహరిని అనవసరమైనవి కోరుకున్నాను అని పశ్చాత్తాపపడ్డాడు. ఆ తరువాత ధ్రువుడు జరిగిన దానికి వగచి లాభం లేదనుకుని పొందిన దానితో సంతృప్తిపడి, దామోదరుడి దర్శన ఫలంతో రాజ్యానికి తిరుగు ముఖం పట్టాడు.

ఇలా తపోఫలంతో రాజ్యానికి తిరిగి వచ్చిన ధ్రువుడిని ఆ లింగం చేసుకొని తండ్రి ఉత్తాన పాదుడు, తల్లి సునీతి తన్మయులయ్యారు. ధ్రువుడి సోదరుడు ఉత్తముడు వేటాడటానికి హిమాలయ పర్వతలోని అడవికి వెళ్లి అక్కడ ఒక యక్షుని చేతిలో నిహతుడైనాడు. అతని తల్లి సురుచి పుత్ర సుఖంతో అరణ్యానికి పయనమై అక్కడ కారు చిచ్చు మంటల్లో చిక్కి

మరణించింది.

దిగివచ్చిన దేవతలు...

విరక్తుడైన ధ్రువుడు తన నగరాన్ని వదిలి పుణ్యభూమి అయినా బదిరికాశ్రమంలో అచంచలమైన భక్తితో పద్మ నేత్రుడైన భగవంతుడిని ఆరాధించాడు. అప్పుడు ప్రకాశవంతమైన విమానం ఆకాశం నుంచి ధ్రువుని దగ్గరకు వచ్చింది. అందులో నుంచి మనోహరులైన ఇద్దరు విష్ణుకింకరులు ప్రత్యక్షమయ్యారు. వారిని చూసి, ఆ విష్ణు భక్తుడు, శ్రీమన్నారాయణ నామాలను స్మరిస్తూ నమస్కరించాడు. అప్పుడు ఆ దేవదూతలు.... "ఏ స్థానాన్ని పండితులు అన్నిటికంటే శ్రేష్టమైనదిని భావిస్తారో, సూర్యచంద్రులూ, గ్రహాలూ, నక్షత్రాలూ, తారాగణాలూ ఏ పదానికి ప్రదక్షిణం చేస్తుంటాయో, దేనిని మీ తాత తండ్రులూ, ఇతరులూ పొందలేక పోయారో, ఏది జగద్వంద్యమో, దేనిని భక్తులు కాని వారు పొందలేరో ఆ విష్ణు పదాన్ని నీవు పొంద బోతున్నావు. రావయ్య రా! ఇదిగో! ఈ విశేషమైన విమానాన్ని ఆ శ్రీహరి నీకోసం పంపించాడ"ని వివరించారు. ఆ క్షణంలో.. 'దేవతలు నగరాలు, డోలులు, తప్పెటలు, మోగించారు. పూల వానలు కురిపించారు. కిన్నెరులూ, గంధర్వులూ మంగళ గీతాలు పాడారు. ధ్రువుడు దేవలోకానికి పైన మయ్యాడు. ఆ సమయంలో ధ్రువుడు కన్నతల్లిని ఎలా విడిచిపోవడమా!' అని విచారించాడు. కానీ విష్ణుభక్తులు అతనికి, ముందు విమానంలో పోతున్న సునీతిని చూపించారు. అప్పుడు ధ్రువుడు సంతసించాడు. తన తల్లి అయిన సునీతని చూసిన తర్వాతేనే ధ్రువుడు విమానాన్ని ఎక్కి బయలుదేరాడు. దేవతలు ఎడతెరిపి లేకుండా పూల వానను కురిపిస్తుంటే సంతోషంతో ప్రయాణించి గ్రహ మండలాన్నీ, మూడు లోకాలను, సప్తర్షి మండలాన్ని దాటి ఆ పైన విష్ణు పదాన్ని చేరుకున్నాడు.

ముగింపు:

సాధారణంగా చాలామంది తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో తెలిసో తెలియకో చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లు పిల్లల మానసికస్థితిపై ఎటువంటి ప్రభావం చూపుతుందో ధ్రువుని పాత్ర ద్వారా మనం తెలుసుకోవచ్చు. అదేవిధంగా చదువులో చురుగ్గా ఉండే పిల్లలతో పోలుస్తూ, చదవని పిల్లల్ని దుర్భాషలాడటం లాంటివి లాంటివి కూడా చిన్నారుల హృదయాలపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. తన పినతల్లి చులకన చేసి మాట్లాడేటప్పుడు ధ్రువుడు ఆత్మ న్యూనత భావానికి లోనై ఏడుస్తూ.. తన తల్లి సునీత వద్దకు చేరుకుని తన బాధను వ్యక్తపరిచినప్పుడు కొండంత ధైర్యంగా తన తల్లి నిలవడంతో ఆ బాధ నుంచి బయటపడి, తీవ్రతపోధనుడై నారద మహర్షి మంత్రోపదేశంతో ధ్రువుడు సమస్త పుణ్యాలకు అలవాలమైన మధువనం చేరుకుని ఉపవాస దీక్షతో, ఏకాగ్ర చిత్తుడై భగవంతుని కరుణాకటాక్షాలకు పాత్రుడై గ్రహ మండలాన్నీ, మూడు లోకాలను, సప్తర్షి మండలాన్ని దాటి విష్ణు పదాన్ని చేరుకుంటాడు. బాల భక్తుడైన ధ్రువుడు అతని సంకల్పం నేటి బాలలకు ఆదర్శప్రాయమైనదని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1) పలికెడిది భాగవతం – స్వామి జ్ఞానదానంద
(పోతనామాత్యుల తెలుగు భాగవతానికి సరళ వ్యాఖ్యానం),
రామకృష్ణ మఠం ప్రచురణలు, హైదరాబాద్.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

తెలుగు సాహిత్యంలో – సద్విమర్శ కొరత



పూసాల. సత్యనారాయణ

ఉపోద్ఘాతం:-

తెలుగెక్కడుందిరా తెలుగోడా ! నీ తెలివి తెల్లారే తెలుగోడా ! ఒక కవి ఆవేదన భావ విస్పోటన చెంది కనులముందు కదలాడి కలవర పెడుతుంది.తెలుగు వాడు తెలుగు మాట్లాడుకుంటే కాళోజీ కవి అన్న మాటలు గుర్తుకు వస్తాయి.” “”తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు సంకోచపడి యెదవు సంగతేమిటిరా అన్య భాషలు నేర్చి ఆంధ్రంభు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా “ తెలుగు పై అభిమానం అలా చాటుకున్నారు తెలుగు పుట్టు పూర్వోత్తరాలు తిరగేస్తే 11 వ శతాబ్దములో.సంస్కృత భాష రాజ్యమేలడముతో తెలుగు మరుగున పడిపోయిందని చరిత్ర కారుల అభిప్రాయం. ఇదే విషయాన్ని ప్రముఖ విమర్శకుడు బహుముఖ ప్రజ్ఞాశాలి ,అభ్యుదయ రచయితల ఉద్యమ స్థాపకులు హేతువాది తాపీ ధర్మారావు గారు “ కొత్త పాళీ “పుస్తకంలో తెలుగు పై సంస్కృత భాష పెత్తనం గురించి కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు దిగుమతి చేసుకున్న సంస్కృత భాష లో కాకుండా మన మాతృభాషలో స్వతంత్రముగా రచనలు చేసినప్పుడే తెలుగు బతికి బట్ట కడుతుందని ఆయన అభిప్రాయపడినాడు .సంస్కృత భాష 11వ శతాబ్దం నుండి క్రమేణా తగ్గు మొఖం పట్టిందని చెప్పుకోవచ్చు. ఆ కాలములో నే నన్నయ్య భట్టారకుడు రాజ రాజ నరేంద్రుడి ఆస్థానంలో కవిత్రయంలో మొదటి వాడు.వేద వ్యాసుడు సంస్కృతములో రచించిన మహాభారతమును తెలుగు పద్యకావ్యముగా ముగ్గురు కవులు అనువదించారు. తెలుగు సాహిత్య చరిత్రలో కవిత్రయముగా నిలిచారు .నన్నయ్య మొదట రెండున్నర పర్వాలు అనువదించి ఆదికవిగా సాహిత్య పితామహుడిగా వెలుగొందినాడు . ఆ తర్వాత 1250 ప్రాంతములో నెల్లూరు మండలాన్ని పరిపాలించే మనుమసిద్ధి దగ్గర

ఆస్థాన కవిగా మంత్రిగా పనిచేసిన తిక్కన మరో అడుగు ముందు వేసి అసంపూర్ణంగా నన్నయ వదిలేసిన అరణ్య పర్వాన్ని అలాగే ఉంచి 15 పర్వాలను అనువదించాడు.కొంత కాలము తర్వాత 14 వ శతాబ్దములో అద్దంకిని పాలించే ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి ఎర్రాప్రగ్గడ గారు మిగిలి ఉన్న అరణ్యపర్వాన్ని అనువదించి మహాభారతాన్ని పూర్తి చేసినాడు . కవిత్రయ దిగ్గజాల కృషి ఫలితమే తెలుగు వారికి అందించిన మదాంధ్ర మహాభారతం .దీనికి దాదాపు 300 సంవత్సరాలు పట్టిందని చరిత్ర కారుల అభిప్రాయం. 20 వ శతాబ్దములో తెలుగేతర భాషల నుండి అనువదించ డ మే గాకుండా స్వతంత్రముగా రచించిన ప్రబంధాలు ,కావ్యాలు గేయాలు ఉన్నపటికి కవిత్రయ కవుల తో సరి తూగ గలరే ? బిరుదులు సన్మానాలు పల్లకి మోతలు గండే పెండేరాలు ఇప్పుడు వరించేనా ? అది రాజుల కాలానికే చెల్లింది కదా ! మహాభారతానికి ఇతిహాసం ఆధారం అయితే మహాభాగవతానికి పురాణాలు ఆధారాలుగా చెప్పబడినాయి. ఇంతకు వాటిలో ఉన్న సారాంశం ఏమంటే భక్తి తత్వం.శ్రీ కృష్ణుడి లీలలు, ధర్మం ,నీతి ,కురుక్షేత్ర యుద్ధవ్యూహాలు రాజనీతి రాజుల చరిత్ర మాత్రమే . వీటికి చారిత్రిక ఆధారాలు ఉన్నాయా ? ఆకర్షించే అందమైన కట్టు కథలా ? ఏది ఏమైనా హేతు వాదానికి నిలువ తరమా ? సంధించిన ప్రశ్నల పరంపరలు జీర్ణించుకోలేని కఠిన చేదు లే కదా ?

సనాతన ధర్మానికి వేద వ్యాసుడు అత్యంత ప్రముఖుడుగా చెప్పబడినాడు. అతని మనసులో మహాభాగవతాన్ని తలచుకుంటే వినాయకుడు లిఖిత పూర్వకముగా రాశాడట. ఎలా రాయ గలడు ? అన్న ప్రశ్న కు సమాధానం దొరకదు. కాని సనాతన ధర్మం మాత్రం ఇప్పటికీ దేదీప్య మానంగా వెలిగి పోతుందంటే అది అతీత శక్తుల మహిమ కాబోలు. ద్వాపార యుగములో మహాభాగవతం పురుడు పోసుకుందని అంటారు.క్రీస్తు పూర్వం 3000 నుండి 5000 సంవత్సరములో జరిగి ఉండవచ్చు అని చరిత్ర కారుల అంచనా వ్యాసుడి పుట్టు పూర్వోత్తరాలు తిరగేస్తే మిశ్రమ కులముగా చెప్పబడింది.అది ఎంత వరకు నిజమో తెలియదు. జ్ఞానాన్ని ఆర్జించుటకు కులాలతో సంబంధం లేదని తెలుస్తుంది. నాగరికత లేని కాలములో కాగితం పుట్టని యుగములో అచ్చు యంత్రం కనిపెట్టని రోజులలో దేవుళ్ళు ధరించిన పట్టు వస్త్రాలు ఎక్కడి నుండి వచ్చాయి ? గ్రంథాలు ఇంకెక్కడా ? వ్యాసుడు ఏ భాష లో రాశాడు ? తాళపత్ర గ్రంథాల పై లిఖిస్తే మూలాధారాలున్నాయా! శతాబ్దాలు గడిచినా చెక్కు చెదరకుండా ఎలా ఉన్నాయి? ఊహా జనిత మైన కట్టు కథలేనా ? ప్రశ్నించుతే నేరమా ? మన సంస్కృతి ,సంప్రదాయాలకు భావోద్వేగాలకు భంగం కలిగినా నిజం నిగ్గు తేలాలి కదా! బిన్నమైన ఆలోచనలు లేకుంటే కొత్త కొత్త ఆవిష్కరణలు వచ్చేనా ? విమర్శ గురించి డాక్టర్ సి. నా. రే జ్ఞన పీఠ అవార్డ్ గ్రహీత అన్నది గుర్తుకు వస్తుంది "కవిత్వం కప్పి చెబితే విమర్శ విప్పి చెబుతుందని " సద్విమర్శ లేని సాహిత్యం సాన బెట్టని వజ్రమే కదా! ఆంగ్ల విద్య తో అచ్చు యంత్రాల రాక తో తెలుగు సాహిత్యం లో వివిధ ప్రక్రియల తో విరాజిల్లింది .

1875 నుండి ఆధునిక తెలుగు సాహిత్యం ఆరంభం అయిందని చెప్పవచ్చు. కందుకూరి వీరేశ లింగం గారు తొలి నవల రాజశేఖర చరిత్రం రచించి నవలా రచయితలకు ఆద్యుడు అయినాడు. పాత్రలను అద్భుతముగా సృష్టించి సమాజంలోని ఉన్న మూఢనమ్మకాలను అసమానతలను ఎండగట్టి ఔరా! అనిపించాడు పాఠకులలో చైతన్యం పొంగి పొరలించి ప్రశ్నించే తత్వానికి నాంది పలికినాడు.నిజానికి చెప్పాలంటే నేటి సాహిత్యములో విజ్ఞాన స్పృహతో కూడిన రచనలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు .వారిలో చెప్పుకోదగిన వారు కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత సుప్రసిద్ధ సాహితీ వేత్త విశ్రాంత బయోలజి ప్రొఫెసర్ డాక్టర్ దేవరాజు మహారాజు గారు అని చెప్ప వచ్చు. గుడ్డి నమ్మకాల పై కలం సంధించి అనేక పుస్తకాలు రాశాడు. మానవత వాదులు హేతువాదుల కృషి అభినందనీయం. లోతైన విశ్లేషణతో నిర్మాణాత్మకమైన విమర్శ చేస్తూ ముప్పాల రంగనాయకమ్మ ఎన్నో రచనలు చేశారు దానిలో "రామాయణ విషవృక్షం" మరియు "బలి పీఠం" సంచలనం సృష్టించింది. కత్తి పద్మారావు మహా కవి కుల మత బేదాలు మూఢ నమ్మకాల పై చేసిన విప్లవ ప్రసంగాలు

మరియు రచనలు చేసి సమాజములో ఉన్న కుళ్ళును దులిపి వేశాడు కులమతాల కు అతీతముగా మనుషులందరూ ఒక్కటే అని దండోరా వేశాడు. గురజాడ అప్పారావుగారు కన్యాశుల్కం నాటకం రచించి వ్యవహారిక భాషను సాహిత్యం లోకి తెచ్చి ఆధునిక సాహిత్య యుగ కర్త గా ప్రాచుర్యం పొందాడు.. నాటి సమాజములో చిన్న పిల్లలను ముసలి వారికిచ్చి కన్యాశుల్కం తీసుకొనే తల్లిదండ్రులకు ఇది ఒక చెంప పెట్టు. ఈ సాంఘిక దురాచారాన్ని నిర్మూలించుటకు కలం కత్తి పట్టి విజయం సాధించిన యోధుడు. శ్రీ కృష్ణ దేవరాయలు ఆస్థానంలో అష్ట దిగ్గజాలలో పేరొందిన అల్ల సాని పెద్దనామత్యుడు తొలి తెలుగు ప్రబంధం మనుచరిత్ర రాసి ఆంధ్ర కవితా పితామహుడు అని బిరుదు పొందాడు .నోరు తిరుగని పద్యాలు వాటి అర్థాలు తెలిసినా తెలియక పోయినా చదవగానే ఓహో! అనిపించే లా ఉంటుంది. వరూధిని ప్రవరుల ప్రేమను వర్ణించిన తీరు అద్భుతం ఇక పోతే శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్త మాల్యద ప్రసిద్ధ తెలుగు ప్రబంధ కావ్యం. తాను ధరించే పూల దండను భగవంతునికి సమర్పించుట గోదాదేవి శ్రీ రంగనాయకుల వివాహం వర్ణన ఆకట్టు కొంటుంది.ఈ కావ్యములో భగవద్భక్తి సనాతన ధర్మ విశిష్టత ముఖ్యమైన ఘట్టాలు. ఆ రోజుల్లో సామాన్య ప్రజలకు అందుబాటులో సాహిత్యము కాని ప్రశ్నించే తత్వం కాని ఎక్కడా చోటుచేసుకోలేదని ఆనాటి సాహిత్యం చెప్పకనే చెబుతుంది .కేవలం కవుల కలం రాజుల చుట్టూ తిరిగింది.ఆ నాటి సాహిత్యం ప్రజల్లోకి చొచ్చుకొని పోలేదు.

తెలుగు ప్రజల నాలుకలపై ఎల్లప్పుడూ నాట్యమాడే పద్యాలు బమ్మెర పోతన రచించినవే . ఇతను 15 వ శతాబ్దానికి చెందినవాడు.వరంగల్ జిల్లా బమ్మెర గ్రామములో రైతు కుటుంబంలో జన్మించినాడు.

సంస్కృతంలో ఉన్న శ్రీమధ్భాగవతాన్ని అద్భుతమైన తెలుగు పద్యాలు గేయాలుగా అనువదించాడు. ఇది భగవంతుని లీలలు భక్తి కి సంబంధించినది .సంస్కృత మూలాల తో కవి సృష్టించిన కల్పితాలు చెరగని ముద్ర వేసినాయి.శ్రీనాధుని కాలములోనే తాళ్ళపాక అన్నమయ్య , క్షేత్రయ్య భద్రాచల రామదాసు ,త్యాగరాజు వంటి వారి కీర్తనలు పదాల సోంపు తెలుగు బాష కు వన్నె తెచ్చినాయి. తెలుగు సాహిత్యమంతా భగవంతుడి చుట్టూ ప్రదక్షణలు చేసి అలసి పోయినాయే తప్ప విజ్ఞాన స్పృహ ,శాస్త్రీయ దృక్పథం హేతువాదం కనబడితే ఒట్టు .ఆధునిక యుగములో తెలుగు గ్రంథాలను సేకరించి ముద్రించి తెలుగు భాషకు ఎనలేని కృషి చేసిన సి .పి .బ్రౌన్ సేవలు ఆచంద్ర తారార్కం.తెలుగు వారు ప్రతి సాహిత్య వేదికలో ఆయన పేరు ప్రస్తావించి కొనియాడాలి. తెలుగు అజంత భాష ప్రతి పదం ఒక అచ్చు తో అంతం అవుతుంది.ఇటాలియన్ భాష కూడా అచ్చుతో అంతం అవుతుంది.15 వ శతాబ్దములో ఇది గమనించిన ఇటాలియన్ యాత్రికుడు"నికొలో డా కాంటి " తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా వర్ణించాడు.

హేతు వాద కవులైన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురాణాలను మూఢచారాలను ప్రశ్నిస్తూ రచనలు చేసి సమాజములో చైతన్యం సృష్టించారు. .శ్రీ శ్రీ మహాప్రస్థానం ద్వారా సాహిత్యము కొత్త పుంతలు తొక్కించారు .సంప్రదాయ ఛందస్సు వీడ్కోలు చెప్పి వచన కవిత్వం వైపు మొగ్గు చూపారు .దాశరథి కృష్ణమాచార్యులు , గుర్రం జాషువా ఆరుద్ర మొదలైన వారు పీడితవర్గ కష్టాలు అసమానతలు శ్రామిక వర్గం పట్ల సానుభూతి రచనలు చేసి ప్రజలలో చైతన్యం తెచ్చినారు. విజ్ఞాన వేదికలు , హేతువాద సంఘాలు సమాజములో ఉన్న మూఢ నమ్మకాలను నిర్మూలించుటకు చేస్తున్న కృషి అభినందనీయం. త్రిపురనేని రామస్వామి నార్ల వెంకటేశ్వర రావు గుడిపాటి వెంకటాచలం రావిపూడి వెంకటాద్రి, గోరా, వంటి ప్రముఖులు వారి రచనలతో తెలుగు సాహిత్యం లో కొత్త ఒరవడి సృష్టించి పాత చింత కాయ పచ్చడిని ఎండగట్టి మనిషి మనిషిగా బతుకడానికి శక్తి వంచన లేకుండా జీవితాలు త్యాగం చేశారు .

భాషాభిమానుల కృషి ఫలితముగా తెలుగు భాషకు ప్రాచీన హోదా 2008 లో లభించింది.ప్రాచీన తెలుగు విశిష్టత అధ్యయన కేంద్రం నెల్లూరు జిల్లా వెంకటాచలం లోని "స్వర్ణ భారతి ట్రస్టు" భవనంలో ఏర్పాటు చేశారు. 2020

జనవరి లో ప్రారంభోత్సవానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాక పోవడం శోచనీయం. మా తెలుగు మన తెలుగు అని గొంతు చించుకునే వారికి తెలుగు తల్లి పై అభిమానం ఎంత ఉందో తెలుస్తుంది. తెలుగు భాషలో ఉన్న శాసనాలు తాళపత్ర గ్రంథాలు వెలికి తీశారా ? పుస్తకాలు ఎన్ని ప్రచురించారు పోరాటం చేసి తెచ్చుకున్న ప్రాచీన గుర్తింపుకు ఎన్ని నిధులు సమకూర్చారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది కదా!. మన తెలుగు తల్లికి మల్లె పూదండలు వేసి చప్పట్లు కొట్టగానే సరి పోయిందా ? శ్రీ శ్రీ కళావేదికలు నిర్వహించే వారు హేతు వాద రచనలను ప్రోత్సహించుతున్నారా?
సమాజములో కుళ్ళును ఎండగట్టే సాహితీ సంస్థలు ఎక్కడా ?
నేటి కవులు రచయితలు వాట్సప్ గ్రూప్ లు సృష్టించి కవితల కథల పోటీ పెట్టి
తెలుగు తల్లి కి సేవ చేస్తున్నారా ?సద్విమర్శలు సమీక్షల లో సద్విమర్శలు అసలున్నాయా ?
"ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ల కదలికనా ? అదెక్కడా కానరాదే ?

కవులు మేధావులు బిరుదలకు సన్మానాలకే పరిమితమా ? కలంలో ఆరాటం కనబడాలి మూఢనమ్మకాలను నిర్మూలించుటకు నడుం బిగించాలి

మనోభావం లో సద్భావన ఉన్నప్పుడు మనిషి మనిషిగానే బతుకాలని అనుకున్నప్పుడు మనసు బాధ పడే అవకాశం ఉండదు కదా ?

ముగింపు:-

సాహితీ వేత్తలు ఇప్పటికైనా విజ్ఞాన స్పృహ తో కదలి రావాలి . మానవీయ విలువలు చిగురించే రచనలు చేయాలి ఆ దిశగా మనందరం కలిసి అడుగులు వేద్దాం రండి .

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

చౌడూరి గోపాలరావు సాహిత్య విశ్లేషణ



బి. జమున
తెలుగు పరిశోధక విద్యార్థిని
పాలమూరు విశ్వవిద్యాలయం
ఫోన్ :8500169682.
జిల్లా : మహబూబ్ నగర్
పర్యవేక్షణ : డాశ్రీశ్రీ మన్నెమోని కృష్ణయ్య.

****

ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసిన సాహిత్య వేత్తలెందరో ఉన్నారు. అటువంటి విశిష్ట సాహిత్య సేవకులలో చౌడూరి గోపాల రావు ప్రముఖులు.

విద్వత్ కవి శ్రీ చౌడూరి గోపాలరావు పాలమూరు జిల్లాలో సుప్రసిద్ధ రచయిత.సామాజిక స్పృహ కలిగిన కవి, అనర్గళంగా మాట్లాడే వక్త. చతురోక్తి సంభాషణా ధురీణుడు. హృద్య పద్య విద్యా నిర్మాణ విశారదుడు. పరిశోధకుడిగా సాహితీ సంస్థల స్థాపకుడిగా, గాయకుడిగా,ప్రవచన కర్తగా, దార్శనికుడిగా, ఆర్ష ధర్మాన్ని అణువణువునా నింపుకున్న ఆజానుబాహుడైన చౌడూరి గోపాలరావు సాహిత్య రసగంగాధరుడై ఎన్నో గ్రంథాలను ఆవిష్కరించిన అసమాన తేజశ్శాలి. ఉత్తమ అధ్యాపకుడిగా రాష్ట్ర ప్రభుత్వం చేత సన్మానించబడి, అలుపెరుగని అధ్యాపనంతో పాటు పద్య, గద్య, వచన, గేయ, జానపద రచనలు చేసి తెలుగు తల్లి కంఠ సీమను శోభాయ మానంగా అలంకరింపజేసిన అసాధారణ శేముషి విభవ సంపన్నులు. పెద్దలతో పిల్లలతో కవులతో మేధావులతో కల్లాకపటం లేకుండా కలిసిమెలిసి జీవిస్తూ తలలో నాలుకలా అందరివాడుగా, ఆత్మబంధువుగా గలగల పారే సెలయేరుగా ప్రవహించే గోపాలరావు నిత్య చైతన్యానికి నిలువెత్తు నిర్వచనం.కవిత్వం ఆయన ఆస్థి,అభ్యుదయం ఆయన సంకల్పం,ప్రజాహితం ఆయన అభిమతం,సాహిత్య సేవ ఆయన ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు.

చౌడూరి గోపాలరావు ఆరడుగుల నిండైన విగ్రహం. నుదుట తిలక ధారణతో, పంచ కట్టు ఆహార్యంతో హైందవ సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంలా వుండేవారు. మంచి భోజన ప్రియులు. ఎప్పుడు నవ్వుతూ ఛలోక్తులు విసురుతూ

మాట్లాడేవారు. ఎవరినీ నొప్పించని మృదుభాషి.

సంఘసంస్కరణయే ప్రధాన ఆశయంగా భావించి 12 గ్రంథాలను ఆవిష్కరించిన చౌడూరి సాహిత్య సేవ అనన్యం. ప్రస్తుతం ఆయన రచించిన రోహిణి,చెరైవేతి కావ్యాలు అలభ్యం. 'అభాగిని'పద్య కావ్యంలో వరకట్నం ఇవ్వలేని తల్లిదండ్రులు పడుతున్న దుర్భర వేదనను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. స్త్రీలపై జరుగుతున్న దురాచారాలపై తీవ్రంగా నిరసన ప్రకటించి తన సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం కోసం అభాగిని కావ్యాన్ని కరుణ రసాత్మకంగా రచించారు.'మధుశాల' పేరుతో ఉమర్ కయ్యాం రుబాయిలను తెలుగులోని అనువాదం చేసి సమాజంలో వేళ్ళూనిన దురాచారాలను దుయ్యబడుతూ,సామాజిక సందేశం అందించారు చౌడూరి. 'ఉత్తిష్ట' కావ్యంలో వ్యక్తి తనలోని నిద్రాణమైన శక్తులను మేల్కొల్పుకొని జీవనాన్ని సాగించాలనే ప్రేరణాత్మక భావన ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది.ఇందులోని కొన్ని కవితా పంక్తులు సుభాషితాలుగా భావితరానికి ప్రబోధాత్మక వాక్యాలుగా నిలిచే విధంగా గొప్ప సాహిత్య సందేశాన్ని ఆవిష్కరించారు.'ఇంటి నుండి ఇంద్ర లోకం'కావ్యంలో కుటుంబ జీవితం ,సంస్కారం,మానవ సంబంధాలు మొదలైన అంశాలను తీసుకుని అంత్య ప్రాసలలో బంధించి ముక్తకాల రూపంలో చమత్కార గర్భితంగా రచించారు.'హిందూ జీవన పద్ధతి'లో భారతీయ సంస్కృతి ఆచార వ్యవహారాలు,ధార్మిక విశ్వాసాలు, నైతిక విలువలు, హిందూ ధర్మమును గురించి తెలియజేస్తూ వర్ణాశ్రమ ధర్మాలు, పురుషార్థములను గురించి విశదీకరించారు. ఇది హిందూ జీవన విధానం గురించి తెలియపరిచే చక్కటి గ్రంథము.

శతకాలలో కొడంగల్ పట్టణంలో కొలువైన వేంకటేశ్వరుని స్తుతిస్తూ 'కొడంగల్ వెంకటేశ్వర శతకము'ను రచించారు. ఇందులో భక్తి ప్రధాన వస్తువుగా నిలుస్తుంది. దైవభక్తితో పాటు ధర్మబద్ధమైన జీవనము, మానవ ప్రవర్తన, నైతికత మొదలైన అంశాలు ఇందులో చోటు చేసుకున్నాయి. బసవేశ్వరుని వచనాలకు అనువాదముగా కూడల సంగమేశ్వర శతకమును అద్భుతమైన ఉపమానాలతో, పాఠకులను కట్టివేసే పదబంధాలతో, అలంకార శోభితంగా రచించారు. ఇందులో భక్తి, ఆధ్యాత్మికత,తాత్విక చింతన ప్రధానంగా వ్యక్తమవుతాయి. దైవారాధనతో పాటు మానవుడు పాటించవలసిన సద్గుణాలను నైతిక విలువలను,ధర్మాచరణ మొదలైన అంశాలను పేర్కొన్నారు.భక్తి ద్వారా మానవ జీవితాన్ని ఉన్నతీకరించాలనే భావన ఈ శతకంలో ప్రతిఫలిస్తుంది.ఇంకిపోని ఎంకి పాటల ప్రణయ కవితలకు సరి సమానంగా రాసిన 'మల్లి పాటలు' పద విన్యాస వైచిత్రితో వసివాడని పరిమళాన్ని వెదజల్లే విధంగా మనోజ్ఞంగా చిత్రించారు. గేయాత్మకత,సరళమైన భాష, భావ స్పష్టత ఇందులో ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. పల్లె ప్రజల జీవనానికి దగ్గరగా ఉండే భావాలను పాటలు రూపంలో అలతి,అలతి పదాలతో అత్యద్భుతంగా వ్యక్తీకరించడం చౌడూరి కల్పనా శిల్ప చాతుర్యానికి నిదర్శనం.బాల బాలికలను దృష్టిలో పెట్టుకుని అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు,చీకటి నుండి వెలుగు వైపు పయనించాలని సందేశమందిస్తూ,బాల బాలికల వ్యక్తిత్వ నిర్మాణమును మేల్కొల్పే విధంగా 'వెలుగు బాట' గీతాలను సరళ సుందరంగా రచించారు. ప్రముఖ ప్రాచీన కవులు,ఆధునిక కవులు రచించిన పది గ్రంధాలపై వ్యాసాలను వివిధ పత్రికల్లో చౌడూరి వెలువరించిన వ్యాస సంపుటి ఆలోకనం. ఇది విమర్శనాత్మక విశ్లేషనాత్మక గ్రంథం. ఇందులో కవుల శైలి వైవిధ్యాలను,ఛందస్సును, పదజాల వినియోగము మొదలైన అంశాలను సమీక్షించారు.

సంప్రదాయవాది అయిన చౌడూరి విభిన్న ప్రక్రియలలో తన రచనను కొనసాగించారు. ఏ ప్రక్రియ చేపట్టిన సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలపై తీవ్రమైన నిరసనను తెలియజేశారు. తాను ఆశించిన సమ సమాజ స్థాపనకు సరిపడే పునాదులు వేశాడు. సంస్కరణాభిలాష కలిగిన ఉత్తమ సాహితీవేత్తగా సమాజానికి మార్గదర్శనం చేశారు. ప్రబోధాత్మకమైన సాహిత్యాన్ని సృష్టించి సమకాలీన కవి కులంలో బలమైన ముద్ర వేసిన ప్రతిభ సంపన్నుడు చౌడూరి.సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాలను పరిశీలించి ప్రగతిశీల ధ్వేయంతో సాహిత్య సృజన గావించిన సవ్యసాచి. ద్వేషానికి ఆవేశానికి లోను గాకుండా సమాజాన్ని ప్రేమిస్తూ సమాజ సంస్కరణకు త్రికరణ శుద్ధిగా పాటిపడిన కవితా సేనాని చౌడరి ఏ రచన చేసినా మనిషిని

కేంద్ర బిందువుగా చేసి సంస్కరించాలనే గాఢమైన తపనతో రచనలు చేసిన చౌడూరి చరితార్థుడు. ప్రసంగం చేసినా,పాట పాడినా, పద్యం వినిపించినా అన్నింటిలో ప్రధానంగా సమకాలీన సామాజిక సమస్యలనే ప్రస్తావించి వాటి పరిష్కారానికి వినూత్నమైన దారులను అన్వేషించిన దార్శనికుడు చౌడూరి. ఆయనకున్న కలుపుగోలుతనంతో సమకాలీన కవులపై కూడా తన ప్రభావాన్ని వేసి వాళ్ళను మేల్కొల్పిన వైతాళిక చక్రవర్తి. ఏ వేదిక లెక్కినా నిర్భయంగా, నిస్సంకోచంగా గళమెత్తి గర్జించిన కవి సింహం

చౌడూరి. అభ్యుదయ భావాలతో పరిణతి చెందిన సంస్కరణవాది.తన రచనలతో,ఉపన్యాసాలతో సమాజానికి మార్గదర్శనం చేసిన మహనీయుడు. సంకుచిత ధోరణులను నిరసించి, సమ సమాజ స్థాపనకు సర్వ మానవ సౌభ్రాతృత్వ జీవన విధానానికి దారులు ఏర్పరచిన దార్శనికుడు. సంఘదురాచారాలను కూకటి వేళ్లతో పెల్లగించి సర్వ మానవ శ్రేయోదాయకమైన మార్గానికి అంకురార్పణ చేసిన ఉదార జాతీయవాది.తన సాహిత్యం ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించడానికి విశేషంగా కృషి చేసిన కలం యోధుడు చౌడూరి.

ఆధార గ్రంథాలు :

1. రోహిణి, చరైవేతి.... చెడూరి వేణుగోపాలరావు.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

వైద్యం వెంకటేశ్వరాచార్యుల - వచన రచనలు పరిశీలన



రాచపూడి జయసుశీల
లెక్చరర్, తెలుగు విభాగం
కె.వి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (వుమెన్)
కర్నూలు.
చరవాణి: 9959587946.

****

ఆధునిక సాహిత్యంలో విశేష ప్రాచుర్యం పొందిన ప్రక్రియలలో వచన కవిత్వం ఒకటి. సామాన్యులకు సైతం సులభతరముగా అర్థమయ్యే ప్రక్రియ వచనం. ఆంగ్లేయుల ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి అడుగిడిన అనేక ప్రక్రియలు కథ,నవల, వ్యాసం, మినీ కవిత మొదలగు వాటిలో వచన కవిత్వం కూడా ఒకటి..

శ్రీ వైద్యం వెంకటేశ్వరచార్యులు వారి సాహిత్యం బహుముఖాలుగా విస్తరించింది వారి సాహిత్యాన్ని స్థూలంగా ఛందో, వచన రచనలుగా విభజించవచ్చు. వైద్యం వారి వచన రచనల్లో పేర్కొనదగ్గవి వ్యాసాలు పరిశోధనాత్మకమైనవి వాటి వివరణ క్రింది విధంగా ఉన్నాయి.

వైద్యం వెంకటేశ్వరాచార్యుల వారి వచన రచనలు :

1. వ్యాస వైజయంతిక – ఇవి కర్నూలు జిల్లా సంబంధిత వ్యాసాలు
2. కర్నూలు జిల్లా కవితరంగిణి
3. వ్యాస చంద్రిక

వివిధ కవి పండిత పరిశోధక విరచితం

4. ఆళ్వార్ల సంగ్రహ చరిత్ర
5. ఆంధ్రీకృత యతిరాజ స్తోత్రము
6. చాత్తాద నామ భాష్యం

7. శాత్తాద శ్రీవైష్ణవం

8. లోనారసి మొదలైనవి.

వైద్యం వేంకటేశ్వరాచార్యులు తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కవి, రచయిత, పరిశోధకులు. కర్నూలు జిల్లాకు చెందిన ఆయన రచనలలో వచన సాహిత్యం ప్రత్యేకమైనది.

వైద్యం వేంకటేశ్వరాచార్యులు వచన రచనల పరిశీలన :

పరిశోధనాత్మక శైలి :

వేంకటేశ్వరాచార్యులు తన వచన రచనలలో పరిశోధనాత్మక దృక్పథాన్ని ఎక్కువగా ప్రదర్శిస్తారు. చారిత్రక, సాంస్కృతిక అంశాలపై ఆయన చేసిన విశ్లేషణలు ప్రామాణికంగా ఉంటాయి.

భాషా పటిమ :

ఆయన వచన రచనలలో స్పష్టత, సరళత మరియు ఆకర్షణీయమైన భాషా శైలి కనిపిస్తుంది. విషయం పాఠకులకు సులభంగా అర్థమయ్యేలా రాయడం ఆయన ప్రత్యేకత.

సాహిత్య పరిశోధన :

సాహిత్యం, కవిత్వం, మరియు సంస్కృతిపై ఆయన అనేక వ్యాసాలు, పరిశోధనాత్మక గ్రంథాలు వచన రూపంలో అందించారు.

రాయలసీమ సంస్కృతి :

ఆయన రచనలలో రాయలసీమ ప్రాంతీయ సంస్కృతి, చరిత్ర మరియు సాహిత్య విశేషాలు ప్రతిబింబిస్తాయి.

1. వ్యాస వైజయంతిక :

- ప్రథమ సంపుటం వైష్ణవ సంబంధిత వ్యాసాలు
- ద్వితీయ సంపుటం కర్నూలు జిల్లా సంబంధిత వ్యాసాలు
- తృతీయ సంపుటం సాహిత్య సంబంధిత వ్యాసాలు
- చతుర్థ సంపుటం
- కొత్త చిగుళ్ళు లఘు వ్యాసాలు

వ్యాస వైజయంతికలో

కర్నూలు జిల్లా సంబంధిత వ్యాసాలు ఇవి 20 కలవు.

వివిధ రాజవంశాల పాలనలో కర్నూలు :

పూర్వ కాలం నుంచి కర్నూలు జిల్లాకు ఎంతో చరిత్ర ఉంది అనేక రాజ వంశాలు సార్వభౌమాధికారాన్ని ఈ ప్రాంతంపై కలిగి ఉన్నాయి. నందులు మౌర్యులు శాతవాహనులు పల్లవులు చోళులు కాకతీయులు రెడ్డి రాజులు విజయనగర రాజులు గద్వాల రాజులు బ్రిటిష్ వారు మొదలగు వారు ఈ జిల్లా ప్రాంతాన్ని స్వాతంత్రానికి పూర్వం పాలించారు.

తెలుగు సాహిత్యంలో కందనవోలు :

కొండారెడ్డి బురుజు :

కర్నూలు పేరు వినగానే మనమస్తిష్కాలలో మొట్టమొదటిగా గోచరించేది కొండారెడ్డి బురుజు పూర్వం కందనవోలు

పట్టణానికి అభేద్యమైన కోట ఉండేది. కాలక్రమములో శిధిలావశేషంగా మారిన కోటలోని ఆనాటి సింహద్వారానికి ఎడమవైపు ఉంటే నా కొండారెడ్డి బురుజు గతరాజు వైభవ దర్పానికి చిహ్నంగా దర్పణం పడుతూ పురావస్తు శాఖ వారి అధీనంలో ధీమాగా నిలిచి ఉంది.

కర్నూలు జిల్లా ప్రాచీన పాలనా విభాగాలు :

- కర్నూలు జిల్లా ఊర్లు పేర్లు
- కర్నూలు జిల్లా కైఫీయత్తులు
- కర్నూలు జిల్లా ప్రాచీన శిలా శాసనాలు – కవి పండితులు
- కర్నూలు జిల్లా కవులు
- కర్నూలు జిల్లా ప్రాచీన సాహిత్యం
- బనగానిపల్లె ప్రాంతపు కవులు సాహిత్యం
- నూరేళ్లలో (1901 – 2000) నంద్యాల సీమ సాహిత్యం
- అహోబిలం
- ఉరుకుంద ఈరన్న స్వామి చరిత్ర సమీక్ష
- కందనోలు మండలం అన్నమయ్య అనుబంధం
- కర్నూలు జిల్లా సాహిత్యం విమర్శ, పరిశోధన
- కర్నూలు జిల్లా నాటక సాహిత్యం
- సీమ చరిత్రలో నిలిచిపోయే విశిష్ట పరిశోధకుడు నరహరి గోపాల కృష్ణమ శెట్టి
- కర్నూలు జిల్లా స్వాతంత్రోద్యమం
- కర్నూలు జిల్లా స్వాతంత్రోద్యమం సాహిత్యం

తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య మొదలగు ఈ విభిన్న అంశాలు వ్యాస వైజయంతిక లో పరిశోధనాత్మక విషయాలు కలవు.

2. కర్నూలు జిల్లా కవితరంగిణి వెయ్యేళ్లలో కందనవోలు సీమలోని కవులు పండితులు రచయితలు గూర్చిన వివరణ ఇందులో కలదు.

3. అధ్యాత్మ రామాయణ వ్యాస చంద్రిక : వివిధ కవి పండిత పరిశోధక విరచితం.తెలుగు సాహిత్య చరిత్రలో విద్వదద్వాల సంస్థాన సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉంది గద్వాల సంస్థాన సాహిత్య చరిత్రలో కాణాదం పెద్దన్న గారి కావ్యాలకు సముచిత స్థానం ఉంది వీరి అధ్యాత్మ రామాయణాన్ని క్రీ.శ. 1879లో ముకుంద విలాసాన్ని క్రీ.శ. 1827లో గద్వాల సంస్థానం వారు ప్రప్రథమంగా ప్రచురించారు. ఆ ముద్రిత ప్రతులతోపాటు వాటి తాళపత్ర లిఖిత పత్రాలు కూడా వైద్యం వారి ఇంట్లో ఉన్నాయి.

వాటిని వైద్యం తండ్రిగారు చిన్నతనంలో చదివించేవారు, అర్థాలను వివరించి చెప్పేవారు ఫలితంగా వైద్యం వారికి ఆ కావ్యాల మీద మక్కువ ఎక్కువైంది అందువల్ల అధ్యాత్మ రామాయణాన్ని వివిధ ప్రతులు పరిశీలించి, పరిష్కరించి,విపుల పీఠిక సంతరించారు. ముకుంద విలాసానికి వ్యాఖ్యానాన్ని రచించారు. వీరు పరిష్కృత సంపాదకత్వ అధ్యాత్మ రామాయణాన్ని టీటీడీ దేవస్థానం వారు 2016 లో ప్రచురించారు. ఆధ్యాత్మి రామాయణ విశేషాలను అనుభవజ్ఞులైన కవి పండిత

పరిశోధకులతో వ్యాసాలు రాయించి ఒక పుస్తకంగా ప్రచురించాలని సంకల్పంతో విద్వన్మిత్రులకు అందజేసి సంబంధిత వ్యాసాలను రాయించారు. ఆధ్యాత్మి రామాయణం వ్యాసచంద్రికను తెలుగు సాహిత్య అభిమానులు ఆదరించారు.

4. ఆళ్వార్ల సంగ్రహ చరిత్ర :

భారతదేశం పుణ్యభూమి కర్మభూమి ఈ దేశంలో ఎందరో మహా పురుషుల అవతరించారు వారి వారి కాలాల్లో వివిధ పరిస్థితుల్లో మనుగడ సాగిస్తూ మానవ సమాజ ఉద్ధరణకు కృషి చేశారు.

శ్రీ వైష్ణవి సంప్రదాయంలో ఆల్వార్లకు విశిష్ట స్థానం ఉన్నది ఆళ్వారులంటే జ్ఞాన సముద్రమును మునిగి లేచిన వారిని అర్థం మహా జ్ఞానులైన ఆల్వార్లు శ్రీ వైష్ణవ మతానికి మూల స్తంభాల వంటి వారు వీరు సూక్తులు మోక్ష సౌధానికి నిచ్చెనలు ఈ ఆల్వారులు 12 మంది వీరిని పన్నిద్దరాళ్వారులు అంటారు.

ఇంతటి మహనీయుల పుణ్య చరితల జీవిత విశేషాలను ప్రసిద్ధ వైష్ణవ పండితులు సాహితీ పరిశోధకులు అయిన శ్రీ వైద్యం వారిచే గ్రంథస్తం చేయించి బ్రహ్మమొక్కటే శీర్షిక కింద ఆల్వార్ల సంగ్రహ చరిత్ర అనే పేరుతో భక్తకోటికి టిటిడి అందిస్తున్నది.

5. ఆంధ్రీకృత యతిరాజ స్తోత్రము :

భారతీయ దార్శనికులలో ఆదిశంకరుల వారిది ప్రముఖ స్థానం అయితే రామానుజుల వారిది విశిష్ట స్థానం వీరికి సంబంధించిన రెండు స్తోత్రాలు బాగా ప్రచారం పొందాయి. అవి మానవ ఆధ్యాత్మిక జీవితానికి అవసరమైన మౌలిక నైతిక ప్రబోధాత్మ కాలు వాటిలో కాలక్రమంగా మొదటిది "భజ గోవింద స్తోత్రం" కాగా రెండవది "భజయతిరాజ స్తోత్రం" రామానుజ స్తుత్యాత్మకమైన భజయతి రాజస్తోత్రాన్ని రచించిన వారు రంగనాథాచార్యుల వారు.

భజగోవింద రాజ స్తోత్రాలు రెండును గానయోగ్యమైన మాత్రాఛందస్సులో రచించబడ్డాయి ఈ చందస్సు చతురస్ర గతిలో సాగుతుంది ఏకతాలానికి ఉదుగుతుంది పల్లవి రెండు పాదాలను కలిగి ఉంటుంది చరణాలు నాలుగు పాదాలు కలిగి ఉంటాయి పాదానికి నాలుగు గణాలు ఉంటాయి గణానికి నాలుగు మాత్రలు ఉంటాయి రగడలలో మధుర గతిరగడ అనే భేదం ఈ చందస్సులోనే సాగుతుంది ప్రయోగించిన అభ్యుదయ కవులలో శ్రీశ్రీ గారు మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం కదిలింది అని నాలుగు మాత్రల జగన ప్రయోగాన్ని కూడా చేశారు ఆదిశంకరుల వారి కాలం నుంచి అభ్యుదయ కవుల కాలం దాకా అస్తిత్వాన్ని నిలుపుకుంటూ అటు ప్రాజ్ఞ కవులను ఇటు ప్రజానీకానీ ఈ చందస్సు ఎంతగానో ఆకట్టుకుందని దీనికుండే ప్రాచుర్యాన్ని పరిశీలిస్తే అవగతమవుతుంది.

6. చాత్తాద నామ భాష్యం :

శ్రీ రామానుజుల వారి సిద్ధాంతాలను ప్రచారం చేయుటలో చాత్తాద శ్రీ వైష్ణవులు యొక్క పాత్ర ప్రముఖమైనది రామానుజుల వారికి పూర్వం నుంచి కూడాచాత్తదులు ఎంతో చరిత్రను కలిగి ఉన్నారని విదేశీ పరిశోధకులు కూడా వెల్లడించారు. చాత్తదులు చరిత్రతో పాటు విశిష్టమైన సంప్రదాయ సంస్కృతులను కూడా కలిగి ఉన్నారు. వీరి సంప్రదాయాన్ని సువ్యక్తం చేసే సాహిత్యం కూడా ఎంతో ఉంది.

7. శాత్తాద శ్రీవైష్ణవం :

శాత్తాద/ చాత్తాద / సత్తాదశబ్దం ఆవిర్భవించిన నాటి నుంచి అనేక పరిణామాలకు గురైంది మౌలిక రూపాన్ని బహు విధాలుగా స్త్రీకరించే ప్రయత్నాలు జరగదు. అందువల్ల శాత్తాద శబ్దానికి అనే కారణాలు ప్రచారం పొందాయి. అత్యంత ప్రాచీనమై అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుని అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన పేరుకు అర్థాలు కూడా అధికంగానే

ఉంటాయి ఉదాహరణకు విష్ణు సహస్రనామం సహస్రనామంలో ఏ పేరు తీసుకున్న దానికి ఒక అర్థం కాక అనేకారులు ఉండటం మనకు తెలుసు ఒక అంశంపై ఎన్ని అభిప్రాయ బేధాలు ఉంటే అన్ని రకాల వ్యాఖ్యానాల ఆవిర్భవిస్తాయి ఎవరి అభిప్రాయాన్ని వారు సమర్పించుకునేందుకు వ్యాఖ్యానాలు చేస్తుంటారు విష్ణు నామసహస్రమే అందుకు ప్రధమోదాహరణము.

8.లోనారసి:

లోనారసి అంటే లోతుగా పరిశీలించడం అంతః పరిశీలనమని అర్థం . వైద్యం వారి సాహిత్య వ్యాసంలో (అసంకల్పితంగా) లోతుగా పరిశీలించిన విశేష విషయాలను పొందుపరిచిన మొత్తం కనుక దీనికి లోనారసి అనే పేరు సరైనది.

శ్రీ రామాయణం సీతారాముల గాధ కావ్య నామములోనే ఆ అర్థం ఉంది కనుక ఆది కావ్య నామ పరిశీలనతో ఆరంభమైంది

కన్నడ రత్న త్రయం తెలుగు కవిత్రయం గురించి లోనారసి తెలుసుకున్న కొన్ని అంశాలు ఇందులో పొందుపరిచినారు.

తొలి తెలుగు చందో గ్రంధం భీమన ఛందన కవిజనాశ్రయం గురించిన కర్తృత్వ విషయం లోనారసిలో సుస్పష్టంగా ఉంది.

భోగినీ దండక భేదం దానికి మార్గదర్శకమైన తమిళ సాహితీ ప్రక్రియ లోనారసిలో ప్రస్తావితం.

బమ్మెర పోతన భాగవతం గురించి శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద గురించి చేమకూర విజయ విలాసం గురించి ఇంతకు పూర్వం ప్రస్తావించని విశేషాలు ఎన్నో ఉన్నాయి. లోనారసిలో సాహిత్యాల గురించి వైద్యం విన్న వారి తండ్రిగారు చెప్పిన, వారి పరిశోధనలో తెలుసుకున్న నూత్న విశేషాలు ఎన్నో ఇందులో పొందుపరిచారు.

సాహిత్య పరిశోధకరత్న వైద్యం వేంకటేశ్వరాచార్యులు వచన రచనలు తెలుగు సాహిత్య పరిశోధనకు మరియు సాంస్కృతిక అధ్యయనానికి ఎంతో విలువైనవి.

ఆధార గ్రంధాలు :

1. వ్యాస వైజయంతిక – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
2. కర్నూలు జిల్లా కవితరంగిణి – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
3. వ్యాస చంద్రిక – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
4. వివిధ కవి పండిత పరిశోధక విరచితం – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
5. ఆళ్వార్ల సంగ్రహ చరిత్ర – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
6. ఆంధ్రీకృత యతిరాజ స్తోత్రము – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
7. చాత్తద నామ భాష్యం – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
8. శాత్తద శ్రీవైష్ణవం – వైద్యం వెంకటేశ్వరాచార్యులు
9. లోనారసి – వైద్యం వెంకటేశ్వరాచార్యులు

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/



పాఠశాల విద్యార్థులు - నైతిక విలువల బోధన - అవశ్యకత



ఆచార్య ఎస్. చిన్నరెడ్డయ్య
ఎం.ఏ., ఎం.ఫిల్, పిహెచ్.డి.
ప్రొఫెసర్, తెలుగు అనువాద, అధ్యయనశాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం
కుప్పం – 515 425, చిత్తూరు జిల్లా.
సెల్ నెం. 94406 11033

కె.నర్సొద్దిన్
పరిశోధకుడు
తెలుగు అనువాద, అధ్యయనశాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
సెల్ నెం. 99663 93708
E-mail : nsd.k1984@gmail. Com

1. ప్రవేశిక :

బాలబాలికలకు పాఠశాల స్థాయిలోనే నైతిక విలువల బోధన జరగాలి. అదికూడా ఉన్నత పాఠశాల స్థాయిలోనే జరగితే బాలబాలికల మనస్సులకు హత్తుకుంటుంది. కొత్తబట్టకు రంగు అద్దినట్లు పాతగుడ్డకు అద్దదుకదా! అదేవిధంగా యుక్త వయస్సు దాటిపోయే దశలో నైతికాశాలు బోధపడవు. అందువల్ల సమాజాన్ని అవగాహన చేసుకుంటున్న దశలో బాలబాలికలకు నీతిబోధలు చేస్తే అవి వారి మనస్సులో నాటుకు పోతాయి. ఆ తరువాత జీవితాంతం నిబద్ధతతో, క్రమశిక్షణతో జీవనం సాగిస్తారు. అలాంటి పౌరులపట్ల ఆదర్శవంతమైన ఒడిదుడుకులు లేని సమాజం రూపుదాలుస్తుంది. నేటి సమాజంలో అనూహ్యమైన రీతిలో అనైతికంగా, అక్రమంగా కొందరు యువతీ యువకులు వ్యవహరిస్తున్నారు. ఏ రోజు దినపత్రికలు చూసినా 'టీనేజి' బాలబాలికలు పాల్పడుతున్న దుర్మార్గాలకు సంబంధించిన వార్తలు చదువుతుంటే శరీరం గగుర్పాటుకు గురవుతున్నది. ఈ సమస్య రోజు రోజుకు పెరుగుతున్నది. ఇది ఒక్క ఆంధ్రదేశానికే పరిమితం కాలేదు. ఈ బాలబాలికలు చేస్తున్న, పాల్పడుతున్న దుష్టచేష్టలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా నైతిక విలువలు నేర్పుతున్నది. దానికోసం ప్రాచీన సంస్కృతాంధ్ర కవులు పేర్కొన్న శ్లోకాలు, పద్యాలను చేర్చి ప్రత్యేకంగా చిన్న పుస్తకాలు రూపొందించి బోధిస్తూ నైతిక విలువల పెంపుదలకు కృషి చేస్తున్నది.

వాటిని ఈ వ్యాసంలో సంక్షిప్తంగా పేర్కొనడం జరిగింది.

2. కొత్తపదాలు

1. గుప్తధనం 2. యశస్సు 3.విహీనః 4.తథ్యము 5.ఖండితం 6.భుజంబు 7.తాపము 8.సాధుజనులు 9.స్వర్గము 10. దుఃఖము 11.నరకము.

3. విద్య - విలువ

మన పెద్దలు ప్రాచీన కాలంలోనే విద్య విలువను గుర్తించారు. ఆ క్రమంలో చూసినపుడు మహాకవి భర్తృహరి విద్య ప్రాధాన్యాన్ని పేర్కొన్నాడు. ఈ మహాకవి సుభాషిత త్రిశతి పేరుతో నిరుపమానమైన శతకాన్ని సంస్కృతంలో రాశాడు. అందులో ఒక్క విద్యనే కాకుండా, సజ్జనుల గురించి, దుష్టుల గురించి, ధనం ప్రాధాన్యాన్ని గురించి ఇంకా అనేక అంశాల గురించి సోదాహరణంగా తెలిపాడు.

విద్యానామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్త ధనం
విద్యా భోగ కరీ, యశస్సుఖ కరీ విద్యా గురూణాం గురుః!
విద్యా బంధుజనో విదేశగమనే విద్యాపరా దేవతా,
విద్యారాజసు పూజ్యతే నహి ధనం విద్యా విహీనః పశు !!

విద్య వల్ల ఒక వ్యక్తి ఎన్ని విధాలుగా గౌరవాన్ని పొందుతాడో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. విద్య పురుషునికి సౌందర్యమిస్తుంది. విద్య రహస్యంగా దాచిపెట్టబడిన ధనం వంటిది. విద్యయే కీర్తిని, సుఖాలను కలిగిస్తుంది. విద్యయే గురువులకు గురువై బోధిస్తుంది. పరదేశంలో బంధువు వలె సాయం చేస్తుంది. విద్యయే పర దైవతం. విద్యయే రాజ్యసభలలో పూజింపబడుతుంది, కాని ధనం కాదు. విద్య రానివాడు పశువుతో సమానం అంటాడు మహాకవి భర్తృహరి. ఆ మహాకవి మాటలు సార్వకాలిక సత్యాలని చెప్పవచ్చు.

"విద్యానామ నరస్య రూప మధికం"... పుట్టుకతో మనుషులకు కొంత అందం వస్తుంది. వృద్ధాప్యం వస్తే తరిగిపోతుంది. కానీ అందం కరిగిపోకుండా పెరిగేది విద్య వలననే! అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణన్, బాబు రాజేంద్రప్రసాద్, చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి, అబ్రహం లింకన్ మొదలగు వారి చిత్రపటాలు స్ఫూర్తి కోసం పెట్టుకుంటారు. వారు అందంగా ఉన్నారని కాదు. వాళ్ళ అందమంతా వాళ్ళ చదువే! ఎవరు మంచి విద్యావంతుడో, విద్వాంసుడో ఆయననే చూడాలని అందరూ కోరుకుంటారు. కాబట్టి విద్య మనిషికి అందాన్ని తెస్తుంది! విద్య "ప్రచ్ఛన్న గుప్తం ధనం" విద్య అనేది గుప్తంగా పైకి కనిపించకుండా మననంటి పెట్టుకున్న ధనం వంటిది! ధనవంతుడు చాలా దర్జాగా, విలాసంగా ఉంటే ఆయన్ని చూసి అసూయపడతారు. కానీ విద్యావంతుడు ఎంతో విద్యను గడించినా సరే, అది చూడటానికి కనిపించదు కదా! ఈశ్వరచంద్ర విద్యాసాగర్ చాలా గొప్ప విద్యావంతుడు. కానీ పైకి సామాన్యంగా ఉండేవాడు. పైకి తెలియదు కాబట్టి ఆయన అంతటి విద్యావంతుడని తెలియదు. ఒకసారి ఒక వ్యక్తి రైలు దిగి "పోర్టర్ లేడా"? అని విసుగ్గా అరిస్తే ఈశ్వరచంద్రవిద్యాసాగర్ ఆ పెట్టె మోసుకు వెళ్లారు. అటువంటి ఆయనతో పెట్టె మోయించినందుకు ఆ వ్యక్తిని అతని తండ్రిని నిందించాడు. ఈశ్వర చంద్ర విద్యాసాగరులని తెలియకపోవటం చేత కొడుకలా చేశాడని క్షమాపణ చెప్పాడు. పైకి కనిపించని ధనము అవటంతో విద్య మీద ఎవరు పన్ను వేయలేరు. ఆస్తిలా అన్నదమ్ములు పంచుకోరు. దొంగలు ఎత్తుకు పోలేరు. ఎవరు చదువుకున్నారో వారిలోనే విద్య నిగూఢంగా నిక్షిప్తంగా ఉంటుంది. డా॥బి.ఆర్.అంబేద్కర్ వందకు పైగా డిగ్రీలు చేశాడు. అందుకే ఆయన్ను దేశమంతా శ్లాఘిస్తున్నది.

4. కోపం - శాంతం

కోపం అన్ని వేళల అనర్థహేతువని పెద్దలన్నారు. దాని పరిణామం ఎంత తీవ్రంగా ఉంటుందో కూడా అనేక ఉదాహరణల ద్వారా తెలిపారు. రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలు కోపం వల్ల ఎదురయ్యే సమస్యలను, దాని దుష్ఫలితాలను అనేక వృత్తాంతాల ద్వారా తెలిపారు. అందులో అగ్రగణ్యులు బద్దెన. ఈయన తన సుమతీ శతకంలో కోపం స్వరూపాన్ని ఇలా తెలిపాడు.

తన కోపమె తన శత్రువు,
తన శాంతమే తనకు రక్ష; దయ చుట్టంబౌ,
తన సంతోషమె స్వర్గము,
తన దుఃఖమే నరకమంద్రు తథ్యము సుమతీ!

బద్దెన సరళమైన శైలిలో కోపం స్వరూపాన్ని అద్భుతంగా తెలిపాడు. ఓ మంచి బుద్ధి కలవాడా! తన కోపమే తనను శత్రువువలె బాధిస్తుంది. తన శాంతమే తనను రక్షిస్తుంది. తన దయయే తనకు చుట్టమువలె సహాయపడుతుంది. తన ఆనందమే తనకు ఇంద్రలోక సౌఖ్యాన్ని అందిస్తుంది. తన దుఃఖమే తనకు నరకంలా మారుతుంది. ఇది నిజము అంటాడు బద్దెన. ఈ కవి మాటలు నిత్య సత్యాలనవచ్చు. ఈ పద్యం పండిత పామరులందరికి అత్యంత సులభంగా బోధపడుతుంది. తన కోపమే తన శత్రువు అంటారు. మనిషికి కోపం అస్సలు మంచిది కాదు. ఎవరికైనా కోపం వస్తే మొట్టమొదట వారి రూపం మారిపోతుంది. వారిలో ఉన్న ప్రశాంతత చెదిరిపోతుంది. అలాంటివారు చూసేవారికి చాలా భయంకరంగా కనిపిస్తారు. ఇతరులు వారిని ఒక క్రూర మృగాన్నో, ఒక విష సర్పాన్నో చూసినట్లు చూస్తారు కోపం మన మీద మనం అదుపుని కోల్పోయేలా చేస్తుంది. ఏం మాట్లాడుతున్నారో వారికే తెలీదు. అవతలవారి మనసును బాధపెట్టేలా మాట్లాడతారు. గౌరవాన్ని ఇవ్వరు. ఏకవచన ప్రయోగం చేస్తారు. ఇంకా కోపం అన్నది మాట మీద నియంత్రణ కోల్పోయేటట్లుగా చేస్తుంది. అందుకే కోపాన్ని విడిచిపెట్టేయాలి. కోపాన్ని ప్రదర్శించడం మంచి లక్షణం కాదు. కోపంలో మనిషి విచక్షణను కోల్పోతాడు. తాను ఏం చేస్తున్నాడో తనకే తెలియదు. అవతల వాళ్ళని కొడతాడు, హింసిస్తాడు. కోపం వచ్చిన మనిషి తన మీద తాను సంయమనం కోల్పోతాడు. దీని ద్వారా కష్టనష్టాలు అనుభవిస్తాడు. కొన్ని సందర్భాల్లో ఈ కోపం వల్ల హింస, ప్రతి హింస జరుగుతుంది. కాబట్టి కోపం మంచిది కాదు.

5. అభివృద్ధిపథం

మనిషి నైతిక విలువలతో జీవించినపుడు తప్పకుండా అభివృద్ధి పథంలో నడుస్తాడు. అది అప్పటికప్పుడే జరగక పోవచ్చు. ఆ ఆలస్యంగానైనా మంచి ఫలితాన్నిస్తుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మన కవీశ్వరులు ఇలా తెలిపారు.

ఖండితం బయ్యు భూజంబు వెండియు మొలచు
క్షీణుడయ్యును నభివృద్ధిజెందు సోము
డివ్విధమున విచారించి యెడలు దెగిన
జనములకు దాప మొందరు సాధుజనులు.

వృక్షాన్ని ఛేదించినా అది తిరిగి మొలుస్తుంది. చంద్రుడు క్షీణించినా కళలతో మళ్ళీ వృద్ధి పొందుతాడు. అలాగే సాధుజనులు కష్టాలను ఎదుర్కొన్నా తిరిగి మళ్ళీ అభివృద్ధిలోకి తప్పకుండా వస్తారు.

ఒక చెట్టు బాగా పెరిగిపోయి నడిచే మార్గంలో కొమ్మలు అడ్డు వచ్చాయి. కొంతమంది అడ్డు వచ్చిన కొమ్మల్ని

నరికారు. అప్పుడు చెట్టు చింతించదు. ఎక్కడ కొమ్మ నరికారో, అక్కడ చిగురించడం మొదలుపెడుతుంది. మళ్ళీ చిగురిస్తే మాత్రం ఏం ప్రయోజనం? అని నిరుత్సాహపడలేదు. పెరిగితే మళ్ళీ నరికేస్తారేమో! అని భయపడలేదు. అలాగే శిశిర ఋతువులో ఆకులన్నీ రాలిపోతే, వసంత ఋతువులో మళ్ళీ ఆకులు చిగురిస్తుంది. అది చెట్టుకి సహజంగా ఉండే లక్షణం. కృష్ణపక్షంలో చంద్రుడి కళలన్నీ క్షీణించిపోతాయి. అమావాస్య వచ్చేటప్పటికీ అసలు చంద్రుడు ఆకాశంలో కనిపించడు. మళ్ళీ అదే చంద్రుడు శుక్ల పక్షం వస్తే తన కళను పెంచుకుంటూ కనిపిస్తాడు. పౌర్ణమినాటికి నిండు బింబంతో దర్శనమిస్తాడు. అంతే తప్ప, నా కళ తగ్గిపోతుందని బెంగ పెట్టుకోడు, కళ పెరిగిందని పొంగిపోడు. పరిస్థితి ఎలా ఉన్నా ఉ త్సాహం పొందుతూనే ఉంటాడు. అలాగే సజ్జనుడు జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బెంగపెట్టుకోడు. అక్కడితో ఆగిపోడు. కష్టాలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతాడు. అభివృద్ధి పథంలోకి సాగుతుంటాడు. అందువల్ల అలాంటి సజ్జనులను ఆదర్శంగా తీసికొని ఉత్తమ పౌరుగా రాణించాలని అంటాడు.

6. ముగింపు

ఒకప్పుడు ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నీతి కథలు బోధించేవారు. రామాయణం, మహాభారతం, భాగవతం బోధించేవారు. పంచతంత్రం కథలు చెప్పేవారు. ఇక ఇంటిలో అవ్వ, తాత మంచి జానపద కథలు నేర్పేవారు. అయితే నేడు సమిష్టి కుటుంబాలు, వ్యష్టి కుటుంబాలుగా మారడంతో అవ్వతాతలు పిల్లలకు దూరమయ్యారు. తల్లిదండ్రులు కూడా మార్కుల యావలో పడిపోయారు. విద్య వ్యాపారమయం కావడంతో పిల్లల ఆలోచనలకు, మానసిక పరిపక్వతకు అవకాశం లేకుండా పోయింది. దాంతో మానవ సంబంధాలు కృత్రిమంగా తయారయ్యాయి. వీటన్నిటిమూలంగా బాలబాలికల్లో వికృత చేష్టలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు తమ ఆలోచనా విధానంలో మార్పు చెంది ఉ పాధ్యాయులకు సహకారం అందిస్తే పిల్లలను ఉత్తమ పౌరులుగా తయారుచేస్తారు. సామాజిక స్పృహ కలిగిన వారందరూ నేడు కోరుకుంటున్నది అదే.

7. ఉపయుక్త గ్రంథాలు

1. విలువల విద్య – సద్గుణ సారం – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, 2025.
2. విలువల విద్య – అమృతధార – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, 2025.
3. సుభాషిత త్రిశతి – భర్తృహరి
4. సుమతీ శతకము – బద్దెన
5. సుభాషితాలు – ఏనుగు లక్ష్మణ కవి

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

శ్రీమద్విరాట పర్వం-వ్యక్తిత్వ వికాసం



డా.గుబ్బల సత్యశ్రీ
స్కూల్ అసిస్టెంట్ తెలుగు
జిల్లా పరిషత్ హైస్కూల్, మాచర
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
చరవాణి. 9030617478

వ్యాస సంగ్రహం :

వ్యక్తిత్వ వికాసం అనేది మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటి. వ్యక్తి ఆలోచనలు, ప్రవర్తన, మాట తీరు, నడవడి, శీలం, క్రమశిక్షణ వంటి లక్షణాల సమాహారమే వ్యక్తిత్వం. ఈ లక్షణాలను మెరుగుపరుచుకొని మంచి మనిషిగా ఎదగడాన్ని వ్యక్తిత్వ వికాసం అంటారు. నేటి ఆధునిక కాలంలో వ్యక్తిత్వ వికాసాన్ని పరీక్షించిన తర్వాతే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి అన్ని సంస్థలు. ఉద్యోగ జీవితంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ విజయం సాధించాలంటే వ్యక్తిత్వ వికాసం అవసరం. కాబట్టి నేటి కాలంలో వ్యక్తిత్వవికాస అభివృద్ధికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అంత ప్రాధాన్యత కలిగిన వ్యక్తిత్వ వికాసం ప్రాచీన సాహిత్యంలో అడుగడుగునా కనిపిస్తూనే ఉంది. అందులోనూ కవిత్రయం విరచిత ఆంధ్ర మహా భారతంలో పుష్కలంగా వ్యక్తిత్వ వికాసం కనబడుతుంది.

ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ ॥

అని లోకంలో నిక్షేపించబడిన పురుషార్థాలను పరిశీలించినపుడు నిజానికి వ్యక్తిత్వ వికాసం ఏంటనేది దర్శనమీయబడుతుంది. ఈ శ్లోకంలో చెప్పినదాన్ని గమనిస్తే, ఓ భరతశ్రేష్ఠా! ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే పురుషార్థాలకు సంబంధించి... ఇక్కడ (మహాభారతంలో) ఉన్న విషయాలు వేరే గ్రంథాలలో ఉండవచ్చు. కానీ, ఇక్కడ లేని విషయాలు

ప్రపంచంలో మరే ఇతర గ్రంథంలోనూ లేవు. ఈ మహా గ్రంథంలో ఎక్కువ భాగం అనగా 15 పర్వాలు తిక్కన రాసినవే. తిక్కన రాసిన మొదటి పర్వం అందునా నానారసాభ్యుదయోల్లసిగా రచించిన విరాటపర్వంలో వ్యక్తిత్వ వికాసం అద్భుతంగా చిత్రించారు. కష్టసుఖాల్లో మనిషి ఒకేలా ఉండాలని గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తిక్కన తెలియచేసిన వ్యక్తిత్వ వికాసాన్ని తెలియచేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

కీలక పదాలు:

మహాభారతం, రసాభ్యుదయం, విరాటపర్వం, పురుషార్థాలు, వ్యక్తిత్వ వికాసం, తిక్కన సోమయాజి విరాట పర్వం, అజ్ఞాత వాసం, ద్విజుడు, కీచకుడు మొదలైనవి.

ఉపోద్ఘాతం :

ఈ విశ్వంలో జీవావిర్భావం తర్వాత అంచెలంచెలుగా ప్రాణికోటిలో ప్రకృతి రీత్యా మార్పులు చోటు చేసుకుని మానవావిర్భావం జరిగిందని సిద్ధాంతం. ఆ తర్వాత సమూహాలు ఏర్పడి సమాజంగా పరిణమించాయి. పలుమంది వ్యక్తుల సమూహారమే సమాజం. సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తికి వ్యక్తి "గతం" ఎలా ఉంటుందో వ్యక్తిత్వం కూడా ఉంటుంది. ప్రతి వ్యక్తికి వ్యక్తిత్వ వికాసం ఉండాలనేది, నేటి సమాజంలో తరచుగా అందరి నోట వినపడే మాట. వ్యక్తిత్వానికి ఎంతో మంది ఎన్నో రకాలుగా నిర్వచనాలు చెప్పారు. అందులో ఇది కూడా ఒకటి.

"పుట్టింది మొదలు చచ్చేవరకు మానవ మస్తిష్కంలో జరిగే వ్యవస్థాపనాత్మక-శాసకీయ ప్రక్రియల పరంపరలే వ్యక్తిత్వం లేదా మూర్తిమత్వం"

వ్యక్తిత్వ వికాసం అనేది మనిషి జన్మించిన దగ్గర్నుండీ గతించే వరకూ జరుగుతూనే ఉంటుంది. ఈ మధ్యలో వ్యక్తులకు ఎదురయ్యే అనుభవాలు, పెద్దల మాటలు, స్నేహితుల హితోక్తులు వంటి వలన వ్యక్తుల మస్తిష్కాలలో వికసిస్తుంటాయి. అలాగే ప్రాచీనాంధ్ర సాహిత్యకారులు తమ సాహిత్యంతో సమాజంలోని వ్యక్తులను జాగురూకులను చేసి, వికాసానికి ఉపయోగపడే బాటలు వేసారు. అలాంటి సాహిత్యంలో మొదట చెప్పుకోదగినవి కవిత్రయ విరచిత ఆంధ్ర మహాభారతం. ఇందులో కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడైన తిక్కన సోమయాజి ఆంధ్ర మహాభారతంలో విరాటపర్వంతో ప్రారంభించి 15 పర్వాలను ఆంధ్రీకరించాడు. ఇందులో విరాటపర్వాన్ని "నానారసాభ్యుదయోల్లాసం" గా రచించానని చెప్పుకొన్నాడు. ఇందులో పాత్రల మధ్య జరిగిన నాటకీయ సంభాషణల ద్వారా పఠితులకు "వ్యక్తిత్వ వికాసం" ఎలా ఒనగూరుతుందో కొన్ని ఉదాహరణలతో ఈ పరిశోధనా వ్యాసంలో వివరిస్తాను.

విరాటపర్వం:వ్యక్తిత్వ వికాస దర్శనం:

రాజ్యాన్ని దుర్యోధనుదులకు ఓడిన పాండవులు, నియమం ప్రకారం 12 సంవత్సరాలు అరణ్యవాసం ముగించుకొని, ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికి సిద్ధపడుతున్నారు. మత్స్య దేశానికి రాజైన విరటుడి కొలువు సరైనదని నిర్ణయించుకొన్నారు. ధర్మదేవత వరం వలన వారికి మారు రూపాలు వచ్చాయి. ఆయుధాలను జమ్మి చెట్టు మీద భద్రపరిచారు. పుట్టిన దగ్గర్నుండి అప్పటి వరకు చక్రవర్తులుగా సేవలు చేయించుకోవడమే గానీ, ఒకరిక్రింద సేవకుడిగా ఎలా మెలగాలో తెలియని పాండవులకు, ద్రుపద పురోహితుడైన గౌమ్యుడు, రాజ సేవిక ధర్మాలు విడమరచి చెబుతాడు.

ఎండకు వానకోర్చి, తన యిల్లు ప్రవాసపు జోటు నాక యా
కొండు నలంగుదున్ నిదురకుం దటి దప్పెడు, డప్పి వుట్టె, నొ
క్కండన యెట్లోకో యనక కార్యము ముట్టిన చోట నీలి నా

తండొక చాయ చూపినను దత్పరతం బని సేయు టొప్పగున్.

(విరాటపర్వం-1-135పద్యం)

ఎండకూ, వానకు సహించాలి. తన ఇల్లని, పొరుగుచోటనీ అనుకోకూడదు. ఆకలి వేస్తుంది, అలసిపోతాను, నిద్రకు సమయం మించిపోతుంది, దాహం వేస్తోంది, "ఒక్కడినే ఎలా చెయ్యడం" అనే ఆలోచనలకు అవకాశం ఎప్పుడూ ఇవ్వకూడదు. అనుకోకుండా రాజు ఒక పని చెప్పినట్లయితే శ్రద్ధతో, భక్తితో చెయ్యాలి అంటూ ఇలాంటి సేవక ధర్మాలు చాలా వివరించాడు. "ఓడలు బళ్ళాతాయి, బళ్ళు ఓడలౌతాయి" అనే సామెత లాగా, చక్రవర్తులుగా కాలం గడిపిన పాండవులు తమ తమ వ్యక్తిత్వాలను పక్కన బెట్టి విరటుడి కొలువులో సేవకులుగా చేరారు.

ప్రతి వ్యక్తి జీవితంలో కష్టాలతో బాటు సుఖాలూ ఉంటాయి. సుఖాలకు అలవాటు పడిన వ్యక్తులు, కష్టాలలో ఎలా ప్రవర్తించాలో, అందుకు తగినట్లుగా ఎలా వ్యక్తిత్వాన్ని మార్చుకోవాలో పై సందర్భం ఉదాహరణ. పాండవులు అయిదుగురు, ద్రౌపదితో కలసి ఒకేచోట ఉంటే అందరికీ తెలిసిపోతుంది. అందుకని అందరూ ఏఏ రూపాల్లో ఉండబోతున్నారో ధర్మరాజుకు చెప్పే సందర్భంలో, ఒక్కొక్కరి ప్రతాపాలను వివరించే పద్యాలున్నాయి. అంతటి ప్రతాపమూర్తులు, ఇకపై ఎలా ఉండబోతున్నారో అని ధర్మరాజు బాధపడే సందర్భంలో, అర్జునుడి గురించిన పద్యం-

ఉ॥ **ఖాండవ మేర్చె; దేవతలు గానని యీశ్వరుగాంచె;**
దోర్బలో ద్దండ మహాసుర ప్రతతి దర్ప మడంచి ప్రియం బొనర్చి యా
ఖండలు డున్న గద్దియ సగంబున నుండె; మహానుభావుడే
తండొక మర్మ్ముజేరి యానుదాత్తత నెమ్మెయి గొల్చువా డోకో!

(విరాటపర్వం-1ఆ-85)

ఈశ్వరుణ్ణి ప్రత్యక్షం చేసుకున్న ఈ అర్జునుడు, సామాన్యుడయిన ఒక రాజును ఆశ్రయించి సైన్యంతో ఏ విధంగా సేవిస్తాడో కదా! అని అన్నగారైన ధర్మరాజు ఆవేదన పడ్డాడు. "జ్యేష్ఠ భ్రాతా పితృ సమాన:" అనే లోకోక్తి బట్టి, అన్నగారు తండ్రితో సమానం. దివ్యత్వంతో అలరారుతున్న తమ్ముడు అర్జునుడి పట్ల, ధర్మరాజు ఆవేదనలో తండ్రిలాగా బాధ్యత కనిపిస్తుంది. అలాగే, కుంతి పెద్ద కొడుకు ధర్మరాజు, మాద్రి పెద్ద కొడుకు నకులుడు. ఈ ధర్మ విషయాన్ని అలవరచుకున్న ధర్మరాజు, పెద్ద కొడుకు చేయవలసిన బాధ్యతలు ఉన్న చోట నకులుడినే ఉటంకిస్తాడు. "ఇది కడు ముద్దరాలు, పనులేమియు జేయగ నేర, దెంతయున" అనే పద్యంలో ద్రౌపది గురించి చెబుతూ భర్త ఆపత్కాలలో భర్త, భార్యపట్ల ఎలా ఉండాలో చెబుతారు.

మొత్తానికి కంకుభట్టు, వలలుడు, బృహన్నల, దామగ్రంథి, తంత్రిపాలురు సైరంధ్రిగా మాలిని అనే పేర్లతో పాండవులు విరటుడి కొలువులో చేరారు. ఇక్కడి నుండి పాత్రోచిత సంభాషణలతో విరాట పర్వాన్ని నాటకీయంగా నడిపించాడు తిక్కన, కంకుడిగా, విరటుడి కొలువులోకి వచ్చిన ధర్మరాజు తన గురించి చెప్పుకునే సందర్భంలో...

కం॥ **ద్విజుడ గురు విషయ జాతుడ**
సుజన ప్రియుడైన ధర్మసుతు సఖుడ బరి
వ్రజనాశ్రయ కలితుండ, మ
నుజవల్లభ యోగ్య బహు వినోదకరుండిన్ (విరాట్ :1-195 పద్యం)

రాజా! నేను ద్విజుడిని, కురుదేశంలో జన్మించాను. ధర్మరాజు స్నేహితుడిని. అయితే ఇప్పుడు సన్యాశ్రమం స్వీకరించినవాడిని, రాజులకు తగిన వినోదాలను కల్పించగలవాడినని చెప్పుకున్నాడు. ఇది బయటకు కనిపించే అర్థం. ఇందులో పరివ్రాజక వ్రతం అంటే ఒకచోట నిలువకుండా సంచరించే వ్రతం. అంటే అజ్ఞాతవాస కాలంలో ఎవ్వరికీ ఆచూకీ తెలియనివ్వకుండా మెలగే వ్రతం అని. ఇది వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించేదే. తన గురించి ఎంతవరకూ చెప్పాలో అంతవరకే చెప్పడమనేది ఇందులోని విశేషం. అలాగే, కీచకుడు వెంబడిస్తూ ద్రౌపది వెంటబడి జడపట్టుకొని, రాజు చూస్తూ ఉండగానే, నేలమీద పడవేసిన సందర్భంలో భీకరావేశంతో ఊగిపోయిన భీముడు, అజ్ఞాతవాస ప్రతిజ్ఞను మరచిపోయి కీచకుణ్ణి, విరాటరాజుని చంపేద్దామనుకున్నప్పుడు, ధర్మరాజు కనుసైగలతో వారించి, ఇలా అన్నాడు.

మ॥ **వలలుం డెక్కడ జూచె నొండెడ ససేవ్యక్ష్మాజముల్ పుట్టవే?**
ఫలితంబై వరశాఖ లొప్పగ నకల్ప ప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయనుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపగా
గల యీ భుజము వంట కట్టియలకై ఖండింపగా నేటికిన్?

(విరాటపర్వం-2వత) 136వ పద్యం)

భీముడితో ధర్మరాజు సూటిగా మాట్లాడకూడని ఈ సందర్భంలో, దేనిమీదనో చెప్పి అన్యాపదేశంగా, గూఢంగా చెప్పాడు. అది కూడా అందులో అర్థం రహస్యంగా అర్థమౌతున్నా, చుట్టూ ఉన్నవారికి తెలియకూడదు. పండ్లు బాగా పండిన పెద్ద కొమ్మలతో గూడి, విశాలమై నీడనిచ్చి ఆశ్రయించిన వారికి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెల కొరకు నరికివేయటం దేనికి? అని పైకి చెబుతూనే, ఆ చెట్టు విరాటరాజుని, పాండవులకు అజ్ఞాతవాసంలో ఆశ్రయమిచ్చిన వరఫల వృక్షాన్ని, అజ్ఞాతవాస భంగం అయ్యేటట్లు చంపకూడదని గూఢార్థంతో భీముడి కోపాన్ని తగ్గించిన ధర్మరాజు పాత్ర ఆపదకాలంలో ఎలా మెలగాలో తెలియజేస్తుంది. భీముడనే ఏనుగును ధర్మరాజు అనే అంకుశం ఎప్పుడూ అదిమి పట్టి ఉంచుతూనే ఉంటుంది.

అదే సందర్భంలో ద్రౌపదిని కూడా హెచ్చరించాడు ధర్మరాజు. అనవసరమైన కోపం అనర్థమని, నీ భర్తలైన గంధర్వులకూ నీకూ ఏదో నియమం ఉండి ఉండాలని గుర్తుచేసి పంపించేస్తాడు. ఎక్కడ ఎలాంటి విచక్షణ ఉపయోగించాలో ధర్మరాజు పాత్రద్వారా తెలుస్తుంది.

ఈ సంఘటన తర్వాత అందరూ హాయిగా నిద్రపోతుంటే, ద్రౌపదికి మాత్రం నిద్రపట్టలేదు. సరికదా, భీముడి దగ్గరకు వెళ్ళింది. తనను అవమానించిన వాడు హాయిగా నిద్రపోతున్నాడు. ప్రతీకారం తీసుకోవాల్సిన భర్త కూడా సుఖంగా నిద్రపోవడం చూసి, అతడిని పౌరుష పదాలతో నిద్రలేపింది. చెవిలో మందమందంగా మాట్లాడింది. అవి మంద్ర భాషణం కాదు. అగ్నిని రెచ్చగొట్టడానికి ఊదటం.

'నీ అన్నమాటకు పరాక్రమం సన్నగిల్లిందా? నువ్వు నిద్రపోకూడదు, శత్రువును నిద్రపోనివ్వకూడదు" అని పరాక్రమవంతుడి భార్యగా మాట్లాడిన తీరు ఆమె వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది.

సంస్కృత మూలంలో ద్రౌపది ఈ సందర్భంలో అన్నమాటలివి.

'ఉత్తిష్ఠోత్తిష్ఠ, కిం శేష, భమసేన! యథామృత:!
నా మృతస్య హి పాపీయాన్ భార్య మాలభ్య జీవతి?" (2-4-16-9)

భీమసేనా! చచ్చినవాడు పడుకొన్నట్టు అలా కదలకుండా పడుకొన్నావేమిటి? లే, లే! నేను బ్రతికున్నవాడి భార్యనైతే

ఆ పాపి చావకుండా ఉంటాడా? అని ద్రౌపది నిద్రలేపుతుంది.

కీచకుణ్ణి హెచ్చరించే చోట, మరో సందర్భంలోనైనా విరాటపర్వంలో ద్రౌపది తన భర్తలను పరాక్రమవంతులుగానే పేర్కొంటుంది. "నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల" వంటివి ఉదాహరణ. భర్త గురించి బయట వారి దగ్గర చెప్పేటప్పుడు, భార్య ఎలా మాట్లాడాలో ద్రౌపది మాటల ద్వారా తెలుస్తుంది. అలాగే భార్యాభర్తలిద్దరే మాట్లాడుకునేటప్పుడు, భర్తలోని మంచి గుణాలను గుర్తుచేయాలి. ద్రౌపది కూడా అదే చేసింది.

లోకాలకు భయాన్ని, విజయాలనూ కలిగించే నీ చేతులకు, ఒక హిడింబ, కిమ్మీర, జరాసంధాదుల భయంకర గర్వాతిశయాలు లొంగిపోయాయి కదా! (విరాటపర్వం: 2ఆ-194వ పద్యం).

ఈ మాటల ద్వారా భీమసేనుడు ఎంతటి బలసాలో గుర్తు చేస్తోంది. అంతేకాకుండా, అంతటి బలసమన్వితుడవైన నువ్వు, నీ భుజబలాన్ని వంటకట్టెలు కొట్టడానికి ఉపయోగించటం నిత్యం చూసి దు:ఖపడుతుంటాను. విరాటరాజు తన వినోదాలకీ మల్లురతోను, క్రూర మృగాలతోనూ పోటీలు పెట్టి వినోదించటం కూడా బాధగా ఉంది" అని అనడం ద్వారా భీముడితో పరాక్రమాన్ని తట్టి లేపుతోంది.

మహా పరాక్రమవంతులైన భర్తల గొప్పదనాన్ని గుర్తు చేసుకుంటున్న ద్రౌపది, అజ్ఞాతవాసంలో వారున్న రూపాన్ని, చేస్తున్న పనులకు విధిని నిందిస్తుంది. ఆ క్రమంలోనే, విద్యాపారగుడైన అర్జునుడు, పేడిగా మారి నాట్యం నేర్పిస్తున్నాడని, మహా అందగాడు, సుకుమారుడైన నకులుడు అశ్వశిక్షకుడిగా ఉండటాన్ని చూసి తట్టుకోలేకపోతున్నానని అంటుంది.

శా॥ **ఆ రూపం బవికార, మా భుజబలం బత్యంత నిర్గర్వ, మా**
శూరత్వంబు దయారసానుగత, మా శాంభత్రియాజ్ఞాన మా
ర్యారంభ ప్రతికూల వాదరహితం, బాయోగి సన్మాన వి
స్తారోదాత్తము మాచి పిన్నకొడు కీతన్మాత్రుండే చూడగన్?

(2.2-25-209)

సహదేవుడి గుణాలను, భార్య అయిన ద్రౌపది గుర్తుచేసుకుంటున్న పద్యమిది. మాద్రి చిన్నకొడుకైన సహదేవుడు అసామాన్యుడు. అతడి రూపం నిర్వికారం, ఆ బాహుబలం గర్వం లేనిది, ఆ పరాక్రమం దయారసంతో కూడింది. ఆ కార్య నిర్వహణ పరిజ్ఞానం పెద్దల నడవడికకు వ్యతిరేకం కానిది. వివాదాలకు గురికానిది. ఆ దానం గౌరవ ప్రపత్తిచేత ఉదాత్తమైనది. కనుక అతడు వయసులో చిన్నవాడైనా గుణాలలో పెద్దవాడే.

అంతటి సహదేవుడు ఆవుల కాపరిగా ఉండటం, నాకు దు:ఖాన్ని కలిగిస్తోంది. అరణ్యవాసానికి వెళ్తున్నప్పుడు, ద్రౌపదికి, సహదేవుణ్ణి అప్పగిస్తూ, కుంతి చెప్పిన మాటలు గుర్తుచేసుకుంది. మాచి చనిపోయినా తన చిన్నబిడ్డగానే సహదేవుణ్ణి పెంచింది కూడా. అందుకే నువ్వే జాగ్రత్తగా చూసుకో! అని ద్రౌపదికి అప్పజెప్పడంతో తల్లిప్రేమ తెలుస్తుంది.

చ॥ **కడు బసి బిడ్డ వీడొకటి కాదవునా నెఱుగండు; ముంద రె**
య్యెడ నొకపాటెఱుంగ డెద యెంతయు గోమల; మెప్పుడైన నీ
గుడువగ బిల్లుగాని తనకుం గల యాకటి ప్రా ద్దెఱుంగ డీ
కొడుకిటు పోకకున్మనము గుందెడు; నిన్నని యూఱడిల్లెడున్.

(2.2.-20-2135)

తల్లి మమకారంతో నిండిన పై ఆవేదన చిన్నకొడుకు అమాయకత్వం గురించి చెప్పడంలో తల్లి కొడుకును గురించి మాట్లాడే విధానం తెలుస్తుంది. ఇందులో, ఈ సహదేవుడు మిక్కిలి పసిబిడ్డ. ఔను, కాదని చెప్పలేని చిరుతడు. సున్నిత స్వభావం కలవాడు. ఆకలి వేళ కూడా తెలుసుకోలేడు. నేను పిలిచి అన్నం పెడతాను గానీ, తనకు తానై అడగడు అని చెబుతుంటే, కొడుకులు ఎంతటి వయస్సువారైనా, తల్లి ప్రేమ ఇలాగే ఉంటుంది. నిజానికి సహదేవుడు షట్‌శాస్త్ర పండితుడు. కొడుకు ఎంతటి వాడైనా, తల్లికి మాత్రం చిన్నవాడే.

అలాగే, ఇదే సహదేవుణ్ణి, భార్య ద్రౌపది వర్ణించిన ముందటి పద్యంలో పదాలను గమనిస్తే, లోకంలో భార్య దృష్టిలో భర్తలు పరాక్రమవంతులే. తల్లి దృష్టిలో చిన్నవాళ్ళే పిల్లలు. ఒకే వ్యక్తి గురించి మాట్లాడినా, బంధాల రీత్యా మాటల మధ్య వ్యత్యాసాన్ని, తద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని మనం సునాయాసంగా గమనించవచ్చును.

విరాటపర్వంలో ఉన్న ప్రగల్భోక్తుల వలన, ఎక్కడ, ఎవరితో ఎలా మాట్లాడకూడదో తెలుస్తుంది. వ్యక్తుల వ్యక్తిత్వాలను గుర్తించడానికి మాటలే మచ్చుతునకలు. వీటిని తెలుగులో బడాయి మాటలంటారు. ఇవి 3 రకాలు. తన శక్తి తనకు తెలియకుండా గొప్పలు సాధిస్తానని చెప్పుకునేవి. దీనికి ఉత్తర కుమారుడు ప్రసిద్ధి. (విరా–4–11).

తన శక్తిని ఎక్కువ అంచనా వేసుకొని శత్రువుల పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడేవి కొన్ని. మల్లుడు కీచకుడు, సుశర్మలు. దీనికి సాక్ష్యం. ఎదుటివారి శక్తిని తక్కువగా అంచనా వేసి తననెప్పుడూ వారికంటే ఎక్కువగా భావించి అసాధ్యమైన విషయాలను సైతం అవలీలగా సాధించగలనని గొప్పలు పలికేవి కొన్ని. కర్ణుడు ఉదాహరణ. (విరా–4– 201,202,203).

పైన చెప్పినవి కొన్ని ఉదాహరణలు. ఈవిధంగా కవిబ్రహ్మ తిక్కిన విరాటపర్వంలో వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలు అడుగడుగునా తారసపడతాయి.

ముగింపు:

ప్రాచీన తెలుగు సాహిత్యం అనేది సమాజంలోని వ్యక్తులను చైతన్యవంతం చేయడానికి, వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందని నిరూపించడమైంది. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి మహాభారత విరాటపర్వంలో పాత్రలను పురాణ పాత్రలుగా కాకుండా, నిత్య జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, గెలుపోటములను సమానంగా స్వీకరించే సజీవ శిల్పాలుగా మలిచారు. ఆపద కాలంలో కోపాన్ని అణచుకోవడం, సమయస్ఫూర్తితో వ్యవహరించడం ఎక్కడ ఎలాంటి విచక్షణను ఉపయోగించాలో ధర్మరాజు, ద్రౌపది వంటి పాత్రల ద్వారా నేటి సమాజానికి అద్భుతమైన సందేశం ఇచ్చినట్లైంది. ఒక వ్యక్తి మాటలే వారి వ్యక్తిత్వానికి అద్దం పడతాయని, ఎవరితో ఎలా మాట్లాడాలి, ఎలాంటి ప్రగల్భాలు పలకకూడదో విరాటపర్వంలోని పాత్రల ప్రవర్తన ద్వారా స్పష్టమవుతుంది. శతాబ్దాల క్రితం రాయబడిన విరాటపర్వం, నేటి ఆధునిక కాలంలో కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు బోధించే వ్యక్తిత్వ వికాసం క్లాసులకు ఒక పరిపూర్ణమైన మార్గదర్శిగా నిలుస్తుంది అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథ సూచి:

1.అంతరార్థ మహాభారతము(ముక్తిసాధనా మార్గము) –వేదుల సూర్యనారాయణ శర్మ.

2.తెలుగు అకాడమి, మూర్తిమత్వ సిద్ధాంతాలు–మాపనం –మోనోగ్రాఫ్.

3.భారతవరణము(రూపకం)–తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ.

4.రఘునాథ శర్మ, ఆచార్య శలాక, శ్రీవేదవ్యాస విరచిత శ్రీమన్మహాభారతమ్– విరాటపర్వం.

5.శ్రీమదాంధ్ర మహాభారతము(సరళ వ్యాఖ్యాన సహితం)–తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, 2013.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

రాయలసీమ సాంఘిక నాటకాలు - చారిత్రక అధ్యయనం



పి.భార్గవీ ప్రియదర్శిని
పరిశోధక విద్యార్థిని
యోగవేమన విశ్వవిద్యాలయం
సెల్ : 9490092730

పరిచయం:

సాహిత్యం సమాజ పరిణామాన్ని ప్రతిబింబించే సృజనాత్మక ప్రక్రియ. అందులోనూ నాటకం దృశ్యకావ్యంగా సమాజాన్ని ప్రత్యక్షంగా ప్రభావితంచేసే కళారూపం. ప్రేక్షకుని ముందు జీవన వాస్తవాలను సజీవంగా ఆవిష్కరించే శక్తి నాటకానికే సొంతం. అందుకే నాటకాన్ని కేవలం వినోదమాధ్యమంగా కాకుండా, సామాజిక చైతన్యాన్ని నిర్మించే ప్రజావేదికగా పరిగణిస్తారు.

నాటకం తన కాలంలోని సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుంది. ఒక సమాజంలో చోటు చేసుకునే మార్పులు, సంఘర్షణలు, విలువల పతనం, మానవ సంబంధాలలో వచ్చే మార్పులు, నాటక రచయిత దృష్టిని ఆకర్షిస్తాయి. అందువల్ల ఒక ప్రాంతంలోని సాంఘిక నాటకాలను అధ్యయనం చేయడమంటే ఆ ప్రాంత సామాజిక చరిత్రను ప్రజల జీవన విధానాన్ని, వారి ఆలోచనా పరిణామాన్ని కూడా అధ్యయనం చేయడమే.

తెలుగు నాటకరంగ చరిత్రలో రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేకస్థానం ఉంది. విజయనగర సామ్రాజ్య వారసత్వం, పాలెగాళ్ళపాలన, కరువు, నీటికొరత, వ్యవసాయ ఆధారిత జీవనవిధానం, వలసలు, సామాజిక అసమానతలు, కుల సంబంధాలు, రాజకీయ ఘర్షణలు, ఈ ప్రాంత సమాజాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దాయి. ఈ జీవనవాస్తవాలే రాయలసీమ సాంఘిక నాటకాలకు ప్రధానప్రేరణగా నిలిచాయి.

రాయలసీమ సాంఘిక నాటకాలు సమాజంలోని లోపాలను మాత్రమే చూపించలేదు. వాటికి పరిష్కార మార్గాలను

సూచిస్తాయి. వ్యక్తి కంటే సమాజాన్ని, సంఘటనలకంటే వాటి వెనక ఉన్న సామాజిక కారణాలను విశ్లేషించే దృక్పథాన్ని అవి పెంపొందించాయి. అందువల్ల రాయలసీమ సాంఘిక నాటకాలను ప్రాంతీయ సాహిత్య ప్రక్రియగా మాత్రమే కాకుండా ప్రాంతీయ సామాజికచరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సూచికలుగా చూడవచ్చు.

రాయలసీమ సామాజిక - సాంస్కృతిక నేపథ్యం :

రాయలసీమ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదు. అది ఒక ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, భాష, ఆలోచనా విధానానికి ప్రతీక. శుష్క వాతావరణం, పరిమిత వర్షపాతం, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, నీటికొరత, వలసలు వంటి అంశాలు ఈ ప్రాంత ప్రజల జీవన విధానాన్ని గణనీయంగా ప్రభావితం చేశాయి.

రాయలసీమ సామాజిక జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే అక్కడి భౌగోళిక పరిస్థితులను కూడా పరిగణలోనికి తీసుకోవాలి. తరచుగా ఎదురయ్యే కరువులు, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు, పంటల వైఫల్యం, అప్పుల సమస్య, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు, కుటుంబసంబంధాల్లోనూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోనూ మార్పులకు కారణమయ్యాయి.

ఈ ప్రాంతంలో కుటుంబవ్యవస్థ, గ్రామీణ సంస్కృతి, ఆత్మగౌరవభావన, శ్రమజీవుల జీవితం, స్త్రీల సామాజిక స్థితి, కులసంబంధాలు, స్థానిక మాండలిక భాష వంటి అంశాలు నాటకరచయితలకు ప్రధాన స్ఫూర్తిగా నిలిచాయి. రాయలసీమ ప్రజల జీవితం కేవలం కష్టాలతో నిండినదే కాదు, పరస్పర సహకారం, మానవీయ విలువలు, సాంస్కృతిక సాంప్రదాయాలతో కూడుకున్నది. ఈ ద్వంద్వ స్వభావమే నాటకాలలో వాస్తవికతను పెంచింది.

స్వాతంత్ర్యానంతర కాలంలో భూసంస్కరణలు, విద్యావిస్తరణ, పారిశ్రామికీకరణ, రాజకీయ చైతన్యం సామాజిక ఉద్యమాలు ఈ ప్రాంతంలో కొత్త ఆలోచనలకు దారితీశాయి. దాని ప్రభావం నాటకరంగంపై కూడా పడింది. పురాణ ఇతివృత్తాల స్థానంలో గ్రామీణ సమస్యలు, రైతాంగ జీవితం, స్త్రీ సాధికారత, అవినీతి, నిరుద్యోగం, సామాజిక న్యాయం వంటి అంశాలు నాటకాలకు ప్రధాన వస్తువులయ్యాయి

రాయలసీమ సాంఘిక నాటకాల చారిత్రక వికాసం:

రాయలసీమలో నాటకరంగం ప్రారంభదశలో పౌరాణిక, చారిత్రక నాటకాల ఆధిపత్యంలో సాగింది. అయితే ఇరవయ్యో శతాబ్దం మధ్యకాలం నుండి సామాజిక మార్పుల ప్రభావంతో సాంఘిక నాటకాల రచన వేగం అందుకుంది. ముఖ్యంగా స్వాతంత్రోద్యమం, జాతీయ చైతన్యం. విద్యావ్యాప్తి, సంఘసంస్కరణ ఉద్యమాలు రచయితలకు ప్రజల జీవితానికి చేరువ చేశాయి.

రాయలసీమ సాంఘిక నాటకాల ప్రత్యేకత వాటి ప్రాంతీయ వాస్తవికత. ఇతర ప్రాంతాల్లో సాధారణ సామాజిక సమస్యలను చిత్రించినప్పటికీ రాయలసీమ రచయితలు స్థానిక జీవన అనుభవాలను, ప్రాంతీయ మాండలికాన్ని, రైతు మనస్తత్వాన్ని, నీటి రాజకీయాలను, కుటుంబ సంఘర్షణలను సహజంగా నాటకీకరించారు. అందువల్ల ఈ నాటకాలు ప్రాంతీయ సాహిత్యానికి మాత్రమే కాకుండా తెలుగు సాంఘిక నాటక వికాసానికి కూడా విలువైన దోహదం చేశాయి.

1950–1980 కాలంలో సాంఘిక సంస్కరణ ప్రధాన లక్ష్యంగా ఉండగా, 1980 తరువాత ప్రజాస్వామ్య విలువలు, మానవహక్కులు, మహిళా సాధికారత, ప్రపంచీకరణ ప్రభావం, విద్యావాణిజ్యీకరణ వంటి కొత్త అంశాలు కూడా నాటకాలలో చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామము రాయలసీమ సాంఘిక నాటకాలు సమాజ పరిణామానికి అనుగుణంగా నిరంతరం రూపాంతరం చెందాయని తెలియచేస్తుంది.

మాండలిక భాష-రాయలసీమ నాటక ప్రత్యేకత :

రాయలసీమ సాంఘిక నాటకాల ప్రత్యేకతలలో ముఖ్యమైనది స్థానిక మాండలిక భాషా వినియోగం. పాత్రలు తమ ప్రాంతానికి సహజమైన భాషలో మాట్లాడడం వల్ల నాటకంలోని సంఘటనలు ప్రేక్షకులకు మరింత సహజంగా అనిపిస్తాయి. స్థానిక పదాలు, నుడికారాలు, సామెతలు, పలుకుబడులు, పాత్రల స్వభావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. జాతీయాలు, సామెతలు కొన్ని సందర్భాలలో హాస్యాన్ని కలిగిస్తే, మరికొన్ని సందర్భాలలో పాత్రల మనస్తత్వాన్ని గుచ్చుకునే భావాన్ని వ్యక్తీకరిస్తాయి. ఒక చిన్న సామెత ద్వారా ఒక పెద్ద సామాజిక సత్యాన్ని చెప్పగలగడం రాయలసీమ నాటక సంభాషణలలో కన్పించే ప్రత్యేకత. వై.జి.ప్రకాష్ తన నాటకాలలో సామెతలను చాలా సమర్థవంతంగా వినియోగించుకుని హాస్యాన్ని పండిస్తారు. అందువల్ల మాండలికం కేవలం భాషాలంకారం కాకుండా, నాటకంలోని సామాజిక వాస్తవికతకు ఒక ముఖ్యమైన సాధనంగా మారింది.

రాయలసీమ సాంఘిక నాటక రచయితల కృషి :

రాయలసీమ సాంఘిక నాటక వికాసాన్ని పరిశీలించినపుడు వ్యక్తిగత ప్రతిభకంటే సామాజికబాధ్యతతో రచనలు చేసిన రచయితలపాత్ర అత్యంత కీలకంగా కన్పిస్తుంది. ఈప్రాంత రచయితలు కేవలం నాటక రచనను కళాత్మక ప్రక్రియగా మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు సాధనంగా భావించారు. వారి రచనల్లో ప్రాంతీయ మాండలికం, గ్రామీణ జీవన విధానం, రైతాంగ సమస్యలు, కుల వైరుధ్యాలు, కుటుంబ విలువల పరిణామం, మహిళల స్థితిగతులు, రాజకీయ అవినీతి వంటి అంశాలు ప్రధానంగా ప్రతిఫలించాయి.

రాయలసీమ నాటకరంగంలో కేతువిశ్వనాథ రెడ్డి, సింగమనేని నారాయణ, విద్వాన్ విశ్వం, పల్లేటి లక్ష్మీకులశేఖర్, వై.జి.ప్రకాష్, కె.వి.సుబ్బారావు, శివప్రసాద్ యాదవ్, తాళ్ళపాక రామచంద్రయ్య, మద్దిరాల రంగయ్య, భానుమతి నాయుడు, సుబ్బన్న చక్రవర్తి వంటి రచయితలు గ్రామీణ జీవన విధానాన్ని, సామాజిక అసమానతలను తమ రచనల ద్వారా ప్రతిబింబించారు. ఉదాహరణకు: వై.జి.ప్రకాష్ గారి పెద్దరికం, సీనియర్ సిటిజన్, శుభం భూయాత్ వంటి నాటకాలు, పల్లేటి లక్ష్మీకులశేఖర్ రచించిన గ్రామీణ జీవన అనుభవాలు, నైతిక విలువలు, కుటుంబవ్యవస్థ సామాజిక బాధ్యత, మానవ సంబంధాల సంక్లిష్టతను ప్రశ్నించే ధోరణిని కలిగి వున్నాయి. వీరందరి రచనలు సామాజిక మార్పుకు, ప్రజలలో చైత్యన్యాన్ని కల్గించడంలో కీలకపాత్ర పోషించడంతోపాటు ప్రాంతీయ చరిత్రను అర్థం చేసుకోవడానికి ప్రత్యామ్నాయ మూలాలుగా కూడా ఉపయోగపడుతున్నాయి.

నాటక సమాజాల పాత్ర :

రాయలసీమలో నాటక సమాజాలు నాటకరంగ అభివృద్ధికి వునాదులుగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు అనేక కళాసంస్థలు నాటకాలను ప్రజలకు చేరవేసి సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయి. సవేరా ఆర్ట్స్ (1985, కడప) నటరాజ కళాక్షేత్రం (1990, అనంతపురం) కడప నవోదయ కళామండలి (1998), కౌముది కళాసంస్థ (2002, తిరుపతి) తెలుగు కళాసమితి (2005, కర్నూలు) వంటి నాటక సమాజాలు గ్రామీణస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నాటక ప్రదర్శనలను నిర్వహిస్తున్నాయి. కొత్తరచయితలకు అవకాశం ఇవ్వడం, యువనటీ నటులకు శిక్షణ ఇవ్వడం, దర్శకులను ప్రోత్సహించడం, సమకాలీన సామాజిక సమస్యలను రంగస్థలంపై చర్చకు తీసుకురావడం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

ఈ సంస్థలు నిర్వహించిన నాటక ప్రదర్శనలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాంతీయ నాటక రంగానికి

ఉత్సాహాన్ని ఇచ్చాయి. ముఖ్యంగా సామాజిక అంశాలపై రూపొందిన నాటకాలకు ప్రేక్షక ఆదరణ లభించడం వల్ల రచయితలు సమకాలీన సమస్యలను మరింత ధైర్యంగా ఇతివృత్తాలుగా స్వీకరించారు.

అయితే ప్రస్తుతం ఆర్థిక వనరుల కొరత, యవతలో రంగస్థలంపై ఆసక్తి తగ్గడం, డిజిటల్ వినోద మాధ్యమాల విస్తరణ వంటి కారణాల వల్ల అనేక నాటక సమాజాలు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది.

నంది నాటకాల పోటీల ప్రభావం:

తెలుగు నాటకరంగ అభివృద్ధిలో నంది నాటక పోటీలు ఒకమైలు రాయిగా నిలిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాటక సమాజాలకు సమాన అవకాశాలను కల్పించడం నాటకప్రదర్శనల్లో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడం, కొత్త రచయితలు మరియు దర్శకులను ప్రోత్సహించడం వంటి అంశాలలో ఈ పోటీలు విశేష పాత్ర పోషించాయి.

నంది నాటక పోటీల ప్రభావంతో నాటక రచయితలు కేవలం కథ చెప్పడానికే పరిమితం కాకుండా నాటకీయత, పాత్ర నిర్మాణం, సంభాషణ, వేదికా ప్రయోగం, సామాజిక సందేశం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. నాటకం ఒకేసారి కళాత్మకంగా, సామాజికంగా, ప్రభావవంతంగా వుండాలనే అవగాహన పెరిగింది. రాయలసీమ సాంఘిక నాటకాలకు ఇది ప్రత్యేకంగా ఉపయోగపడింది. ఎందుకంటే స్థానిక సమస్యలను విశాలమైన సామాజిక సమస్యలతో అనుసంధానించడానికి నాటక రచయితలకు అవకాశం ఏర్పడింది.

రాయలసీమకు చెందిన అనేక నాటక సమాజాలు, రచయితలు, నటీనటులు నంది వేదిక ద్వారా రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. ఈ పోటీల కారణంగా నాటక రచనలో నిర్మాణపరమైన క్రమబద్ధత, దర్శకత్వంలో సృజనాత్మకత నటనలో సహజత్వం, రంగస్థల రూపకల్పనలో సాంకేతిక నైపుణ్యం పెరిగాయి. సామజిక సమస్యలను కళాత్మకంగా ప్రదర్శించాలనే దృక్పథం కూడా బలపడింది. కానీ విమర్శనాత్మక దృష్టితో చూస్తే పోటీలకే పరిమితమైన రచనాధోరణి పెరిగి, ప్రజాజీవితంతో, సన్నిహిత సంబంధం కల్గిన నాటకాలు తగ్గినట్లు కన్పిస్తుంది.

విమర్శనాత్మక విశ్లేషణ :

రాయలసీమ సాంఘిక నాటకాలను కేవలం రంగస్థలం వినోదంగా చూడటం సరైనది కాదు. అవి ఒక నిర్దిష్ట కాలంలోని సామాజిక పరిస్థితులకు ప్రతిబింబాలుగా నిలుస్తాయి. ఒక ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి, కుటుంబ సంబంధాలు, సామాజిక విలువలు, రాజకీయ ప్రభావాలు, భాషా సంస్కృతి వంటి అనేక అంశాలను నాటకాల ద్వారా అధ్యయనం చేయవచ్చు. రాయలసీమ సాంఘిక నాటకాల మరో విశిష్టత ప్రాంతీయత నుండి విశ్వజనీనతవైపు ప్రయాణించడం. ఉదాహరణకు రాయలసీమలోని కరువు ప్రాంతీయ సమస్య అయినప్పటికీ దానివల్ల ఏర్పడే పేదరికం, వలస కుటుంబ విభజన వంటి సమస్యలు ప్రపంచంలోని అనేక సమాజంల్లో కనిపిస్తాయి. ఈ విధంగా స్థానిక అనుభవం, విశ్వజనీనమైన మానవ అనుభవంగా మారుతుంది.

రాయలసీను సాంఘిక నాటకాల ప్రధాన బలం వాటి ప్రాంతీయ వాస్తవికత. ఈ నాటకాలు గ్రామీణ సమాజాన్ని అలంకారికంగా కాకుండా అనుభవాత్మకంగా చిత్రించాయి. రైతుల కష్టాలు, నిరుద్యోగం, కుటుంబ విలువల మార్పు, అవినీతి వంటి అంశాలను ప్రజల అనుభవానికి దగ్గరగా ఆవిష్కరించాయి. అయితే ఆధునిక కాలంలో కొత్త సామాజిక సమస్యలు – సాంకేతిక పరిణామాలు డిజిటల్ సంస్కృతి, ప్రపంచీకరణ ప్రభావం, పర్యావరణ సంక్షోభం నాటకాలలో మరింత విస్తృతంగా ప్రతిబింభించాల్సిన అవసరం ఉంది.

సమకాలీన సందర్భంలో రాయలసీమ నాటకం:

ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం సామాజిక మాధ్యమం టెలివిజన్, సినిమా, డిజిటల్ వినోదం, విస్తరించినప్పటికీ నాటకానికి ఉన్న ప్రాధాన్యం పూర్తిగా తగ్గిపోలేదు. ప్రత్యక్షంగా ప్రేక్షకుడిని ఎదుర్కొనే కళారూపకంగా నాటకానికి ప్రత్యేక సామాజిక శక్తి ఉంది. నేటి రాయలసీమ సమాజంలో కూడా రైతాంగ సమస్యలు, ఉపాధి వలసలు, కుటుంబ సంబంధాలు, వృద్ధుల ఒంటరితనం, మహిళా సాధికారత విద్యా సమస్యలు, పర్యావరణం యావత్ భవిష్యత్తు వంటి అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి. కాబట్టి ఈ సమస్యలను నాటక రూపంలో ఆవిష్కరించే అవసరం ఇప్పటికీ ఉంది. రాయలసీమ సాంఘిక నాటక సంప్రదాయం గతాన్ని మాత్రమే ప్రతిబింబించేది కాదు. వర్తమానాన్ని ప్రశ్నిస్తూ భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచే సామర్థ్యం కూడా దీనికి వుంది.

ముగింపు :

రాయలసీమ సాంఘిక నాటకం ఒక ప్రాంతీయ నాటక ప్రక్రియగా ప్రారంభమైనప్పటికీ దాని పరిధి ప్రాంతీయతను దాటి మానవీయత వరకు విస్తరించింది. రాయలసీమ సామాజిక, ఆర్థిక పరిస్థితులు, కరువు, రైతాంగ జీవితం, వలసలు, కుటుంబ వ్యవస్థ, కుల సంబంధాలు, స్త్రీ సమస్యలు, నిరుద్యోగం, అవినీతి వంటి అంశాలు ఈ నాటకాలకు ఇతివృత్త సంపదను అందించాయి. రచయితల సృజనాత్మకతతో పాటు నాటక సమాజాలు, కళా సంస్థలు, నాటక పోటీలు ఈ ప్రక్రియ అభివృద్ధికి దోహదపడ్డాయి. సవేరా ఆర్ట్స్, కడప నవోదయ కళామండలి వంటి సంస్థల కార్యకలాపాలు నాటక రంగానికి వేదికను కల్పించాయి. నంది నాటక పోటీలు వంటి వేదికలు ప్రాంతీయ ప్రతిభకు విస్తృత గుర్తింపును అందించాయి.

రాయలసీమ సాంఘిక నాటకాలు ప్రాంతీయ జీవితానికి కళారూపాలు మాత్రమే కాదు, అవి సామాజిక చరిత్రను నమోదు చేసే సాంస్కృతిక పత్రాలు. రచయితల సామాజిక నిబద్ధత, నాటక సమాజాల సేవ, నంది నాటక పోటీల ప్రోత్సాహం వల్ల ఈ ప్రక్రియ తెలుగు నాటక సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. భవిష్యత్తు పరిశోధనంలో రాయలసీమ సాంఘిక నాటకాలను ప్రాంతీయత, ప్రదర్శనా సిద్ధాంతం, స్త్రీవాదం దళిత సాహిత్యం, సాంస్కృతిక అధ్యయనాల దృష్టిలో విశ్లేషించడం ద్వారా కొత్త పరిశోధనా దిశలు ఆవిష్కృతమవుతాయి. ఈ తరహా అధ్యయనాలు రాయలసీమ నాటక వారసత్వాన్ని సమగ్రంగా పత్రబద్ధం చేయడమే కాకుండా తెలుగు నాటక విమర్శను కూడా మరింత సమృద్ధి చేస్తాయి.

ఈ అధ్యయనం ద్వారా రాయలసీమ సాంఘిక నాటకం ప్రాంతీయ జీవితం → సామాజిక సమస్య → నాటకీయ వ్యక్తీకరణ → సామాజిక చైతన్యం అనే పరిణామ క్రమంలో అభివృద్ధి చెందినట్లు స్పష్టమవుతుంది. నాటక రచయిత, నటుడు, దర్శకుడు, నాటక సమాజం, ప్రేక్షకుడు అనే ఐదు అంశాల సమన్వయంతో ఈ ప్రక్రియ బలపడింది భవిష్యత్తులో రాయలసీమ సాంఘిక నాటకాలపై మరింత విస్తృతమైన పాఠ్య, ప్రదర్శనా, సామాజిక అధ్యయనాలు జరగాల్సిన అవసరం ఉంది.

సూచన గ్రంథాలు :

1. పి.ఎస్.ఆర్. అప్పారావు, తెలుగునాటక వికాసం.
2. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ఆంధ్రనాటకరంగ చరిత్ర.
3. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు.
4. నంది నాటకపోటీల సావనీర్లు.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

బాలసుధాకర్ మౌళి కవిత్వం - కళింగాంధ్ర అస్తిత్వం



యర్రంశెట్టి మణికంఠ
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ,
ఆంధ్ర
విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.

ఆచార్య జర్రాఅప్పారావు
ప్రొఫెసర్ & హెడ్,
తెలుగుశాఖ, ఆంధ్ర
విశ్వవిద్యాలయం
విశాఖపట్నం.
సెల్ : 9492495813
drraojarra@gmail.com



****

ఉపోద్ఘాతం :

భౌగోళికంగా నిర్దిష్ట సరిహద్దుల లోపల నివసించే ప్రజలను ఆ ప్రాంతవాసులు అంటారు. ఆ సరిహద్దులలో లభించే వనరులపై ఆ ప్రాంతీయులకు సహజ హక్కులు ఉంటాయి. తమది అనుకున్న వాటిపై ఇతరుల ఆధిపత్యాన్ని సహించలేనితనం నుంచి ప్రాంతీయవాదం మొదలవుతుంది. కళింగాంధ్ర ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతం. అన్ని రకాలుగా వివక్షకు గురికాబడిన ప్రాంతం. తమ సమస్యల్ని బలంగా వినిపించడానికి ఈ ప్రాంత మేధావులు, కవులు సాహిత్య సృష్టి చేసి ఆ ప్రాంత అస్తిత్వాన్ని బలపరిచారు. కళింగాంధ్ర ప్రాంతీయవాదం కథా సాహిత్యంలో మొదట కనిపిస్తుంది. కాళీపట్నం రామారావు, అప్పల్నాయుడు వంటి కథకులు తమ ప్రాంతవాదాన్ని బలంగా వినిపించారు.

ఆధునిక కాలంలో కవులు కవిత్వ రూపంలో తమ ప్రాంత అస్తిత్వాన్ని తెలుపుతున్నారు. కళింగాంధ్ర వెనుకబాటుతనాన్ని గంటేడ గౌరునాయుడు గారు తన కవిత "నాగేటి చాలుకు నమస్కారం" లో చాటి చెప్పారు. గంటేడ గౌరునాయుడు మార్గదర్శకంలో ఎందరో యువ కవులు కళింగాంధ్ర అస్తిత్వం కోసం తమ వాణిని వినిపించారు. వారిలో బాలసుధాకర్‌మౌళి అగ్రగణ్యులని అనడంలో సందేహం లేదు. కళింగాంధ్ర ప్రాంత ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతీ వైచిత్రిని, రైతుల ఆర్తనాదాలని, పెట్టుబడిదారుల చేతుల్లో బలైపోతున్న అడవితల్లి అంతరంగాన్ని, ఎండిపోతున్న నదుల దుఃఖాన్ని మొదలైనవాటిని తన కవిత్వంలో ఆవిష్కరింప జేశారు బాలసుధాకర్‌మౌళి.

కళింగాంధ్ర ప్రాంతంలో పల్లెలు నిర్మానుష్యమవుతున్నాయి. సకాలంలో వర్షాలు పడక, పనులు లేక గ్రామీణులు

జీవనోపాధి కొరకు వలసపోవడం సర్వసాధారణం. తాము పుట్టి, పెరిగిన నేలను వదిలి ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళే ప్రజల దుఃఖాన్ని తన కవిత్వంలో పొందుపరిచారు బాలసుధాకర్‌మౌళి. గ్రామాలను వదిలి వలస వెళ్ళిన వారి దుఃఖాన్ని, గ్రామంతో వారికి దూరమైన బంధాన్ని "అతను" అనే కవితలో బాల సుధాకర్ మౌళి గారు తనదైన శైలిలో చిత్రీకరించారు.

అతను
భుజాల మీద నాలుగేళ్ల పిల్లాణ్ణేసుకుని
వొక చేత్తో లగేజితో
భారంగా నడుస్తున్నాడు
అతని వెనుక
అతని భార్య నడుస్తుంది
అతని
ఇద్దరు పిల్లలు నడుస్తున్నారు
పెరిగిన వయసుతో
బాధపడుతున్న
అతని తల్లీ తండ్రీ నడుస్తున్నారు
పుట్టి పెరిగిన నేలనొదిలేసి
ఎక్కడికో
వొకింత ఆసరా కోసం
వెళ్లిపోతున్నారు పుట 25 – ఎగరాల్సిన సమయం

పుట్టి పెరిగిన ఊరిని, బాల్యాన్ని గడిపిన ఊరిని, అనుబంధాన్ని, ఆప్యాయతల్ని పంచుకున్న ఊరిని వదిలి రావడం ఎంత కష్టమో ఈ కవితలో తెలియజేసారు. వలస వెళ్ళేవారి మనో వేదనను, దుఃఖాన్ని పాఠకుని కళ్ళకు కట్టినట్లు చూపించారు.

గ్రామాలలో పొలం పనులపై ఆధారపడి బతికే కూలి రైతులు వెళ్లాల్సి రావటం కరువు పరిస్థితుల వలన గ్రామాలలో పనులు లేక పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి రావటం తప్పనిసరి పరిస్థితిగా మారింది. ఆకలి మనిషిని ఎంత దూరమైనా ప్రయాణించేలా చేస్తుంది. కళంగాంధ్ర ప్రజలు పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళడాన్ని గుర్తు చేస్తూ "పొలం యాత్ర" కవితను ఆవిష్కరించారు బాలసుధాకర్ మౌళి.

చెమట బొట్లు
బతుకు యాత్ర చేస్తున్నాయి
బొట్టు వెనుక బొట్టు
బొట్టు వెనుక బొట్టు
నేల దేహం చిందిన చెమటబొట్లు
గొలుసుకట్టుగా
ఒకే దారిలో నడుస్తున్నాయి పుట 82 – నీళ్లలోని చేప

నేలను చెమటతో పండించిన కూలి రైతులు గొలుసుకట్టుగా వలస వెళ్ళిపోతున్నారు. ఒకరి వెనుక ఒకరు బతుకు యాత్ర చేస్తున్నారు. పంట పొలాలను పండించిన వాళ్ళు ఆకలిని తీర్చుకోవడానికి మరో మార్గం లేక, ఇతర ప్రాంతాలకు

వలస వెళ్ళిపోతున్నారు. పొలం యాత్ర చేయాల్సిన రైతులు బతుకు యాత్ర చేయాల్సి వచ్చిందని ఈ కవితలో నర్మగర్భంగా తెలియజేసారు కవి.

గ్రామాలలో ఇళ్లను వదిలి పట్టణాలకు వలస వెళ్ళిపోయిన వారి ఇళ్లు పూరాతనమై పాడుబడిపోయి గ్రామీణుల వలస జీవితానికి ప్రతీకగా నిలుస్తున్నాయని వలస వెళ్ళిన వారి ఇళ్లు కళిగాంధ్ర గ్రామాలలో ఎలా ఉన్నాయో "వలస" కవితలో తెలియజేసారు బాలసుధాకర్ మౌళి.

ఎవరో ఎప్పుడో
పిల్లాపాపలతో బతికిన గుర్తులు
శిలాజాల్లా
ఇంటి మూల మూలా
మిగిలి ఉన్నాయి. పుట 48 – నీళ్లలోనిచేప

వలస పోయిన వారి ఇళ్ళు చూస్తే పురాతన శిలాజాల్లా కనిపిస్తాయనంటే వారు వలస వెళ్ళి ఎన్నో సంవత్సరాలు గడిచిపోయి ఉంటుంది. అలా వలస వెళ్ళిన వారి గురుతులు ఆ పాడుబడ్డ ఇంటి మాటున మిగిలి ఉన్నాయి. వలస వెళ్ళిపోయిన వారి మనసుల్లోకి, జ్ఞాపకాల్లోకి ప్రవేశించి వలసపోయిన వారి శరీరాల్లోకి పరకాయ ప్రవేశం చేసి తన ఆత్మీయతను వ్యక్తపరిచారు కవి.

ఎందుకంటే ఉద్యోగరీత్యా బాలసుధాకర్ మౌళి గారు కూడా తాను పుట్టి పెరిగిన పల్లెను వదిలేసి పట్నానికి రావల్సి వచ్చింది.

పచ్చని పంటపొలాల మధ్య
బతికి బతికి, బతుకు చితికి
నగరానికొచ్చాను
ఎటుచూసినా విస్తరిస్తున్న ఊడలతో
నగరం
ఒక పెద్ద మాయావృక్షంలా
కనిపించింది పుట 26 – నీళ్లలోనిచేప

గ్రామీణ వాతావరణానికి, పచ్చని ప్రకృతికి అలవాటు పడిన ఎవరైనా పట్టణాల్లోని ఇరుకు గదుల్లో ఉండటానికి అంతగా ఇష్టపడరు.

కళింగాంధ్ర ప్రాంత రైతులకు అన్నదాతలుగా నిలబడే నదులు నాగావళి, వంశధార. వీటి ఉపనదులు చంపావతి, సువర్ణముఖి, వేగావతి, జంఝావతి, గోస్తనీ మొదలైనవి. ఇవన్నీ కూడా వర్షాధారంగా ప్రవహించేవే. బాలసుధాకర్ మౌళి కవిత్వంలో నదుల దుఃఖాన్ని కూడా తెలియజేసారు. తనని నమ్ముకున్న రైతు వలస వెళ్ళిపోవడాన్ని చూడలేక నదులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయని అంటారు కవి. నదుల దుఃఖమంటే ఆ ప్రాంత ప్రజల దుఃఖమే.

"నదిని దాటుతూ" కవితలో ఆ దుఃఖాన్ని పాఠకుల కళ్ళముందుంచారు బాలసుధాకర్ మౌళి గారు.

ఎన్నిసార్లు
నదిని దాటానో
దాటిన ప్రతిసారి

నది కనుగుడ్లపై
కన్నీటిచారికలను
చూశాను
నది మాట్లాడలేదు
ఎన్నిసార్లు తీరం మీద నడిచానో
నడిచిన ప్రతిసారి
తీరంపైన
రాకాసి పాదముద్రలను
చూశాను
తీరం మాట్లాడలేదు
ఎన్నిసార్లు
నీళ్లల్లో వూరి ప్రతిబింబాన్ని వెతికానో
వెతికిన ప్రతిసారి
వలసెళ్లిన వూరుని
అడుగునెక్కడో తేలిన రాళ్లల్లో
చూశాను
నీళ్లు మాట్లాడలేదు
నేనిప్పుడు
నది గొంతునయ్యాను పుట 104 – నీళ్లలోని చేప

మనం ఎన్నోసార్లు నదిని దాటుంటాం. కానీ ఆ నది ఆర్తిని, ఆర్తనాదాన్ని మనం పట్టించుకోం. కానీ కవి హృదయం నది గుండెను తాకుతుంది. నది ఘోషను వింటుంది. ఆ కవితా హృదయంతోనే బాలసుధాకర్ మౌళి గారు అమూర్త వస్తువుకు రూపం కల్పించి ఎండిపోయిన నది ముఖంపై కన్నీటిని చూడగలిగారు. ఎండిపోయిన నదిలో చిన్న చిన్న పాయలుగా సన్నగా కదిలే నీటిని కవి కన్నీటి చారికలుగా చిత్రీకరించారు. నది కన్నీటి గాథను తన కలం ద్వారా సమాజానికి వినిపించారు బాల సుధాకర్‌మౌళి గారు.

కళింగాంధ్ర ప్రాంతంలో ప్రవహించే చంపావతి అనే నది ఎండిపోవడంతో ఆ నదీ ఆధార పంట పొలాలపై జీవించే రైతుల ఆత్మహత్యలు, రైతు కూలీల ఆకలి బాధలు "చంపావతి నుంచి" అనే కవితలో వాస్తవిక దృష్టితో వివరించారు కవి.

చంపావతి నది
దుఃఖం గుంతలో కూరిపోతున్నది
చంపావతిలో నీళ్లేవి
పంట పొలాల్లో పున్నమేది
ఆకలితో వలసెళ్లిపోతున్న వూళ్లల్లో మనుషులేరి

పిడచకట్టిన నది దేహం
కన్నీళ్లతో నిండిపోయింది
చంపావతి నదిలో
దుఃఖం సుళ్లు తిరుగుతుంది
నదిని దాటి వెళ్తున్నాను
చంపావతి నది నుంచి
కన్నీటి కథలను ఏరి
వూళ్ల మీదుగానే నడుస్తున్నాను పుట 90 – నీళ్లలోని చేప

చంపావతిలో నీళ్లు లేని కారణంగా పంటలు పండట్లేదు. పంటని పున్నమిగా భావించే రైతులు తమ పున్నమిని వదిలి ఆకలి పొట్టలు పట్టుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిపోతున్నారని కళింగాంధ్ర రైతుల దుస్థితిని వివరించారు ఈ కవితలో బాల సుధాకర్ మౌళి.

ముగింపు :

బాల సుధాకర్‌మౌళి గారు కళింగాంధ్ర ప్రాంత ఆకలి కేకలు, కరువు పరిస్థితి, వలసలు, రైతుల ఆత్మహత్యలు, నగరాలలో ఇమడలేని జీవనం వంటి ఎన్నో ప్రజల సమస్యలను తన కవిత్వంలో చాలా వాస్తవికంగా తెలియజేశారు. సమాజంలో అట్టడుగు ప్రజల జీవితాలను, సాహిత్యాన్ని ప్రపంచానికి తెలియజేసారు. వ్యథాభరిత యథార్థ జీవిత గాథలను కవిత్వ రూపంలో తెలియజేయడంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. కళింగాంధ్ర ప్రాంత ప్రజల అంతరంగాన్ని ఆవిష్కరించడంలో సఫలీకృతులయ్యారు బాలసుధాకర్ మౌళి. అందుకే బాల సుధాకర్ మౌళి కవిత్వం – కళింగ్రాంధ అస్తిత్వం అనడంలో సందేహం లేదు.

ఆధార గ్రంధాలు :

1. మౌళి కవిత్వం .... బాల సుధాకర్.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

వి. ప్రతిమ సాహిత్యం – పరిశీలన – స్త్రీలు సమస్యలు





- గుండాల నరేంద్రబాబు
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
చరవాణి – 9493235992.

- ఆచార్య కడియాల వెంకటరమణ,
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,

ఉపోద్ఘాతం:

"మనం ఆధునిక యుగంలో కథ, కథానిక అని చెప్పుకునే లిఖిత కథ మొట్టమొదట ఇంగ్లీషులోనే వచ్చింది. ఆంగ్లభాషా సాహిత్యాల పరిచయంతో 19, 20 శతాబ్దాలలో భారతీయ భాషల్లోకి ప్రవేశించింది. ఇలా బండారు అచ్చమాంబ, గురజాడ రాసిన కథలు మొదటి కథలుగా లెక్కింపబడుతున్నాయి. బండారు అచ్చమాంబ 1902లో రాసిన 'స్త్రీవిద్య'ను మొదటి కథగా కొందరు గుర్తిస్తే, 1910లో గురజాడ రాసిన 'దిద్దుబాటు'ను తెలుగులో మొదటి కథగా మరికొందరు గుర్తిస్తున్నారు. కథ, కథానికకు స్వల్పంగా భేదాలున్నా అవి రెండూ సమానార్థకాలుగానే ప్రయోగింపబడుతున్నాయి. ఇంగ్లీషులో "Short story" అనే దానికి కథ, కథానికలను సమానార్థకాలుగా ఉపయోగిస్తున్నారు. కథా మూలాలకు ఆధారాలు భారతీయ సాహిత్యంలో ఉన్నాయి.

"ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా!
కథానికేతి మన్యంతే గద్యకావ్యాచ పంచధా!"

అనే శ్లోకం అగ్నిపురాణంలో ఉంది. దీనిని బట్టి గద్య కావ్యాలు, ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక అని ఐదు భాగాలుగా విభజింపబడినట్లు తెలుస్తుంది. "ఇందులో కథ, కథానికలు నేడు బహుళప్రచారంలో ఉన్న కథ, కథానికలకు దగ్గరగా ఉంటాయని"[1] డా॥ కాలువ మల్లయ్య గారు కథానిక ప్రక్రియ పూర్వాపరాలను విశ్లేషించారు.

ఇక ఈ కథానిక ప్రక్రియను అనేకమంది నిర్వచించారు. అందు ఒక నిర్వచనాన్ని ఇక్కడ పేర్కొనడం జరిగింది.

"పాట, కథ అతి ప్రాచీనమైన కళలు. మానవుడు మాట్లాడడం, భావనాశక్తిని ఇతరులతో పంచుకోవడం మొదలుపెట్టాడో అప్పటినుంచి కథ మొదలైంది. ఇంట్లో తాత అవ్వలు మొదలు సాయంకాలాలు తమ పనులు అయిన తరువాత ఒకచోటచేరి ప్రజలు కబుర్లు చెప్పుకునే సమయాల్లో ఈ కథలు ప్రారంభమయ్యాయి. మనకు ఇతిహాస, పురాణాల్లో కనిపించే ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలే నేటి పరిభాషలో కథలు, కథానికలు. కథకు కథానికకు పెద్దగా భేదంలేదనే చెప్పుకోవాలి. కథ ఎన్ని పాత్రలతోనైనా, ఎన్ని సన్నివేశాల కూడికగానైనా ఉండవచ్చు. కథానిక కొన్ని పాత్రలకు, ఏదో ఒకటి రెండు సందర్భాలకు మాత్రం పరిమితమై ఉంటుంది. నవలా సాహిత్యం ఎన్నిరకాలైన మార్పులకు లోనైందో కథానికా సాహిత్యం కూడా అన్నిరకాల మార్పుల్ని చూసింది"[2] అని డా॥ సత్యవాణి పేర్కొన్నారు.

ఆధునిక సాహిత్యంలో కాలానుగుణంగా వచ్చిన మార్పులకు తగినట్లుగా ప్రక్రియలు కూడా రూపుదాల్చాయి. వాటిని కథానిక, నవల, విమర్శ, వచన కవిత్వం, గేయాలు, హైకూలు, నానీలు, రెక్కలు వంటి ప్రక్రియలుగా పేర్కొనవచ్చు. వీటిల్లో అత్యధికస్థాయిలో సాహిత్యం వెలువడుతున్నది కథల్లోనే అనవచ్చు. ప్రతి దిన, వార, మాస పత్రికలు కథానికలను విధిగా ప్రచురిస్తున్నాయి. ఆటా, తానా, సిలికానాంధ్ర వంటి ప్రవాస భారతీయ సంస్థలు కూడా కథానిక పోటీలు నిర్వహించి భారీస్థాయిలో నగదు పారితోషికాన్ని అందజేస్తున్నాయి. ఈ కథానికల తరువాత వచనకవిత్వం, నవలలు విస్తారంగా వెలువడుతున్నాయి. ప్రతి రచయిత నవలలు రాయడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. కథల ద్వారా లబ్దప్రతిష్ఠులైన కథకులెందరో ఉన్నారు. నేడు దాదాపుగా అన్ని భాషల్లోను కథానికలు రాస్తున్న రచయితలు, రచయిత్రులు ఎందరో ఉన్నారు. ఈ కోవలో చూసినపుడు వి. ప్రతిమ చక్కని సామాజికస్పృహతో కథలు రాశారు, రాస్తున్నారు. ఈమె ఎక్కువగా స్త్రీల సమస్యలపైనే దృష్టిసారించారు.

రచయిత పరిచయం:

శ్రీమతి. వి. ప్రతిమ 27ఆగష్టు 1956వ సంవత్సరంలో శ్రీమతి. రత్నమ్మ, శ్రీ. మల్లెమాల వేంకట రాఘవరెడ్డి దంపతులకు తమిళనాడు రాష్ట్రం ప్రస్తుత చెన్నై నగరంలోని తిరువళ్ళూరు సమీపంలోని నత్తగుల్లదిబ్బ గ్రామంలో ద్వితీయ సంతానంగా జన్మించారు. వీరిది రాజకీయ నేపథ్యం గల కుటుంబం. తండ్రి మల్లెమాల వేంకట రాఘవరెడ్డి ఒక రాజకీయ నాయకుడు. వీరికి అన్న, తమ్ముడు, చెల్లెలు తోబుట్టువులుగా కలరు. వి. ప్రతిమ వివాహం 1973వ సంవత్సరం డిసెంబర్‌లో డాక్టర్ వెడిచర్ల. ప్రద్యుమ్నకుమార్ రెడ్డితో జరిగింది. వి. ప్రతిమ, ప్రద్యుమ్నకుమార్‌రెడ్డి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, కుమార్తె గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

స్త్రీలు-సమస్యలు:

సత్వ, రజో, తమో గుణాలు కలిగినది స్త్రీ అని ఆధ్యాత్మికవేత్తలు అన్నారు. అందుకే స్త్రీని త్రిగుణ స్వరూపురాలు అంటారు. అలాంటి స్త్రీ పుట్టింది మొదలు గిట్టేవరకు అడుగడుగునా సమస్యలు ఎదుర్కొంటున్నది. చదువుకోనివ్వరు, ఇంటిపనంతా చెయ్యాలి, రజస్వల అయినవెంటనే వివాహం చేస్తారు. నవమాసాలు గర్భాన్ని మోయాలి. ప్రసవనొప్పులు

భరించి పిల్లలను కనాలి. వారి ఆలనాపాలనా చూడాలి. గృహ హింసను భరించాలి. మగవారినుంచి ఎదురయ్యే లైంగిక వేధింపుల నుండి బయటపడాలి. అత్తమామల వేధింపులు భరించాలి. ఆడపడుచుల ఎత్తిపొడుపు మాటలు భరించాలి. కుటుంబ సభ్యులందరూ తిని పడుకున్నాక పడుకోవాలి. ఉదయాన్నే అందరికంటే ముందు లేవాలి, ఇలా చెప్పుకుంటూ పోతే స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు చాంతాడంత అవుతాయి.

కథకురాలు వి. ప్రతిమ తన కథల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. అదేవిధంగా రచయిత్రి పేర్కొన్న స్త్రీల సమస్యలను చర్చించడానికిగానూ వాటిని స్త్రీలు–సమస్యలు, కుటుంబజీవనంలో స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, ఇతరాంశాలుగా విభజించడం జరిగింది.

పురాణస్త్రీలు - ఎదుర్కొన్న సమస్యలు:

మానవమాత్రులు ఎందుకు సమస్యలు ఎదుర్కోవాలని ఎవరైనా ప్రశ్నిస్తే దానికి పెద్దలు పురాణాలను ఉటంకిస్తారు. దాంతో ఎవ్వరూ నోరు తెరవరు. ఎందుకంటే పురాణాలను ఎవరూ ప్రశ్నించకూడదనే నియమం పెట్టారుగదా! 'పురాణాలు ప్రభుసమ్మితాలు' అన్నారు. పురాణాలు చదువుతూ ఉన్నపుడు వచ్చే సందేహాలను అడగకూడదు. ఎలాగంటే అవి రాజులతో సమానం. రాజును ఎవరూ ప్రశ్నించకూడదు. ఆవిధంగానే పురాణాలను ప్రశ్నించరాదని పెద్దలన్నారు. ఆ సూక్తి ప్రకారమే నేడు ప్రజలు ప్రవర్తిస్తున్నారు.

"ఓ 'ఆడమ్' నువ్వు ఒక్కొక్క మెట్టూ ఎక్కుకుంటూ కీర్తి శిఖిలాలనధిగమించావు. ఆకాశాన్ని అందుకున్నావు. చివరికి సృష్టికి ప్రతిసృష్టి చేసే క్లోనింగ్ బ్రహ్మవయ్యావు. బాగానేవుంది. అయితే 'ఈవ్'ని మాత్రం నీతోపాటు చేయిపట్టి నడిపించకుండా దారిలోనే నిర్దాక్షిణ్యంగా వదిలేశావు. ఎదగనీయకుండా నొక్కి తొక్కి పారేశావు.

ఆడమ్ ఫస్ట్ సిటిజన్....ఈవ్ సెకండ్ సిటిజన్, విశ్వమంతటా ఇదే కథ!

ఓ నా ఈవ్ ఎక్కడున్నావమ్మా! పడుతూ లేస్తూ ఎక్కడాగిపోయావ్?

ఈ జీవితారణ్యంలో నీ కాళ్లకి మాత్రమే ముళ్లు గుచ్చుకున్నాయా? గండశిలలద్దం పడ్డాయా? మాయమాటలు చెప్పి ఏ కొండశిఖరం మీదినుండి తోసేశాడు నిన్ను ఆడమ్.

నువ్వు పతివ్రతవి కాదని రజకుడెవరో అంటే అరణ్యానికి తోలేశాడా?

శీలపరీక్ష పేరిట అగ్ని స్నానాలు చేయించాడా?

అప్పులు తీర్చుకోవడం కోసం నిన్ను నడివీధిలో నిలబెట్టి అమ్మేశాడా?

రాత్రికి రాత్రి నిన్నొదిలిపెట్టేసి లోకాన్నుద్ధరించడం కోసం చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయాడా?

విచ్చుకత్తుల వంతెనల పహారా కాశాడా?

అర్థంపర్థంలేని ఆవేశంతో నిన్ను నడిబజారులో వివస్త్రను చేశాడా!

బిడ్డపాలను నీరొమ్ములుండి పిండి తీశాడా?

నువ్వు ప్రేమించనన్నావని క్లాసు రూములో కొచ్చి కత్తితో నరికేశాడా?

నవ్వుతూ నవ్వుతూ కాఫీలో నిద్రమాత్రలు కలిపిచ్చాడా?

సందడి, చప్పుడు లేకుండా గ్యాస్ నాబ్ తిప్పేశాడా?

కిరసనాయిలు డబ్బా ఖాళీ చేశాడా?

కాఫీలో చక్కెర తక్కువయిందని కొట్టి చంపేశాడా? లేక అత్తింటివారి గొంతెమ్మ కోర్కెలు తీర్చలేక, పుట్టింటి వారికి భారం కాలేక నువ్వే ఆత్మహత్యే శరణ్యమనుకున్నావా?

ఓ నా ఈవ్ ఎక్కడున్నావమ్మా?

ఎక్కడో లోయల్లో, కొండల్లో కోనల్లో ఈవ్ ఈవ్ నువ్వెందుకట్లా వెనకబడి పోయావ్? ఆడమ్ తినకుండా ఆ పండు నువ్వు మాత్రమే ఎందుకు తిన్నావమ్మా!

ఎక్కడో ఒక ఈవ్ పైలట్ అవుతుంది, మరోచోట ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కుతుంది

ఇంకొక ఈవ్ అంతరిక్షంలోకి వెళుతుంది, మరోచోట భారతరత్న పొందుతుంది

అంతా చంకలు గుద్దుకుంటాం, అంతేగానీ మిగిలిన తొంభైతొమ్మిది శాతం,

మనసులో రగులుతున్న ఆలోచనల సంఘర్షణని బయటపెట్టలేక అట్టడుగు స్థితిలో హింస పడుతున్నారన్న సంగతి గుర్తించం

హయ్యో! కొత్త శతాబ్దిలోనయినా నువ్వు ఆడమ్తో సమానంగా నడుస్తావా? ఇంకా ఎప్పటికి తల్లీ నువ్వు ప్రశ్నించడం నేర్చుకునేది?

"ఏదో పాపం, హఠాత్తుగా వాళ్ళమ్మ చనిపోవడంతో నిత్యకి మెంటల్ షాకయిపోయింది"

"షాకా....పిచ్చిపట్టేసినట్లుంది...ఏదేదో మాట్లాడుతోంది"

"కొడుక్కి చెప్పారా లేదా? కొడుకొచ్చేదాకా ఉంచేస్తారా? ఇప్పటికే చూడు ఎట్లా అయిపోతోందో బాడీ, మామూలు చావుకాకపాయె! పవ్స్.....రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

"అయినా ఈ వయసులో ఈ పని చేసుండాల్సింది కాదు, బిడ్డ మొహమయినా చూసుండాల్సింది"

హయ్యో! ఇప్పుడు కూడా అమ్మనే తిడుతున్నారు అంతా, నేనేం చేయాలి?

పోగొట్టుకున్న జీవితాన్ని ఉదయం నుండీ వెతుకుతూనే ఉన్నాను, సాయంత్రానిగ్గాని చెప్పలేను నా నిర్ణయమేంటో....

"నిత్యా.....ఇక లేమ్మా, అమ్మ కాళ్లకి దణ్ణం పెట్టకో" పిలుస్తున్నారెవరో,

భయం.....భయంగా కళ్ళు విప్పాను

వీధిలోకి ఈడ్చి పారేస్తారు, ఒక్కరోజు కూడా ఇంట్లో ఉంచుకోరంతే

అప్పటికే జీవంలేని అమ్మ శరీరాన్ని వాకిట్లోకి పెట్టేశారు, అంతే! ఆ గుక్కెడు పోతే

నాన్న ఏడుస్తున్నాడు, అది నిజమైన ఏడుపో లేక అంతా తనని నిందిస్తారని దొంగేడుపు ఏడుస్తున్నాడో"[3]

"ఈవ్ మళ్ళీ చచ్చిపోయింది" కథలో రచయిత్రి వి. ప్రతిమ వివరించారు.

స్త్రీలు - వ్యక్తిగత సమస్యలు:

పల్లెల్లో స్త్రీలు ఇంటి వసతుల విషయంలో, వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి ఎలా ఇబ్బందులు పడుతున్నారో ఒక స్త్రీ తన తమ్ముడితో చెప్పి ఆవేదన చెందుతుంది.

"నాకేం ఆశలుండాయిరా.....పిలకాయిలు కూడా లేకపోతిరి.....నాకేంలేదురా, యిదిగో ఈ ఆడోళ్ళంతా నీళ్ళకోసం యింతింత కష్టాలు పడుతుండారు.....రెడ్డేరితోటలో మోటరేస్తేనే నీళ్ళు, లేకపోతే లేదు. ఈ నడమ ఎలచ్చన్లని దినుమ్మూ యిస్తున్యారు. యహన ఈ నీటిచుక్కకి కూడా అల్లాడాల్సిందే. ఒకపూట పైకి పోసుకుంటే రెండు దినాలు పోసుకునేది ల్యా. ఈదిబావుల్లో చేదుకుందావన్నా పాతాళంలోవుండె నీళ్ళు. మన మాలాడకీ, మాదిగాడకీ నీళ్ళు తెచ్చుకోవాలిరా....యింకోటేందంటే ఆడోళ్ళకి బయిటికిపోవాలంటే నిండా యిబ్బందిగా ఉంది. చెట్లూ, పుట్టలూ

కూడా ల్యాకుండాపాయె. గబక్కన పోవాలంటే యాడకని పరిగిస్తారు చెప్పు.....ఆడోళ్ళకి బాధల్యాకుండా కక్కసుదొడ్లు కట్టించుకోవాలిరా.....'' ఒక ట్రాన్స్ లోలా మాట్లాడుతోన్న అక్కకేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు రమణ.

నిజానికి ఏదో నిలబెడ్తే నిలబడి గెలిచేసిందేకాని యిట్లా అక్కకి కొన్ని ఆలోచన్లూ, ఆశయాలూ వుంటాయని అతడూహించలేదు. అడివికిపోయి కట్టెలు కొట్టుకొచ్చుకునే అక్క....ఆమడదూరం నుండైనా నీళ్ళబిందెలు మోసే అక్క.....కలుపు తీసే అక్క....పాటలు పాడే అక్క....బర్రెల్ని మేపుకొచ్చే అక్క.....మొగుడిచేత లెస్స తన్నులు తినే అక్క.....ఆ అక్కేనా మాట్లాడుతోంది అని వింతగా చూస్తున్నాడు. వెనువెంటనే అక్క చేతిని పట్టుకున్నాడు''[4] అంటూ ఒకనాటి పల్లె స్త్రీల జీవిత సమస్యలను ''నీళ్ళు'' కథలో చక్కగా వివరించారు కథకురాలు వి. ప్రతిమ.

స్త్రీలను వివిధ రకాలుగా వాడుకోవాలని చూచుట:

బాధిత స్త్రీలు ఏ ఆఫీసుకువెళ్ళి తమకు రావలసిన బకాయిలు, ఇతర బకాయిలు చెల్లించమని అడిగినా, మొదటిగా లంచాన్ని ఆశిస్తారు. ఆ తరువాత వారిని లైంగికంగా వినియోగించాలని చూస్తున్నారు. కొందరైతే రెండు ఆశిస్తున్నారు. వారు అంగీకరించి సమర్పించేంతవరకు ఆఫీసుకు తిప్పించుకుంటూనే ఉంటారు. ఇలాంటి బాధితుల గురించి మనం ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో, యూట్యూబ్ వంటి వాటిల్లో చూస్తున్నాము. నేటి సామాజిక పరిస్థితులకు రచయిత్రి వి. ప్రతిమ కథలు అద్దం పడుతున్నాయి. ఈ అంశాలను కథకురాలు ఒక సన్నివేశంలో ఇలా తెలిపారు.

''దాదాపు నలభైవేల దాకా రావల్సుంటుందిరా'' అని తన పని తాను చేసుకోసాగాడు. ''ఏం లేదు మామా! పాపం ఆడమనిషి, అన్నిసార్లు తిప్పించుకోవడమెందుకూ..... ఆ పనేదో చేసేస్తే సరిపోతుంది కదాని'' నవ్వాడు సోమశేఖరం.....అజ్ఞానిని చూసినట్లుగా. ''అట్నుంచి మనకేమీ రాలదురా....మరేవిధంగా ఉపయోగపడుతుందా ఈ మనిషి అని చూస్తున్నాను''. ''అదేం? రేపు డబ్బులొచ్చాక తీసుకో'' ఏమీ ఎరగనివాడిలా అన్నాను.

''ఆ ఏం తీసుకుంటాంలే.....శివయ్య చేసిన అప్పులకీ, దానికీ సరిపోద్ది.....అదీ కాకుండా రవీ ఎప్పుడూ ఏదయినా ముందే జరిగిపోవాలి.....ఇప్పుడయితే వాళ్ళు మనచుట్టూ తిరుగుతారు.....రేపు మనం వాళ్ళచుట్టూ తిరగాల్సివుంటుంది.....ఫ్చ్ అయినా అయ్యన్నీ నీకు తెలీవు లేరా....'' అంటూ మళ్ళీ పన్లో పడ్డాడు.

నేను మౌనంగావుండడం చూసి, అయిదు నిమిషాలాగి మళ్ళీ మాట్లాడ్డం ప్రారంభించాడు సోమవేఖరం. ''రవీ'' గుసగుసగా పిలిచాడు నాకేసి నిశితంగా చూస్తూ.....''ఏమిట్రా నీకంత ఇంట్రెస్టు?'' కన్నుగీటుతూ చిరునవ్వు నవ్వాడు మామ.

ముందు సిగ్గువడ్డట్టున్నాను, అయినా....''ఫిగర్ అదిరింది మామా అన్నాను ఏ జంకూ లేకుండా''. ''మంచిది....అయితే ఆ ఫైల్సన్నీ నీకే ఇస్తాను. రేపు వచ్చిందంటే నీకాడికే పంపిస్తాను.....నువ్వే చూడు!! అంటూ నవ్వాడు గుంభనంగా.

నా తండ్రి వయసున్న వాడితో ఇటువంటి విషయాలు చర్చించడం సబబా, కాదా అని నేనాలోచించలేదు. ఎందుకంటే ఈ ఆఫీసులో ఇటువంటివి చాలా మూమూలు విషయాలుగా తోస్తున్నాయి. నా బతుక్కి తగ్గ ఆఫీసు దొరికినందుకు లోలోపలే సంతోషిస్తూ, వర్షంకేసి చూస్తున్నాను.

ఎన్నాళ్ళనుండో చెక్కుతూ వచ్చిన కన్నీటిశిల్పం కరిగికరిగి నీరవుతున్నట్లుగా, నడుస్తున్న శోకదేవతలా కదలివస్తోంది శివయ్య భార్య వర్షంలో.....ఇంతటి వర్షంలో కూడా పట్టువదలని విక్రమార్కుడిలా ఆమె నడచిరావడం చూస్తుంటే, ఆమె ధ్యేయంపట్ల హర్షం, ఆమె పరిస్థితి పట్ల జాలీ కలిగాయి నాలో''[5] చక్కగా వివరించారు కథకురాలు ''కోరిక'' కథలో.

అక్కచెల్లెళ్ళు ఒకరినొకరు ఓదార్చుకొనుట:

అక్క భారతి, చెల్లెలు కస్తూరి ఇద్దరూ మెట్టినింటివారి బాధితులే. వారు ఒకరి బాధను మరొకరు పంచుకుంటారు. ఆ క్రమంలో వారు మాట్లాడుకున్న అంశాలను రచయిత్రి వి. ప్రతిమ వివరించారు. ఆ మాటలు నాటి-నేటి స్త్రీల అభద్రతకూ, ఆవేదనకు సంకేతాలుగా ఉంటున్నాయని స్పష్టంగా చెప్పవచ్చు. ఆ మాటలు ఇలా ఉన్నాయి.

"అక్కా! నువ్వు చెప్పు ఇందులో నా తప్పేమైనా ఉందా?" ఏడుస్తూ ఏడుస్తూ సగంలో ఆపి మౌనంగా ఉన్న అక్కని అనుమానంగా చూస్తూ ప్రశ్నించింది కస్తూరి. "ఛ.....ఛ లేదు కస్తూరీ....ఇందులో నీ తప్పేమీలేదు. తప్పంటూ ఏదైనావుంటే ఈ పురుషాధిక్య ప్రపంచానిది....తప్పంటూ ఏదైనా ఉంటే పూర్తిగా నీ భర్తది" ఖచ్చితంగా జవాబిచ్చింది.

ఆశ్చర్యంగా అక్కవైపు చూసింది కస్తూరి. "అవును కస్తూరీ! ఏదైనా తప్పంటూ ఉంటే అది పూర్తిగా మీ ఆయనదే, అంటే మగాడిది. అవును పురుష బీజకణంలో ఉన్న 'వై' క్రోమోజోముది", "అంటే ఏంటక్కా?"

"స్త్రీ అండంలో కేవలం 'ఎక్స్' క్రోమోజోము మాత్రమే ఉంటుంది. పురుషుడిలో అలా కాకుండా కొన్ని వీర్యకణాల్లో 'వై' ఉంటుంది. స్త్రీపురుష సంయోగంలో పురుషుడి తాలూకూ 'ఎక్స్' క్రోమోజోము ఉన్న వీర్యకణం స్త్రీని చేరుకుంటే స్త్రీలో ఉన్న 'ఎక్స్' తో కలిసి 'ఎక్స్ ఎక్స్' అవుతుంది. అప్పుడా దంపతులకి ఆడపిల్ల పుడుతుంది. అలా కాకుండా పురుషుడిలోని 'వై' ఉన్న వీర్యకణం స్త్రీని చేరుకుంటే ఆమెలో ఉన్న 'ఎక్స్' తో కలిసి 'ఎక్స్ వై' అవుతుంది అప్పుడు మగపిల్లవాడు పుడతాడు.....మీ ఆయనలోని 'వై' క్రోమోజోమ్ కాకుండా తన 'ఎక్స్' క్రోమోజోమ్ మాత్రమే నిన్ను చేరుకుని ఉంటుంది....ఇందులో నీ బాధ్యతేముంది?" అందుకే అన్నాను ఏదైనా తప్పంటూవుంటే మీ ఆయనదేనని" చిరునవ్వుని మొహంమీదికి తెచ్చుకుంటూ వివరించింది భారతి.

ఆమె కాలేజీ చదువులు చదవలేదు. జెనెటిక్స్ నేర్చుకోలేదు, అయినా చిన్ననాటి నుండీ ఆమెతోపాటే నడిచివచ్చిన సాహిత్యాభిలాష ఆమెచేత ఎన్నో ఎన్నెన్నో పుస్తకాలు చదివించింది. ఆ పుస్తకాల్లో జీవితాన్ని చదువుకుంది. అందుకే అంతటి సహనం, ఎంతటి బాధనైనా నిబ్బరంగా ఎదుర్కునే గుండెధైర్యం.

ఆరాధనగా భారతినే చూస్తోంది కస్తూరి. "అక్కా ఆ తప్పు నాది కాదంటే వాళ్ళు ఒప్పుకుంటారంటావా" జాలిగా చెల్లెల్నే చూస్తూ నవ్వింది భారతి. "పిచ్చి కస్తూరీ! యమ్.ఎస్.స్సీ., చదివి కాలేజీలో లెక్చరరుగా ఉద్యోగం చేస్తోన్న అతడికి ఈ విసయం తెలీదంటావా. ఇది పురుషాధిక్యస్వామ్య ప్రపంచం. మగాడు ఏం చేసినా, ఏం చెప్పినా ఆడది తలవంచి ఉండాల్సిందే, బాధగా అన్నది భారతి.

"ఏం చేస్తున్నారే ఇద్దరూనూ, పాప అలా గుక్కపట్టి ఏడుస్తూంటే" పార్వతమ్మ వంటగదిలో నుండి కేకపెట్టడంతో ఇద్దరూ ఈ లోకంలోకి వచ్చారు"[6] అని వారు మాట్లాడుకున్న అంశాలను, వారి అన్యోన్యతను రచయిత్రి వి. ప్రతిమ "మాక్కొంచెం నమ్మకమివ్వండి" కథలో చక్కగా వివరించారు.

ఆడపిల్లల స్వేచ్ఛ - అణచివేత:

ధనవంతులైనా పేదవారు అయినా ఆడపిల్లలపై అనేక ఆంక్షలు విధిస్తారు. చిన్నప్పటినుంచి ఆంక్షలమీద ఆంక్షలు ఉంటాయి. కట్టే వస్త్రాలపై ఆంక్షలు, తినేతిండిపై ఆంక్షలు, ఎక్కడికైనా వెళ్ళాలంటే ఆంక్షలు, సకాలానికి ఇంటికి రాకపోతే ఆంక్షలు, చదువులో బాగా రాణిస్తున్నా , ఉన్నతచదువు చదువుతున్నారంటే ఆంక్షలు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆడపిల్లలకు స్వేచ్ఛ అనేదే లేదనవచ్చు. అయితే అమ్మాయిలకు స్వేచ్ఛను ఇస్తే అనర్థాలు జరుగుతున్నాయని కొందరంటున్నారు. దాని దుష్ఫలితాలను కూడా వివరిస్తున్నారు. ఇక్కడ అలాంటి ఒక సన్నివేశాన్ని వివరించారు.

రచయిత్రి వి. ప్రతిమ.

''పెళ్ళికాక ముందు వసంతలక్ష్మి ఎలా వుండేది? వసంత ఋతువులాగే కదా....ఉదయపు అందాలనూ, సాయంసంధ్యలోని పసుపు పచ్చదనాన్ని, పచ్చని చెట్లలోని హరితవర్ణాన్నీ, ఏటిఒడ్డున మర్రిచెట్టుకింద కూచున్నప్పటి హాయి గురించీ, అమ్మ గురించీ తెరలుతెరలుగా జ్ఞాపకం చేసుకుంది వసంతలక్ష్మి. పెళ్ళి కాకముందు ఇవన్నీ ఆమె ప్రాణశక్తులు. పెళ్ళయిన మర్నాటినుంచీ చిత్రంగా మారిపోయింది వసంతలక్ష్మి. ఆయన ఇష్టాలు, రుచులూ, అభిరుచులూ, అతడి కోసమే, అతడితోడిదే జీవితం, అతడువేరు తను వేరూ కాదు అనే ఒక అలౌకిక ప్రేమలో పడిపోయింది వసంతలక్ష్మి. సాహిత్యాన్నీ, సంగీతాన్నీ, సారవంతమైన ఆలోచనలనూ అన్నింటినీ వరుసగా తనకే తెలీని క్రమంలో మరిచిపోయింది. అతడి సంరక్షణా భారాన్నంతా గుత్తకు తీసుకున్నదానిలా బతకడం మొదలుపెట్టింది.

ఇంట్లోని ప్రతికూల పరిస్థితుల్లో తన అస్థిత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆ హడావిడిలో తనలోని సౌకుమార్యాన్ని, మార్దవాన్ని, స్పందననీ క్రమంగా వదిలేసింది.

పెళ్ళి.....పెళ్ళి.....ఆడపిల్ల పెళ్ళికోసమే పుడుతుందా?..... పెళ్ళి లేకపోతే జీవితమే లేదా?...

పుట్టినప్పట్నుండీ ఆ పిల్లకి పెళ్ళిచేయాలనే ధ్యాస తప్ప మరో ఆలోచన, అభిప్రాయం ఉండవు....జీవితం కంటే పెళ్ళే ముఖ్యమన్నట్లుగా పెంచబడ్తుంది.....వసంతలక్ష్మి వాళ్ళమ్మ కూడ యిందుకు భిన్నమేమీ కాదు. అమ్మాయిని ఏదో ఒక అయ్య చేతిలో పెట్టేస్తే నిశ్చింత అనుకుంది. కూతుర్ని యిష్టప్రకారం చదివినంతవరకూ చదివించుదాం, ఆమెకి నచ్చిన మార్గంలో వెళ్ళే స్వేచ్ఛనిద్దాం అనుకోలేదు. అందుకే వసంతలక్ష్మి డిగ్రీలో చేరాలన్న కోరిక కోరికగానే ఉండిపోయింది. ఇంటర్మీడియెట్లో వచ్చిన డిస్టింక్షన్ మార్కులు పసుపచ్చ బూజుపట్టి పూరుకున్నాయి.

ఇప్పుడా చదువు చాకలిపద్దు వ్రాసుకోడానికీ, పాత పత్రికలు తిరగేయడానికి పనికొస్తుంది. ఆ పత్రికలయినా మంచివి చదువుదామని రాజేశ్వరినడిగితే 'వనితా మార్గం', 'భూమిక', 'స్త్రీశక్తి' పుస్తకాలు పంపించింది. ఆ పత్రికలు చూసి ఇంట్లో పెద్దగొడవే జరిగింది. అటువంటి పుస్తకాలింకోసారి చూస్తే ఇంట్లోనుండి బయటికి గెంటేస్తానన్నాడతడు. అర్థంకాక విస్తుపోయి చూస్తుంటే 'వనితామార్గం', 'బువనతార' పత్రికలు ఇంట్లోవుంటే పోలీసులు అరెస్ట్ చేస్తారన్నాడు. మంచి పత్రికలు చదివి జ్ఞానం పెంచుకుంటే పోలీసులెందుకు అరెస్ట్ చేస్తారన్నాడు. మంచి పత్రికలు చదివి జ్ఞానం పెంచుకుంటే పోలీసులెందుకు అరెస్ట్ చేస్తారో అర్థంకాలేదామెకి. ఆవిధంగా చైతన్యం అనేది ఇంట్లోకి రాకుండానే గడపలో నుండే వెళ్ళిపోయింది వసంతలక్ష్మికి''[7] అంటారు కథకురాలు ప్రతిమ ''జోగారం'' కథలో.

ఉపసంహారం:

ప్రస్తుత కాలానికి 2500 సం॥లకు పూర్వం స్త్రీలు ఏయే రంగాలలో ఎక్కువగా ఉన్నారో ప్రస్తుత కాలంలో కూడా ఆయా రంగాలలోనే ఎక్కువగా ఉన్నారన్నది అత్యంత ఆశ్చర్యపరిచే అంశం. చిన్నప్పుడు తండ్రి మాట విని, విద్యకు నోచుకోక, వివాహం తరువాత భర్త నీడలోవుంటూ భర్త చనిపోతే విధవరాలై, కొడుకుల అదుపాజ్ఞల్లో ఉంటూ ఆఖరికి జీవిత చరమదశలో తన చావు కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేది.

భర్త తాగుబోతు అయినా, జూదగాడైనా, మూర్ఖుడైనా అతనికోసం ప్రార్థించాలి తప్ప ఏ స్వతంత్ర ప్రతిపత్తిలేని నిస్సహాయతతో ఉండేది. కొడుకు సన్మార్గంలో నడవాలని భగవంతుని ప్రార్థించడం తప్ప అతన్ని సరిదిద్దే స్వతంత్రంలేని పరిస్థితిలో ఉండేది. అది ఆకాలపు స్త్రీల పరిస్థితి. ప్రస్తుతం స్త్రీలు అన్ని రంగాలలో ఉన్నారు. అధ్యాపకులుగా,

వైద్యులుగా, రాజకీయ, ఆర్థికవేత్తలుగా ఉన్నారు. ఇంకా తక్కిన అన్ని రంగాల్లో ఉన్నారు. అయినా మెట్టినింట వేధింపులకు గురవుతూనే ఉన్నారు. వాటిని కథకురాలు తన కథల్లో చిత్రించారు.

రచయిత్రి నేటి స్త్రీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను వివిధ కోణాల్లో చిత్రించారు. దీనినిబట్టి ఈ కథకురాలికి చక్కని సామాజికస్పృహ ఉందని ఒక స్త్రీగా స్త్రీల సమస్యలపై చక్కగా స్పందించారని ప్రతిపాదించడం జరిగింది. ఈ కథలు చదివాక అయినా సాటి స్త్రీలను వేధించే స్త్రీలలో మానసికంగా మార్పువస్తుందని భావించడం జరిగింది.

ఉపయుక్త గ్రంథసూచి:

1. నూటపదేళ్ళ తెలుగుకథ – విభిన్నధోరణులు, డా॥ కాలువ మల్లయ్య, ప్రచురణ: తెలుగు అకాడెమి, హైదరాబాద్, డిసెంబరు 2012.
2. తెలుగులో ప్రక్రియా వైవిధ్యం, డా॥జొ.వెం. సత్యవాణి, ప్రచురణ: తెలుగు అకాడెమి, హైదరాబాద్, డిసెంబర్ 2012.
3. ఖండిత కథలు, వి. ప్రతిమ, ప్రచురణ: చైత్ర ఇంప్రెషన్స్, హైదరాబాద్, జనవరి 2008.
4. సుప్రజ, వి. ప్రతిమ కథలు, ప్రచురణ: విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్, జనవరి 2012.
5. పక్షి కథాసంకలనం, వి. ప్రతిమ, ప్రచురణ: చైత్ర ఇంప్రెషన్స్, హైదరాబాద్, సెప్టెంబర్ 2004.

పాదసూచికలు:

1. నూటపదేళ్ళ తెలుగుకథ – విభిన్నధోరణులు, పుట: 2, డా॥ కాలువ మల్లయ్య, ప్రచురణ: తెలుగు అకాడెమి, హైదరాబాద్, డిసెంబరు 2012.
2. తెలుగులో ప్రక్రియా వైవిధ్యం, పు: 57, డా॥జొ.వెం. సత్యవాణి, ప్రచురణ: తెలుగు అకాడెమి, హైదరాబాద్, డిసెంబర్ 2012.
3. పక్షి కథాసంకలనం – ఈవ్ మళ్ళీ చచ్చిపోయింది – వి. ప్రతిమ, పుట: 103.
4. ఖండిత కథలు – నీళ్ళు – వి. ప్రతిమ, పుట: 80.
5. సుప్రజ – కోరిక – వి. ప్రతిమ కథలు, పుట: 82, 83.
6. పక్షి కథాసంకలనం – మాక్కొంచెం నమ్మకమివ్వండి – వి. ప్రతిమ, పుట: 22, 23.
7. పక్షి కథాసంకలనం – జాగారం – వి. ప్రతిమ, పుట: 91, 92.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

"నిజ జీవిత కథలు" - డా: కొండపల్లి నీహారిణీ గారి "రాచిప్ప కథలు".



పి. మృదుల
తెలుగు పరిశోధక విద్యార్థి,
బెస్ట్ విశ్వవిద్యాలయం (అనంతపురం, గోరంట్ల మండలం).
తెలుగు అధ్యాపకురాలు,
TGSWRDCW IBP,
రాష్ట్రం: తెలంగాణ
6303909565.

వ్యాస సంగ్రహం :

తెలంగాణా మాండలికానికి పెద్దపీట వేసినట్టుగా తెనిగించిన "రాచిప్ప కథలు" డాక్టర్ కొండపల్లి నీహారిణీ గారి చేత రచించబడ్డాయి. ఈ కథలోని పాత్రల ద్వారా బంధుత్వాలు, ఆత్మీయానురాగాలు, మానవతాసుబంధాలు, స్నేహాలు, ప్రేమలు ,పెద్దరికాలు వంటి భావోద్వేగాలు చిత్రించబడ్డాయి. నిజజీవిత సమస్యలు కథనాత్మకంగా, సహజమైన సంఘటనల ద్వారా వ్యక్తమై, మానవుల చిన్న తప్పిదాలకు చెల్లిస్తున్న మూల్యమెంతో వివరించేంత విలువైన కథలుగా కూడా ఈ రాచిప్ప కథలు రచించబడ్డాయి. పుట్టి పెరిగిన ఊరు, వ్యవసాయం, ప్రకృతి, ఆడపిల్లల విలువ, స్త్రీల ఓపిక గట్టితనం, కుటుంబ యజమాని పట్ల ప్రదర్శించే విలువల వంటివి అంతరార్థంగా నింపబడిన కథలుగా, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాల ఇతివృత్తంగా సాగిన కథలుగా, ఆధునికత తెచ్చిపెట్టిన సమస్యల వృత్తాంతంతో సాగిన కథలుగా, వైవిధ్య భరితమైన వస్తు కథనాలతో పాఠకులను ఆలోచింప చేసేవిగా వాస్తవిక కథలు గా చిత్రించబడ్డాయి.

కీలక పదాలు:

వ్యక్తుల సంబంధ బాంధవ్యాలు, సామాజిక విధ్వంసాలు, తరాల అంతరాలు, ఆత్మాభిమానపు చిహ్నాలు, కుటుంబ సభ్యుల కలతలు, తెలంగాణ యాస, సాంప్రదాయాలు, స్నేహాలు వంటివి.

ఉపోద్ఘాతం:

వర్తమాన కాలంలో అంతర్జాలం ద్వారా "మయూఖ, తరుణి పత్రికల కు" సంపాదకత్వం వహిస్తున్న, ఒద్దిరాజు

సోదరుల జీవితంపై పరిశోధనా సిద్ధాంతాన్ని సమర్పించిన, ఎనిమిదో అడుగు కవితా సంపుటి, వ్యాసహారిక వంటి గ్రంథ రచనలతో తెలుగు సాహితీ లోకం ఎరిగిన డాక్టర్ కొండపల్లి నీహారిణీ గారి చేత ఈ "రాచిప్ప కథలు" రచించబడ్డాయి. అనుబంధాల ఆర్ద్రతతో కూడిన కథలు తెలంగాణా సాహితీ క్షేత్రంలో బహుళంగా పరివ్యాపితమవుతాయనేది డాక్టర్ కొండపల్లి నీహారిణీ గారు రచించిన ఈ కథల ద్వారా మరొక మారు నిరూపితమయ్యాయి. ఈ సంపుటిలో మొత్తం 19 కథలు ఉండి ప్రతి కథ తనదైన శైలీ పరిమళంతో పాఠకులను ఏకబిగిన చదివేలా శీర్షికా ప్రయుక్తంగా .....నిశ్శబ్దానికి ఆవల, కథకాని కథ, అరుణ అరణ్య రోదన, చెద బట్టని అగ్ని, రాచిప్ప, మారాకు తొడిగింది వంటి మొదలైన కథలు ఉన్నాయి. ఈ కథా సంపుటికి ముందుమాటగా.... "అనురాగం ఆత్మీయతలను చిత్రించే కథలు" అనే శీర్షికతో ప్రఖ్యాత రచయిత్రి "డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డి" గారు వ్యక్తీకరించిన అభిప్రాయం నిలువెత్తు సాక్ష్యమని ఈ కథల ద్వారా అందించే సందేశాలు మనకు అవగతం చేస్తాయి .

వ్యాస విశ్లేషణ:

ఈ కథా సంపుటిలోని క్రింది కథలను పరిశీలిస్తే.....

1) "నిశ్శబ్దానికి ఆవల" శీర్షికతో శ్రీరామ్, లక్ష్మీ ,సరళ ప్రధాన పాత్రధారులుగా, నాని పేరుతో కేర్ టేకర్ పాత్రను సృష్టించి నేటి ఉరుకుల పరుగుల జీవితం చాటున నలుగుతున్న పసిపిల్లల దైన్య స్థితిని వివరించడమే కాక, నేటి కాలపు మనుషులు డబ్బు కోసం పసిపిల్లల చేత బిక్షమెత్తిస్తున్నట్టుగా పాఠకులు చదివినప్పుడు భావోద్వేగానికి లోనయ్యే విధంగా కథను నడిపించారు. ఈ కథ ద్వారా తరాల అంతరాల వల్ల..... ఉదాహరణకు అత్తా కోడళ్ళు, తండ్రీ కొడుకుల మధ్య సరైన సంబంధ బాంధవ్యాలు లేకపోవడం, ఉద్యోగాలు చేస్తూ పరిగెత్తే నేటి ఆధునిక జంటలకు పెద్దలతోడు, సహాయం లేకపోవడం చేత నష్టపోతున్న బాలల జీవితాలను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. మనిషికి డబ్బు, ఆస్తుల కంటే ప్రేమతో కూడిన బంధాలు, ఆప్యాయతలు, మానవత్వమే నిజమైన సంపద అని, పిల్లల పట్ల ప్రేమ, వారి మనసును అర్థం చేసుకోవడం, వారిని కేవలం క్రమశిక్షణతో కాకుండా ఆప్యాయతతో తీర్చిదిద్దడం ముఖ్యమని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియచేశారు.

2) చెద బట్టని అగ్ని : కథ ద్వారా వ్యక్తిగత బాధ్యతను, సామాజిక బాధ్యతను, పర్యావరణ పరిరక్షణ, మానవత్వం వంటి వాటి గురించి వివరించారు. ఈ కథలో "శ్రావ్య" అనే పాత్ర నిర్లక్ష్య ధోరణితో ఒక ప్లాస్టిక్ కవర్ను రోడ్డుపై పడేయడం వల్ల అది ఒక మోటార్ సైకిల్ వ్యక్తి ప్రమాదానికి చివరకు అతని మరణానికి కారణం అవుతుంది. తన తప్పు తెలుసుకున్న తర్వాత శ్రావ్య తీవ్రంగా బాధపడుతుంది. అయితే కేవలం పశ్చాత్తాపంతో ఆగకుండా ఆ వ్యక్తి కుటుంబ పరిస్థితిని తెలుసుకొని, వారి బాధ్యతను కూడా తీసుకొని, ప్రతి నెలా ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకొని తప్పుదిద్దుకునే ప్రయత్నం వైపు శ్రావ్య పాత్ర అడుగులు వేసినట్లుగా రచయిత్రి కథను సృష్టించారు. ఈ కథ ద్వారా ప్రతి వ్యక్తికి సామాజిక బాధ్యత ఉందని, మన చర్యల వల్ల ఇతరులకు హాని కలగకుండా జాగ్రత్త పడుతూ తప్పు జరిగితే దాన్ని సరిదిద్దడానికి మానవత్వంతో ముందుకు రావాలనే నీతిని బోధించారు.

3) రాచిప్ప: కథ ద్వారా కుటుంబ బంధాలు, మానవ సంబంధాలను కాపాడుకోవడం, ప్రేమను పంచుకోవడం, క్షమాగుణంతో ముందుకు సాగడమే జీవితానికి అసలైన అర్థం గా నిర్వచించారు. రాచిప్ప అనేది తెలంగాణ ప్రాంతీయులు పచ్చళ్ళు, తొక్కులు, నిల్వ చేసుకునే పాత్ర అని వైదేహమ్మ, రామవ్వల సంభాషణల వల్ల పాఠకులకు స్ఫురించేలా తెలియజేశారు. తెలంగాణా యాసలో మనుషుల మధ్య వచ్చే అపార్థాలను, తిరిగి సులువుగా బంధాలను అల్లుకుపోయే తీరును కూడా తనదైన తీరులో వివరించారు. మంచి సంస్కృతిని, కలియతిరిగే మనుషుల స్వభావం, కట్ను కానుకల ఊసు అవసరం

లేదంటూ పాత్రల ద్వారా చెప్పించిన తీరుకు పాఠకుడు విజ్ఞాన, సాంప్రదాయాల మధ్య తిరగాడుతున్న అనుభూతిని పొందేలా రచయిత్రి చక్కని సందేశాన్ని అందించారు.

4) అర్ధంలో చందమామ: సంధ్య, రవి, కళ్యాణ్, కారుణ్య పాత్రలతో సృష్టించిన ఈ కథ ద్వారా ఇప్పటి పిల్లల ఇష్టాలైన బైక్, సెల్ఫోన్ వంటి వాటి ఉపయోగం ఎంతవరకో, ఉద్యోగస్తులైన తల్లిదండ్రులు తీసుకునేటటువంటి లోన్లు, పిల్లల చదువుల ఫీజులు, నిత్యావసరాలు, కోరికలు, వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యతలు, వంటివన్నీ కూడా కుటుంబ సభ్యులు పరస్పర అవగాహన, నమ్మకంతో పరిష్కరించుకోవాలని భార్యాభర్తలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవడం ద్వారా కుటుంబంలో వచ్చే చిన్న చిన్న సమస్యలను సులువుగా పరిష్కరించుకునే వీలు కలుగుతుందని, తద్వారా బంధాలు బలపడతాయనే సూచన చేశారు.

5) మట్టి పూలు మంచి వాసనలు: కథలో కండక్టర్ జీవితాన్ని, అతని నిజాయితీని, బాధ్యతను, సమాజం పట్ల ఉన్న మానవత్వాన్ని ఎంతో సహజంగా చిత్రించారు. తన ఉద్యోగాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక బాధ్యతగా భావించిన కండక్టర్ ప్రయాణికుల సమస్యలను తన సమస్యలుగా తీసుకొని పరిష్కరించిన ప్రయత్నంతో పాఠకులకు కూడా మనం చేసే పని చిన్నదైనా పెద్దదైనా దానిని నిబద్ధతతో, నిజాయితీతో చేస్తే సమాజానికి ఉపయోగపడగలమనే హితబోధ చేశారు.

6) ఎద్దు చేసిన పెండ్లి: కథ ద్వారా ఆడపిల్లలకు చదువు, స్వేచ్ఛ, స్వశక్తితో నిలబడేలా ప్రోత్సహిస్తే వారు తమ జీవితాన్ని సంతోషంగా ధైర్యంగా నిర్మించుకోగలరని, తల్లిదండ్రుల నిజమైన సంపద పిల్లల భవిష్యత్తేననే సందేశాన్ని అందించారు.

7) మృత్యుంజయుడు: కథలో "శంకర్ "పాత్ర ద్వారా ప్రజల పట్ల బాధ్యత, సేవాభావం, ధైర్యం, నిజాయితీ వంటి గొప్ప విలువలను ప్రతిబింబించారు. తనకు ఎదురయ్యే కష్టాలను, సమస్యలను పట్టించుకోకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే గొప్ప వ్యక్తిత్వం ఉన్న పాత్రగా మలిచారు. ఈ కథలో శంకర్ ఎదుర్కొన్న సంఘటనలు, అతని నిర్ణయాలు మనలో కూడా సమాజం పట్ల బాధ్యత, ఇతరులకు సహాయం చేయాలనే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయి. ఎలాంటి పరిస్థితులకు అయినా ధైర్యంగా నిలబడి న్యాయం కోసం పోరాడటం ద్వారా మనిషి తన జీవితానికి అర్థాన్ని కల్పించుకోగలడని ఈ కథ ద్వారా సందేశాన్ని అందించారు.

ముగింపు: సహజ మానవ ప్రవర్తనలు, అవసరాలు, కోరికలతో ఏర్పడే సంఘర్షణల ఫలితంగా మార్పులు చోటు చేసుకుంటున్న జీవితాలకు చక్కని పరిష్కార మార్గాలను చూపుతున్న కథలుగా ఉన్నాయని చదివిన పాఠకులు నాతో ఏకీభవిస్తారనడంలో అతిశయోక్తి లేదు. డాక్టర్ కొండపల్లి నీహారిణి గారి జ్ఞానం, జీవితానుభవం, రచనానుభవం కలబోసి రచించిన కథలుగా, మన నిత్యజీవితంలో తారసపడుతున్న పాత్రలుగా తప్పక తథానుభూతి చెందుతారు.

ఆధార గ్రంధాలు :

1. రాచిప్ప కథలు .... డా॥. కొండపల్లి నిహారిణి.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

దాట్ల దేవదానం రాజు కథలు – సామాజిక చిత్రణ



- పి. జ్యోతిలక్ష్మి
పరిశోధక విద్యార్థి
తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు-560056
చరవాణి : 9885651627

****

ప్రవేశిక:

ప్రతి మానవ జీవితంలో కథల గురించి తెలియని వారంటూ ఉండరు. అనాది కాలం నుండి ఈనాటి కాలం వరకు చిన్న పిల్లలను నిద్రపుచ్చుటకు, అలాగే సన్మార్గంలో నడవడానికి కథల రూపంలోనే తమ తల్లిదండ్రులు, గురువులు వర్ణిస్తారు. మానవుల జీవితానికి, కథలకు చాలా అన్యోన్య సంబంధం అంటిపెట్టుకొని ఉంది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చెప్పినట్లు 'మానవ జీవితాన్ని నవల విశదం చేస్తే, దాన్ని నాటకం ఉజ్వలపరిస్తే, చిన్న కథ మనిషి జీవితంలో రసవత్తరమైన ఒక ఘట్టాన్ని జటిలమైన ఒక అనుభూతిని హృదయం మీద అచ్చు గుచ్చుతుంది.

కథలు సమాజంలో మార్పుకు తోడ్పడతాయి. మనిషి ఏకాంతంగా ఉన్నప్పుడు గాని, మనస్సు బాగా లేనపుడు గాని కథలను చదివితే మనస్సు మంచి ఉత్సాహంతో ఉంటుంది. ఈ కోవకే చెందుతాయి దాట్ల దేవదానం రాజు కథలు. దాట్ల వారు ప్రతి కథని భిన్నమైన కోణంలో ఎన్నుకొంటారు. దాట్ల వారు వ్రాసిన కథలను పత్రిక ముఖాంతరంగా సమాజానికి అందించడం విశేషం. చాలావరకు తెలుగు పుస్తకాలను కేవలం సాహిత్యానికి సంబంధించిన వాళ్ళు మాత్రమే చదువుతుంటారు. కాని పత్రికలను అన్నీ రంగాలవారు చదువుతారు. డా॥ నార్ల వెంకటేశ్వరరావు చెప్పినట్లు ఒక పత్రిక వందమంది సైనికులతో సమానం. అలాగే దాట్ల వారి కథలు పత్రికల ముఖాంతరంగా అందరికీ సుపరిచితాలే.

1) తెలుగు కథలు పుట్టు పూర్వోత్తరాలు:

'కథ్' ధాతువు నుండి 'కథ' అనే పదం పుట్టింది. దానికి సంభాషించు, చెప్పుట అనే అర్థాలున్నాయి. పోరంకి

దక్షిణామూర్తి చెప్పినట్లు 'తెలుగువాళ్ళకు అనేక వందల సంవత్సరాలుగా కథా వాఙ్మయం ఉంది. కాని దానికి నిర్దిష్టమైన రూపం ఏర్పడడం మాత్రం 20వ శతాబ్దంలోనే జరిగింది. దానికి ఒరవడి పెట్టింది పాశ్చాత్య సాహిత్య సంపర్కం.

అగ్ని పురాణంలో కథానిక గురించిన శ్లోకం

"భయానకం సుఖతరంర్భేచ కరుణోరసః

అద్భుతో–న్తే సుక్లప్తార్థనో దాత్తా సా కథానికా"

తెలుగులో కథ, కథానికి అనేవి ఇంగ్లీషులోని "short story" కి పర్యాయ పదంగా వాడబడుతున్నాయి. "A short story is a prose narrative requiring from half an hour to one or two hours into perusal putting the same idea, into different phraseology, we may say that a short story is a story that can be easily read at a single sitting". - W.H. Hudson.

శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి మాటల్లో :-

"మానవ జీవితాన్ని నవల విశదం చేస్తే, దాన్ని నాటకం ఉజ్వల పరిస్తే, చిన్నకథ మనిషి జీవితంలో రసవత్తరమైన ఒక ఘట్టాన్ని జటిలమైన ఒక అనుభూతిని హృదయం మీద అచ్చు గుచ్చుతుంది."

అందుకే సమాజంలో కథానికకు అంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుతం సినిమారంగంలో మంచి మంచి కథలను ఎన్నుకొని సినిమాలను ప్రదర్శిస్తూ ఉన్నారు.

2) దాట్ల దేవదానం రాజు కథలు - సామాజిక చిత్రణ :

దాట్ల దేవదానం రాజు కవిగా, కథకుడుగా తెలుగు పాఠకులకు చిరపరిచితులే. ఈయన 1988 నుండి ఇప్పటి వరకు కూడా కథల్ని, కవితల్ని రాస్తూ వున్నారు. ఈయన వ్రాసిన మొదటి కథ "పేకా భాగోతం". ఇది 1988లో 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో ప్రచురించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యం శోభాయమానమైన ప్రకృతి సౌందర్యానికి నిలయమైన కోనసీమలో జన్మించిన దేవదానం రాజు గారికి సహజంగానే ప్రకృతి సౌందర్యమంటే అపారమైన ప్రేమ ఏర్పడింది. అందువలననే ఈయన కథలలో, కవిత్వాలలో ప్రకృతి సౌందర్యాన్ని గురించిన వర్ణనలు తరచుగా కనిపిస్తాయి.

దాట్ల దేవదానం రాజుగారి కథలు అధికంగా ప్రకృతి సహజమైన కథలు. భార్యాభర్తల మధ్య అన్యోన్య దాంపత్యం గురించి మరియు వయస్సు పైబడినాగాని వారి బాధ్యతను మరువక పోవడం, కష్టానికి తగిన వేతనం దొరకకపోవడం, స్త్రీలను కేవలం నామమాత్రముగ చూడడం, జంతువుల వల్ల మనుషులకు హాని జరుగుతుందని గ్రుడ్డిగా నమ్మి వాటిని దారుణంగా చంపడం, మనిషి శవం పడి ఉన్నా దానిని ఎవరూ ముట్టుకోకపోవడం, పనిమనిషి ఇంటి యజమాని కొడుకు కోసం ప్రాణాలను త్యాగం చేయడం. ఆధునిక జీవితంలో నిత్యావసర వస్తువులపై తండ్రి పొలాన్ని అమ్మడానికై కొడుకు సిద్ధపడటం, అనాథ పిల్లలపై శ్రీమంతులకు జాలి లేకపోవడం వంటి అంశాలను తన కళ్ళారా చూసి వాటిని కథలుగా వ్రాశారు. సమాజంలో ఎన్నో రకాల దారుణాలు, మంచి పనులు, నూతన ఆవిష్కరణలు ఇలా చాలా జరుగుతుంటాయి. వాటికి సాహిత్యాన్ని జోడించి వాటిని కథలుగానూ, కవిత్వంగానూ, నవలలు గానూ వ్రాసి సమాజంలో ప్రజల ముందుకు తెస్తారు కవులు. అందుకే సాహిత్యానికి అత్యంత శక్తి ఉంది.

3. రచయిత పరిచయం:

దాట్ల దేవదానం రాజు గారు తూర్పుగోదావరి జిల్లాలోని కోలంక గ్రామంలో 1954 మార్చి 20న జన్మించారు. దాట్లవారి తండ్రి వెంకటపతిరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. వీళ్ళది వ్యవసాయ కుటుంబం. దాట్ల వారి బాల్యం చాలా గారాబంగా సాగింది. తల్లి సూర్యనారాయణమ్మకు దాట్ల దేవదానం కంటే ముందు పుట్టిన 11 మంది పిల్లలు యేడాదిలోపే

మరణించడం వలన 12వ సంతానంగా జన్మించిన దేవదానం రాజుగారిపై అమితమైన ప్రేమను చూపించింది.

రాజుగారి ప్రాథమిక విద్య అంతా స్వగ్రామంలోనే పూర్తి చేశారు. తర్వాత ఉన్నత పాఠశాల విద్య కోసం కోలంకలోనే శ్రీ దంతులూరి వెంకటరాయప్ప రాజా ఎయిడెడ్ ఉన్న పాఠశాలలో చేరారు. తర్వాత ఇంటర్మీడియేట్‌లో ఎం.పి.సి. గ్రూపులో చేరారు. ఆ తర్వాత డిగ్రీని పూర్తి చేశారు. తర్వాత ఎం.ఎ. తెలుగు, ఎం.ఎ ఎకనామిక్స్‌ను పూర్తి చేశారు. బి.ఇడి.ని చేసి ఉపాధ్యాయ వృత్తిలో కాలుమోపారు. ఉపాధ్యాయ వృత్తిలో పిల్లలందరికి చక్కని పాఠాలు నేర్పి గొప్ప గొప్ప స్థానాలకు వారిని ఎదగనిచ్చారు. వృత్తిని దైవ సమానంతో చూడడం వల్ల జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి చేతులమీదుగా రెండుసార్లు బహుమతిని అందుకొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో తృష్ణ తీరక చిన్న చిన్న కథలను రాసి పత్రికలకు పంపేవారు. ఆ కథలన్నింటినీ ఒక చోట పోగుచేసి పుస్తకాల రూపంలో పాఠకుల ముందు ఉంచారు. ఆ పుస్తకాలలోని కథలు పాఠకులలో మంచి ఆదరణ పొంది ఎన్నో అవార్డులు, రివార్డులకు దారితీశాయి.

ఇలా ఒక గొప్ప కథకుడుగా, కవిగా, ఉత్తమ ఉపాధ్యాయునిగా, గొప్ప భర్తగా, గొప్ప తండ్రిగా మంచి మిత్రుడుగా, సమాజంలో మంచి వ్యక్తిగా ఉత్తమ అభ్యుదయవాదిగా ఉండడం కేవలం దాట్ల దేవదానం రాజుగారికే సాధ్యం అవుతుంది. "మంచి అలవాట్లను అలవడించుకొని ఆపదలో వున్న నలుగురికి సాయం చేస్తూ, ఇప్పుడిప్పుడే కథలు రాస్తున్న యువతరం కథకులకు తన పుట్టిన రోజు సందర్భంగా పదివేల రూపాయలతో సత్కరించేవారు.

ముగింపు:

నిర్దిష్ట స్థలాన్ని కేంద్రంగా చేసుకొని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, గోదావరి జలాల్ని స్వీకరిస్తూ, నడకలో ఎదురు వస్తున్న మనుషులను పలకరిస్తూ, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, దోపిడీలకు ఆకారం ఇస్తూ 1988 నుండి ఇప్పటివరకు కథలను రాస్తూ పాఠకుల హృదయంలో చెరగని ముద్ర వేసుకొన్నారు. దాట్ల దేవదానం రాజుగారు. సాహిత్యానికి సమాజం ఎంతో అవసరం అలాగే సమాజానికి సాహిత్యం కూడా అంతే అవసరం. సాహిత్యానికి, సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. సమాజంలో ప్రతినిత్యం ఎన్నో సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. అటువంటి సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనాలన్నా, ఆ సమస్యలను సులభతరం చెయ్యాలన్నా, సమస్యలు తలెత్తకూడదన్నా, ఇటువంటి కథలు సమాజానికి ఎంతో ఆదర్శప్రాయంగా ఉంటాయి. ఇలాంటి కథలపై ఇంకా మరిన్ని పరిశోధనలు జరగాల్సి వుంది. తెలుగు కథలపై లోతైన పరిశోధనలు జరిపి ఇటువంటి గొప్ప కథలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు:

1. తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వా.నా.శాస్త్రి.
2. ఉదయిని ప్రత్యేక సంచిక – దాట్ల దేవదానం రాజు.
3. కథల గోదారి – దాట్ల దేవదానం రాజు.
4. తెలుగు సాహిత్య చరిత్ర – ఆచార్య వెలమల సిమ్మన్న.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

తెలంగాణ కథా సాహిత్యంలో కుమ్మరి జీవన చిత్రణ



డా॥సి.హెచ్.శేఖర్
Inspector of Police, Kukatpally,
Ph:712596926

కీలకపదాలు :

కథానిక, సంస్కృతి, కులవృత్తి, సంప్రదాయ వృత్తులు, స్త్రీ సమస్యలు, ప్రపంచీకరణ, మానవ సంబంధాలు, అస్తిత్వం, గ్రామీణ నేపథ్యం, సామాజిక వాస్తవికత.

వ్యాస సంగ్రహం :

వ్యవసాయం ద్వారా పండించిన గింజల్ని ఆహార యోగ్యంగా మార్చుకోవడానికి ముఖ్యమైనది కుండ. గింజను కూడుగా మార్చేది కుండ. కూడుకు– ఇంటికి ఉన్న గాఢమైన బంధం కురాడు. కురాడు కూడుపెట్టే దైవం. అందుకే ఇంట్లో ఏ ప్రత్యేక వంటకమైనా ముందు కురాడు పెట్టిన తర్వాతే ఇతరులకు. తెలంగాణ సంస్కృతిలో కురాడు కుండ ప్రత్యేక స్థానం కలిగి ఉన్నది.ఆ కుండను రూపొందించేది కుమ్మరి. వంటకు అవసరమైన రకరకాల పాత్రలు కుమ్మరి తయారు చేస్తాడు. బువ్వకుండ, పాలపట్టువా, పెరుగు బుడ్డి, కూరయేసల, దీపాంత, కంచుడు ఇట్లా ఒక్కొక్క పాత్రకు ఒక్కొక్క పేరు. వంటకు మాత్రమే కాదు ఇంటికి పెండ్లికి ఐరేని కుండలు ప్రధానమైనవి. పొలంబోనం, పోచమ్మబోనం అన్నిటికి కుండలు, గురుగులు అవసరం నీటి నిల్వకు గోలేం, ధాన్య నిల్వకు కొట్టే. సాంప్రదాయక సంస్కృతిలో కుమ్మరి స్థానం పవిత్రతను కూడా సంతరించుకున్నది.ఈ మట్టి పరిశ్రమను లోహం దెబ్బతీసింది. స్టీలు, ఇత్తడి, ప్లాస్టిక్ పాత్రలు మట్టి పాత్రల స్థానాన్ని ఆక్రమించడంతో కుమ్మరి వృత్తి పూర్తిగా అంతరించి పోయింది. ఇప్పుడు కేవలం చావు కాడ మాత్రమే కుండ అవసరం పడుతున్నది. ఈ పరిణామాలన్నింటిని తెలంగాణ కథా సాహిత్యం చిత్రించింది. దీనిని వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

ప్రవేశిక :

శిరంశెట్టి కాంతారావు 'ప్రయాస' కథలో ప్రపంచీకరణ విసిరిన సవాళ్ళను ఎదుర్కోలేక తరతరాలుగా వస్తున్న సంప్రదాయ కులవృత్తిని వదులుకొని మరొక వృత్తిని స్వీకరించే క్రమంలో పడిన ప్రయాసను తెలిపింది ఈ కథ. జాతశ్రీ రాసిన 'చలివేంద్రం' కథలో కుమ్మరి దగ్గర కుండలు కొన్న పోలీసులు అతను ఊరి పేరు తెలియగానే నక్సలైటని అనుమాన పడతారు. కుండలతో పాటు ఇరవై రోజులు కష్టపడి సంపాదించుకున్న పైసలు కూడా గుంజుకొని రోడ్డు మీదకి విసిరేస్తారు. దీనితో పాటు ప్రపంచీకరణతో వచ్చిన ఫ్రిజ్ లు కుండను నాశనం చేసిన తీరు అంతర్గతంగా ఈ కథలో కనబడుతుంది. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'కాగుబొత్త' నమ్ముకున్న కులవృత్తిలో బతుకు భారం కావడంతో దాన్ని వదిలి రకరకాల పనులు చేసి చివరికి కులవృత్తి చేయాల్సి రావడంతో మలివయసులో సారెపడతాడు.

బతుకు పోరాటంలో భాగమైన కులవృత్తిలో బలైపోయిన వాస్తవాన్ని ఫ్రీజ్-కుండ మధ్య నడిచే సంభాషణతో కుమ్మరి వృత్తి ఎలా కనుమరుగవుతుందో తెలుపుతూ ప్రపంచీకరణ ప్రభావంతో తండ్రి కొడుకుల మధ్య పోటీ తత్వాన్ని తెలుపుతుంది. ఐతా చంద్రయ్య రాసిన 'కొడుకు రాకపాయే' కథలో సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కుమ్మరి ముత్యాలు కొడుకును తన లాగా వృత్తిలో కాకుండా ఉన్నత చదువులు చదివించాలని పట్నంలో కాలేజీలో చేర్పిస్తాడు. రెండు సంవత్సరాలు తండ్రిదనులకు కనిపించకుండా పోయిన కొడుకు కష్టపడి చదివి వైమానిక దళంలో ఉద్యోగం సంపాదించుకుని రావడంతో తల్లిదండ్రులు పడిన ఆనందాలను వివరిస్తుంది. రామచంద్రమౌళి రాసిన 'నిరంతరము-అనంతము' కథలో నేటి కాలంలో ప్రజలు కులంతో సంబంధం లేకుండా అవసరాన్ని బట్టి ఉపాధి కోసం వివిధ రకాల వృత్తులనుచేపడుతున్నారు. కులవృత్తులను అనుసరించక ఇస్రోలో ఉద్యోగం చేసే ఇద్దరు భార్యాభర్తలు తమ మూలాలను వెతుకుని ఒక రోజు కొలవృత్తిని చేపట్టిన మైనాన్ని ఈ కథలో చిత్రించబడింది. మలయశ్రీ 'ఐరేని కుండలు'కథ కాలనుగుణంగా వచ్చిన మార్పులకు ఆచరవ్యవహారాలు, సాంప్రదాయాలు, విలువలన్నిటిలో మార్పు వస్తుంది అలా సమాజంలో వచ్చిన మార్పులు కుమ్మరి వృత్తిలో ఏ విధంగా చోటు చేసుకున్నాయో వివరిస్తూ ప్రపంచీకరణ ప్రభావాన్ని చిత్రించింది.

నెరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ రాసిన 'ఇత్తడి కుండలు' గ్రామీణ సమాజంలో ఆచార సాంప్రదాయవ్యవహారాల్లో ప్రపంచీకరణ, పారిశ్రామికరణతో వచ్చిన పెనుమార్పుల వల్ల కుమ్మరి వృత్తి అవసరం లేకుండా పోయింది. పెండ్లిలకు అత్యవసరమైన ఐరేని కుండలు,జాతర్లకు పండుగలకు అవసరమైన బోనం కుండలుమొదలైనవి తగ్గిపోయి వాటి స్థానంలో ఇత్తడి, స్టీలు ప్లాస్టిక్, వస్తువులు రావడం వల్ల కుమ్మరి వృత్తి ఏ విధంగా నిరాదరణకు గురైందో ఈ కథ చిత్రించింది. మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'తలగోరుకుండ' కథలో మానవ పరిణామ చరిత్రలో కుమ్మరి గుర్తుకి ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది మనిషి పుట్టుక నుండి చావు వరకు జీవితంలో కుండ యొక్క ప్రాముఖ్యత ఎంతో గొప్పది కానీ ప్రపంచీకరణ ప్రభావంతో అంతరించిపోతున్న కుమ్మరి మృతిలో నేటి సమాజానికి ఎంతో కొంత అవసరం ఉన్నదని ఆ అవసరం కూడా ఎంతో ముఖ్యమైనది ఉంటుందని తెలుపుతుంది. టి.సంపత్ కుమార్ రాసిన 'చిప్ప' కథలో ప్లాస్టిక్, ఇండాలియం, అల్యూమినియం, ఉత్పత్తులతో కుమ్మరి వృత్తి శిథిలమైన క్రమాన్ని మూడు తరాలు ఎలా మారుతూ వచ్చాయో, చివరి తరం ముంబైలో బిచ్చమెత్తుకునే వారిగా మారిన క్రమాన్ని ఈ వ్యాసంలో విశ్లేషించడం జరిగినది.

కుమ్మరి జీవనచిత్ర కథలు విశ్లేషణ :

1.డా. మలయశ్రీ-ఐరేని కుండలు, 2.రామా చంద్రమౌళి-నిరంతరమూ-అనంతమూ 3.ఎనుగంటి వేణుగోపాల్-జీవితాన్ని గెలిచినవాడు !, 4.సంపత్ కుమార్-చిప్ప 5.కరణ్ గోపిని-కుమ్మరి చక్రం, 6. శిరంశెట్టి కాంతారావు-ప్రయాస, 7. దేవరాజు

ఈశ్వరరావు-వలస కూలి, 8. శంబంగి చిన్నం నాయుడు-మా ఊరు చూద్దాం, 9. యడవల్లి శైలజ-వృత్తి బంధువులు, 10. గుగులోత్ తులసి-మట్టికుండ 11. శేషబ్రహ్మం-సీతమ్మోరి బొమ్మ

ఈ కథలే కాకుండా ఐతా చంద్రయ్య 'సుదర్శనం', గోపిని కరుణాకర్ 'కుమ్మరిచక్రం', బోయ జంగయ్య 'తలగోరు కుండ' కథలు కుమ్మరి జీవితాన్ని చిత్రించాయి. ఇలా తెలంగాణ కథాసాహిత్యంలో కుమ్మరి వృత్తి చిత్రితమైంది. కుమ్మరి వృత్తిపై రావల్సినంత కథలు రాలేదు కానీ వచ్చిన కథల్లో కుమ్మరి జీవితాన్ని సమగ్రంగా చిత్రించారని చెప్పవచ్చు.

1. నిరంతరమూ అనంతమూ :

కన్ను తెరిస్తే ప్రపంచంలో నువ్వు.
కన్ను మూస్తే నీలోనే పలు ప్రపంచాలు'
మనిషికి తన వర్తమాన స్థితి ఏదన్నాకానీ... అది నచ్చదు
మార్పుకావాలి... స్థితి మారాలి.. తనకున్నది వద్దు. లేనిది, తెలియనిది ఏదో కావాలి
ఏమికావాలి..... తెలియదు ఎందుకు కావాలి... ఉహు.. తెలియదు..
తెలియని దానికోస ం ఆరాటం.. వేట...అన్వేషణ... వెంపర్లాట... నిరంతరం....అనంతం.

నిజానికి... మనిషి కళ్ళుమూసుకుని తనలోకి తాను చూచుకున్నా, కళ్ళు తెరచి నిండు నీలాకాశంలోకి చూచినా ఎంత ప్రశాంతతో.. ఎంత బీభత్సమో, ఎంత విహ్వలతో... ఎంత భయమో.

లోనికి.. లోలోనికి.. ఆత్మలోకి తొంగి చూచుకుంటున్నపుడు
ఒక చీకటి బావిలోకి చూస్తున్నట్టు... ఒక ప్రళయించే సముద్రంలోకి చూస్తున్నట్టు..

తను ఎవరో ఓ పురాతన మనిషియొక్క సుదీర్ఘ జీవిత శృంఖలలో ఓ కొలికివలె... ఒక కొనసాగింపా... ఒక వారసత్వమా... ఎవరో పూర్వీకుల అవశేష జీవపదార్థంగా ఒక ఉనికా... అనువంశికంగా వస్తున్న ప్రవర్తన, ప్రతిస్పందనలు, ప్రతిఫలనలు, ప్రతిచర్యలు యివన్నీ గుప్తంగా, అదృశ్యంగా, రహస్యంగా మనిషిని దహిస్తూ..

2. ఐరేనికుండలు :

ఎంకమ్మ అరుగుమీద పాత ఈతచాప వేసుకొని కూర్చుంది. ఆమె అన్నారం వారింటి ఆడపడుచు. సిరికొండ వారింటి కోడలు. ఆమె ప్రక్కన సున్నం పూసిన కొత్తకుండలున్నయి, మంచినీటి కడవలంతయి. మరికొన్ని కడుముంతలు-బుడ్లు. ఆమె ముందట మట్టి చిప్పల్ల ఎరుపు నలుపు రంగులు కలిపిన రెండు చిప్పలున్నవి. ఐరేని కుండలకు రంగులేస్తున్నది. కుండలకు రంగు మంచిగ అంటుకొని ఉండల్నని రంగుల్ల నూనె కలిపింది. తక్కువైతె మల్లపోసి కలుపుకోవచ్చునని చిన్న పిలగాళ్ళు నీళ్లు తాగే అసోంటి ఓ బొడ్డు గురిగిల నూనె, కడుమంతల నీళ్ళు పక్కకు పెట్టుకుంది.

3. చిప్ప :

"చక్రం తిరుగుతోంది. గిరగిరా తిరుగుతోంది. ముందుకు కాదు – వెనక్కు కాదు. తన చుట్టూ తాను తిరుగుతూనే ఉంది. వేగం తగ్గినపుడు కర్ర పుచ్చుకొని కదులుతున్న చక్రం పట్టు దొరికించుకొని శక్తి కొద్దీ తిప్పి వదలాడు గంగన్న, ఎంత వేగంగా తిప్పి వదిలినా చక్రంపై నున్న మట్టి ముద్ద తన ప్రభావాన్ని చూపుతూనే ఉంది. భారంగా తిరుగుతోంది. నిండు గర్భిణి నడకలా ఉంది. గంగన్న వంగి మోకాళ్లపై మోచేతుల్ని మోపి, వెన్నె లాంటి మట్టి ముద్ద నుండి కుండల్ని తయారు చేయ సాగాడు.

బ్రహ్మ పుట్టించిన జీవుల్లో ఎంతో వైవిధ్యం ! ఆకారాల్లో తేడా. రంగుల్లో తేడా. బుద్ధుల్లో అసమానత. సమస్తం వైవిధ్య భరితం! కాని గంగన్న చేతుల్లో పురుడు 'పోసుకుంటున్న ఏ వస్తువైనా సాంచాలోంచి ఊడి పడ్డట్టుగా ఉంటుంది. కొలతల్లో తేడా రాదు. ఆకారంలో మార్పు ఉండదు. అంత ఏకాగ్రతతో 'మట్టి' పని చేస్తాడు గంగన్న. ఆ ఊళ్లో ముగ్గురు గంగన్నలున్నారు. అంచేత అందరూ పేరుకు ముందు కులవృత్తి జోడించి 'కుమ్మరి గంగన్న' అనే పిలుస్తారు.

కుమ్మరి గంగన్న చేసిన మట్టి వస్తువులు లేని ఇల్లు ఆ ఊళ్లో లేదు. చిరుదీపాల్ని పెట్టుకొనే దివ్వెల నుండి తవ్వల కొద్దీ గింజల్ని దాచుకునే కాగుల వరకూ గంగన్న చేతులు తాకినవే! ఎండాకాలంలో చల్లని నీళ్ళిచ్చే కుండల నుండి ఇంటిని కప్పే గూన వరకూ గంగన్న చేతిలో రూపం దిద్దుకున్నవే ! పిల్లలకు పొదుపు నేర్పే డబ్బులు దాచుకునే గురిగిల నుండి వధూవరుల్ని ఏకం చేసే ఐరేని కుండల వరకూ గంగన్న చేతులు స్పృశించినవే! ఎవరి అంతిమయాత్రలోనైనా అగ్నిని తీసుకెళ్ళేది ఆయన చేసిన కుండల్లోనే! మనుషులకే కాదు, పశువులకు కూడా ఆయన వస్తువులు కావాలి. దాణా తినిపించే మట్టికంచాల నుండి కుడితి కలిపే బాణల వరకూ అతను ఆప్యాయంగా చేసినవే !

గంగన్నకు ఐదేళ్ళ వయసపుడే పెళ్ళయింది. భార్య పేరు నర్సు. చుట్టం చూపుగా అప్పుడప్పుడు పండగకో, పబ్బానికో అత్తగారింటికి వెళ్ళొచ్చేవాడు. ఇంట్లో ఆడదిక్కు లేకపోవడంతో నర్సు మొగుడింటికి వచ్చేది కాదు. ఇప్పుడు ఇద్దరూ ఎదిగారు. మనసులు ఎదిగాయి. చక్రంపై మట్టి ముద్ద ఒదిగి ఊపందుకుంది. సంసారం పుంజుకుంది.

గ్రామాల్లో, టౌన్లలో ప్లాస్టిక్ వస్తువులు చాపకింద నీరులా ప్రజల జీవనంలో 3 స్థానాన్ని ఏర్పరచుకుంటున్నాయి. తేలిగ్గా, అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. కిందపడ్డా తమకేమీ కాదంటూ శాస్త్రవేత్తల నుంచి అమృతాన్ని తాగి మరీ వచ్చాయి. తేలిక లోహాలన్నీ కలిసి వ్యూహాన్ని రచించాయి. ఫ్యాక్టరీల్లో కరిగి, అన్ని రకాల 'అగ్ని 'పరీక్ష'లు జరుపుకుని సాంచాల్లోకి జారి రూపొంది దుకాణాల్లోకి తోవచేసుకున్నాయి. కుండలకు వైధవ్యం వచ్చింది. అడిగేవారు కరువయ్యారు.

అల్యూమినియం, హిండాలియం వచ్చి గంగన్న పెద్ద కొడుకును బొంబాయి జ తరిమాయి. ప్లాస్టిక్కొచ్చి రెండవ కొడుకును దుబాయి పంపింది. ఇద్దరికీ మరోసారి బొడ్డుతాడు కస్సున తెగింది. గంగన్నకు బ్రతుకు భారమయింది. చక్రం గోడకు ఒరిగింది. కాయం వయస్సును మించిన వయస్సును చూపుతోంది. క్షయ శరీరంలో తిష్ట వేసింది. చేసిన వస్తువులకు అమ్మకం లేదు.

4. మంగళం పెంక :

కుమ్మరింట్ల పుట్టుడు నా తప్పానే ఇగ నా మనసు ఇరిగిపోయింది. నీ తిట్లతోని నేనెళ్లిపోతా.. అడుక్క తినైనా బతుకుత గానీ ఈడికైతే రానే!"

ఎగిలి వారకముందే వచ్చే పట్నం బస్సెక్కి ఏడుసుకుంట ఎల్లిపోయిండు రాజు.

"ఏందీ బిడ్డా రాజూ.. నా మీద కోపమొచ్చి అలిగి పోవడితివి ఏందిరా.. నీ కోసమే తండ్లాడుతన్న బిడ్డా! నలుగురికి పని ఇచ్చినోల్లం. నలుగురి దగ్గర చెయ్యి సాపవడితిమి, మట్టి కులంల పుట్టినందుకు. మన రాతింతే కొడకా!" దుఃఖాన్ని దిగమింగుకుంటా ఓ మూలన కూలబడ్డది.

5. ప్రయాస :

శిరంశెట్టి కాంతారావు 'ప్రయాస' కథలో ప్రపంచీకరణ విసిరిన సవాళ్ళను ఎదుర్కోలేక తరతరాలుగా వస్తున్న సంప్రదాయ కులవృత్తిని వదులుకొని మరొక వృత్తిని స్వీకరించే క్రమంలో పడిన ప్రయాసను తెలిపింది ఈ కథ. జాతశ్రీ రాసిన 'చలివేంద్రం' కథలో కుమ్మరి దగ్గర కుండలు కొన్న పోలీసులు అతను ఊరి పేరు తెలియగానే నక్సలైటని అనుమాన

పడతారు. కుండలతో పాటు ఇరవై రోజులు కష్టపడి సంపాదించుకున్న పైసలు కూడా గుంజుకొని రోడ్డు మీదకి విసిరేస్తారు. దీనితో పాటు ప్రపంచీకరణతో వచ్చిన ఫ్రీజ్ లు కుండను నాశనం చేసిన తీరు అంతర్గతంగా ఈ కథలో కనబడుతుంది. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'కాగుబొత్త' నమ్ముకున్న కులవృత్తిలో బతుకు భారం కావడంతో దాన్ని వదిలి రకరకాల పనులు చేసి చివరికి కులవృత్తి చేయాల్సి రావడంతో మలివయసులో సారెపడతాడు.

ముగింపు :

సమకాలీన సమాజాన్ని ఆవిష్కరిస్తూ కులవృత్తి వర్గాల సమస్యలకు మూలాల్ని అన్వేషిస్తూ, సామాజిక వాస్తవికతకు దర్పణం పడుతూ పరిష్కారాల్ని సూచిస్తూ సాగింది మల్లెసాల కథా ప్రస్థానం. స్థిరీకృత, ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నించడంతో కథా రచయితలు ఒకడుగు ముందు వేసినారు. తెలంగాణ ప్రాంతం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంక్షోభానికి గురవడం ఈ ప్రాంత కథా రచయితలకు బలమైన వాహికగా, కథా వస్తువుగా నిలచింది. ప్రధానంగా పరాయీకరణ, వలసలు, గ్రామాలు విధ్వంసమవడం, మనిషి వ్యాపారవస్తువుగా మారడం, సంస్కృతి విచ్ఛిన్నతకు పరాయి వారి భాషా, సంస్కృతుల ఆధిపత్య ధోరణులు, జీవనవిధానంలోని అంతరాలు, సామాన్యునికి చేరని స్వాతంత్ర్య ఫలాలు కథా రచయితల్ని తీవ్రంగా ఆలోచింపజేశాయి.

అనేక కథల్లో కుమ్మరివారి జీవితం ఎలా విధ్వంసమైయిందో స్పష్టంగా కనిపిస్తుంది. కుమ్మరి జీవనాన్ని చిత్రించిన కథలను పరిశీలిస్తే మనకు ఒక విషయం సుస్పష్టంగా అర్థమౌతుంది. అదెంటంటే ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణలు కులవృత్తికారుల్ని దెబ్బతీసి స్వయంగా పోషక గ్రామీణ వ్యవస్థలో ఆయువు పట్టయిన కులవృత్తులను తరిమివేసినాయి. పారిశ్రామిక రంగం వల్ల కుండకు ప్రత్నమ్నాయంగా అల్యూమినియం, స్టీలు, రావడం వల్ల వీటి వాడకం తక్కువైతే. ప్రపంచీకరణ ప్రభావంతో రైస్‌కుక్కర్, ప్రెషర్‌కుక్కర్, ఫ్రిజ్ లాంటివి రావడంతో పూర్తిగా కుమ్మరికుండ అంతరించిపోయింది.

కుండలను ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో ప్రవేశించిన వివిధ ఆధునిక వస్తువులతో పోటీపడలేక. వృత్తిదారులు పరిశ్రమలు పెట్టే శక్తి లేక తరతరాల నుండి వారసత్వంగా వచ్చిన కులవృత్తిని వదిలి మరొక వృత్తిలోకి వెళ్ళి బతికే పరిస్థితులు లేకపోవడంతో వీధిపాలయ్యారు కుమ్మరివారు. సమాజంలోని మార్పులకనుగుణంగా అభివృద్ధి చెందాల్సిందే అది ముమ్మాటికి కరెక్టే కానీ సమాజంలో 80 శాతం ప్రజలు వివిధ రకాల వృత్తి పనులు చేసేవారున్నారు. వారికి ప్రత్నామ్నాయ దారులను చూపడంతో ప్రభుత్వాలు విఫలం చెందాయని పై కథల్లో స్పష్టంగా అర్థమైంది.

ఆధార గ్రంథాలు:

1. జ్వలిత (సం), మల్లెసాల శతాధిక చేతివృత్తి కథలు, జే.డి.పబ్లికేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్, 2021.
2. మలయశ్రీ, ఐరేని కుండలు, రామాచంద్రమౌళి–నిరంతరమూ–అనంతరమూ, సంపత్ కుమార్–చిప్ప, శీరంశెట్టి కాంతారావు –ప్రయాస కథలు మొదలైన కథలు.
3. తెలంగాణ కథ–ప్రాంతీయ స్పృహ: బి.యస్. రాములు: సం.అయిలయ్య, కర్రె సదాశివ్: విశాల సాహిత్య అకాడమీ. ప్ర.ము. 2012
4. తెలంగాణ కథలు– (ముందుమాట) ఏటుకూరి ప్రసాద్, సం: కాలువ మల్లయ్య సదానంద శారద, చంద్ర – విశాలాంధ్ర పబ్లిషింగ్, హైదరాబాద్: ప్ర.ము. 2005
5. దేవేంద్ర, ఎం. తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రణ (1990–2010), చందన మారోజు పబ్లికేషన్స్, తార్నాక, హైదరాబాద్, 2021.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

దెంచనాల జ్వలిత జీవితం,సాహిత్యం - కథల పరామర్శ



బి. ప్రవల్లిక
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్.బి.వి.ఆర్. మహిళా కళాశాల,
నారాయణ గూడ, హైదరాబాద్

కీలకపదాలు:

కథ, కథానిక, సమకాలీనత, ఆధునికం, సంస్కృతి, సాంస్కృతిక జీవనం, గ్రామీణ నేపథ్యం, మానసిక ఘర్షణ, కులవృత్తులు, మానవ సంబంధాలు, స్త్రీవాదం, ప్రపంచీకరణ.

వ్యాససంగ్రహం:

సాహిత్యం, సారస్వతం వాఙ్మయం అనే పదాలు సామాన్యంగా ఒకే అర్థంలో వాడబడుతూ ఉంటాయి. సాహిత్యం అనే పదానికి "సహితస్యభావంః సాహిత్యమ్" "హితేన సహితం సాహిత్యం" అనే నిర్వచనాలున్నాయి. అంటే హితంతో కూడినది, హితం చేకూర్చేది అని ఆ నిర్వచనాలకు అర్థం. ఆధునిక కల్పనా సాహిత్య ప్రక్రియ లన్నింటిలోనూ, కథానిక ప్రముఖ స్థానాన్ని అలంకరిం చింది. ఆంగ్లంలోని Short Storyకి సమానార్థకంగా మనం 'కథానిక' అనే పదాన్ని వ్యవహరిస్తున్నాం. ఇంద్ర గంటి హనుమచ్ఛాస్త్రిగారు 1936లో 'ప్రతిభ' అనే పత్రికలో వ్యాసం రాస్తూ Short Story అనేదాన్ని 'చిన్నకథ' అని అనకుండా సంస్కృతంలో వున్న 'కథానిక' అనే పదాన్ని ఉపయోగించడం అన్ని విధాలా మంచిదని సూచించారు. అప్పటి నుండి Short Story 'కథానిక' అని పిలవడం పరిపాటి అయింది. అయితే 'కథానిక' అన్న పదాన్ని మనం సాహిత్యంలో మాత్రమే వాడుతున్నాం. ఎక్కువ మంది నిత్య వ్యవహారంలో కథ, కథలు అని వాడు తుంటారు. మొత్తం మీద కథానికను కథ అనీ, చిన్న కథ అనీ వ్యవహరిస్తున్నారు.

తెలంగాణ కథాసాహిత్యంలో తెలంగాణ కథకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడ కథ సమస్యలనుండే

పుట్టింది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని కథలకంటె తెలంగాణ కథ భిన్నంగా కన్పిస్తుంది. అందుకు కారణం చారిత్రకంగా కొన్ని వందల సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోని ప్రజలు నిత్యం సంఘర్షణలకు లోనవుతూ పరాయిపాలనలో మగ్గిపోవడమే, ఇక్కడి వాతావరణ పరిస్థితులు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవనవిధానం, ఆచార వ్యవహారాలు మిగతా ప్రాంతాల కంటే కూడా భిన్నంగా ఉంటాయి. 'పేదరికం, నిరక్షరాస్యత, భూసమస్య, వెట్టిచాకిరి, చాలీచాలని వ్యవసాయం, అణచివేత మొదలైన ప్రాంతీయ సమస్యలు తెలంగాణ కథకు మౌలిక లక్షణాలు' అందువల్లనే తెలంగాణా కథ సామాన్య మానవుని జీవితానికి వాస్తవికతా దర్శనంగా రూపొందింది. దీనికి అక్షర సాక్ష్యం జ్వలిత కథాసంపుటాలు. ఈ వ్యాసంలో జ్వలిత జీవితము,సాహిత్యంతో పాటు కథాసంపుటాలను సంక్షిప్తంగా పరిచయం చేయడమే ముఖ్య ఉద్దేశ్యం.

ప్రవేశిక :

కథకు వస్తువే అతి ముఖ్యం. అలాంటి వస్తువు సమకాలీన కథ విషయంలో కొంత భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే సమకాలీన కథ సామాజిక స్పృహతో, కాలచక్రంలో నలిగిపోతున్న మనుషుల యదార్థ సంఘటనల ఆధారంగా సమకాలీన సామాజిక అంశాలను కథా వస్తువుగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఇందులో కథా వస్తువు భిన్నమైన అంశాలతో సమాజ చిత్రణ చేశారు. ఈ పరంగా జ్వలిత కథలను పరిశీలించినట్లయితే కథావస్తువులో వైవిధ్యం కన్పిస్తుంది. ఈ కథల్లో సామాజిక స్థితిగతులను జ్వలిత కళ్ళకు కటించినట్లు చిత్రిస్తుంది. ఈ కథలకు వస్తువు సమ కాలీన సమాజమే. భాష సరళంగాను, విషయం సమకాలీనమైనదిగా వుండడంవల్ల కథ పాఠకుని హృదయానికి బాగా హత్తుకుపోతుంది. కథల్లో సృష్టించిన పాత్రలు వాస్తవిక దృక్పథాన్ని చాటుతాయి. అలాగే కథా ఇతివృత్తానికి తగినట్టుగా పాత్రలు ఇమిడిపోతాయి. ఎక్కువభాగం మధ్యతరగతి జీవనానికి ప్రతిబింబంగా ఈ కథల్లో నిలుస్తాయి. కథల్లో సామాజిక వాస్తవికతను దర్శించవచ్చు.

కవి ఏ కాలంలో జీవించాడో, ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, విషయాలన్ని జ్వలిత కథా రచనల్లో సమాజాన్ని ప్రతిబింబించారు. ఒక్కమాటలో చెప్పాలంటే జ్వలిత కథలు వాస్తవంతో కూడి ఆదర్శప్రాయంగా ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

జీవితం-సాహిత్య పరిచయం :

జ్వలిత అనే కలం పేరుతో కవిత్వం వెలువరిస్తున్న కవయిత్రి అసలు పేరు దెంచనాల విజయకుమారి. ఈమె దెంచనాల ఈశ్వరమ్మ, బ్రహ్మయ్య దంపతులకు 1959 మార్చి 11వ తేదీన ఖమ్మం జిల్లా తిరుమలాయపాళెంలో జన్మించింది. ఈమె స్వయంకృషితో ఎం.ఎ. తెలుగు, ఎం.ఎస్.సి సైకాలజీ, ఎం.ఇడి, ఎల్.ఎల్.బి. చదివింది. ఈమె భర్త తుంగతుర్తి జనార్ధనరావు. ఈమె తమ్ముడు దెంచనాల శ్రీనివాస్ తెలుగు నాటకరంగ రిపర్టరీలో నూతన ప్రయోగాలతో మలుపులు తిప్పుతున్న రచయిత. ఈమె ఉపాధ్యాయినిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. మూడు దశాబ్దాలుగా సాహిత్యంలో జ్వలిత కృషి చేస్తున్నారు. జ్వలిత తాను ముందు నడుస్తూ చుట్టూ సమాజాన్ని, సాహిత్య రంగాన్ని నడిపిస్తూ సాగుతున్న రచయిత్రి.

కవయిత్రి, కథకురాలు, అనువాదకురాలు, సంపాదకురాలుగా పేరు పొందినవారు జ్వలిత. గతంలో వీరు సంపాదకురాలిగా 2007లో స్త్రీవాద కవిత్వంతో "పరివ్యాప్త" సంకలనం, అమృతలత, రాజీవలతో కలిసి తెలంగాణ స్త్రీల కవిత్వంతో 2010లో "గాయాలే గేయాలై" సంకలనం, విశ్వకర్మ కవుల కవిత్వంతో 2013లో "రుంజ" కవితా సంకలనం వెలువరించారు. 104 మంది ఖమ్మం జిల్లా రచయితలతో 2016లో "ఖమ్మం కథలు" వెలువరించారు. సంపాదకురాలిగా విభిన్నమైన పుస్తకాలను తీసువచ్చే జ్వలిత 139 కథకులతో 'మల్లెసాల శతాధిక చేతివృత్తి కథలు' అనే బృహత్ గంథాన్ని తీసుకువచ్చారు.

ఆదర్శ ఉపాధ్యాయినిగా, ప్రధానోపాధాయులుగా ఎనలేని కృషిచేసి రిటరయ్యారు. వచన కవిత్వంలో 2007లో "కాలాన్ని జయిస్తూ నేను", 2008లో "మర్డర్ ప్రొలాంగేర్" (అనువాదం). 2009లో "సుదీర్ఘ హత్య", 2011లో "ఆత్మాన్వేషణ" కథల సంపుటి, 2012లో "అగ్నిలిపి", 2016లో సాహిత్య సామాజిక వ్యా సాలతో "జ్వలితావర్ణవాలు", 2019లో "సంగడి ముంత" (కవిత్వం), రూపాంతరం అనే మరో కథల సంపుటిలో 2019లో వెలువరించారు. వీరి సంపాదకత్వంలో 2007లో స్త్రీవాద కవిత్వంతో "పరివ్యాప్త" సంకలనం. అమృతలత, రాజీవలతో కలిసి తెలంగాణ స్త్రీల కవిత్వంతో 2010లో "గాయాలే గేయాలై" సంకలనం, విశ్వకర్మ కవుల కవిత్వంతో 2013లో "రుంజ" కవితా సంకలనం వెలువరించారు. అనేక కష్టాలకోర్చి మరుగున పడిన కథలను వెలికితీసి 2016లో 104 మంది ఖమ్మం జిల్లా కథా రచయితల కథలతో "ఖమ్మం కథలు" సంకలనం వెలువరించారు. ఖమ్మం బాల కవులతో "అక్షర పుష్పాలు భావ సౌరభాలు" సంపుటిని 2016లో వెలువరించారు. తాను రిటైరవుతున్న సందర్భంగా 2017లో "ఓరు" అనే సంచికను వెలువరించారు. (2019లో "పూలసింగిడి" పేరిట బతుకమ్మ కవిత్వానికి సహ సంపాదకత్వం వహించారు.) అంతేకాకుండా జెడి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో 126 మంది రచయితల డైరీ నుండి "కరోనా డైరీ" అనే సంకలనాన్ని 2020లో ప్రచురించారు. "గర్భికాతరువు" పేరిట 104 మంది ఒకపేజీ కథలతో 2020లో సంకలనం ప్రచురించారు. పసిపిల్లలపై లైంగిక హింసను ఖండిస్తూ రాసిన లేఖలతో "లేఖా ప్రక్రియ" లో వలోకనం' సంకలనం ప్రచురించారు.

పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పురస్కారంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం వంటి అనేక పురస్కారాలను అందుకున్నారు. ఇలా విస్తారంగా రాసిన జ్వలిత కవితలలో, కథలలో, సంపాదకీయాల్లో తనదైన ప్రత్యేక శైలి శిల్పం ఎన్నుకొని రచనలు చేస్తూ నిరంతరం జ్వలించే అగ్నిజ్వాల. జ్వలిత రచనలు చేయడంతో పాటు సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన ధీశాలి. నిజాన్ని నిర్భయంగా నిలువునా కాల్చే నిప్పుల గుండంలా మాటలో–రచనలో–ఆచరణలో చూపే జ్వలిత ఎవరికీ వెరవదు. ఎంతటివారినైనా ప్రశ్నిస్తుంది. నిలదీస్తుంది. జ్వలిత కృషి బహుముఖీనమైనది. ఖమ్మం జిల్లా రచయితల కథలను ఎన్నో కష్టాలకోర్చి సేకరించి సంకలం వేసి సాహిత్య చరిత్రకు తన వంతు తోడ్పాటును అందించారు. జ్వలిత కలిసి పనిచేసే క్రమంలో మహిళా రచయితల్లో కూడా వర్గాలు కులాలు ఉన్నాయి అని ప్రత్యేక భావాలు కులాల వారీగా కొనసాగుతున్నాయని గమనించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన జ్వలిత అనేక మహిళా సంఘాలతో, మహిళా రచయితలతో కలిసి నడిచే క్రమంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. ఇది కాదని తనదైన మార్గాన తాను సాగుతున్నా కనపడని కంచెలు ఎదుర్కొంటూ ఎదురీదుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1980లో స్త్రీవాదం ప్రాచుర్యంలోకి వచ్చింది. తెలంగాణాలోని సామాజిక ఉద్యమకారులు, పురుషులు స్త్రీవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

విశ్వజనీన విలువలు, సంస్కృతి, మానవ సంబంధాలు, పరిణామాలను స్థానిక, స్థల, కాల, కులాల నిర్దిష్ట జీవితం, సంస్కృతిలో భాగంగా చిత్రించినప్పుడు ఆ సాహిత్యం మాత్రమే విశ్వజనీన సాహిత్యమవుతుంది. విశ్వజనీన సంస్కృతి, మానవీయ విలువలు, స్నేహం, ప్రేమ, కరుణ, పరోపకారం, ఇంద్రియ సంవేదనలు చిత్రించకుండా కేవలం ఆయా కులాల సంస్కృతి, ఈతి బాధలు, ఎదుగుదల వికాసం చిత్రిస్తే అవి కేవలం స్థానిక భాషా సాహిత్యంగానే మిగిలిపోతుంది. అందువల్ల ఏ కులం గురించి చిత్రించినా, ఏ వర్గం గురించి చిత్రించినా, ఏ ప్రాంతం గురించి చిత్రించినా స్త్రీల గురించి, పురుషుల గురించి చిత్రించినా, బాలల గురించి చిత్రించినా, దంపతుల గురించి చిత్రించినా, కులాంతర వివాహాల గురించి చిత్రించినా వాటన్నిటా మహోన్నత మానవీయ విలువలు, సంస్కృతి, ఉదాత్త వ్యక్తిత్వాలు, స్వభావాలుగా ఎదిగిస్తూ చిత్రించినప్పుడే అది ప్రపంచ సాహిత్యంలో భాగం అవుతుంది. దళిత, బహుజన సాహిత్యం ఇప్పుడిప్పుడే దీన్ని అర్థం చేసుకొని ఉన్నత స్థాయిని చేరుకునే ప్రయత్నం చేస్తున్నది. ఈ అంశాలన్నీ జ్వలిత కథాసాహిత్యంలో చూడవచ్చు.

కథా సాహిత్యం-సంక్షిప్త పరిచయం :

రూపాంతరం కథా సంపుటిలో 22 కథలున్నాయి. అవి: రూపాంతరం, అమ్మ ఓడిపోయింది, పసిదెట్ల అయితది, పాతగాయం, కర్మఋణ, సహ అనుభూతి వెలిగించిన దీపం, కొత్తమందు, యశోదమ్మ కల, ప్రత్యమ్నాయం, ఒయాసిస్, ఆత్మాన్వేషణ, పడిగాపుల పండుగ, మాయమవుతున్న మనసు, సిబ్బి, మానవసరోవరం, రాజుగారు... కప్పల చెరువు, నాన్మా ! వాడెవ్వడు ?, సహస్రధార, బలికుసుమాలు, ఊరిడిచిన ఉత్తరం, మా ఊరి వేపచెట్టు, ప్రశ్నించే పంజరాలు పెడ దోరణిన పడుతున్న సమాజంపట్ల విచ్ఛిన్నమవుతున్న అనుబంధాలపట్ల వీగిపోతున్న విశ్వాసాల పట్ల వేదన చెందుతుంది. ఈ సంపుటిలో కథలన్నీ జ్వలిత సమాజాన్ని చూసి ప్రజల పడుతున్న బాధలను గమనిస్తూ రాసినవే. ఇవి ఆమె కలం నుంచి రాల్చిన కన్నీళ్ళు బడభాగ్నుల సమూహాలే. ఇంతటి వైవిధ్యమున్న కథలను ప్రతి ఒక్కరూ చదువ వలసిన అమూల్యమైన కథలివి.

మాతృక కథా సంపుటిలో 15కథలున్నాయి అవి: మాతృక, పోరి, ఫర్వాన్తై, వలయం, సంకల్పం, జిల్లేడు కాయ, విత్తన సైనికులు, గుల్దస్తా, క్యాస్ట్ విడో, పగబట్టాడు, బతుకు నాటకం, ఆపద్ధర్మం, శిశిరోన్ముఖం, పెనుభూతం, అభినందన గేయమాలిక

గత మూడు దశాబ్దాలుగా సమాజిక వైవిధ్యంతో కథలు రాస్తున్న జ్వలిత వెలువరించిన సరికొత్త కథాసంపుటి ఇది. మహిళ లోకానికి తోడ్పాటుగా నిలిచి, కొత్త ఆలోచనలకు, కొత్త చూపుకు ఈ కథా రచనా ఒక దిక్సూచి అని చెప్పవచ్చు.

ఆత్మాన్వేషణ కథా సంపుటిలో 12 కథలున్నాయి. అవి: ఆత్మాన్వేషణ, పడిగాపుల పండుగ, మాయమవుతున్న మనసు, సిబ్బి, మానవ సరోవరం, రాజుగారు.... కప్పల చెరువు..., నాన్మా వాడెవ్వడు, సహస్రధార, బలికుసుమాలు, ఊరిడిచిన ఉత్తరం, మా ఊరి వేప చెట్టు, ప్రశ్నిస్తున్న పంజరాలు.

ఈ కథల్లో సమాజిక పరిణామం వెనుక సాగే మానసిక సంఘర్షనలు కన్పిస్తాయి. వీటితోపాటు మారుతున్న మానవసంబంధాలను, కుటుంబ సంస్కృతిని, ఆవిష్కరించిన వైవిధ్యమున్న దృశ్యమాలిక ఆత్మాన్వేషణ.

ముగింపు :

సమాజంలో జరిగే పరిణామాలకు సాహిత్యం దర్పణం. సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో కథ ఒకటి. జ్వలిత తెలంగాణ కథ సమకాలీన పోకడలను పట్టించుకుంది. అలా అది ఒక చారిత్రక వనరుగా మిగిలింది. వర్తమానంలో బహుజన కులాల్లో వస్తున్న మార్పులను రూపాంతరం కథ చూపించింది. "ప్రపంచీకరణ ప్రభావం వల్ల కుల వృత్తులు ఎలా ఛిద్రం అయ్యాయో కథ చెప్పింది. చేతివృత్తుల కళ జాతి జీవనానికి ఎలా పాదులు వేసిందో వివరించింది. మొత్తంగా బహుజన కథ మానవ శ్రమకు పట్టం కట్టింది.

ఈ కథలు సమాజలోపలి పొరల్లోని మలినాన్ని బయటపెట్టాయి. దాని బాధితుల వేదనను ప్రపంచానికి అందించాయి. వారి అస్తిత్వాన్ని ఎరుక పరుస్తూ ఆత్మగౌరవాన్ని డిమాండ్ చేసాయి. రాజకీయ అధికారం ద్వారానే సాధికారత, సామాజిక న్యాయం, సామాజిక మార్పు సాధ్యమని తేల్చాయి. బహుజన చైతన్యపు ఆనవాళ్ళను అందించాయి. చమట చుక్కల ఉదాత్త వ్యక్తిత్వాలను ఆవిష్కరించాయి. శ్రామికుల స్వచ్ఛ ఆలోచనలను, అమాయక ధోరణులను పదిలపరిచాయి. ఈ కథలు బహుజన ప్రపంచాన్ని కంటిపాప వరకు తెచ్చిపెట్టాయి. సామాజిక మార్పుకు, వ్యక్తిగత చైతన్యం కూడా దోహదపడుతుందని నిర్ణయించాయి. ఈ కథలు అనేక సామాజిక సమస్యలను వివరిస్తూ వాటికి పరిష్కారాన్ని చూపిస్తూ విశ్లేషించాయి.

ఆధార గ్రంథాలు:

1. రూపాంతరం, జ్వలిత, సాహితీవనం ప్రచురణ, కూకట్‌పల్లి, హైదరాబాద్, 2019
2. ఆత్మాన్వేషణ, జ్వలిత, నిరుపమ సంజన ప్రచురణలు, కూకట్‌పల్లి, హైదరాబాద్, 2011
3. మాతృక, జ్వలిత, జే.డి.పబ్లికేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్, 2025
4. అనురాధ.జె, రచయిత్రుల కథానికలు–స్త్రీల సమస్యల చిత్రణ, శోధనా ప్రచురణలు, హైదరాబాద్, 2011
5. గిరిజామనోహరబాబు.జి, కథకు శతమానం (కథానిక సాహిత్య వ్యాసాలు) సం:గన్నమరాజు ఫౌండేషన్, 2012.
6. ప్రాంతీయ చైతన్యం–తెలంగాణ సాహిత్యం – కాత్యాయనీ విద్మహే, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్ ప్ర.ము. 2000.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాభ్యుదయ పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

తెలంగాణ వృత్తి జీవన కథలు - సామాజిక వైవిధ్యాల పరిశీలన



డా॥ వెంకట్ బాలగోని
సినీరచయిత
హైదరాబాద్

కీలక అంశాలు :

కథ, గ్రామీణ కులవృత్తులు, సామాజిక వాస్తవికత, సాంస్కృతిక చిత్రణ, స్త్రీ సమస్యలు, ఆచారాలు, ఆర్థిక స్థితిగతులు, ఇతివృత్త వైవిధ్యం, సమాజ చిత్రణ, రైతు జీవనం.

వ్యాస సంగ్రహం :

భారతదేశంలో గ్రామాలింకా గ్రామాలుగానే ఉండడం వల్ల గ్రామీణ సమాజమే సంస్కృతికి ప్రధానమైన స్థావరంగా కొనసాగుతూ భారతీయ సంస్కృతికి నిజమైన అర్థం గ్రామాలలోనే దొరుకుతుంది. గ్రామీణ జీవన సంస్కృతిని ప్రతిఫలించే చిత్రణలు తెలంగాణ నవలా రచయిత్రుల నవలేతివృత్తంలో చోటు చేసుకున్నాయి. కులవ్యవస్థ పాలన గ్రామీణ సంస్కృతిలో ఒక భాగం. కుల వ్యవస్థ పునాదుల పైననే గ్రామీణ సామాజిక జీవనం నిలబడుతూ వచ్చింది. తెలంగాణ పల్లెలు కన్నీరు పెట్టుకొవడానికి ఎన్నో కారణాలు ఉన్నప్పటికీ ప్రధానంగా అగుపించేవి మూడు కారణాలే. ఒకటి వ్యవసాయం రెండు కులవృత్తులు మూడు మానవీయ సంబంధాల విధ్వంసం. తెలంగాణ కథల్లో చిత్రితమైన గ్రామీణ వాతావరణం, కులవృత్తులు, సామాజిక ఆర్థిక స్థితి గతులు, అభిరుచులు, పనులు, వినోదాలు, విందులు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, దేవతలు-మొక్కులు మొదలైన వానిని విశ్లేషించినట్లయితే గత జీవితపు తాలూకు గ్రామీణ జీవనం విశదమవుతుంది. ఈ కథలన్నీ గ్రామీణ

ప్రజాజీవనాన్ని ప్రతిబింబించేవే. తెలంగాణ గ్రామీణ వ్యవసాయం అన్ని విధాల అడుగంటి పోయింది. ప్రస్తుతం రైతును కాపాడే నాథుడే లేడు. రైతుల కుటుంబాలకు మిగిలింది ఆత్మహత్యల పర్వమొక్కటే. ఇటువంటి పరిస్థితులలో రైతులు కుటుంబాలతో భూమిని వదలి గుండె కోతతో వలసలు పోతున్నారు. 'అలాగే గ్రామీణ కులవృత్తులు చేతి వృత్తులు మటుమాయమై పోయాయి. గ్రామీణ ప్రజలకు కులాలున్నాయి కానీ కులవృత్తులు లేవు. ప్రపంచీకరణ ద్వారా అన్ని వృత్తుల వాళ్ళు అనాథలయ్యారు. కులవృత్తుల్ని వదిలేసి మరోవృత్తిలో స్థిరపడేంత శక్తికానీ జ్ఞానంకానీ తెలంగాణ ప్రజలకు లేక పోవడంవల్ల పల్లె బతుకు వెర్రిలిడిన పోయింది. ప్రపంచీకరణ వల్ల గ్రామీణ ప్రజలు మరింత పరాయీ కరణకు గురయ్యారు. ప్రపంచీకరణ వల్ల మానవ సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలుగా మారిపోతాయని ఈ వ్యాసంలో విశ్లేషించడమైనది.

ప్రవేశిక :

ప్రతి మనిషి జీవితంలో కష్టాలు, బాధలు, ఆనందాలు, సమస్యలు ఎదుర్కొనక తప్పదు. మనిషి బాధలు కలిగినప్పుడు కుంగిపోవడం, ఆనందం కలిగినప్పుడు ఉత్సాహంగా ఉండడం సహజం. కష్టం కలిగినప్పుడు, ఆ కష్టాన్ని బట్టి మనిషి మనసు అనేక విధాలుగా ఆలోచిస్తుంది. మనసు సంఘర్షించుకొని బాధపడుతుంది. మనిషి మనస్తత్వాన్ని బట్టే మానసిక సంఘర్షణ ఉంటుంది. "సాహిత్యంలో కుల సమస్య ఇప్పటి వరకూ ఓ అంటరాని వస్తువు గానే ఉండి పోయింది. సాహిత్యం విశ్వజనీన సార్వకాలీన సత్యాలను ఆవిష్కరించాలన్న సాధారణ సూత్రం కింద నిర్దిష్టతని కోల్పోయింది. తెలుగు సాహిత్యంలో వీస్తున్న కొత్తగాలుల వల్ల సంప్రదాయక మైన కళాసౌందర్య భ్రమలు తొలగిపోయి, అస్పృశ్యమైన వస్తువు ఏదీ లేదన్న భావం బలపరుస్తున్న సమయం ఇది. ముఖ్యంగా కుల సమస్య, మత భావాల వ్యక్తీకరణలు ఇప్పుడు అనివార్యమైన సాహిత్య వస్తువులుగా మారాయి. ఒకప్పుడు సందర్భవశాత్తు కులమతాల ప్రస్తావన వస్తేనే పెద్ద కల్లోలం చెలరేగేది" ఇప్పుడు తెలంగాణ సాహిత్యం ఆ పరిస్థితిని అధిగమించింది.

సమకాలీన సమాజాన్ని ఆవిష్కరిస్తూ కులవృత్తి వర్గాల సమస్యలకు మూలాల్ని అన్వేషిస్తూ, సామాజిక వాస్తవికతకు దర్పణం పడుతూ పరిష్కారాల్ని సూచిస్తూ సాగింది తెలంగాణ కథా ప్రస్థానం. స్థిరీకృత, ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నించడంతో కథా రచయితలు ఒకడుగు ముందు వేసినారు. తెలంగాణ ప్రాంతం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంక్షోభానికి గురవడం ఈ ప్రాంత కథా రచయితలకు బలమైన వాహికగా, కథా వస్తువుగా నిలచింది. ప్రధానంగా పరాయీకరణ, వలసలు, గ్రామాలు విధ్వంసమవడం, మనిషి వ్యాపారవస్తువుగా మారడం, సంస్కృతి విచ్ఛిన్నతకు పరాయి వారి భాషా, సంస్కృతుల ఆధిపత్య ధోరణులు, జీవనవిధానంలోని అంతరాలు, సామాన్యునికి చేరని స్వాతంత్ర్య ఫలాలు కథా రచయితల్ని తీవ్రంగా ఆలోచింపజేశాయి. ఈవిధమైన తెలంగాణ తెలంగాణ వృత్తి జీవన కథలను వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

సామాజిక వైవిధ్యాల పరిశీలన :

1. గ్రామీణ నైపథ్య కథలు 2.వలసలను చిత్రించిన కథలు
3.స్త్రీ జీవనం/సమస్యలు 4. మానవ సంబధాలు

1. గ్రామీణ నైపథ్య కథలు :

గ్రామీణ సమాజంలో కులం ప్రధానమైన సామాజిక సమస్య. అగ్రవర్ణ, వర్గాలలో అనేక కులాలున్నట్లే. బహుజనులు ఎదుగుతున్న క్రమంలో ఉద్యోగం చేస్తున్న వాళ్లలో, హోదాను బట్టి వర్గాలు పుట్టుకొస్తాయని 'కొత్తకులాలు' కథ తెలుపుతుంది. ఈ కథలో ఆఫీసర్ ఇంట్లో పార్టీకి వెళ్ళడమే తప్పయిందని, ఆఫీసర్ భార్య తన పట్ల అమర్యాదగా ప్రవర్తించినట్లు లక్ష్మీ తన

భర్త నారాయణతో అంటుంది. ఆమెకు జవాబుగా 'లక్ష్మీ మన సమాజంలో అనేక కులాలున్నాయి. వాటికి తోడు కొత్తకులాలు పుడుతున్నాయి. ఆఫీసర్ల కులం, గుమాస్తాల కులం. ఎగ్జిక్యూటివ్‌ల కులం.. కార్మికుల కులం.. యజమాన్ల కులం.. పనిమనుషులకులం.. చదువుకున్నోల్ల కులం... చదువురానోళ్ళకులం... ఖద్దరుబట్టల కులం... తెల్లబట్టలకులం.. కాలినడకకులం.. ఉన్నోళ్ళకులం.. లేనోళ్ళకులం.. ఇలా ఎన్నో కులాలు పుట్టుకొస్తున్నాయి'. అని చెప్పాలనుకున్నా నారాయణ మాటల్ని బట్టి మనుష్యులంతా ఒక్కటే అనే భావన లేకుండా పోయినట్లు తోస్తుంది. ముదిగంటి సుజాతరెడ్డి– పలాయనం, కాలువ మల్లయ్య–కుక్కసద్ది, పెద్దింటి అశోక కుమార్ గోస, దిలావార్ నడక మొదలైన కథలతో పాటు మరికొన్ని కథల్లో గ్రామీణ నేపథ్యం కన్పిస్తుంది.

పట్టణాలలో మానవసంబంధాలు పలుచన. వస్తువ్యామోహసంస్కృతిలో పడి మానవ ప్రేమలు నానాటికీ దిగజారిపోతున్నాయి. మనిషి మాట, ప్రేమలు అన్నీ వస్తువులతో సుఖాన్వేషణ, భోగలాలసత్వం, ఆడంబరాల ప్రదర్శనల జీవితం ఇవే పట్నం బతుకులు. పల్లెల్లో అందుకు విరుద్ధంగా సమిష్టి జీవన సంస్కృతి కనిపిస్తుంది. కులాలుంటాయి. ఆర్థిక అంతరాలూ ఉంటాయి కానీ ప్రేమలూ ఉంటాయి. కులాలతో పిలుచుకుంటారు, ఆపేక్షలతో జీవిస్తారు. కులవృత్తులకు విలువనిస్తారు. చాకలి, మంగలి, గౌండ్ల, గొల్ల, ఉప్పరి, కుమ్మరి, పద్మశాలి, వడ్రంగి, కంసాలి, మాల, మాదిగ, అందరూ పలకరించుకుంటూ సహకరించు కుంటూ సహజీవనం సాగిస్తారు. ఇప్పుడంటే ూూ మనుషులు తెలివి మీరి పట్నాల గాలి సోకి మారిపోతున్నారు.

2. వలసలను చిత్రించిన కథలు :

కొక్కుల భాస్కర్ రాసిన 'తెగినపోగు' కథ పద్మ శాలీలు చేనేత వృత్తి గిట్టుబాటు కాక బొంబాయి, భీవండి వలస వెళ్ళిన క్రమాన్ని చిత్రిస్తుంది.

కొక్కుల భాస్కర్ 1980 నుండి కళా సాహిత్య పత్రికా రంగాలకు అంకితమయిన వ్యక్తి ఒకటి రెండు సినిమాలు తీసి మధ్యలో ఆగిపోయారు. ప్రఖ్యాత ఆర్టిస్ట్ గంగాధర్తో కలిసి తీసిన కళాత్మక టివి డాక్యుమెంటరీకి రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు వచ్చాయి. ఏడవ తరగతి వరకే చదువుకున్న కొక్కుల భాస్కర్ పత్రికా రంగంలో కృషి చేయాలని పట్టుదల.గత తొమ్మిదేళ్ళు పద్మపీఠ మాసపత్రికను పద్మశాలి సమాజంలో చైతన్యం కోసం వెలువరిస్తున్నారు. ఐదారు కథలు రాశారు.

ఈ కథలో బొంబాయి వలసక్రమంలో పద్మశాలి సమాజం తాలుకు మారిపోయిన కుటుంబ సంబంధాలు ఆర్థిక స్థితిగతులు చాతగాని దశలో తిరిగి ఇల్లు చేరేసరికి పేదరికం తప్ప ఏమీ మిగలని దశను. జీవితం 'తెగిన పోగు'లా మారిన హృదయ విదారక జీవన దృశ్యాన్ని చిత్రించింది.

"ఎప్పుడో చిన్నతనంలో తాను కళ్ళారా చూసిన దృశ్యాలు కరువులో కోత కంపుతున్నప్పుడు కసాయి వెంట దీనంగా నడచిన ఎడ్లూ, వంటచెరుకు కోసమని చింత చెట్ల కొమ్మలు నరుకుతున్నప్పుడు నేలరాలి పగిలిన కొంగ గుడ్లూ, రోడ్డు పోసేందుకని సర్కారువారు రచ్చబండ కాడి రావిచెట్టు కూల్చినప్పుడు కిందపడి చచ్చిన జెముడు కాకి పిల్లలూ రోజూ కలల్లోకి వస్తూండగా ఆ ముసలమ్మకు గత రెండు రోజుల్నుండి నిద్రపట్టడం లేదు. బతుకుదెరువు వెదుక్కుంటూ తన కొడుకులు, వాళ్ళవెంట కోడళ్ళు ఒక్కరొక్కరుగా వలస వెళుతున్న పక్షుల తీరు దూర ప్రాంతాలకు తరలి పోతూండటం పట్ల ఆమె తీవ్రంగా కలత చెందుతున్నది. **(త్రిభుజపు నాలుగోకోణం, పుట.214)**

"గోపిని ఏవలసకూలీలూ పట్టించుకోలేదు. ఎవరి బతుకు తీపి వారివి. ఈ కరోనా ఎంత క్రూరమైనది! కరచాలనాలు

లేవు. ఆలింగాలనాలు లేవు. ఆత్మీయతలు లేవు. ఆప్యాయతలు లేవు. అనుబంధాలు లేవు. దూరం దూరం సామాజిక దూరమట! ఇంటోవారికే ఎవరికైనా ఆ మహమ్మారి సోకినా ఇక అంతే సంగతులు. ఎడమొఖం పెడమొఖమే. మానవత్వం బలవంతంగా మంట గలిసే రోజులొచ్చాయి. **(నడక, పుట.238)**

3. స్త్రీ జీవనం/సమస్యలు : కాలంతో పాటు నడుస్తూ, నిరంతర చైతన్యాన్ని నడకలో నింపుకుని ముందుకు కదులుతూ పోవడమే తన జీవన విధానంగా చేసుకొన్నారు. సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర అనన్య సామాన్యం. భారతదేశంలో స్త్రీకి చాలా గౌరవం ఉంటుంది. ఇది నాణానికి ఒక వైపు, మరోవైపు నిరాదరణకు గురి చేసిన సంఘటనలే ఎక్కువగా కనిపిస్తాయి. తన జీవిత ఆశయాలను పక్కకు నెట్టి సమాజంలో నేటికి ఉత్తమ సమాజ నిర్మాతలుగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమాజంలో ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొంటూ తమ జీవితాన్న కొనసాగిస్తున్నారు మరీ ముఖ్యంగా నిరుపేద స్త్రీ జీవితం మరింత దుర్భరంగానే ఉంటుంది.

"తాగుడుకు బానిసయి పిల్లల పోషణ భారం వహించని భర్త ఉన్నా, లేకున్నా ఒకటేనని శ్రమను నమ్ముకున్న మహిళగాథ ముదిగంటి సుజాతరెడ్డి 'పలాయనం' (1998).

మల్లమ్మ చంద్రయ్య భార్యాభర్తలు, చంద్రయ్య తాగుబోతు. మల్లమ్మ కుటుంబానికి జీవనాధారం తండ్రి ఇచ్చిన ఇస్త్రీ పెట్టే. ఇస్త్రీ చేసిన కష్టార్జితం తాగుడుకు హారతి కర్పూరం చేస్తాడు. కష్టానికి వెనుక తాగుడుకు ముందు ఇదే తంతు. మల్లమ్మను ఇండ్ల జాగా కొంటానని నమ్మించి పెళ్ళిలో పెట్టిన నగలు అన్నీ ఖర్చు పెట్టేసాడు. "దెబ్బలకు ఒళ్ళు నొప్పిగా వున్నా ఆగకుండా ఇస్త్రీ చేస్తూనే వుంది మల్లమ్మ. గీ బట్టలు జల్ది అయితే గిన్ని పైసలు ఎంటనే చేతులబడ్డయి! గిన్ని నూకలు ఒస్తయి. రాతిరికైన కడుపునిండ పోరగాల్లకు తనకు గింత కూడయినా దొరుకుతది!" అన్న ఆలోచన మల్లమ్మ మనస్సులో జోరీగ లాగ తిరుగుతున్నది. ఆమె చేతిలోని ఇస్త్రీ పెట్టె ఆగడం లేదు. **(పలాయనం, పుట.115)**

ఇల్లు, పిల్లలు, సంసారం కాబట్టదు. చివరికి ఇస్త్రీ పెట్టినీ కూడ తాకట్టు పెట్టి తాగాడు. మల్లమ్మ తండ్రి సంగయ్య వచ్చి విడిపించి వెళ్ళాడు. ఐదు మంది పిల్లలు. చంద్రయ్యకు ఏ పనీచేయకున్నా వేళకు తిండి పెట్టాలి. మల్లమ్మ తండ్రిని సాగనంపి వచ్చిన చంద్రయ్య వేళకు కూడు పెట్టలేదని భార్యను చితకబాదాడు. ఆ దెబ్బలకు నోటమాటరాక కుప్పకూలిపోయింది. చనిపోయిందని చంద్రయ్య జారుకున్నాడు. చాలా ఏండ్ల వరకు పత్తాలేడు. జాతరలో బిక్షమడుక్కుంటూ కనిపించాడని వార్త. చలించలేదు మల్లమ్మ. పలాయినం కథలో ముదిగంటి సుజాతారెడ్డి రజక స్త్రీల కష్టాలను వేదనతో వర్ణించారు.

"శోభ పెళ్లయ్యాక భూమలింగంకు పొట్ట గడవడం కష్టమయింది. కొడుకులు లేకపోవడంతో కూతురుకే అన్ని విద్యలు నేర్పించాడు. సాధనా శూరుల వృత్తిలో అన్ని మెలకువలను నేర్చుకుంది నోటి పళ్లతో కర్రను అదిమిపటి నాగలిని పైకెత్తేది. బలమైన ఇనుప సలాకను గొంతువద్ద తగిలించుకుని వంచేది. చిన్న ఇనుప రింగులోంచి ముందుగా తల, తర్వాత చేతులు పెట్టి ఈగేది. తాడుపై నడిచేది. నిండు బిందెను ఏళ్లతో ఎత్తేది.

పెళ్లయ్యాక ఆట వస్తువులన్నీ మూలకు పడ్డాయి. బతుకుదెరువు కోసం కోతిపిల్లను పెంచాడు రామలింగం. రింగ్ లోంచి అటూ ఇటూ దూకడం. పల్టీలు వేయడం, దండం పెట్టడం, రాయిని నెత్తిమీద ఎత్తుకుని నడవడం, డ్యాన్స్ చేయడం లాంటి చిన్న చిన్న ఆటలు నేర్పించాడు. ఆనాటి నుంచి అదే అతడికి జీవనోపాధి అయింది. ఊర్లల్లో, బళ్లల్లో కోతిని ఆటలు ఆడిస్తూ పూట గడుపుకునేవారు. గడుపుకునేవారు. **(గోస, పుట.622)**

సారవల్ల నష్టపోయిన కుటుంబాల్లోని మహిళల ముఖంలో ఆనందం కనిపించింది. ఇదే మంచి అవకాశం అనుకొని కొందరు మహిళలు చీపురు అందుకున్నారు. మరికొందరు చెప్పులు చేత పట్టుకున్నారు. ఇలా ఒకర్ని చూసి మరొకరు మహిళలందరు బయలు దేరినారు.

కాటమయ్య మెల్లమెల్లగా నడుస్తున్నాడు.

మహిళలు మాత్రం వేగంగ నడుస్తున్నారు.

గొండ్లోల్లు వెనుకపడ్డారు.

సారనిషేద ఉద్యమంలో మహిళలు ముందు పడ్డారు. తమ జీవితాలను నాశనం చేస్తున్న సారపై నిరసన తెలుపుతూ సాగుతుంది దండోర. **(కాటమయ్య, పుట.680)**

అనాది కాలం నుండి నేటి వరకు స్త్రీ వైయక్తికంగా సామాజికంగా, కుటుంబపరంగానూ, లైంగికంగానూ అనేక సమస్యలతో సతమతమవుతూ ఉంది. తెలుగు సాంప్రదాయంలోనూ, సాహిత్యంలోనూ ఒకవైపు స్త్రీని గౌరవించాలి అంటూనే అణచివేయబడిన సంఘటనలు సమాజంలో మనకు చాలానే కనిపిస్తున్నాయి. అనేక సందర్భాలలో స్త్రీలకు సంబంధించిన సంఘటనలు, సమాజంలో వారికి ఇస్తున్న స్థానం వంటివి స్త్రీని అణచివేస్తూ ఊపిరాడనివ్వకుండానే చేస్తున్నాయి.

ఆధునిక కాలంలో అనేక ఉద్యమాల కారణంగా స్త్రీల పరిస్థితిలో కొంతలో కొంత మార్పు వచ్చింది. మారుతున్న కాలానికి అనుగుణంగా స్త్రీలు కూడా అన్ని రంగాలలో రాణిస్తూ వారు కోల్పోతున్న హక్కులను పొందడానికి పోరాటం చేస్తున్నారు. దానిని సాహిత్య, సాంస్కృతిక రంగాలకూ విస్తరిస్తున్నారు. దీనిలో భాగంగానే కులవృత్తి కథలు వచ్చాయి.

ముదిగంటి సుజాతారెడ్డి, కె.ఎ.ఎల్. సత్యవతి, డా.పెళ్ళకూరి జయప్రద, చల్లా సరోజినీ దేవి, ఎమ్. వి. ఉమాదేవి, జ్వలిత, దామరాజు విశాలాక్షి, గీతాంజలి, సుజన నామని, డా. దాసోజు పద్మావతి, జి.విజయలక్ష్మి, షాజహానా, అనిశెట్టి రజిత, డా.కొండపల్లి నీహారిణి, డా.వంగరి త్రివేణి, డా.గంధం విజయలక్ష్మి, యడవల్లి శైలజ, ఎండపల్లి భారతి, ఓరువాల సరిత, ఆచార్య సూర్యధనుంజయ, డా.తాళ్లపల్లి యాకమ్మ, పెద్దపల్లి తేజస్వి, రమాదేవి బాలబోయిన, మహతితేజశ్రీ, నాంపల్లి సుజాత, పొన్నడగౌరి, గుగులోత్ తులసి, డా. ప్రతిభా లక్ష్మి, సిస్టర్ అనసూయ, శ్రీలత సవిడిబోయిన, వానరచెట్ల జయంతి, సరోజన బోయిన, సుమతి చురుకంటి మొదలైన రచయిత్రులు మల్లెసాల సంకలనంలో స్త్రీల సమస్యలను ఆవేదనలను కళ్ళకు కట్టించారు.

4. మానవ సంబధాలు :

తరిగిపోతున్న మానవ సంబంధాలు, అట్లాకావడానికి దారి తీసిన పరిస్థితులను గూర్చి విడమరచి చెప్పేకథ 'పేగుబంధం' ఈ కథలో రామయ్య అనే రైతు దున్నపోతులతో వ్యవసాయం చేస్తూ రావడంతో ఊళ్ళో 'దున్నపోతుల రామయ్య'గా అవహేళనకు గురువుతాడు. పరిస్థితులు అనుకూలించి ఆ యేడు పండించిన పంటకు గిట్టుబాటు ధర పలకడంతో, ఎడ్లు కొనాలనే తనచిరకాల కోరిక నెరవేరబోతున్నందుకు సంతోషించాడు. అనుకోని సంఘటనగా తండ్రి చావుబతుకుల్లో ఉన్న పరిస్థితుల్లో తండ్రి చనిపోతేనే తన కోరిక నెరవేరుతుందను కుంటాడు. బస్సులో బయలుదేరి ఆస్పత్రికి వెళ్తున్నప్పుడు దారిలో చూసిన దృశ్యం మనస్సు కలచివేయగా, ఆఖరికి మనస్సు మార్చుకొని తండ్రిని రక్షించుకోవడానికి ఉద్యుక్తుడౌతాడు. మనిషిలో మిణుకు మిణుకు మంటూ ఆరిపోయే స్థితిలో ఉన్న మానవత్వాన్ని చివరకు పేగు బంధమే గెలుస్తుందని ఈ కథ ద్వారా నిరూపిత మవుతుంది.

మనిషి పుట్టినప్పటి నుండి నేటి వరకు మానవ సంబంధాలు వర్ధిల్లుతూనే ఉన్నవి. అవయే ప్రాతిపదికలపై అవి కొనసాగుతున్నవో వాటిని ఆయా పేర్లతో పిలుస్తున్నరు. ఇదంతా దృష్టి భేధం వల్ల జరుగుతుంది. సాహిత్యం విశ్వమానవ కళ్యాణాన్ని కాంక్షిస్తుంది. అదే అలవరసలపై కథ సాగుతున్నది. మానవ సంబంధాలకు కథ పెద్దపీట వేసింది. తెలంగాణ కథకులు ఆ దారిలో కథను ముందుకు నడిపారు.

ఒక ప్రాంత సంస్కృతీసంప్రదాయాలు, అక్కడి ప్రజల ఆదానప్రదానాలను, మనుగడను సూచిస్తాయి. వీటి వల్ల ఆ కాలపుప్రజల మానవీయ స్పందనలు, స్ఫూర్తి, జీవన ప్రమాణాలు తెలుస్తాయి. తెలంగాణది పల్లె సంస్కృతి. ఇక్కడ ఉ త్సవాలు, ఉర్సులు, వేడుకలు ఎక్కువ. జానపదులు శ్రమజీవులు, తెలంగాణవారు సమిష్టికి పీట వేస్తారు. వీరిది ఉమ్మడి సంస్కృతి. ఊరుమ్మడి బ్రతుకు. దీన్ని గమనిస్తే ఇక్కడ విరిసిన మానవీయత తెలుస్తుంది.

'విధ్వంసం' కథలో దొమ్మరాటలను నమ్ముకొని జీవనం గడిపే వృత్తిదారుల గురించి రాసి సర్కస్ ద్వారా ఎంత కష్టపడి అన్నం అడుక్కుంటారో జాతశ్రీ 'విధ్వంసం' కథని అద్భుతంగా చిత్రీకరించారు.

ఈ కథలో దొమ్మరిపోశం మరియు గురవ్వ భార్య భర్తలు. వీరికి పోలి అనే కుమారి ఉంటుంది. అలాగే కొండాలు అనే కుమారుడు కూడా ఉంటాడు. సంకలో పాము బుట్టను, తలపై తట్టెడు బరువుతో ఊరురా తిరుగుతూ సంచార జీవితం గడుపుతాడని జాత శ్రీ దొమ్మరిపోశం ద్వారా కథని చక్కగా చిత్రీకరించాడు. పాముతో అద్భుతాలు, మ్యాజిక్లు చేయించి ధాన్యం గింజలను ఎలా అడుక్కొని కడుపునింపుకుంటారో ఈ కథలో చూపించాడు. ఎర్రటి ఎండలో దారిలో నడుస్తూ, భుజాల మీద తమ వస్తువులను మోసుకుంటూ, మరికొన్ని బరువైన సామాగ్రిని గాడిద మీద ఎక్కించి దొమ్మరోల్లు ఊరురా తిరుగుతారని జాతశ్రీ చెప్పిన తీరును పరిశీలిస్తే అనేకాంశాలు గోచరిస్తాయి. ఆకలిని లెక్కచేయకుండా కాలినడకన ఛలో పాదయాత్ర అన్నట్లు దొమ్మరోల్లు ఊరూరా తిరిగి ప్రదర్శనలు ఇస్తుంటారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఈ వృత్తిని నమ్ముకున్నవారు సజీవంగానే ఉన్నారని చెప్పొచ్చు. కానీ దొమ్మరోల్లు స్థితి ప్రస్తుతం ఏ విధంగా తయారిందో వాటికి గల కారణాలేవో 'విధ్వంసం' కథ ద్వారా ప్రస్తావించాడు.

ముగింపు :

విశ్వజనీన విలువలు, సంస్కృతి, మానవ సంబంధాలు, పరిణామాలను స్థానిక, స్థల, కాల, కులాల నిర్దిష్ట జీవితం, సంస్కృతిలో భాగంగా చిత్రించినప్పుడు ఆ సాహిత్యం మాత్రమే విశ్వజనీన సాహిత్యమవుతుంది. విశ్వజనీన సంస్కృతి, మానవీయ విలువలు, స్నేహం, ప్రేమ, కరుణ, పరోపకారం, ఇంద్రియ సంవేదనలు చిత్రించకుండా కేవలం ఆయా కులాల సంస్కృతి, ఈతి బాధలు, ఎదుగుదల వికాసం చిత్రిస్తే అవి కేవలం స్థానిక భాషా సాహిత్యంగానే మిగిలిపోతుంది. అందువల్ల ఏ కులం గురించి చిత్రించినా, ఏ వర్గం గురించి చిత్రించినా, ఏ ప్రాంతం గురించి చిత్రించినా స్త్రీల గురించి, పురుషుల గురించి చిత్రించినా, బాలల గురించి చిత్రించినా, దంపతుల గురించి చిత్రించినా, కులాంతర వివాహాల గురించి చిత్రించినా వాటన్నిటా మహోన్నత మానవీయ విలువలు, సంస్కృతి, ఉదాత్త వ్యక్తిత్వాలు, స్వభావాలుగా ఎదిగిస్తూ చిత్రించినప్పుడే అది ప్రపంచ సాహిత్యంలో భాగం అవుతుంది. దళిత, బహుజన సాహిత్యం ఇప్పుడిప్పుడే దీన్ని అర్థం చేసుకొని ఉన్నత స్థాయిని చేరుకునే ప్రయత్నం చేస్తున్నది.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ కథ–ప్రాంతీయ స్పృహ: బి.యస్. రాములు: సం.అయిలయ్య, కర్రె సదాశివ్: విశాల సాహిత్య అకాడమీ. ప్ర.ము. 2012

2. ఆంధ్ర, తెలంగాణ కథారచయితలకు చెందిన వివిధ కథాసంపుటాలు, కథా సంకలనాలు.
3. ఎల్లారెడ్డి కర్ర, 2007 తెలంగాణ కథ , తెలంగాణ సాహితి, హన్మకొండ.
4. బి.వి.ఎస్.స్వామి, కథా సోపనములు, నీల్‌కమల్ పబ్లికేషన్స్ ప్రవేట్ లిమిటెడ్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్, 2023
5. నవతరం తెలుగు కథ – 1998–2008 వారధి రచయితల సహకార వేదిక, 2009
6. ప్రాంతీయ చైతన్యం–తెలంగాణ సాహిత్యం – కాత్యాయనీ విద్మహే, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్ ప్ర.ము. 2000.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-09 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253



జాతీయ స్వాతంత్ర్యోద్యమ గీతాలు - జాతీయత

దాసరి విజయ కుమారి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం,
హైదరాబాద్-500046, చరవాణి : 9491877705,
dasara.vijayakumar@gmail.com, vijaya_dasara@uohyd.in

సమర్పణ (D.O.S) : 20-08-2026 ఎంపిక (D.O.A) : 28-08-2026 ప్రచురణ (D.O.P) : 01-09-2026

వ్యాస సంగ్రహం

భారతదేశ 80 వ స్వాతంత్ర దినోత్సవం భారతీయులందరూ ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేటి ఈ ఆనందానికి కారణమైన సాహిత్యాన్ని తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉంది. మన కవులు, రచయితలు రాసిన గేయాలు, పద్యాలు, వ్యాసాలు రాశారు. గేయం మౌఖికంగా ప్రచారం పొందుతూ ప్రజలను ప్రేరేపించి, ఉద్యమాలలో పాల్గొనే విధంగా చేస్తుంది. ఆనాటి నాయకులు, రచయితలు ఈ గేయాలను పాడుతూ, ఉద్యమాలను విజయ వంతంగా నడిపించి, స్వాతంత్ర్య సాధనకు కృషిచేశారు. కొంతమంది తాము రచించినట్టు కూడ ఎక్కడా ఆధారాలు కూడ పేర్కొనకుండ అజ్ఞాతంగా ఉండిపోయారు. కొంతమంది నాయకులు సంఘ సంస్కరణలు చేసి, ప్రజల పునరుజ్జీవనానికి పాటుబడ్డారు. అనేక మంది పత్రికలను స్థాపించి, వాటిలో తమ రచనలను ప్రకటించి ప్రజలను కార్యోన్ముఖులను చేశారు. జాతీయ నాయకులు ఎన్నో త్యాగాలను చేశారు. ఈ సాహిత్యం మరియు వారి సేవ గురించి నేటి విద్యార్థులకు అవగాహన కలగాలి. అందువల్ల వారిలో దేశభక్తి పెంపొందుతుంది. సాహిత్యం ద్వారా అది సాధ్యమవుతుంది. ఆ ఉద్దేశంతోనే ఈ వ్యాసంలో కొన్ని గేయాలను పేర్కొని, వారి కృషిని స్మరించుకునే ప్రయత్నం చేశాను.

కీలక పదాలు :

జాతీయ స్వాతంత్ర్యోద్యమం, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం, సంస్కరణోద్యమం 1. దేశమాతస్తుతి 2. మేలుకొలుపు గీతాలు 3. ఆంధ్రమాత స్తుతి 4. నాయకస్తుతి 5. నాయకస్మృతి 6. పంజాబ్ దురంతాలు 7. జాతీయ జెండాగీతాలు 8. సహాయనిరాకరణోద్యమ గీతాలు 9. నిర్మాణ కార్యక్రమాలపై గీతాలు 10. స్వాతంత్ర్య సమరగీతాలు

ఉపోద్ఘాతం :

భారతదేశంలో ప్రజల జీవితాన్ని బ్రిటిషు పరిపాలన అనేక రకాలుగా ప్రభావితం చేసింది. వారు మనదేశాన్ని వలస దేశంగా మార్చి, స్థానికంగా ఉన్న హిందూ, ముస్లింలను చిన్నచూపు చూడడం మొదలుపెట్టారు. 1813 ఇతర దేశాలకు నూలువస్త్రాలను ఎగుమతిచేసిన భారతదేశం ఇంగ్లండ్ నూలువస్త్రాలను దిగుమతి చేసుకునే దేశంగా మారింది. ఈ విధానం వల్ల మన దేశంలోని చేనేత కార్మికులు నిరాశ్రయులయ్యారు. నిత్యజీవితంలో రోజువారీ వస్తువుల దిగుమతి వల్ల లక్షలాదిమంది చేతివృత్తుల వారు తమ ఉపాది కోల్పోయారు. జమీందారీ రైత్వారీ భూమి

పన్ను విధానాలను ప్రవేశపెట్టి రైతులను చిత్రహింసలకు గురిచేసి పన్నులు వసూలు చేశారు. దీనితో భారతీయ రైతాంగంలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు నెలకొన్నాయి. ఈ కారణంగా 1857 - 1859లో ప్రధమ స్వాతంత్ర్య సంగ్రామం మొదలయ్యింది. ఈ సంగ్రామం విజయం సాధించలేకపోయింది. భారత జాతీయోద్యమంలో సంస్కరణోద్యమ పాత్ర విశిష్టమైనది. 1828 లో 'రాజారామమోహన్' 'బ్రహ్మసమాజం' స్థాపించారు. 1875 లో 'దయానంద సరస్వతి' 'ఆర్యసమాజం' స్థాపించారు. ఆ తరువాత శ్రీ'రామకృష్ణ పరమహంస', ఆయన శిష్యుడు 'వివేకానందుడు,' 'జాతీయ పునరుజ్జీవనోద్యమం' ప్రారంభించారు. 'మేడం బ్లావిట్స్కి, కల్నల్, ఆల్కాట్' అనే పాశ్చాత్య పండితులు 'దివ్యజ్ఞాన సమాజం' స్థాపించారు. 1874 లో 'జ్యోతిరావుపూలే' 'సత్యశోధక సమాజం' నెలకొల్పారు. ఈ సంస్థలన్నీ క్రమంగా రాజకీయ స్ఫూర్తిని పొంది జాతీయోద్యమ దిశగా పయనించాయి. ఈ ఉద్యమంలో పత్రికలు కూడా ప్రధాన పాత్రవహించాయి. అనేక మంది రచయితలు గేయాలను రచించడమే గాక స్వయంగా ఉద్యమంలో పాల్గొని ప్రజలలో దేశభక్తిని, జాతీయతను పెంపొందింపజేశారు, ఈ అంశాలను వ్యాసరూపంలో తెలియజేశాను.

పత్రికల సేవ :

భారతదేశంలో ఆంగ్ల విద్యావ్యాప్తి, పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల ప్రజలలో జాతీయతా భావాలు మొదలయ్యాయి. 20 శతాబ్దాల నుండి జాతీయచైతన్యం, దేశభక్తి, బానిసత్వ నిరసనం మొదలైన భావావేశాలు మొదలయ్యాయి. బెంగాల్ అన్ని ప్రాంతాలను ప్రభావితం చేసింది. 19వ శతాబ్దం దశకంలో పత్రికలు ఉద్యమ సాహిత్యానికి ఎనలేని సేవచేశాయి. 1872లో బందరులో ఉమానాయకులు 'పురుషార్ధ ప్రదాయని' అనే పత్రికను స్థాపించారు. వీరేశలింగం పంతులు తొలిరచనలు ఈ పత్రికలోనే ప్రచురితమయ్యాయి. ఆ తరువాత ఆయన రాజమండ్రి నుండి వరుసగా 'వివేక వర్ధని' (1874) 'హాస్య సంజీవని'(1875) 'సతీహితబోధిని' (1888) 'సత్యసంవర్ధని' (1892) లో, (1905) లో సత్యవాదిని అనే పత్రికల్ని వెలువరించి సంఘ, సంస్కరణ ఆశయాలను, జాతీయతా భావాలను ప్రచారం చేశారు. (1874) లో 'గట్టుపల్లి శేషాచార్యులు' శశిరేఖ, (1994)లో 'పార్థసారధినాయుడు' ఆంధ్రప్రకాశిక, (1896) లో చలపతి దేశాభిమాని వీరేశలింగం అనుయాయుడు 'ఘజాయత్ ఆలీఖాన్' నర్సాపురం నుండి 'విద్వాన్ మనోహారిణి న్యాపతి సుబ్బారావు చింతామణి రాయసం వెంకట శివుడు జనానాపత్రిక' దేశాభిమానాన్ని జాగృతం చేశాయి. 20 శతాబ్ద ఆరంభంలో 'చిలకమర్తి లక్ష్మీనరహింహం' 1906 లో మనోరమ, 1910లో దేశమాత పత్రికలు జాతీయభావాలను ప్రచారం చేశాయి. 1920 ఫిబ్రవరి లో 'కొండ వెంకటప్పయ్య', 'దాసునారాయణరావు' కృష్ణాపత్రికను నెలకొల్పారు. 1907 'ముట్నూరి కృష్ణారావు ప్రధాన సంపాదకులుగా నాలుగు దశాబ్దాలపాటు సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి జాతీయోద్యమానికి దర్పణంగా కృష్ణాపత్రికను మలిచారు. 1908 సెప్టెంబర్ 9న కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు బొంబాయిలో ఆంధ్రపత్రికను స్థాపించారు. పత్రికల్లో తిలక్ గారు 1908 లో కేసరి మరాఠీ తీవ్రవాద వ్యాసాలు రాసిన బ్రిటిషు ప్రభుత్వం అరెస్టు చేసింది. తొలినాటి జాతీయోద్యమ వ్యాప్తికి పత్రికలు కృషిచేశాయి. 1897 - 98 మధ్య కాలంలో సరస్వతి పత్రికలో భారతదేశ స్థితిగతుల్ని వర్ణిస్తూ అనేక ఖండికలు వెలువడ్డాయి. 1897 మేలో చింతామణి పత్రికలో దేశాభిమాని లక్షణాలను వివరిస్తూ పి. రామశాస్త్రి విశాఖపట్టణ మండలసభ పర్వాలను రాశారు. 1905 లో అక్టోబర్ లో కృష్ణాపత్రికలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్వదేశాభిమానము వ్యాసం అచ్చయ్యింది. 1905 డిశంబర్ 15 నాటి కృష్ణాపత్రిక లో ఒక అజ్ఞాతకవి ది 'క్రై ఆప్ మదర్ ఇండియా' శీర్షికన ఒక గొప్ప ప్రబోధ గీతాన్ని రాశారు.

హిందువులారా ఎన్నాళ్ళీగతి
మందమతులరైమాటికి జెడెదరా

అనే పద్యం జాతీయోద్యమ తొలిరచనగా చెబుతారు. బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర పర్యటన సమయంలో సమావేశాలకు హాజరై ఆయన ప్రసంగాలు విన్న 138 మంది కాలేజి విద్యార్థుల్ని కళాశాల యాజమాన్యం బర్తరఫ్ చేసింది. 1907 మే 1న కాకినాడలో 50 మంది దేశభక్తుల్ని అరెస్ట్ చేసింది. 1907 లోనే చెన్నా ప్రగడ భానుమూర్తి పంతులు భారతధర్మ దర్శనము అనే ఖండకావ్యం వెలువడింది.

1907 మే లో పంజాబ్ కేసరి లాలాలజపతిరాయ్ ని అరెస్టు చేసి దేశానికి దూరంగా బర్మాలో నిర్భందించింది. "చెరసాలల్ పృథు చంద్రశాలలె యగున్ చేదోయి గీలించు నయ్యర దండల్ విరిదండలయ్యెడున్" అనే పద్యంతో పాటు "భరతఖండంబు" అనే పద్యాన్ని చిలకమర్తి రాశారు.

1908 లో అత్తిలి సూర్యనారాయణ హిందూదేశ దరిద్రం ముట్నూరి వెంకట సుబ్బారాయుడు మరియు మంగిపూడి వెంకటశర్మ మాతృ శతకము వెలువడ్డాయి. 1908 లో దేశీయ కీర్తనలు అనే పుస్తకం వెలువడింది. 1909 ఆంధ్ర భారతిలో మేలుకొలుపు శీర్షికతో ప్రబోధ గీతం ప్రచురింపబడింది.

గేయం :

మేలుకొనుమీ భరత పుత్రుడ - మేలుకొనుమీ సుజన మిత్రుడ

ఈ పాట ప్రేరణతో 1921 లో మంగిపూడి

మేలుకో సుచరిత్ర మేలుకో భరతపుత్ర-లుకో చిరమిత్ర మేలుకో భరతపుత్ర

అనే పాట బడుగుజీవులు సామాజిక అసమానతలను ప్రశ్నించిన వేదనాగీతం.

1910లో గురజాడ అప్పారావు దేశభక్తి గీతం వెలువడింది. ఆయన తన 58వ ఏట నూతన జీవిత దృక్పథంతో దేశభక్తికి కొత్త నిర్వచనాన్నిచ్చి అంతర్జాతీయ దృష్టిని ఆంధ్రులకు అందించారు.

దేశము ప్రేమించుమన్నా - మంచియన్నది పెంచుమన్నా

ఈ గేయాన్ని స్ఫూర్తిగా తీసుకుని 1914 లో జన్మభూమి గీతాన్ని రాయప్రోలు రాశారు.

ఏ దేశమేగినా ఎందు కాలిడినా - ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా

(తెలుగులో ఉద్యమగీతాలు 2019, 61)

పై గేయాలు ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించడానికి తోడ్పడతాయని చెప్పవచ్చు. జాతీయ స్వాతంత్ర్యోద్యమ గీతాలు 10 రకాలుగా వర్గీకరించబడ్డాయి. 1. దేశమాతస్తుతి 2. మేలుకొలుపు గీతాలు 3. ఆంధ్రమాత స్తుతి 4. నాయకస్తుతి 5. నాయకస్మృతి 6. పంజాబ్ దురంతాలు 7. జాతీయ జెండాగీతాలు 8. సహాయనిరాకరణోద్యమ గీతాలు 9. నిర్మాణ కార్యక్రమాలపై గీతాలు 10. స్వాతంత్ర్య సమరగీతాలు

దేశమాత స్తుతి :

భారతీయులందరికి నిత్యస్మరణీయమైన 'మాతృదేవోభవ' అనే పదం. దానిని ప్రతీక గా తీసుకుని దేశాన్ని కూడ 'మాత' గా భావించడం మన జాతీయోద్యమ గీతాల్లో కనిపిస్తుంది. ఆదిమానవుడు ప్రకృతి శక్తులకు మానవత్వాన్ని, దైవత్వాన్ని ఆపాదించి నేలను, నదిని తల్లిగా భావించి పూజించాడు. నాగరిక మానవుడు కూడ దానిని అనుసరించాడు. అందువల్లే దేశం దేశమాత గా కీర్తిస్తారు.1921 కి ముందే బాలకవి పడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీవిశ్వనాథ శాస్త్రి

దండాలు దండాలు భారతమాత- అవి అందుకొని దీవించు భారతమాత

(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 63)

అని భారతమాత గీతాన్ని పాడారు. ఈ గీతం మరికొన్ని గీతాలను చేర్చి 'స్వరాజ్యగీతామృతము' అనే పుస్తకాన్ని వీరు ప్రచురించారు. అది సహించలేని బ్రిటిషు ప్రభుత్వం ఆ గేయాన్ని, పుస్తకాన్ని కూడ నిషేధించారు. వారిరువురిని ప్రభుత్వం క్షమాపణ చెప్పమంటుంది. వారు క్షమాపణ చెప్పడానికి నిరాకరించారు. అందుకు వారికి ప్రభుత్వం 124 ఏ ఐ. పి. సి. చట్టం కింద 9 నెలలు కఠిన కారాగార శిక్ష విధించింది. 500 జరిమానా కూడ వేస్తారు. అది కట్టలేదని 3 నెలలు రాజమండ్రి జైల్లో పెట్టింది. ఈ శిక్షను బాలకవి ధైర్యంగా భరించాడు. పూడిపెద్ది కాశీవిశ్వనాథశాస్త్రి శిక్షను భరించలేక క్షమాపణ రాసిచ్చి జైలు నుండి వెళ్ళి, రాజకీయాలను వదిలేస్తా ఈ పుస్తకం వేటపాలెంలో లభిస్తుందని ఎస్వీ సత్యనారాయణగారు తెలియజేశారు.

గేయం :

దండాలు దండాలు - భరతమాత (తెలుగులో ఉద్యమగీతాలు. 2019,65)

పై గేయంలో భారతమాత ముద్దుబిడ్డ అయిన గాంధీజీ ఉండగా తమకు భయంలేదని, ఏమీ లోటులేదని, కట్టుకోడానికి బట్టలు ఒక పూట తినడానికి ఆహారం కూడ లేదని, చాకిరి చేయడానికి శక్తి కూడ లేదని భారతీయులు భారతమాతను కోరుకుంటారు. తమ ప్రాణం పోయేటప్పుడు కూడ వారిని సత్యం తప్పనీయవద్దని, తాము ఎవరిని హింసించకుండ, ధైర్యాన్నిచ్చి రక్షించమని వారు వేడుకుంటారు. భారతమాత మానాన్ని నిలపడానికి తమ ప్రాణాన్నైనా ఫణంగా పెడతామని, ఆరునెలల కాలంలో స్వరాజ్యాన్ని తెచ్చే శక్తినివ్వమని, నీకన్న బిడ్డలం గంపెడు మందిమి ఉన్నాము నీకు నిశ్చయంగా విజయం కలుగుతుందని భారతీయులందరూ ఏకమై తమ ఆత్మవిశ్వాసాన్ని చాటుతూ పాడిన గేయమిది.

గరిమెళ్ళ సత్యన్నారాయణ గారు రాసిన మరొక గీతం

గేయం :

'వందన మిదె గైకొనుమీ- భారత జనని ని మాపాలి రాణీ' అనే పల్లవితో ప్రారంభమైంది.
(తెలుగులో ఉద్యమగీతాలు. 2019,67)

గరిమెళ్ళ సత్యనారాయణ మాతృభూమిని కీర్తిస్తూ గొంతెత్తి గానం చేసిన జాతీయకవి. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతికి సమానమైన ప్రతిభ గల వ్యక్తి.

బ్రహ్మశ్రీ మంగిపూడి వేంకటశర్మగారు 1921 నాటికి మరో దేశమాతస్తుతి గీతాన్ని రాశారు.

'నిన్ను నెన్న మాతరమా? నిరుపమానభరతమాత' (తెలుగులో ఉద్యమగీతాలు. 2019,67)

పై గేయాన్ని చెఱుకువాడ వేంకట రామయ్య, రామోజీవరపు వేంకట నరసింహారావు రచించారని కేసరి సమాజము, రాజమహేంద్రవరము వారు ప్రచురించిన 'జాతీయ గీతములు' అనే సంకలనంలో ఉందని, గురజాడ రాఘవశర్మ 'జాతీయ గీతాలు' పేరుతో మరొక సంకలనం ప్రకటించి, మంగిపూడి వేంకటశర్మ పేరుతో ఈ గీతాన్ని ప్రచురించారని ఆచార్య యస్వీ. సత్యనారాయణగారు పేర్కొన్నారు.

గేయం :

పతిత భారత ఘోర - పరిభవనాల మర్చ
కుతుకమున వచ్చినామే తల్లి (తెలుగులో ఉద్యమగీతాలు. 2019,68)

పై గేయం మంగిపూడి వేంకటశర్మ సత్యాగ్రహ ఉద్యమ సమయంలో రాయవెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్నపుడు పాడిన గేయంగా యస్వీ. సత్యనారాయణ గారు తెలిపారు.

వేదుల సత్యనారాయణ ఈ కింది గేయం రాశాను

గేయం :

జయము హిమగిరి మణికిరీటా - జయము సింహళ పాదపీటా
జయము విజయాంకిత లలాటా - జయము ప్రియ జననీ (తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 68)

పై గేయం తెలుగు రచయితలు -- భారత స్వాతంత్ర్యోద్యమం రచయిత ఆర్. ఎన్. శర్మ అనుబంధ ప్రచురణలు, సికింద్రాబాద్‌లో ప్రచురించబడింది.

అని వడ్లాది సీతారామాంజనేయులు భారతమాతను సృష్టించాడు. మరికొంతమంది కవులు జాతీయగీతాలను రాశారు.

కాటూరి వేంకటేశ్వరరావు గారు ఈ కిందిగేయం రాశారు. ఈ గీతం ప్రేరణతో మాతెలుగు తల్లికి మల్లెపూదండ వంటి గీతాలు వెలువడినట్టు రచయిత తెలిపారు.

గేయం :

హిమగిరి శిఖరము - వింధ్యవనీంద్రము
కన్యాకుమారీ పద డిండీరము - స్ఫురితము - భరితము - చలితోల్లలితము
(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 70)

అనే గేయాన్ని కవికొండల వెంకటరావుగారు రాశారు.

గేయం :

జయ జయ జయ ప్రియ బారత - జనయిత్రీ దివ్య ధాత్రీ

అనే గేయాన్ని కృష్ణశాస్త్రి గారు రాశారు. 1940 కాలంలో జరిగిన విద్యార్థి సమావేశాలలో దీనిని ప్రార్థనాగీతంగా ఆలపించారు.

గేయం :

జయ జయ భారత జననీ నీకిదే జయపారతి గొనుమా
విజయ పతాకము, విరులు దండలును

అనే గేయాన్ని జాతీయోద్యమంలో పాల్గొంటున్న బాలికల కోసం మిక్కిలినేని భగవంతరావుగారు ఒక జయగీతిని రాశారు. ఈ గీతం "జాతీయగేయాలు -- మిక్కిలినేని భగవంతరావు. దేశికవితా మండలి, బెజవాడ." అనే గ్రంథంలో వెలువడింది.

గేయం :

ఓ దాస్య భారతమాత నీవు - కలవరింతువా కంటినీరుల్లో

అనే గేయాన్ని అబ్బరాజు శర్మ గారు రాశారు. బానిసత్వం శాశ్వతం కాదని బారతమాతకు బాలచంద్రుడి వంటి కొడుకులు ఉన్నారని, వారు ఆ సంకెళ్ళను బద్దలు కొడతారని ఈ గేయం ద్వారా రచయిత తెలియజేశారు.

మేలుకొలుపు గీతాలు :

జాతీయోద్యమానికి ప్రజలను ప్రేరేపించిన గీతాలు మేలుకొలుపు గీతాలు.

గీతం పాడుపు కొండమీద - పాడిచె నల్లదె ప్రొద్దు (తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 73)

పై గేయం గురజాడ రాఘవ శర్మగారు రాసినది అది జాతీయ గీతాలు లో ముద్రింపబడింది.

దేశ ప్రజలలో జాతీయతా ప్రబోధాన్ని కలిగించిన నినాదం. దీనిని గానం చేసినవారు ముట్నూరి వెంకట సుబ్బారాయుడు, మంగిపూడి వెంకటశర్మ.

దేశాభిమానంబు, దీపింపజేయు మంత్రంబు వందే మాతరంబు సుండు

(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 74)

ప్రజలలో ఐకమత్యాన్ని పెంచుతూ, దేశాభిమానాన్ని ఉద్దీపింపజేయడానికి వందేమాతర నినాదాన్ని వినిపించే గీతమీ కిందిది.

గేయం :

భారతదేశము నాదేరా - భారతీయుడను నేనేరా

(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 75)

పై గేయాన్ని మంగిపూడి పురుషోత్తమ శర్మ గారు రాశారు. ఈ విధంగా భారతదేశ దయనీయ స్థితిని వర్ణిస్తూ జాతీయ కవులు ప్రజలకు తమ కర్తవ్య నిర్వహణవైపు నడిపించారు.

ఆంధ్రమాత స్తుతి :

జాతీయోద్యమంలో దేశమాతతో బాటు ఆంధ్రమాతను కూడ స్తుతించారు.

గేయం :

జయ జయహే మహాంధ్ర జననీ! మధునాదవనీ! (తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 77)

అనే గేయాన్ని బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి గారు రాశారు.

పై గేయం ద్వారా దుగ్గిరాల బలరామకృష్ణయ్య తెలుగుసీమ వైభవాన్ని ప్రపంచమంతా చాటిచెప్పారు. 127 చరణాల సుదీర్ఘ గీతం రాసి ఆంధ్రమాత గొప్పతనాన్ని ప్రశంసించారు. 1924 లో జూన్ నెలలో శేషాద్రిరమణ కవులు నిజామ్ రాష్ట్రప్రశంస శీర్షికతో సుదీర్ఘకావ్యాన్ని ప్రచురించారు.

గేయం :

కఱుడుగట్టిన తెలుగు నెత్తుటి - వరదలందున నీదులాడెడి

(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 77)

శేషాద్రి రమణ కవులు తెలుగుజాతి పునరుద్ధరణ కోసం కృషిచేశారు.

నాయక స్తుతి :

తిలక్, బిపిన్ చంద్రపాల్ మొదలైన వారు జాతీయ, స్వాతంత్రోద్యమాలకు నాయకత్వం వహించి, అనేక కారాగార శిక్షలు అనుభవించి, ప్రజలను ఉద్యమ కార్యోన్ముఖులను చేశారు. వారిని స్తుతిస్తూ అనేక గీతాలు, ఖండకావ్యాలు, కావ్యాలు వెలువడ్డాయి.

గాంధీస్తుతి :

గాంధీజీ వచ్చినంత గౌరవం, ఆదరణ, సాహిత్యంలో ఆయనకు గల స్థానం ఏ జాతీయ నాయకునికి లభించలేదని చెప్పవచ్చు. ఆయన వ్యక్తిత్వం, శాంతి మార్గం, పోరాట విధానం అనేక మంది కవులు కొనియాడారు. 1921 వరకు ఆయన స్వీయచరిత్రను రాసుకున్నారు. దానిని తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు ఆత్మకథగా కావ్యానువాదం

చేశారు. ఆ తరువాత మహాత్మకథ పేరుతో ఒక స్వతంత్ర కావ్యాన్ని రాశారు. మరింగంటి శేషాచార్యులు శ్రీ గాంధీ భారతము అనే కావ్యాన్ని రచించారు. గరిమెళ్ళ సత్యనారాయణ గాంధీ అనే శీర్షికతో గీతాన్ని రాశారు.

సామాన్యడనుకోకు మతని - దైవ సంకల్పమురవాని జననమీ యవని అని కీర్తించారు.

కత్తిని నిరసించు సతము స్వస్థ - చిత్తవృత్తియె
వానిచేతి యాయుధము ॥ వినురా ॥

అనే 17 చరణాల దీర్ఘగీతాన్ని గరిమెళ్ళ గాంధీ గురించి రాశారు. 1921 లో శ్రీ మహాత్మా గాంధీ భజన కీర్తనలు అనే కావ్యాన్ని శింగవరపు వాసియైన మద్దూరి పాపారావు గారు రాశారు. వంగలపూడి వాసియైన నీరుకొండ వెంకట రత్నం చౌదరి గారు ఈ గ్రంథ ముద్రణకు ధన సహాయం చేశారు. ఈ పుస్తకాన్ని శింగవరపు కాంగ్రెస్ సంఘం వారు ముద్రించారు.

అంతేగాక నూకల సుబ్బారావు అనే వ్యక్తి గాంధీజీ గొప్పతనాన్ని లోకానికి తెలియజేస్తూ కోలాట కీర్తన కూడా రచించారు.

గేయం :

గాంధీ మహాత్మకు జైజై యనుచును ప్రజలెల్లరు రండి

పై గేయంలో గాంధీజీ గుణగణాలు, ఖద్దరుదారణ మొదలైన అంశాలు వర్ణించబడ్డాయి.

మరికొన్ని గేయాలను మంగిపూడి మిక్కిలినేని భగవంతరావు రచించారు.

గేయం :

నెత్తురు చుక్కను నేలను చిందక - ఎత్తినావు మన స్వరాజ్య జెండా
దేశదేశముల దిగ్భ్రమ జెందగ -- సత్యాహింసలు చాటితివయ్యా
(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 81)

అని మిక్కిలినేని భగవంతరావు నివాళులర్పించారు.

అనేక గేయాలను గురజాడ రాఘవశర్మ రాశారు. నెల్లూరి వెంకట్రామానాయుడు, గురజాడ రాఘవశర్మ, పురిపండా అప్పలస్వామి, ఓలేటి చిరంజీవిశర్మ, గొన్నాబత్తుల మల్లిఖార్జునరావు, అంబటి లక్ష్మీనరసింహరాజు, మల్లావధాని, మధునాపంతుల, పాటిబండ మాధవశర్మ, ఖండవల్లి లక్ష్మీరంజనం, దొప్పలపూడి అనసూయాదేవి, దాశరథి కృష్ణమాచార్య మొదలైన వారు గాంధీజీ గురించి అనేక గీతాలు, పద్యాలు, కావ్యాలు రాశారు.

ఇతర జాతీయనాయకుల స్తుతి

1907 చెరుకువాడ వెంకట్రామయ్య, గాదె జగన్నాథస్వామి లాలాలజపతిరాయ్ అనే లఘు కావ్యాన్ని రచించారు.

1917లో మంత్రిప్రగడ భుజంగరావు ఏకాశ్వాస నిర్వచన ప్రబంధ గోఖలే చరిత్రము, 1918 లో దాదాభాయి నౌరోజి చరిత్రము రాశారు.

1921 లో జంధ్యాల అయ్యవారుశాస్త్రి దేశభక్తుడు లఘుకావ్యం రచించారు. 1939 లో నూకల సుబ్బారావు గుప్త రాష్ట్రపతి సుభాస్ చంద్రబోసు జీవితచరిత్ర అనే దీర్ఘగీతం రచించారు. 1941 లో చెళ్ళపిళ్ళ వేంకటేశ్వరకవి లోకమాన్యతిలక్ అనే కావ్యాన్ని రచించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో జంధ్యాల పాపయ్యశాస్త్రి అరుణ కిరణాలు రాశారు. జయప్రకాశ్ నారాయణ, బాపూజీ, కెప్టెన్ విజయలక్ష్మి, అరుణా అసఫాలీ, ఆంధ్రకేసరి మొదలైన వారిపై అనేక నాయక స్తుతి గీతాలు వెలువడ్డాయి.

సుభాష్ చంద్రబోస్ స్తుతి :

గాంధీజీకి నేతాజీకి అభిప్రాయం బేధాలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో 'నేతాజీ పార్వర్డ్ బ్లాక్' ని స్థాపించారు. ఆ తరువాత భారత జాతీయ సైన్యం వెలువడింది. సహాయ నిరాకరణోద్యమం, శాంతియుత పోరాటం, భారత జాతీయ సైన్యం దేశసరిహద్దుల అవతల చేసే సాయుధ పోరాటం బ్రిటీష్ వారిలో గుబులు పుట్టించింది.

1939 నాటికే తెలుగు సాహిత్యం మీద సుభాష్ చంద్రబోస్ ప్రభావం ఉన్నట్లు వెల్లడి అవుతుంది. 1946 నాటికి అది తీవ్రతరమైంది. 1946 జనవరి 26 న ఆగస్ట్ గేయాలు వెలువడింది. ఇవి 'ఆగస్ట్ విప్లవవీరులకు' అంకితం చేయబడింది.

కాశీ విశ్వనాథం నెత్తురు కలం పేరుతో గేయాలు రాశారు.

గేయం :

జైహింద్, జై హింద్ జై నినాదం - జాతీయోద్యమ శంఖారావం
వినడంలేదా? సుభాసుబాబు దివ్య సందేశం - స్వతంత్ర సమరపు జైజై నాదం

(తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 81)

అని భారతసేనకు జయ జయ నాదాలు చేశారు.

1947 జనవరి మాసంలో 'విద్యార్థుల వీరగేయాలు' మిక్కిలినేని భగవంతరావు రచించారు.

అంటూ విప్లవాత్మక నినాదాలు చేస్తూ మిక్కిలినేని గేయాలు రాశారు. 1949 ఆగష్టులో జాస్తి వెంకట నరసయ్య, ధూళిపాళ వెంకట సుబ్రహ్మణ్యం జాతీయ దసరా గీతములు రాశారు. 1949 ఆగష్ట్, సెప్టెంబర్ మాసాలలో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బ్రిటిష్ వారి నిర్భందాలను సైతం లెక్కచేయకుండ తరుణ భారతనారీమణి అరుణ సఫాలీ ఆంధ్రప్రాంతంలో పర్యటించారు. ఆమెకు అంకితమిస్తూ కరుణశ్రీ అరుణకిరణాలలో ఈ కింది గేయం రచించారు.

గేయం :

యువభారత యుగోదయంలో - నవభారత మహోదయంలో
పూచిందొక అరుణ తరంగం - లేచిందొక క్రాంతి విహంగం

మరొక కవి ఆమెను కీర్తిస్తూ ఈ కింది గేయం రాశారు

జయప్రకాష్ నారాయణని స్తుతిస్తూ కరుణశ్రీ అరుణకిరణాలలో గేయం రాశారు.

ఆంధ్ర నాయక స్తుతి :

ఆంధ్ర దేశాన్ని ఉద్యమం వైపు నడిపించిన ఆంధ్ర నాయకులను స్తుతిస్తూ అనేక గేయాలు వెలువడ్డాయి. బుద్దిరెడ్డి కోటేశ్వరరావు స్వరాజ్యరథము పేరుతో 45 చరణాల సుదీర్ఘ గీతాన్ని రాశారు.

కొండా వెంకటప్పయ్యను నిర్భంధించినపుడు కోటేశ్వరరావు ఈ కింది విధంగా రాశారు.

గేయం :

ప్రభవించు నెవ్వానిగొల్తు - ధర్మరాజంచు నెవ్వాని ప్రార్థింత్రు
కొండావశాబ్ది చంద్రుడు బంధింపబడినాడే

అని తన ఆందోళనను వెల్లడించాడు. అంతేగాక చెరకువాడ నరసింహ పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావు, బులుసు సాంబమూర్తి వ్యక్తిత్వాలను పోరాట ప్రతిమను కొనియాడారు.

నాయక స్మృతి :

గోపాలకృష్ణ గోఖలే

రాయప్రోలు సుబ్బారావు గారు మొట్టమొదట ఆదునికాంధ్ర సాహిత్యంలో స్మృతి కావ్యం రాశారు. గోపాలకృష్ణ గోఖలే(1915 ఫిబ్రవరి19) మరణవార్త విని సుబ్బారావు గారు స్మృతి ఖండికను రాశారు.

తిలక్ స్మృతి

బాలగంగాధర్ తిలక్ 1920 ఆగష్ట 31 న మహానాయకుడు లోకమాన్యతిలక్ నిర్యాణం తరువాత ఈ కింది గేయం ఒక కవి రాశారు.

గేయం :

షాకతాలీ గాంధీల జూపి లోకమాన్యుడేగె దివిజసభకు
మాలోకమాన్యుడేగె దివిజసభకును ఈలోకులతని (తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 90)

మోతీలాల్ స్మృతి

మోతిలాల్ నెహ్రూ 1931 ఫిబ్రవరి 5 న తనువు చాలించారు. ఆ సందర్భంగా కర్ణవీర నాగేశ్వరరావు మోతీలాల్ నిర్యాణము పేరుతో స్మృతి కావ్యం రాశారు. .

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య స్మృతి

చీరాల పేరాల ఉద్యమంలో రామదండు నిర్మాణం చేసి ఆంధ్ర ప్రాంతంలో జాతీయోద్యమాన్ని విస్తరింపజేశారు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య 1928 జూన్ 10 న దివంగతులయ్యారు. ఆ విషయం విన్న చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, వేదాంతంకవి, గుఱ్ఱం జాషువా, బలిజేపల్లి లక్ష్మీ కాంతంకవి, దోమా వెంకటస్వామి, దోమా వెంకటస్వామి గుప్త, చెళ్ళపిళ్ళ దుర్గేశ్వర శాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి, బసవరాజు అప్పారావు, బులుసు రామజోగారావు, బాగవతుల సుబ్బయ్యశాస్త్రి మొదలైన కవులందరూ అనేక పద్యాలు గేయాలు రాశారు. వాటన్నింటినీ ఆంధ్రరత్న ''దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జీవిత చరిత్రము'' పేరుతో శ్రీ కారెంపూడి నాగేంద్రుడు బహూత్తమ పబ్లికేషన్స్ ప్రచురించారు.

కస్తూరిబా స్మృతి

1942 ఆగష్ట్ విప్లవ సందర్భంగా ప్రముఖ జాతీయ నాయకులందరితో బాటు గాంధీజీ సతీమణి అయిన శ్రీమతి కస్తూరిబా గాంధీని కూడ జైల్లో పెట్టారు. ఆమె అక్కడే తుదిశ్వాస విడిచారు. ఆ వార్త అనేకమందిని ఆవేదనకు గురిచేసింది. ఆ సందర్భంగా అనేక మంది స్మృతి గీతాలు రాశారు.

గేయం :

'కస్తూరి మాత యింక కానరాదండీ - కఠినమైన జైలులోనే కాలమొందిందీ
తల్లీ కాలమొందిందీ' ---------- అని మిక్కిలినేని భగవంతరావు రాశారు
కస్తూరి గాలిలో కలసిపోయినది - గాంధి వాసనలతో - కమ్మనే కమ్మనై ॥ కస్తూరి ॥

అని శిష్టా సత్యనారాయణ రాజశేఖరం రాశారు. ఈ విధంగా వీరమపేంద్ర చౌదరి స్మృతి, బొంబాయి నావికుల స్మృతి, గాంధీజీ స్మృతి మొదలైన గీతాలు వెలువడ్డాయి.

పంజాబ్ దురంతాలు :

1919లో బ్రిటిష్ ప్రభుత్వం రౌలట్ చట్టాన్ని ప్రవేశపెట్టి ప్రజలను ఎవరినైనా ఎప్పుడైనా ఏ కారణం లేకుండా నిర్భంధించడం మొదలు పెట్టింది. ఈ బిల్లుకి వ్యతిరేకంగా దేశమంతా నిరసనలు జరిగాయి. బొంబాయి నగరంలో పోలీసులు కాల్పుల్లో 53 మంది మరణించారు. 119 ఏప్రిల్ 13 వ తేదీన నాడు పంజాబ్ లోని జలియ్న్ వాలాబాగ్

లో ఉగాది పండుగ సందర్భంగా 3000 మంది భారతీయులు సమావేశమయ్యారు. సైన్యం ప్రజలను చుట్టుముట్టింది. డయ్యర్ కాల్పులకు ఆదేశించాడు నిరాయుధులైన ప్రజలు ఆ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమందికి గాయాలయ్యాయి. ఆ మారణకాండను వర్ణిస్తూ అనేక మంది కవులు పద్యాలు, గేయాలు రాశారు.

గేయం :

కంటా గుడ్డను పెట్టి- కర్ణాన వేలెట్టి
వింటా వటర ఓరయ్యా ముందరింటిలో జరిగిన చర్య (తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 103)

అని గరిమెళ్ళ సత్యనారాయణ రాశారు

జాతీయ జెండాగీతాలు :

మొట్టమొదట జాతీయ పతాకాన్ని 1906 ఆగష్ట్ 7 వ తేదీన కలకత్తాలోని 'పార్సీబగాన్ స్క్వేర్' (ఇప్పటి గ్రీన్ పార్క్) లో ఎగుర వేశారు. ఆ జెండాలో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులు ఉన్నాయి. పై భాగంలో ఎరుపు రంగు దానిలో ఎనిమిది తెల్లకమలాలు, పసుపు రంగులో ముదురు నీలం రంగుతో దేవనాగరి లిపిలో వందేమాతరం అన్న అక్షరాలు ఉండేవి. ఆకుపచ్చ భాగంలో ఎడమపక్క తెల్లటి సూర్యుడు, కుడుపక్క తెల్టి అర్ధచంద్రుడు ఒక నక్షత్రం ఉండేవి. ఆ తరువాత 1907 ఆగష్టు 18వ తేదీన జర్మనీలోని 'స్టట్ గార్డ్' నగరంలో 'మేడమ్ కామా' మన జాతీయ జెండాను ఎగురవేశారు. ఇక్కడ జాతీయ పతాకంలో కొన్ని మార్పులు చేశారు. ఎరుపు రంగులోని ఎనిమిది కమలాలకు బదులు ఒక కమలం ఏడు నక్షత్రాలు పొందుపరచి వాటిని సప్త ఋషులకు సంకేతంగా చెప్పారు. 1917 లో లోకమాన్య బాలగంగాధర్ తిలక్, అనిబిసెంట్ హోమ్ ఉద్యమ సమయంలో కొన్ని మార్పులు చేసి ఆవిష్కరించారు. దానిలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చ స్ట్రిప్పు వరుస ఒకదాని తరువాత ఒకటి ఉంచి వాటిపై సప్త ఋషులకు చిహ్నంగా ఏడు నక్షత్రాలు, పైన ఎడమ బాగంలో యూనియన్ జాక్, కుడిబాగంలో అర్ధచంద్రుడు పొందుపరిచారు.

ఆ తరువాత 1920 జాతీయోద్యమంలో గాందీజీ వచ్చారు. పింగళి వెంకయ్యగారు మన జాతీయజెండాని రూపొందించారు. 1921 మార్చి 31 వ తేదీన విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సంఘం మహాసభలు జరుగుతున్న సమయంలో పింగళి వెంకయ్య జాతీయ పతాక నమూనాని తయారుచేసి గాంధీజీకి అందజేశారు. దానిలో ఎరుపు ఆకుపచ్చ రంగులు ఉన్నాయి. ఈ రెండు రంగులకు మధ్య అన్ని జాతులకు గుర్తుగా గాంధీగారు తెలుపు రంగును సూచించారు. ఆ తెలుపు రంగులో ప్రగతికి సూచకంగా రాట్నం ఉండాలని పంజాబ్ లోని జలంధర్ నివాసి వయోవద్ధుడయిన ఒక దేశభక్తుడు సూచించినట్టు వెల్లడి అవుతుంది. 1923 మే 21 న నాగపూర్ లో జెండా సత్యాగ్రహం ఈ జెండా నీడలోనే జరిగింది. 1931 లో కరాచీ కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఆ సంస్థకు ఒక అధికార పతాకాన్ని నిర్ణయించడానికి ఏడుగురు సభ్యులున్న ఒక కమిటీని నియమించింది. వారు పూర్తి కాషాయరంగు అందులో ఎడమవైపు ఒక మూల మట్టిరంగులో రాట్నం ఉండాలని నిర్ణయించారు. కొన్ని చర్చల తరువాత కాంగ్రెస్ కు మూడు రంగుల జెండా ఉండాలని, అవి కాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు పైనుండి కిందికి అదే వరుసలో ఉండి తెలుపు రంగు మధ్యలో తెలుపు రంగు మద్యలో నీలి రంగు రాట్నం ఉండాలని నిర్ణయించారు. ఈ జెండా పింగళి వెంకయ్య సూచించిన దానికి దగ్గరగా ఉంది. అందులోని ఎరుపు రంగుకి బదులు కాషాయరంగుని కాంగ్రెస్ సభ్యులు సూచించారు.1947 లో తెలుపులో రాట్నానికి బదులు సారనాథ్ స్థూపంలో ఉన్న ధర్మచక్రాన్ని ప్రతిఫటించి జాతీయజెండాగా ఆమోదించారు.

జాతీయ జెండాపై అన్నిభాషలలోను రచయితలు గేయాలు రాశారు. "శ్రీ శ్యాంలాల్ గుప్తా ప్రసాద్ హిందీలోజెండా ఉంచా రహే హమారా" గీతం రాశారు.

జాస్తి వెంకట నర్సయ్య, ధూళిపాళ వెంకట సుబ్రహ్మణ్యం అనేక గీతాలు రాశారు.

ఈ విధంగా గురజాడ రాఘవశర్మ మొదలైన అనేక మంది కవిలు జాతీయ జెండాని కొనియాడుతూ గీతాలను రాశారు.

సహాయ నిరాకరణోద్యమ గీతాలు :

1920 లో కలకత్తాలో అత్యవసర సమావేశం జరిగింది అప్పుడు సత్యాగ్రహ ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. గరిమెళ్ళ సత్యనారాయణగారు మాకొద్దీ తెల్లదొరతనము అనే గీతాన్ని రచించారు ఈ గీతం ప్రతి ఊరిలోను విశేషంగా ప్రచారం చేయబడింది.

గేయం :

మాకొద్దీ తెల్లదొరతనము - దేవ

ఉప్పు సత్యాగ్రహం :

1930 లో ఉప్పు సత్యాగ్రహం దేశవ్యాప్తంగా తీవ్రంగా ఉన్నపుడు త్రిపురనేని రామస్వామి చౌదరి సూతాశ్రమ గీతాలు ప్రకటించారు. 1930 లో ఈ సమావేశానికి ఉన్నవ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. అప్పుడు త్రిపురనేని రామస్వామి చౌదరి సత్యాగ్రహుల నుదుటిన కుంకుమ బొట్టుపెట్టి ఈ కింది గేయం పాడతారు.

గేయం :

వీరగంధము తెచ్చినారము
వీరుడెవ్వఁడె దెల్పుడీ (తెలుగులో ఉద్యమగీతాలు. 2019, 117)

పై గేయం సూతాశ్రమం లోనిది. ప్రజలను సత్యాగ్రహ కార్యోన్ముఖులను చేసిన గేయమిది.

మిక్కిలినేని భగవంతరావు గారు భారతదేస బానిసత్వాన్ని ఈ గేయంలో వర్ణించారు.

కొండవల్లి జగన్నాథరావు గారు సహాయనిరాకరణ ఉద్యమాన్ని సహాయనిరాకరణము శీర్షికతో ఈ కింది గేయాన్ని రాశారు.

గేయం :

నిరాకరణమను మిఠాయి యిదుగో బిరాన రుచి చూడండి
వేరేపోయి కొనబనిలేదిక - చీరాలపురిలో కొల్లగ దొరకును ॥ నిరాకరణ ॥

పై గేయంలో "సత్యాగ్రహమనే గోధుమ పిండిలో సత్యసారమనే ఆజ్యంపోసి, సాత్వికమనే పెద్దబాండములో. సత్యాగ్రహమనే పాకంపట్టి, మానుషమనే బియ్యంపిండిలో జ్ఞానమనే తేనెను కలిపి, ముని గాంధీయని చెఱకు బెల్లంతో మున్సిపాలిటీ పాకం పట్టిన, దేశభక్తియను గోధుమనూకలో, దేశముక్తియను వెన్నను కలిపి, దేశభక్తి జగమంత నిండగ, సత్యాగ్రహులు తయారుచేశారని" కొండవల్లి జగన్నాథరావు గారు ఆనాటి సత్రాగ్రహ ఉద్యమాన్ని అభివర్ణించారు.

గురజాడ రాఘవశర్మగారు ఉప్పు సత్యాగ్రహానికి మకుటాయమానమైన గేయాన్ని రాశారు.

జాతీయ గీతాలు సంకలనంలోనిది ఈ గేయం. ఇంకా అనేక గేయాలు ప్రజల గొంతులలో ప్రతిధ్వనించాయి. అనేకమంది కవులు దేశమాతను, జాతీయ నాయకులను స్తుతిస్తూ కోకొల్లలుగా జాతీయ గేయాలు రాశారు. తమ రచనలలో పంజాబ్ దురంతాలను ప్రకటిస్తూ, జాతీయ జెండాను స్తుతిస్తూ, దాని వైశిష్ట్యాన్ని ప్రజలకు తెలియజేశారు. సహాయ నిరాకరణోద్యమ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రతి భారతీయుడి ఊపిరిగా నిలిపారు.

జాతీయోద్యమంలో నిర్మాణ కార్యక్రమాలు, స్వాతంత్ర్యోద్యమ గీతాలు కూడా ఎన్నో ఉన్నాయి.

ఈ కింది గేయాన్ని మద్రాసు ఆకాశవాణి వారు 1947 ఆగష్టు 14 వ తేదీ రాత్రి రికార్డు చేసి, 15 వ తేదీ ఉదయం ప్రసారం చేశారు.

గేయం :

మ్రోయింపు జయభేరి - వాయింపుము నగారా
తేలింపుము నభోవీథిని త్రివర్ణాంచిత ప్రతాపా ॥ మ్రోయింపు ॥
భారతదేశ స్వేచ్ఛాసూర్య నాచ్ఛాదించు రాహుచ్ఛాయ
అంతర్ధానమాయె ..... అంతర్ధానమాయె ॥ మ్రోయింపు ॥
దేశదేశముల దీనజనానికి దాస్యబంధన విముక్తి
ద్వేషరోషములు తెగలుపగలు
వశియింప జగమెల్లశాంతి ॥ మ్రోయింపు ॥

అనే గేయాన్ని ప్రసారంచేసి భారతీయులు తమ ఆనందాన్ని అభివ్యక్తం చేశారు.

ముగింపు :

బ్రిటిషు వారు భారతదేశాన్ని బానిసదేశంగా మార్చినపుడు ఆ సంకెళ్ళను విడిపించడంలో మనజాతీయ నాయకులతోబాటు కవులు కూడ ప్రధాన పాత్రవహించారని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. వారు తమ రచనలద్వారా ప్రజలను ఉద్యామాలకు ప్రేరేపించడమే గాక, వారు కూడ ఆ ఉద్యమాలలో స్వయంగా పాల్గొని శిక్షలను అనుభవించిన సందర్భాలు కూడ ఉన్నాయి. వారందరి త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్నాం. 80 వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నాం. ఈ స్వాతంత్ర్యానికి సంబంధించి రచయితల రాసిన సాహిత్యం, నేటి యువతకు తెలియవలసిన ఆవశ్యకత ఉంది. విద్యార్థి దశలో వారికి తెలియాలి, విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించి, బాల్యం నుండి విద్యార్థులలో దేశభక్తి పెంపొందింప జేయాలి. దేశ స్వాతంత్ర్యానికి పాటుపడిన నాయకులు, పోరాడి, ప్రాణాలు కోల్పోయిన వీరులు, రచయితల గురించి పాఠ్యాంశాలను పాఠశాల, కళాశాలలో మరియు విశ్వవిద్యాలయాలలో కూడ పాఠ్యాంశాలుగా బోధించాలి. ఆ విధంగా చేసినప్పుడే యువత లో జాతీయత, దేశభక్తి పెరిగి, ఉన్నతమైన ఆశయాలు కలిగి, దేశద్రోహులకు చరమ గీతం పాడతారు.

హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఈ అంశాన్ని 5 సంవత్సరాల ఎమ్.ఎ (IMA) విద్యార్థులకు ఒక సెమిస్టర్ లో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టింది. "జనరంజక తెలుగు సాహిత్యం - Popular Telugu Literature" అనే పాఠ్యాంశం.

ఉపయుక్త గ్రంథాలు :

1. అప్పారావు, బసవరాజు. 1934. బసవరాజు అప్పారావు గీతాలు.
2. కరుణశ్రీ, 1946. అరుణ కిరణాలు. రామాపబ్లిషర్స్, విజయవాడ.
3. కళారవి - ఉదయ కిరణాలు. (గేయమాల) సరసరచనా సమితి, విజయవాడ.
4. కృష్ణారావు, సూర్యనారాయణరావు.(సంపాదకులు)1939. చేనేత భజనావళి, చేనేత గ్రంథమాల, చీరాల.
5. జయరామరెడ్డి. యస్. 1986. చైతన్యగీతాలు. (హేతువాద గేయసంపుటి) భూప్రజసాహితీ నిలయం, అనంతపురం.

6. భగవంతరావు, మిక్కిలినేని. 1946. జాతీయ గీతాలు. దేసికవితామండలి, బెజవాడ.
7. సత్యనారాయణ, ఎస్వీ. 2019. తెలుగులో ఉద్యమ గీతాలు. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
8. సత్యనారాయణ, గరిమెళ్ళ. 1951. స్వరాజ్యగీతములు. ఇండియా యేజంసీ బీరో, మదరాసు.
9. సుబ్బరామశాస్త్రి, పైడిపాటి. - ఆంధ్రజాతీయగీతము(కరపత్రము).
10. సుబ్రహ్మణ్యం, బండ్ల. 1980. ఆంధ్ర మహాభ్యుదయ(పద్యకావ్యం)
11. రాఘవశర్మ, గురజాడ. 1973. జాతీయగీతాలు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-09 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253



తెలంగాణ చరిత్ర - సామాజిక పరివర్తనకు ప్రతిబింబాలు నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం' - పి.వి. నరసింహారావు 'గొల్ల రామవ్వ' కథల తులనాత్మక పరిశీలన

చేరాల సూర్యనారాయణ
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
చరవాణి : 9848351766, Email : suryacherala77@gmail.com.

సమర్పణ (D.O.S) : 20-08-2026 ఎంపిక (D.O.A) : 28-08-2026 ప్రచురణ (D.O.P) : 01-09-2026

సారాంశం

తెలంగాణ సాహిత్యంల కథా ప్రక్రియకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తెలంగాణ ప్రాంత చరిత్ర, సామాజిక జీవనం, రాజకీయ పరిణామాలు, ప్రజల పోరాటాలు, గ్రామీణ జీవన విధానం, మానవ సంబంధాలు కథా సాహిత్యంలో విభిన్న రూపాల్లో ప్రతిఫలించాయి. ముఖ్యంగా నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలు, తెలంగాణ సాయుధ పోరాటం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం వంటి చారిత్రక పరిణమాలు తెలంగాణ కథకులక ముఖ్యమైన ఇతివృత్తాలుగా నిలిచాయి.

ఈ నేపథ్యంలో నెల్లూరి కేశవస్వామి రచించిన 'యుగాంతం', పి.వి. నరసింహారావు రచించిన 'గొల్ల రామవ్వ' కథలు ప్రత్యేకంగా పరిశీలించదగినవి. 'యుగాంతం' ఒక రాజకీయ - సామాజిక వ్యవస్థ ముగింపును, ఆ మార్పు సాధారణ ప్రజల జీవితాలపై చూపిన ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. 'గొల్ల రామవ్వ' తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలోని ప్రజాధైర్యం, మానవీయత, ప్రతిఘటనలను ఒక సాధారణ గ్రామీణ మహిళా పాత్ర ద్వారా ఆవిష్కరిస్తుంది.

ఈ రెండు కథలను చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, మానవతా దృక్కోణాల్లో తులనాత్మకంగా పరిశీలించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం. రెండు కథల్లోనూ చరిత్రను పాలకుల దృష్టితో కాకుండా సామాన్య ప్రజల అనుభవాల ద్వారా చూడగలిగే అవకాశం కనిపిస్తుంది. ఒక కథలో 'యుగాంతం'గా ఒక వ్యవస్థ ముగుస్తుంటే, మరో కథలో ఆ కాలపు ప్రజా ప్రతిఘటనకు 'గొల్ల రామవ్వ' ప్రతీకగా నిలుస్తుంది.

కీలక పదాలు :

తెలంగాణ కథ, యుగాంతం, గొల్ల రామవ్వ, నెల్లూరి కేశవస్వామి, పి.వి. నరసింహారావు, నిజాం పాలన తెలంగాణ సాయుధ పోరాటం, సామాజిక పరివర్తన, ప్రజా చైతన్యం, మానవతా వాదం.

పరిచయం :

తెలుగు కథా సాహిత్యం సమాజ పరిణామాలను అతి సన్నిహితంగా నమోదు చేసిన సాహిత్య ప్రక్రియ. నవలతో పోలిస్తే కథ పరిమిత పరిమాణంలోనే జీవితంలోని ఒక ముఖ్యమైన సంఘటనను, ఒక సమస్యను లేదా ఒక సామాజిక వాస్తవాన్ని ప్రభావవంతంగా చిత్రించినగలదు.

తెలంగాణ కథా సాహిత్యానికి ఈ లక్షణం మరింత బలంగా వర్తిస్తుంది. ఎందుకంటే తెలంగాణ సమాజం అనేక చారిత్రక, రాజకీయ, సామాజిక పరిణామాలను అనుభవించింది. నిజాం పాలన, భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీ, రజాకార్ల దౌర్జన్యాలు, తెలంగాణ రైతాంగ పోరాటం, సాయుధ పోరాటం, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం వంటి సంఘటనలు ప్రజల జీవితాలను లోతుగా ప్రభావితం చేశాయి.

ఈ నేపథ్యంలో నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం', పి.వి. నరసింహారావు 'గొల్ల రామవ్వ' కథలు తెలంగాణ చరిత్ర - సమాజ సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన పాఠ్యాలుగా నిలుస్తాయి.

నెల్లూరి కేశవస్వామి – కథా నేపథ్యం :

నెల్లూరి కేశవస్వామి తెలంగాణ కథా సాహిత్యం ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించిన రచయిత. ముఖ్యంగా హైదరాబాద్ నగర జీవితం, పాత హైదరాబాద్ సామాజిక వాతావరణం, హిందూ-ముస్లిం సంబంధాలు, మారుతున్న సామాజిక పరిస్థితులు ఆయన కథల్లో ప్రతిఫలించాయి.

ఆయన కథలు హైదరాబాద్ నగరపు ప్రత్యేక సాంస్కృతిక వాతావరణాన్ని పాఠకుల ముందుకు తీసుకువస్తాయి. ముఖ్యంగా పాతబస్తీ జీవితం, అక్కడ ప్రజల మధ్య ఉన్న అనుబంధాలు, సామాజిక మార్పులు ఆయన కథా వస్తువుల్లో కనిపిస్తాయి.

'చార్మినార్ కథలు' ఆయన ముఖ్యమైన కథా సంపుటిగా గుర్తించబడుతుంది. అందులో 'యుగాంతం' వంటి కథలు హైదరాబాద్ సంస్థాన చరిత్రలోని ఒక కీలక దశను సాహిత్య రూపంలో నమోదు చేశాయి.

'యుగాంతం' – శీర్షికలోని అంతరార్థం :

'యుగాంతం' అనే పదం రెండు భాగాల కలయిక - 'యుగం', 'అంతం'. యుగం అంటే ఒక కాలం, ఒక వ్యవస్థ, ఒక జీవన విధానం. అంతం అంటే దాని ముగింపు. అందువల్ల 'యుగాంతం' అనే శీర్షిక ఒక వ్యక్తి జీవితంలోని ముగింపును కాకుండా ఒక సామాజిక - రాజకీయ వ్యవస్థ ముగింపును సూచించే ప్రతీకగా భావించవచ్చు.

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడం తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన రాజకీయ పరిణామం. ఈ పరిణామం కేవలం పాలకుల మార్పు మాత్రమే కాదు. ప్రజల జీవితాల్లో కూడా అనేక మార్పులకు కారణమైంది.

పాత అధికార సంబంధాలు బలహీనపడ్డాయి. కొత్త పరిపాలనా వ్యవస్థ ఏర్పడింది. ప్రజల భవిష్యత్తుపై కొత్త ఆశలు ఏర్పడ్డాయి. అదే సమయంలో గత అనుభవాల జ్ఞాపకాలు కూడా కొనసాగాయి. ఈ సంధికాలాన్ని 'యుగాంతం' కథ ప్రతిబింబిస్తుంది.

చరిత్ర నుంచి జీవితంలోకి 'యుగాంతం' :

చరిత్రలో ఒక సంఘటనకు తేదీ ఉండవచ్చు. కానీ ఆ సంఘటన ప్రజల జీవితంలో ఎలా అనుభూతి చెందబడిందో తెలుసుకోవాలంటే సాహిత్యం అవసరం.

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడం చారిత్రకంగా ఒక రాజకీయ సంఘటన. కానీ ఆ సమయంలో సాధారణ ప్రజలలో ఏమి జరుగుతోంది? వారి భయాలు ఏమిటి? ఆశలు ఏమటి? పాత సంబంధాలు ఎలా మారుతున్నాయి? భవిష్యత్తును వారు ఎలా ఊహిస్తున్నారు?

ఇలాంటి ప్రశ్నలకు కథా సాహిత్యం సమాధానాలను అన్వేషిస్తుంది. 'యుగాంతం' కథ యొక్క ప్రధాన ప్రాధాన్యత ఇదే. ఇది చరిత్రను కేవలం సంఘటనల వరుసగా కాకుండా, మనుషుల జీవితాల్లో చోటుచేసుకున్న పరివర్తనగా చూడటానికి అవకాశం కల్పిస్తుంది.

సామాజిక పరివర్తన :

రాజకీయ వ్యవస్థ మారినప్పుడు సమాజం కూడా మారుతుంది. అధికర సంబంధాలు మారుతాయి. ప్రజల మధ్య ఉన్న కొన్ని భయాలు తొలగుతాయి. కొత్త ఆశలు ఏర్పడతాయి. అయితే సామాజిక మార్పు ఒక్కరోజులో పూర్తికాదు. పాత ఆలోచనలు, పాత సంబంధాలు, పాత జ్ఞాపకలు కొంతకాలం కొనసాగుతాయి.

ఈ సంధికాల స్వభావాన్ని 'యుగాంతం' కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ 'యుగాంతం' అంటే కేవలం ఒక పాలన 'యుగాంతం' కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ 'యుగాంతం' అంటే కేవలం ఒక పాలన అంతం కాదు. ఒక సామాజిక మనస్తత్వానికి ముగింపు, మరో కొత్త ఆలోచనా ప్రపంచానికి ప్రారంభం.

మానవ సంబంధాలు :

నెల్లూరి కేశవస్వామి కథా ప్రపంచంలో మానవ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ సామాజిక జీవితంలో హిందూ - ముస్లిం సహజీవనం, పరస్పర అనుబంధం, మానవీయత వంటి అంశాలు ఆయన రచనల్లో ప్రతిఫలిస్తాయి.

రాజకీయ పరిస్థితులు ప్రజల మధ్య విభజనలను సృష్టించినా, సాధారణ ప్రజల జీవితాల్లో మానవీయ సంబంధాలు పూర్తిగా కనుమరుగు కావు.

అందువల్ల 'యుగాంతం' కథను రాజకీయ కథగా మాత్రమే కాకుండా మానవ సంబంధాల పరివర్తనను ప్రతిబింబించే కథగా కూడా చదవాలి.

పి.వి. నరసింహారావు – 'గొల్ల రామవ్వ' :

తెలంగాణ సాయుధ పోరాటం తెలంగాణ చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం. భూమి, భుక్తి, విముక్తి వంటి ఆకాంక్షలతో ప్రజలు సాగించిన పోరాటం అనేక కుటుంబాల జీవితాలను ప్రభావితం చేసింది.

ఈ చారిత్రక నేపథ్యంలో పి.వి. నరసింహారావు రచించిన 'గొల్ల రామవ్వ' కథ ప్రత్యేక ప్రాధాన్యతను పొందింది.

అందుబాటులో ఉన్న సాహిత్య ఆధారాల ప్రకారం ఈ కథ మొదట 1949 ఆగష్టు 15న ప్రచురితమైంది. తరువాత 'విస్మృత కథ' వంటి సంకలనాల్లో పునర్ముద్రితమైంది. కథకు సంబంధించిన రచయితత్వంపై కంత చర్చ ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న ఆధారాలు దీనిని పి.వి. నరసింహారావు రచనగా నమోదు చేస్తున్నాయి. పరిశోధనా వ్యాసంలో ఈ అంశాన్ని ఆధారంతో పేర్కొనడం శాస్త్రీయ పద్ధతి.

గొల్ల రామవ్వ - సాధారణ మహిళ నుంచి ప్రతీకగా 'గొల్ల రామవ్వ' కథలోని రామవ్వ సాధారణ గ్రామీణ మహిళ.

కానీ చారిత్రక పరిస్థితులు ఆమెను అసాధరణమైన నిర్ణయం తీసుకునే స్థితిలోకి తీసుకువస్తాయి. ప్రమాదంలో ఉన్న ఉద్యమకారుడిని రక్షించడానికి ఆమె చూపిన ధైర్యం కథలో కీలక అంశం. రామవ్వ పాత్రను మూడు కోణాల్లో చూడవచ్చు.

మానవీయ కోణం :

ప్రమాదంలో ఉన్న మరొక మనిషిని రక్షించాలనే సహజమైన మానవ స్పందన.

ప్రతిఘటన కోణం :

అధికార భయానికి పూర్తిగా లొంగిపోకుండా పరిస్థితులను ఎదుర్కోవడం.

స్త్రీ చైతన్య కోణం :

సమాజంలో సాధారణ స్థానంలో ఉన్న ఒక మహిళ కూడా చారిత్రక పరిస్థితుల్లో కీలక పాత్ర పోషించగలదని నిరూపించడం.

ఈ కారణాల వల్ల రామవ్వ పాత్ర ఒక వ్యక్తిని దాటి ప్రజా ధైర్యానికి ప్రతీకగా మారుతుంది.

తెలంగాణ స్త్రీ – చరిత్రలో ఒక మౌన శక్తి

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను సాధారణంగా నాయకులు, రైతులు, ఉద్యమకారులు వంటి కోణాల్లో అధ్యయనం చేస్తారు. అయితే మహిళల పాత్రను కూడా సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

'గొల్ల రామవ్వ' ఈ అంశాన్ని సాహిత్యరూపంలో ముందుకు తీసుకువస్తుంది. రామవ్వకు రాజకీయ పదవి లేదు. ఆమె నాయకురాలు కాదు. కానీ ఒక కీలక సందర్భంలో ఆమె తీసుకున్న నిర్ణయం ఆమెను చరిత్రలో నిలబెడుతుంది. ఇది సాహిత్యం చేసే గొప్ప పని.

చరిత్రలో పెద్ద పేర్లు మాత్రమే కాకుండా, చరిత్రను నిర్మించిన సాధారణ మనుషుల పాత్రను కూడా సాహిత్యం గుర్తిస్తుంది.

భాష – ప్రాంతీయత – వాస్తవికత

తెలంగాణ కథా సాహిత్యంలో భాషకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రజలు మాట్లాడే భాష, స్థానిక పదజాలం, యాస, సామెతలు, జీవన అనుభవాలకు సంబంధించిన పదాలు కథలో సహజత్వాన్ని పెంచుతాయి.

'గొల్ల రామవ్వ'లో తెలంగాణ మాండలిక స్పర్శ కథా వాస్తవికతను పెంచుతుంది. రామవ్వ పాత్ర ఏ సామాజిక నేపథ్యానికి చెందినదో ఆఎ మాటతీరు కూడా పాఠకుడు గ్రహించగలడు. భాష ఇక్కడ కేవలం సమాచార సాధనం కాదు. అది ప్రాంతీయ అస్తిత్వానికి గుర్తు.

రెండు కథల్లో చరిత్ర

'యుగాంతం', 'గొల్ల రామవ్వ' కథల ప్రధాన సామ్యం చరిత్రలో వాటికి ఉన్న సంబంధం. 'యుగాంతం'లో ఒక రాజకీయ వ్యవస్థ ముగింపు నేపథ్యంగా ఉంటుంది. 'గొల్ల రామవ్వ'లో ప్రజా నేపథ్యంగా ఉంటుంది. ఒకటి మార్పును చూపుతుంది. మరొకటి మార్పు కోసం జరిగిన ప్రజా ప్రతిఘటనను చూపుతుంది. అందువల్ల ఈ రెండు కథలను కలిపి చదివినప్పుడు తెలంగాణ చరిత్రలోని ఒక ముఖ్యమైన పరిణామం రెండు భిన్న కోణాల్లో మనకు కనిపిస్తుంది.

తులనాత్మక పరిశీలన

పరిశీలనా అంశం	'యుగాంతం'	'గొల్ల రామవ్వ'
రచయిత	నెల్లూరి కేశవస్వామి	పి.వి. నరసింహారావు
ప్రధాన నేపథ్యం	హైదరాబాద్ సంస్థానం ముగింపు	తెలంగాణ సాయుధ పోరాటం
కేంద్ర దృష్టి	సామాజిక మార్పు	మానవ ధైర్యం
ప్రధాన ప్రతీక	యుగాంతం	రామవ్వ
సామాజిక స్థలం	హైదరాబాద్ నగర జీవితం	తెలంగాణ గ్రామీణ జీవితం
ప్రధాన విలువ	మానవ సంబంధాలు	మానవత్వం, ధైర్యం
స్త్రీ పాత్ర	సామాజిక సంబంధాల నేపథ్యం	కేంద్ర పాత్రగా స్త్రీ
చారిత్రక ప్రాధాన్యం	ఒక వ్యవస్థ ముగింపు	పోరాటంలో ప్రజల పాత్ర

రెండు కథల్లో ప్రజల స్థానం చరిత్రను సాధారణంగా రాజులు, పాలకులు, రాజకీయ నాయకులు, ఉద్యమ నాయకుల చుట్టూ రాస్తారు.

కానీ ఈ రెండు కథలు చరిత్రను ప్రజల దృష్టికోణం నుండి చూడటానికి అవకాశం కల్పిస్తాయి. 'యుగాంతం'లో రాజకీయ మార్పు ప్రజల జీవితాల్లో ఎలా ప్రతిఫలిస్తుందో తెలుస్తుంది.

'గొల్ల రామవ్వ'లో ఒక సాధారణ మహిళ చారిత్రక సందర్భంలో ఎలా కీలకపాత్ర పోషిస్తుందో తెలుస్తుంది.

అందువల్ల ఈ రెండు కథలు ప్రజా చరిత్రకు సాహిత్య రూపాలుగా భావించవచ్చు.

మానవతా దృష్టి

రెండు కథల్లోనూ మానవతావాదం ఒక అంతర్లీన విలువగా కనిపిస్తుంది. మతం, కులం, సామాజిక స్థానం, రాజకీయ పరిస్థితులు మనుషుల మధ్య భేదాలను సృష్టించవచ్చు. కానీ సంక్షోభ సమయంలో మనిషిని మనిషిగా చూసే దృష్టి అత్యంత ముఖ్యమైనది.

'యుగాంతం'లో మారుతున్న సామాజిక పరిస్థితుల మధ్య మనవ సంబంధాలు ప్రాధాన్యం పొందుతాయి. 'గొల్ల రామవ్వ'లో ప్రమాదంలో ఉన్న వ్యక్తిని కాపాడే మానవీయ స్పందన ప్రధానమవుతుంది.

అందువల్ల రెండు కథల అంతరార్థంలో మానవత్వం సామాజిక మార్పుల కంటే శాశ్వతమైన విలువగా కనిపిస్తుంది.

సాహిత్యం – చరిత్ర – సామాజిక జ్ఞాపకం :

సాహిత్య చరిత్రకు ప్రత్యామ్నాయం కాదు. కానీ చరిత్రలోని మానవ అనుభవాలను అర్థం చేసుకోవడానికి అది ఒక ముఖ్యమైన అనుబంధ ఆధారం. చరిత్ర మనకు సంఘటనను చెబుతుంది.

సాహిత్యం ఆ సంఘటనలో మనిషి అనుభవాన్ని చూపుతుంది. ఈ దృష్టిలో 'యుగాంతం', 'గొల్ల రామవ్వ' కథలు తెలంగాణ చారిత్రక జ్ఞాపకాలను సజీవంగా ఉంచే సాహిత్య పాఠ్యాలుగా నిలుస్తాయి.

వీటి ద్వారా ఒక కాలపు భయం, ధైర్యం, ఆశ, నిరసన, మానవత్వం వంటి అనుభవాలను అర్థం చేసుకోవచ్చు.

సమకాలీన ప్రాసంగికత

ఈ కథలు కేవలం గతాన్ని చెప్పేవి కావు. నేటి సమాజంలో కూడా రాజకీయ, ఆర్థిక, సాంకేతిక మార్పులు మనుషుల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఒక వ్యవస్థ మారినప్పుడు సాధారణ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు వస్తాయన్న ప్రశ్న నేటికీ ప్రాసంగికమే.

అలాగే సంక్షోభ సమయంలో సాధారణ వ్యక్తి చూపించే మానవత్వం, ధైర్యం కూడా ఎప్పటికీ అవసరమైన విలువలే. అందువల్ల ఈ రెండు కథలను చారిత్రక కథలుగా మాత్రమే కాకుండా సమకాలీన మానవ విలువలను ప్రశ్నించే కథలుగా కూడా చదవవచ్చు.

ముగింపు :

నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం', పి.వి. నరసింహారావు 'గొలల రామవ్వ' కథలు తెలంగాణ చరిత్ర - సామాజిక పరిణామాలను విభిన్న కోణాల్లో ప్రతిబింబించే ముఖ్యమైన కథలు.

'యుగాంతం' ఒక రాజకీయ - సామాజిక వ్యవస్థ ముగింపును మాత్రమే సూచించదు; పాత జీవన విధానం నుంచి కొత్త దశకు సమాజం మారుతున్న సంధికాలాన్ని ప్రతిబింబిస్తుంది.

'గొల్ల రామవ్వ' ఒక సాధారణ గ్రామీణ మహిళ ద్వారా తెలంగాణ సాయుధ పోరాట కాలంలోని ధైర్యాన్ని, మానవీయతను, ప్రతిఘటనను ఆవిష్కరిస్తుంది.

ఈ రెండు కథలను కలిపి చదివితే ఒక ముఖ్యమైన విషయం స్పష్టవుతుంది; చరిత్రను నిర్మించేది కేవలం పాలకులు లేదా నాయకులు మాత్రమే కాదు; సాధారణ ప్రజలు కూడా చరిత్ర నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారు.

'యుగాంతం' ఒక యుగం ముగింపుకు ప్రతీయ అయితే, 'గొల్ల రామవ్వ' ప్రజల అంతర్గత ధైర్యానికి ప్రతీక.

ఒకటి వ్యవస్థ మార్పును చూపుతుంది; మరొకటి మనిషి ప్రతిఘటనను చూపుతుంది.

అందువల్ల ఈ రెండు కథలు తెలంగాణ కథా సాహిత్యంలో చారిత్రక అవగాహన, ప్రాంతీయ అస్తిత్వం, ప్రజా చైతన్యం, మానవతావాదం, స్త్రీ ధైర్యం వంటి అంశాలను అధ్యయనం చేయడానికి విలువైన సాహిత్య ఆధారాలుగా నిలుస్తాయి.

సాహిత్యం చరిత్రను కేవలం భద్రపరచదు; చరిత్రలో వినిపించని మనిషి స్వరాన్ని కూడా వినిపిస్తుంది. 'యుగాంతం', 'గొల్ల రామవ్వ' కథల సాహిత్య ప్రాసంగికత ఈ మానవీయ కోణంలోనే ఉంది.

ఆధార గ్రంథసూచి :

1. నెల్లూరి కేశవస్వామి, చార్మినార్ కథలు, 1981.
2. నెల్లూరి కేశవస్వామి, 'యుగాంతం', చార్మినార్ కథలు.
3. పి.వి. నరసింహారావు, 'గొల్ల రామవ్వ', విస్మృత కథ, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ, 1995.
4. కథానిలయం, నెల్లూరి కేశవస్వామి రచయిత వివరాలు మరియు 'యుగాతం' కథ నమోదు.
5. కథనిలయం, 'గొల్ల రామవ్వ' కథా నమోదు.
6. తెలుగు రచయిత, పి.వి. నరసింహారావు - రచయిత పరిచయం, 'గొల్ల రామవ్వ', కథకు సంబంధించిన పరిశోధనా సమాచారం.
7. నమస్తే తెలంగాణ, తెలంగాణ కథా సాహిత్యం, నెలూలరి కేశవస్వామి కథలపై ప్రచురితమైన సాహిత్య వ్యాసాలు.
8. తెలంగాణ కథా సాహిత్యంపై వెలువడిన విమర్శా గ్రంథాలు, పరిశోధనా వ్యాసాలు.
9. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు సంబంధించిన ప్రామాణిక చారిత్రక గ్రంథాలు.
10. హైదరాబాద్ సంస్థానం, నిజాం పాలన, తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన చారిత్రక ఆధార గ్రంథాలు.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-09 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

స్వర్ణయుగంగా ప్రకాశించిన సాహితీ జీవనం



సుండు శ్రీనివాస్
రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటి, హైదరాబాద్ - 500 007.

సమర్పణ (D.O.S) : 20-08-2026 ఎంపిక (D.O.A) : 28-08-2026 ప్రచురణ (D.O.P) : 01-09-2026

వ్యాస సంగ్రహం

సాహిత్యం సమాజానికి అద్దం మాత్రమే కాదు. మనిషి మనసుకు అక్షర రూపం. కాలం మరచిపోయిన అనుభూతులకు జ్ఞాపకం. మాటల్లో చెప్పలేని మనసు స్పందనలకు మౌన భాష మనిషి మనసుకు అక్షర రూపం. కాలం మరచిపోయిన అనుభూతులకు జ్ఞాపకం. మాటల్లో చెప్పలేని మనసు స్పందనలకు మౌన భాష. తెలుగు సాహిత్యపు విశాల ప్రస్థానంలో ఎన్నో రచయితలు, రచయిత్రులు తమదైన ఆలోచనా ప్రపంచాన్ని సృష్టించారు. కొందరు సమాజాన్ని ప్రశ్నించారు; కొందరు జీవితాన్ని విశ్లేషించారు; మరికొందరు మనిషి అంతరంగాన్ని అక్షరాల్లో ఆవిష్కరించారు. అయితే సాధారణ మనిషి జీవితంలోని సున్నితమైన అనుభూతులను, ముఖ్యంగా స్త్రీ హృదయంలోని ఆశలను, ఆవేదనలను, ఆత్మగౌరవాన్ని, ప్రేమను, స్వప్నాలను అక్షరాలుగా మలిచి లక్షలాది పాఠకుల హృదయాలకు చేరువైన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి.

కీలక పదాలు

యాద్దనపూడి సులోచన రాణి, ఆత్మాభిమానం, స్త్రీ సాధికారత, ఆత్మ గౌరవం, సెక్రటరీ, కీర్తి కిరీటాలు, జై జవాన్ ఆంధ్ర యువకుడా దారి ఇటు, విజేత, కుటుంబ సంబంధాలు, దేశభక్తి, దివి మహోత్సవాలు, ఋతురాగాలు, దూరదర్శన్, రాగ సప్త స్వరమ్, విన్ సేవా సంస్థ.

ఉపోద్ఘాతం

యద్దనపూడి సులోచనారాణి రచనా ప్రపంచంలోకి అడుగుపెడితే మనకు ఒక ప్రత్యేకమైన జీవన ప్రపంచం దర్శనమిస్తుంది. అక్కడ ప్రేమ ఉంది, కుటుంబం ఉంది, అనుబంధం ఉంది, సంఘర్షణ ఉంది, ఆత్మగౌరవం ఉంది, ఆశ ఉంది, నిరాశ ఉంది. ముఖ్యంగా జీవితాన్ని గెలవాలనే ఒక అంతర్గత తపన ఉంది. అక్షరాల్లో కనిపించే స్త్రీ కేవలం కుటుంబానికి పరిమితమైన వ్యక్తి కాదు. ఆమె ప్రేమిస్తుంది, ఆలోచిస్తుంది, ప్రశ్నిస్తుంది, నిర్ణయిస్తుంది, బాధపడుతుంది, తిరిగి నిలబడుతుంది. అందుకే మీ సాహిత్యంలో స్త్రీ పాత్రలను పరిశీలించడం అంటే ఒక కాలంలోని స్త్రీ మనస్తత్వాన్ని, కుటుంబ వ్యవస్థను, సామాజిక విలువలను, వ్యక్తిగత ఆకాంక్షలను పరిశీలించడమే. సులోచన రాణి రచన ప్రస్థానం మద్రాస్ ప్రెసిడెంట్లోని కృష్ణాజిల్లా కాజా గ్రామం హైదరాబాదు క్యాలిఫోర్నియాతో

ముగిసింది. ఆమె రచనలలోని సృజనాత్మకతకు, పాఠకాదరణకు, సంఘంలోని సముచిత వాతావరణంకై,సాహిత్య ప్రభావానికి ఆమె రచనలే ప్రధాన సాక్ష్యాలు. ఉదాహరణకు సెక్రటరీ, మీనా, జీవన తరంగాలు, కీర్తి కిరీటాలు, అగ్నిపూలు, బంగారు కలలు, జై జవా జవాన్, ఆంధ్ర యువ కూడా దారిటు, వంటి రచనలు తెలుగు పాఠక లోకంలో విశేష స్పందనను పొందాయి. ఈ రచనలను కేవలం ప్రేమకథలుగా లేదా కుటుంబ కథలుగా చూడటం వాటి అంతరార్థాన్ని పరిమితం చేయడమే అవుతుంది. వాటిలో వ్యక్తి-కుటుంబం, వ్యక్తి-సమాజం, స్త్రీ-పురుష సంబంధాలు, ప్రేమ-వివాహం, ఆర్థిక పరిస్థితులు, సామాజిక విలువలు, వ్యక్తిత్వ వికాసం వంటి అనేక జీవన పార్శ్వాలు అంతర్లీనంగా ఉన్నాయి. కాలం మారుతుంది. సమాజం మారుతుంది. జీవన విధానాలు మారుతాయి. కానీ మనిషి మనసులోని ప్రేమ, అనుబంధం, ఆత్మగౌరవం, గుర్తింపు కోసం చేసే అన్వేషణ మాత్రం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. అందుకే యద్దనపూడి సులోచనారాణి రచనలు ఒక నిర్దిష్ట కాలానికి చెందినవిగా కనిపించినప్పటికీ, వాటిలోని మానవీయ అనుభూతులు నేటికీ పాఠక హృదయాన్ని తాకగలుగుతున్నాయి.

వ్యాస విశ్లేషణ

"ఏదో ఒక విషయాన్ని ఎన్నుకొని దాన్ని చర్చించడం దానికి సంబంధించిన ఒక కొత్త కోణాన్ని పరిచయం చేయడము ఒక కొత్త వాదనను లేవనెత్తడము చేస్తూ వచనంలో సాగే ప్రక్రియ" (లక్ష్మణ చక్రవర్తి, సి,హెచ్, తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, పుట:1054) వ్యాసమని నిర్వచించబడింది. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అతి కొద్ది మంది రచయితల కోవకు యద్దనపూడి సులోచనా రాణి చెందుతారు. తెలుగు నవల సామ్రాజ్యంలో మకుటం లేని మహారాణి.

చిత్ర నళీనీయం అనే కథతో, సెక్రటరీ నవలతో ప్రారంభమైన సాహిత్య ప్రస్థానం 30 కథలు 75 నవలలతో తెలుగు సాహిత్యాన్ని పులకింప చేశారు. "దాదాపు యాభై, అరవై ఏళ్ల పాటు ప్రజల నాలుకల మీద నాట్యం చేసిన రచయిత్రి గా సులోచన మన్ననలు పొందింది. తన రచన జీవితంలో 75 నవలలు 30 కథలు తెలుగు సమాజానికి అందించింది". (డా. వేణుగోపాల్ నాగసూరి, సంపాదకీయం, యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన, పుట: 54) అనేక నవలలు సినిమాలుగా మలచడం జరిగింది. వచ్చిన అన్ని చిత్రాలు దాదాపుగా అన్ని ప్రజల మన్ననలు పొందినాయి. నవలను సీరియల్ ధారావాయికగా చిత్రికరించి ప్రదర్శించే వారు. దూరదర్శన్ లో మొదటిసారిగా సీరియల్ ను పరిచయం చేసింది సులోచన గారి బుతురాగాలు నవలఆధారంగా చిత్రికరించారు." 1997 నుంచి 1999 వరకు దూరదర్శన్,సప్తగిరి ఛానల్ లో మొదటిసారి ప్రారంభమైన తొలి దైనిక ధారావాహిక' బుతురాగాలు' సులోచన గారి నవలను అనుసరించే తీశారు" (బుద్ధప్రసాద్ మండలి వ్యాసం, యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన, పుట :107). సులోచన రాణి సాహిత్యం స్వర్ణయుగంగా ప్రకాశించినది అని చెప్పడానికి మనకు అనేక ఆధారాలు ఉన్నాయి. 1960-70 దశకంలో హైస్కూల్ కాలేజ్ చదివే విద్యార్థులు మరియు గృహినీలు మధ్యతరగతి కుటుంబంలోని స్త్రీ పురుషులు యద్దనపూడి సులోచనాన్ని నవలల్ని ఎంతో ఆసక్తిగా చదివే వాళ్ళు. ఆమె రాసిన నవలలను ప్యాకెట్ నవలలుగా మార్చి మరి చదివేవారు. మరీ ముఖ్యంగా ఆమె రాసిన సీరియల్స్ చదవటం కోసమే పత్రికలు కొనేవాళ్లు. జ్యోతి మాసపత్రిక ఆంధ్రజ్యోతి వారపత్రికల్లో సులోచన రాణి నవలలు ఎక్కువగా సీరియల్స్ గా వచ్చేవి.

సులోచన రాణి పాఠకుల నాడి పట్టిన రచయిత్రే కాకుండా పాటకుల కట్టిపడేసే వశీకరణ శక్తి ఆమెకు బాగా తెలుసు. రచనలలో అందరికీ అర్థమయ్యే పదజాలాన్ని వాడుతూ తన వర్ణనాచాతుర్యంతో పాటకులందరినీ మంత్ర ముగ్ధుల్ని చేసేది. ఆమె భాష సరళమైనది, పాఠకులకు సులభంగా అర్థమయ్యేది, భావోద్వేగాలను సహజంగా వ్యక్తీకరించేది. కథనంలో సంభాషణలకు, పాత్రల మనస్తత్వ చిత్రణకు, అనుభూతుల సున్నితమైన ఆవిష్కరణకు

ప్రత్యేక స్థానం ఉంది. అందువల్ల ఆమె రచనలు కేవలం కథా నిర్మాణం లేదా భావోద్వేగ వ్యక్తీకరణగా కాకుండా, ఒక సమగ్ర సామాజిక-సాంస్కృతిక పత్రంగా నిలుస్తాయి." సిద్ధాంత రాద్ధాంతాలను పాఠకుల నెత్తిన రుద్దకుండా మధ్యతరగతిని ఆకట్టుకునేలా సులోచన రాణి గారి రచనలు ఉండేవి" (బుద్ధ ప్రసాద్ మండలి వ్యాసం,యద్దనపూడి సులోచనారాన్ని సాహిత్య వివేచన, వ్యాస సంపుటి, పూట : 108) అని అనడంలో అతిశయోక్తి లేదు. సీరియల్స్ ను సస్పెన్స్ తో నడిపించి వచ్చేవారం ఏమి జరుగుతుందో అని ఉత్కంఠగా ఎదురు చూసే వాళ్ళుగా ఆమెరచనలను రాసేవారు. పత్రిక రాగానే ఇంటిల్లిపాది నేను ముందు అంటే నేను ముందు అంటూ ఒకరు చేతుల్లో నుంచి ఒకరు లాక్కొని చదివేవారు.

ఆమె రచనల్లోని పాత్రలు కేవలం కల్పిత పాత్రలుగా అనిపించవు. అవి మన ఇంట్లో, మన పక్కింట్లో, మన సమాజంలో మనకు ఎదురయ్యే వ్యక్తుల్లా అనిపిస్తాయి. అందుకే ఆమె నవలలను చదివిన పాఠకుడు కథను మాత్రమే చదవడు, ఇదే.తన జీవితంలోని ఏదో ఒక అనుభూతిని అందులో గుర్తించుకుంటాడు.అదేవిధంగా కథా నాయకలు అందకత్తెలు అహంకారంగా కాకుండా ఆత్మాభిమానం సంపూర్ణంగా తన దేహంలో ఒక భాగం అన్నట్లు ఉండేవారు. నాయకులూ కూడా హుందాగా పలుకుబడి కలిగి ఆడపిల్లలకు కలలా రాకుమారుల్లా సాక్షాత్కరించేవారు. కలలా రచయిత్రిగా ప్రసిద్ధి రావటానికి కారణం. ఇదే యద్దనపూడి సులోచనారాణి రచనా ప్రతిభకు ప్రత్యేకమైన గుర్తింపు రచయిత్రి ప్రాధాన్యంకాలం మారుతుంది. సమాజం మారుతుంది. జీవన విధానాలు మారుతాయి. కానీ మనిషి మనసులోని ప్రేమ, అనుబంధం, ఆత్మగౌరవం, గుర్తింపు కోసం చేసే అన్వేషణ మాత్రం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. అందుకే యద్దనపూడి సులోచనారాణి రచనలు ఒక నిర్దిష్ట కాలానికి చెందినవిగా కనిపించినప్పటికీ, వాటిలోని మానవీయ అనుభూతులు నేటికీ పాఠక హృదయాన్ని తాకగలుగుతున్నాయి.

సులోచన రాణి కథలు, నవలలు సమాజంలోని అన్ని అంశాలను ప్రతిబింబించే విధంగా కొనసాగింది.ఆమె కథా నాయికలు కేవలం ప్రేమ కోసం ఎదురుచూసే వ్యక్తులు మాత్రమే కాదు. వారి జీవితాల్లో కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు, సామాజిక నియమాలు, వ్యక్తిగత ఆకాంక్షలు, ఆత్మగౌరవం వంటి అంశాలు పరస్పరం సంఘర్షిస్తాయి. ముఖ్యంగా సెక్రెటరీ-జయంతి, మీనా-మీనా, జాహ్నవి - జాహ్నవి, జీవన తరంగాలు-రాధ మొదలైన నవలలలోనిస్త్రీ పాత్రలు ప్రేమించగలవు,బాధను భరించగలవు సమస్యలను ఎదుర్కొనగలవు, ప్రశ్నించగలవు.తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోగలవు, జీవితంపై నిర్ణయాలు తీసుకోవాలనే ఆకాంక్షను వ్యక్తపరచగలవు." సమాజంలోని రకరకాల స్త్రీల విభిన్న పరిస్థితులని వారి సమస్యలను ఏ కరువు పెడుతూ ఈ పరిస్థితులకు కారణమైన సమాజాన్ని కోర్టు మార్షల్ చేస్తాయి స్త్రీల పాత్రలు." (శ్రీమతి రామ్నాథ్, బాలాంత్రపు, వ్యాసం - ఎప్పుడు స్త్రీల పక్షమే, యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన, పుట: 192). ఈ కారణంగా ఆమె నవలల్లోని స్త్రీ పాత్రలు ఒక నిర్దిష్ట కాలంలోని మహిళల భావజాలాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సాహిత్య ఆధారాలుగా పరిశీలించవచ్చు.

మధ్యతరగతి జీవితం ప్రధానమైన ఆత్మీయులు, జీవన తరంగాలు, సంయుక్త, అవ్యక్తం నేపథ్యంగా నవలలో కనిపిస్తుంది.స్త్రీ సాధికారిక విషయానికి వస్తే యద్దనపూడి సులోచనారాణి రచనల్లో 'సెక్రటరీ' జాహ్నవి నవలు ప్రత్యేకమైన ప్రాధాన్యాన్ని పొందిన నవలగా పరిగణించవచ్చు.

ఉద్యోగ జీవితాన్ని, వ్యక్తిగత సంబంధాలను, ప్రేమను, ఆత్మగౌరవాన్ని, సామాజిక పరిస్థితులను కలిపి కథను నిర్మించే విధానం ఇందులో పరిశీలించదగిన అంశం. 'సెక్రటరీ' ద్వారా స్త్రీ ఉద్యోగ జీవితం, కార్యాలయ వాతావరణం, పురుష-స్త్రీ సంబంధాలపై సమాజపు దృష్టి వంటి అంశాలను కూడా పరిశీలించవచ్చు. కుటుంబ గౌరవం, ఆర్థిక పరిమితులు, ఉద్యోగం, వివాహం, ప్రేమ, సామాజిక ప్రతిష్ఠ, కుటుంబ బాధ్యతలు వంటి అంశాలు ఆమె కథా ప్రపంచంలో సహజంగా మిళితమై ఉంటాయి. ఆమె సాహిత్యంలో ప్రేమతో పాటు మమత, స్నేహం, కుటుంబ

అనుబంధం, తల్లిదండ్రులు--పిల్లల సంబంధం, భార్యాభర్తల సంబంధం వంటి మానవ సంబంధాలకు కూడా ప్రాధాన్యం ఉంది. దీనితోపాటు ఆదర్శ ఆదర్శ భావాలు, దేశభక్తి, శాస్త్రీయ దృక్పథం, సమాజానికి సేవ చేయడం,యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించడం మొదలైన విషయాలు జై జవాన్ విజేత ఆంధ్ర యువకుడా దారి ఇటు, మనసులు మమతలు,జాహ్నవి అనే నవలలలో సులోచన రాణి తెలుగు యువతకు ఒక సుస్పష్టమైన మార్గాన్ని చూపడం జరిగింది.

ముగింపు

తెలుగు సాహిత్యంలో అనేక వైవిధ్య ఫలితమైన రచనలను అందిచి తెలుగు సాహిత్యంలో సులోచన రాణి కాలాని సువర్ణ అక్షరాలతో లెక్కించవచ్చు.ఎందుకంటే ఈమె సాహిత్యంతో పాటు అనేక సమాజ సేవా కార్యక్రమాలు, అనేక 'విన్ ధార్మిక సంస్థను స్థాపించి తన రచనల ద్వారా వచ్చిన డబ్బులను ధార్మిక సంస్థకే వెచ్చించడం అనేది తర్వాతి తరం రచయిత్రి,రచయితలకు సాహిత్యం తోనే కాకుండా సాహిత్యం ద్వారా సమకూరిన ద్రవ్యాన్ని సైతం సమాజానికి ఎలా ఉపయోగించాలో ఒక మంచి ఉదాహరణగా నిలిచారు యద్దనపూడి సులోచన గారు.

అందుకే తెలుగు సాహిత్య చరిత్రలో యద్దనపూడి సులోచనారాణి పేరు కేవలం ఒక ప్రజాదరణ పొందిన రచయిత్రి పేరుగా మాత్రమే కాకుండా, పాఠక హృదయాన్ని చేరిన సాహిత్య అనుభూతిగా, మధ్యతరగతి జీవనాన్ని అక్షరాల్లో ఆవిష్కరించిన నవలా శక్తిగా, స్త్రీ మనసులోని సున్నితమైన భావాలకు స్వరం ఇచ్చిన రచయిత్రిగా చిరస్థాయిగా నిలుస్తుంది. ఆమె సాహిత్యాన్ని పునఃపరిశీలించడం అంటే ఒక రచయిత్రిని మాత్రమే అధ్యయనం చేయడం కాదు; ఒక కాలాన్ని, ఒక సమాజాన్ని, ఒక తరాన్ని, ఒక స్త్రీ అనుభవ ప్రపంచాన్ని, కాక ముఖ్యంగా మధ్యతరగతి మనిషి హృదయాన్ని అధ్యయనం చేయడం.

ఉపయుక్త గ్రంథాలు

1. 'ఆంధ్రుల అభిమాన రచయిత్రి యద్ధనపూడి సులోచనారాణి, 'సాహిత్య వివేచన' విశ్లేషణ వ్యాస సంపుటి, సంపాదకులు నాగనూరి వేణుగోపాల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, చంద్రమౌళి నగర్, గుంటూరు.
2. లక్ష్మణ చక్రవర్తి సి.హెచ్., సంపత్ కుమార్ చార్య, కోవెల (సంపా), తెలుగు సాహిత్య విమర్శ దర్శనం (విజ్ఞాన సర్వస్వం) సంపుటం హైదరాబాద్, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విజ్ఞాన స్వర్వస్వకేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2016.
3. యద్ధనపూడి సులోచనారాణి-నవలలు, ఎమ్మెస్కో బుక్స్, గగన్‌మహల్ రోడ్, దోమలగూడ, హైదరాబాద్.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-09 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

తెన్నేటి సుధాదేవి కవిత్వంలో స్త్రీల అస్తిత్వం



భూక్య సంధ్య
రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటి, హైదరాబాద్.

సమర్పణ (D.O.S) : 20-08-2026 ఎంపిక (D.O.A) : 28-08-2026 ప్రచురణ (D.O.P) : 01-09-2026

వ్యాస సంగ్రహం

ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వంలో తెన్నేటి సుధాదేవి రచనలు స్త్రీల జీవితం, వారి సమస్యలు, హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాలను ప్రతిబింబిస్తాయి. ఆమె కవిత్వంలో స్త్రీని కేవలం కుటుంబానికి పరిమితమైన వ్యక్తిగా కాకుండా, తన జీవితాన్ని తానే నిర్ణయించుకోగల స్వతంత్ర వ్యక్తిత్వంగా చిత్రించారు. 'జన్మహక్కు' వంటి కవితల్లో తల్లిని ప్రేమ, త్యాగం, రక్షణ, దైవత్వానికి ప్రతీకగా చూపిస్తూ మాతృత్వానికి భారతీయ సమాజంలో ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. అదే సమయంలో స్త్రీకి పురుషుడితో సమానమైన సామాజిక గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. 'సహనం సరిహద్దు', 'మౌనం వీడాలి' వంటి కవితల్లో స్త్రీ తన బాధలను మౌనంగా భరించకుండా, తన హక్కుల కోసం ధైర్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఆమె కవిత్వం వ్యక్తిగత భావోద్వేగాలకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక చైతన్యాన్ని, స్త్రీ విముక్తి ఆకాంక్షను ప్రతిబింబించే శక్తివంతమైన స్త్రీవాద స్వరంగా నిలుస్తుంది.

కీలక పదాలు

తెన్నేటి సుధాదేవి, స్త్రీవాద కవిత్వం, స్త్రీ సాధికారత, స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, స్త్రీ హక్కులు, గృహహింస, పురుషాధిక్య సమాజం, సామాజిక చైతన్యం, విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ హక్కులు, స్త్రీ విముక్తి, సామాజిక న్యాయం.

ఉపోద్ఘాతం

సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర అత్యంత కీలకమైనది. అయినప్పటికీ చరిత్రలోని అనేక దశల్లో స్త్రీ పురుషాధిక్య వ్యవస్థ, సామాజిక ఆంక్షలు, మూఢనమ్మకాలు, ఆర్థిక ఆధారపడటం, కుటుంబ హింస వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటూ వచ్చింది. ఆధునిక కాలంలో స్త్రీ విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ భాగస్వామ్యం వంటి రంగాల్లో ముందుకు వచ్చినప్పటికీ లింగ వివక్ష, గృహహింస, సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో స్త్రీవాద కవిత్వం స్త్రీల సమస్యలను బలంగా వ్యక్తీకరించింది. స్త్రీల బాధలు, ఆకాంక్షలు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాలకు కవిత్వం గొంతుకగా మారింది. ఈ స్త్రీవాద దృక్పథాన్ని

తన రచనల్లో సమర్థంగా వ్యక్తీకరించిన కవయిత్రుల్లో తెన్నేటి సుధాదేవి ఒకరు. ఆమె కవిత్వంలో స్త్రీ జీవితంలోని అంతర్గత వేదనతో పాటు సామాజిక అన్యాయంపై నిరసన కూడా కనిపిస్తుంది. స్త్రీని బలహీనురాలిగా కాకుండా తన హక్కుల కోసం పోరాడగల శక్తిమంతమైన వ్యక్తిగా ఆమె చిత్రించారు. ఆమె కవిత్వం స్త్రీ సమస్యలను కేవలం వ్యక్తిగత స్థాయిలో చూపకుండా వాటి వెనుక ఉన్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ కారణాలను కూడా ప్రశ్నిస్తుంది. అందువల్ల తెన్నేటి సుధాదేవి కవిత్వాన్ని పరిశీలించడం ద్వారా ఆధునిక తెలుగు స్త్రీవాద సాహిత్యంలో స్త్రీ సాధికారత, సమానత్వం, స్వేచ్ఛ వంటి భావాల పరిణామాన్ని అర్థం చేసుకోవచ్చు.

విషయం

తెన్నేటి సుధాదేవి అప్పుడప్పుడు రచించిన కవితల సంకలనం 'అమ్మ' సంపుటి. ఈ సంపుటిని సుధాదేవి తన తల్లి తెన్నేటి అహల్యాదేవికి అంకితం చేసింది. ఈ కవితా సంపుటిలో 'అమ్మ'ను తలుచుకుంటే కలిగే ఆర్ద్ర భావుకతను సుధాదేవి అక్షర రూపం చేసింది. 'అమ్మ' అనే శీర్షికతో రాసిన కవితలో అమ్మను గురించి ఈ విధంగా చెబుతుంది. 'అమ్మ' అనే రెండక్షరాల పదం చిన్నదైనా, దాని అర్థం అనంతమైనది. ఆ రెండు అక్షరాలు అమృత బిందువులవంటివి, ఎందుకంటే అవి ప్రేమను, అనురాగాన్ని, జీవనాధారాన్ని అందిస్తాయి. అవి ఆత్మీయతా సింధువులు, ఎందుకంటే తల్లి ప్రేమకు హద్దులు ఉండవు. ఈ ప్రపంచంలోని ప్రతి జీవిని దేవుడు స్వయంగా రక్షించడం సాధ్యం కాదని భావించి, ఆ బాధ్యతను నిర్వర్తించడానికి 'అమ్మ' అనే దైవస్వరూపాన్ని సృష్టించాడని రచయిత్రి భావించింది. అందుకే తల్లి ప్రతి జీవికి మొదటి గురువు, మొదటి దైవం, మొదటి రక్షకురాలు అంటుంది.

"అమ్మ అనే రెండక్షరాలు
అమృత బిందువులు
ఆత్మీయతా సింధువులు
ప్రతిచోటా ప్రతి జీవిని
పరిరక్షించే బాధ్యత
భారంగా తోచిన దేవుడు
అమ్మను సృష్టించాడట అంతట" *(సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:5).*

ఈ పద్యంలో కవయిత్రి తల్లి గొప్పతనాన్ని అలంకారికంగా, భావగర్భితంగా చిత్రించింది. 'అమృత బిందువులు' అనే రూపకం ద్వారా తల్లి ప్రేమ శాశ్వతమైనదని, జీవనానికి ఆధారమని తెలిపింది. 'ఆత్మీయతా సింధువులు' అనే పదబంధం ద్వారా తల్లి ప్రేమ సముద్రంలా అపారమైందని వ్యక్తం చేసింది. 'ప్రతి జీవిని పరిరక్షించే బాధ్యత భారంగా తోచిన దేవుడు' అనే భావం ద్వారా దేవునికే తల్లి అవసరం అనిపించిందనే కవికల్పనను ఆవిష్కరించింది. తల్లిని దేవుని ప్రతిరూపంగా చిత్రించడం ద్వారా భారతీయ సంస్కృతిలో మాతృస్థానానికి ఉన్న అత్యున్నత గౌరవాన్ని ప్రతిబింబించింది. తల్లి ప్రేమ, త్యాగం, రక్షణ, దైవత్వం వంటి అనేక విలువలను రచయిత్రి సుధాదేవి ఎంతో ప్రభావవంతంగా వ్యక్తీకరించింది.

ఈ కవితలోనే మరో పంక్తిలో తల్లి ప్రేమ, త్యాగం, వాత్సల్యం, ఆప్యాయత, పిల్లల పట్ల ఆమెకున్న అపారమైన అనురాగాన్ని కవయిత్రి హృదయస్పర్శిగా చిత్రించారు. తల్లి ఈ సృష్టిలో కనిపించే దైవమని, ఆమె ప్రేమకు సాటి మరొకటి లేదని, జీవితంలో ప్రతి మనిషికి అమ్మే మొదటి గురువు, మొదటి దైవం, మొదటి ఆశ్రయం అని ఈ పంక్తులు మనకు తెలియజేస్తాయి.

"అమ్మా! మాటలకందని మమతామయివి నీవు
నిత్య సత్య ప్రకృతివి అనాదివి కనిపించే దైవానివి
కనిపెంచిన జనయిత్రివి చిన్ననాడు చేయిపట్టి

అడుగులు వేయిస్తూ పరవశించిపోయావు
పెరిగిన దశలో ముందడుగులు వేస్తుంటే
చెప్పలేని ఆనందంతో పులకరించి పోయావు
నాకాలికి చిన్న ముల్లు గుచ్చుకున్నా
నీ గుండెల్లో గునపం దిగినంతగా విలవిల లాడేవు'' *(సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:6).*

తల్లి మాటలకు అందని మమతామయి. ఆమె ప్రేమ స్వార్థరహితమైనది, పవిత్రమైనది. తల్లి నిత్యసత్య స్వరూపిణి, ప్రకృతిలా సృష్టికి మూలం, కనిపించే దైవం. ఈ ప్రపంచానికి జన్మనిచ్చే జనయిత్రి తల్లేనని కవయిత్రి గొప్పగా కొనియాడారు. శిశువు చిన్నతనంలో చేయిపట్టి నడక నేర్పుతూ, ప్రతి చిన్న అడుగును చూసి పరవశించే తల్లి, పిల్లలు పెద్దయ్యాక జీవితంలో ఎదుగుతూ ముందడుగులు వేస్తుంటే కూడా అంతే ఆనందంతో పులకించిపోతుంది. పిల్లల విజయమే తన విజయంగా భావించే వ్యక్తి తల్లి మాత్రమే అని ఈ పంక్తులు తెలియజేస్తాయి. పిల్లల కాలికి చిన్న ముల్లు గుచ్చుకున్నా, అది తన గుండెల్లో గునపం దిగినంత బాధగా అనుభవిస్తుంది తల్లి. పిల్లల బాధను తన బాధగా భావించే ఆమె ప్రేమకు హద్దులు ఉండవు. అందుకే ఏ కష్టం వచ్చినా, ఏ బాధ కలిగినా, మన నోటి వెంట సహజంగానే 'అమ్మ' అనే పదమే వస్తుంది. ఆ పదం ధైర్యాన్ని, ఓదార్పును, భరోసాను అందిస్తుంది. బిడ్డల పట్ల అమ్మకుండే వాత్సల్యాన్ని హృద్యంగా చిత్రించింది సుధాదేవి.

తెన్నేటి సుధాదేవి 'జన్మహక్కు' అనే కవితలో స్త్రీని మాటల్లో మాత్రమే గౌరవించే సమాజాన్ని నిలదీస్తూ, ఆచరణలో సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరాన్ని బలంగా ప్రతిపాదిస్తుంది. స్త్రీ శక్తిని గుర్తించి, పురుషులతో సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన సామాజిక పురోగతి సాధ్యమవుతుందని తెన్నేటి సుధాదేవి ఈ కవిత ద్వారా స్పష్టమైన సందేశాన్ని అందించారు.

''పురాణాల్లో పురాతన గ్రంథాల్లో
సూక్తులు నీతులు ఏ పేరైతేనేం?
అన్నీ మహిళలకే వర్తించే మాయదారి కట్టుబాట్లు
ఓర్పుకు ప్రతీకవంటూ, ఆదిశక్తివంటూ
ఏవేవో బిరుదులు విశేషణాలే తప్ప
పురాషాధిక్య మహావృక్షచ్ఛాయలు
స్త్రీ సముచిత స్థానాంకురాల్ని
ఏనాడు ఎదగనిచ్చిందని?'' (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:50).

ఈ కవితలో రచయిత్రి తెన్నేటి సుధాదేవి సమాజంలో స్త్రీల పట్ల కొనసాగుతున్న ద్వంద్వ వైఖరిని తీవ్రంగా ప్రశ్నించారు. పురాణాలు, శాస్త్రాలు, నీతి సూక్తుల పేరుతో స్త్రీలకు మాత్రమే ఎన్నో నియమాలు, కట్టుబాట్లు విధించారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాటల్లో స్త్రీని 'ఆదిశక్తి', 'ఓర్పుకు ప్రతీక', 'గృహలక్ష్మి' అని కీర్తించినా, ఆచరణలో మాత్రం ఆమెకు సమాన హక్కులు, గౌరవం, స్వేచ్ఛ ఇవ్వలేదని రచయిత్రి విమర్శిస్తున్నారు. పురుషాధిక్య సమాజం స్త్రీల అభివృద్ధికి అడ్డంకిగా నిలిచి, వారి ప్రతిభ వికసించకుండా అణచివేసిందని ఆమె స్పష్టం చేస్తున్నారు. ఒకవైపు గొప్ప బిరుదులతో సత్కరిస్తూ, మరోవైపు ఇంట్లోనూ బయటా మానసిక, శారీరక, సామాజిక హింసలకు గురిచేయడం సమాజంలోని కపటత్వానికి నిదర్శనమని చెబుతున్నారు. అలాంటి నకిలీ గౌరవాలు, మాయా నాటకాలు ఇక చాలని హెచ్చరిస్తూ, స్త్రీలోని అసలైన శక్తిని గుర్తించి, ఆమెకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించాలని సుధాదేవి పిలుపునిస్తున్నారు.

అదే కవితలోని మరొక పంక్తి స్త్రీ సాధికారతకు ఒక ప్రకటన పత్రం వంటిది. స్త్రీ తన హక్కులను గుర్తించి, అన్యాయాలను ప్రతిఘటించి, సమానత్వాన్ని జన్మహక్కుగా సాధించుకునే నూతన యుగాన్ని కవయిత్రి ఆశావహంగా చిత్రించారు. స్త్రీ చైతన్యం అనేది ఇక ఆపలేని ప్రవాహం. అది సమానత్వ సమాజ నిర్మాణానికి మార్గదర్శక శక్తి అనే సందేశమే ఈ పంక్తులకి మూలసారం.

"కాలం మలుపు తిరుగుతున్నది స్త్రీ జాతి మేలుకొంటున్నది
అసమానతలు, హింసలు దురాచారాలపైన
పిడుగై విరుచుకు పడుతున్నది
ఉప్పెన కెరటంలా ఉవ్వెత్తున లేస్తున్నది
ఏ ఆనకట్టలూ ఆ ఉప్పెననాపలేవు
ఏ మాయాజాలం ఆమెనింక
నిద్రపుచ్చి మోసగించలేదు
మహిళా సాధికారతా బిల్లును
కలకాలం నిరోధించలేదు
జన్మహక్కుగా సమానతను సాధిస్తుంది
ప్రపంచపటంపై తన స్థానం ముద్రిస్తుంది
స్త్రీ జాతిమేలుకొంటున్నది
కాలం మలుపుతిరుగుతున్నది" (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:51).

ఈ పద్యం స్త్రీవాద దృక్పథాన్ని ప్రతిబింబించే చైతన్య కవిత. ఇందులో తెన్నేటి సుధాదేవి కేవలం స్త్రీ బాధలను మాత్రమే వర్ణించలేదు. ఆమె పోరాటస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, సాధికారతలను గంభీరంగా వ్యక్తం చేశారు. రచయిత్రి సుధాదేవి స్త్రీ చైతన్యం, సమానత్వ పోరాటం, మహిళా సాధికారత వంటి సమకాలీన అంశాలను శక్తివంతంగా ఆవిష్కరించారు. ఒకప్పుడు అన్యాయం, వివక్ష, హింస, దురాచారాలను సహించాల్సి వచ్చిన స్త్రీ నేడు తన హక్కుల కోసం ధైర్యంగా నిలబడుతోందని రచయిత్రి చెబుతున్నారు. స్త్రీలపై జరుగుతున్న అసమానతలు, హింసలు, దురాచారాలపై పిడుగులా విరుచుకుపడుతూ, ఉప్పెనలా ఉవ్వెత్తున లేచిన మహిళా శక్తిని చిత్రించారు. ఈ చైతన్యాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని, ఏ మోసపూరిత సంప్రదాయాలూ ఇక ఆమెను బంధించలేవని స్పష్టం చేశారు. మహిళా సాధికారతా బిల్లు ప్రస్తావన ద్వారా స్త్రీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం, సమాన హక్కులు లభించే దిశగా జరిగిన చారిత్రక మార్పును సూచించారు. సమానత్వం అనేది స్త్రీ జన్మహక్కు అని ప్రకటిస్తూ, ప్రపంచ వేదికపై తన ప్రతిభతో, కృషితో, సామర్థ్యంతో స్త్రీ తన స్థానాన్ని శాశ్వతంగా నిలబెట్టుకుంటుందని ఆశావహ సందేశాన్ని అందించారు.

ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వంలో స్త్రీ అంతరంగాన్ని అత్యంత సహజంగా, ఆవేదనతో చిత్రించిన కవయిత్రుల్లో తెన్నేటి సుధాదేవి ఒకరు. ఆమె కవిత్వం కేవలం వ్యక్తిగత భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్రమే కాదు, అది శతాబ్దాలుగా స్త్రీపై కొనసాగుతున్న సామాజిక వివక్షకు వ్యతిరేకంగా వినిపించే చైతన్య స్వరం. 'సహనం సరిహద్దు' అనే కవితలో సుధాదేవి స్త్రీ మౌనం, అణచివేత, అసమానతకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలనే తపన వ్యక్తమవుతుంది. స్త్రీ జీవితంలోని మౌన వేదనను మాత్రమే కాకుండా, ఆ మౌనం ఒకరోజు ప్రతిఘటనగా మారే చైతన్యాన్ని కూడా వ్యక్తం చేశారు. 'మౌనం వీడాలని' అనే ఆకాంక్ష స్త్రీ విముక్తికి తొలి అడుగు. ఈ కవిత స్త్రీని కేవలం బాధితురాలిగా చూపకుండా, తన అస్తిత్వాన్ని గుర్తించి అన్యాయాన్ని ఎదిరించే చైతన్యవంతురాలిగా ఆవిష్కరిస్తుంది. అందువల్ల ఈ పద్యం ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వంలో ఒక శక్తివంతమైన సామాజిక ప్రకటనగా నిలుస్తుంది.

"మౌనం వీడాలని
అన్యాయాన్నెదిరించాలని ఉంది
స్త్రీనైనందుకు చిన్ననాటి నుంచీ
మౌనం మదిలో పేరుకు పోయింది
ఘనీభవించి కూచున్నది
లోలోపల అగ్ని జ్వాలలు
ప్రజ్వరిల్లుతూనే ఉన్నై
అసమానతలపై గొంతెత్తలేని
నా అసమర్థత,
బాహాటంగా ఎదిరించలేని
నా అశక్తత,
నన్నే పరిహసిస్తున్నాయి" (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:55).

ఈ కవిత నేటి సమాజంలో కూడా అత్యంత సమకాలీనమైనది. విద్య, ఉద్యోగం, రాజకీయాలు, కుటుంబం వంటి అనేక రంగాల్లో స్త్రీలు అవకాశాలు పొందుతున్నప్పటికీ, లింగవివక్ష, గృహహింస, సామాజిక ఆంక్షలు, భావప్రకటన స్వేచ్ఛపై పరిమితులు ఇంకా కొనసాగుతున్నాయి. అందువల్ల ఈ కవిత ఒక వ్యక్తి అనుభవం మాత్రమే కాకుండా సమాజంలోని అనేక మంది స్త్రీల అనుభవాలకు ప్రతినిధిగా నిలుస్తుంది. చిన్ననాటి నుంచే 'అమ్మాయి కాబట్టి ఇలా ఉండాలి', 'ఎదురు మాట్లాడకూడదు', 'అడిగినదే చేయాలి' వంటి సామాజిక నియమాలు ఆమె వ్యక్తిత్వాన్ని క్రమంగా మౌనంలోకి నెట్టివేస్తాయి. సుధాదేవి ఈ మౌనాన్ని వ్యక్తిగత స్వభావంగా కాకుండా, సమాజం నిర్మించిన సంకెళ్లుగా చిత్రించింది. స్త్రీలోని మానసిక సంఘర్షణ అత్యంత హృద్యంగా వ్యక్తమవుతుంది. సమాజం తనను అణచివేసినందుకు మాత్రమే కాదు, తాను ఎదిరించలేక పోతున్నాననే ఆత్మవిమర్శ కూడా ఆమెను బాధిస్తుంది. 'నన్నే పరిహసిస్తున్నాయి' అనే వ్యక్తీకరణ ద్వారా తన మౌనంపై తనకే కలిగిన అసంతృప్తిని తెన్నేటి సుధాదేవి సున్నితంగా ఆవిష్కరించింది.

అదే పద్యం మరికొన్ని పంక్తులలో స్త్రీ జీవితంలోని వేదనను మాత్రమే కాకుండా, ఆ వేదన నుంచి చైతన్యం వైపు సాగాల్సిన అవసరాన్ని కూడా తెలియజేస్తుంది. 'ఎక్కడ నీ సంకల్పబలం? ఎందుకు ఈ నీ మౌనం?' అనే ప్రశ్నలు ప్రతి స్త్రీలో ఆత్మవిశ్వాసాన్ని రగిలించే ఉద్యమ నినాదాలుగా నిలుస్తాయి. అందువల్ల ఈ పద్యం స్త్రీ ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పిలుపునిచ్చే చైతన్యాత్మక కవితగా ప్రత్యేక స్థానం పొందింది.

"చదువూ సంధ్యా
ఉద్యోగం సద్యోగం
ఏదీ స్త్రీకి గౌరవాస్పదం కాకున్నది
ఇంటా బయటా
గుండెలు పిండే ఎన్నో అవమానాలను
దిగ మింగటమే అవుతోంది
మాటల ఈటెలకు
మనస్సు తూట్లు పడుతున్నా
మౌనంగా భరించుటే అవుతున్నది
కన్నీటి వెనక విలవిలలాడే

నా మనస్సు ప్రశ్నిస్తున్నది
ఎక్కడ నీ సంకల్ప బలం?
ఎందుకు ఈ నీ మౌనం?" (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:56).

స్త్రీ ఎంత ఉన్నత విద్యను అభ్యసించినా, ఎంత మంచి ఉద్యోగంలో ఉన్నా, ఆమె వ్యక్తిత్వానికి తగిన గౌరవం సమాజం నుంచి లభించడం లేదని తెన్నేటి సుధాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగం స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇచ్చినా, సామాజిక గౌరవాన్ని మాత్రం పూర్తిగా అందించలేక -పోయాయని ఈ పంక్తులు తెలియ జేస్తున్నాయి. ఇంట్లో కుటుంబ సభ్యుల నుంచి, బయట సమాజంలో సహచరుల నుంచి ఎదురయ్యే వివక్ష, అవమానాలు ఆమె హృదయాన్ని కలచివేస్తున్నా, వాటిని వ్యక్తపరచకుండా భరిస్తూ జీవించాల్సిన పరిస్థితిని కవయిత్రి చిత్రించారు. శారీరక హింస కంటే మాటలతో చేసే అవమానం మనసుపై లోతైన గాయాలు చేస్తుందని, అయినప్పటికీ సమాజపు ఆంక్షల కారణంగా స్త్రీ తన బాధను మౌనంగా భరిస్తోందని సుధాదేవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'కన్నీటి వెనక విలవిలలాడే నా మనస్సు ప్రశ్నిస్తున్నది-ఎక్కడ నీ సంకల్పబలం? ఎందుకు ఈ నీ మౌనం?' అనే ప్రశ్నల ద్వారా పద్యం కీలక మలుపు తిరుగుతుంది. ఇక్కడ ప్రశ్నించేది సమాజం కాదు, స్త్రీ అంతరాత్మే. ఈ పద్యంలో స్త్రీవాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. విద్య, ఉద్యోగం మాత్రమే స్త్రీ సాధికారతకు సరిపోవని, ఆమెకు సమాజంలో సమాన గౌరవం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం లభించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని తెలియజేస్తున్నారు. స్త్రీ తన హక్కుల కోసం స్వయంగా గొంతెత్తాలని, మౌనాన్ని వీడి ప్రతిఘటించాలని ఈ పద్యం ప్రేరేపిస్తుంది.

తెన్నేటి సుధాదేవి 'నేను' అనే కవితలో స్త్రీ మనసులో దాగి ఉన్న ఆవేదనను, ఆమె స్వేచ్ఛా ఆకాంక్షను, సామాజిక చైతన్యాన్ని శక్తివంతంగా వ్యక్తీకరించారు. స్త్రీల మౌన వేదనను మాత్రమే కాదు, ఆ మౌనాన్ని ఉద్యమ స్వరంగా మార్చే సంకల్పాన్ని ప్రతిబింబించారు. స్త్రీ తన బాధలను చెప్పుకునే హక్కు, తన భావాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం కలిగి ఉండాలని సుధాదేవి ఈ కవిత ద్వార తెలియజేస్తున్నారు.

"బాధల గాథలు చెప్పాలని ఉంది
గొంతుకలో తారట్లాడే భావాలకు
ఊపిరి పొయ్యాలని ఉంది
పురుషాహంకార సమాజంలో
అనుక్షణం అవమానాలకు
గురి అయ్యే అతివల
తిరుగుబాటు బావుటాను
కావాలని ఉంది" (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:73).

ఎన్నో సంవత్సరాలుగా మౌనంగా భరిస్తున్న స్త్రీల జీవిత వేదనలకు స్వరం ఇవ్వాలనే తపన వ్యక్తమవుతుంది. ఇది కేవలం వ్యక్తిగత బాధ కాదు, సమస్త స్త్రీ జాతి అనుభవాల ప్రతిధ్వని. 'గొంతుకలో తారట్లాడే భావాలకు ఊపిరి పొయ్యాలని ఉంది' అనే పాదం స్త్రీల అణచివేయబడిన భావోద్వేగాలకు ప్రతీక. ఎన్నో భావాలు గొంతు దాటకుండా నిలిచిపోతాయి. సమాజ భయం, కుటుంబ పరిమితులు, సంస్కృతి పేరుతో విధించిన నియమాలు ఆమెను మౌనంలో బంధిస్తాయి. ఆ మౌనానికి ముగింపు పలికి, భావాలకు స్వేచ్ఛనివ్వాలనే సంకల్పాన్ని కవయిత్రి వ్యక్తం చేస్తున్నారు. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు నిరంతరం ఎదుర్కొనే అవమానాలు, వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడే ఉద్యమ పతాకంగా మారాలని కవయిత్రి ఆకాంక్షిస్తున్నారు. ఇక్కడ 'తిరుగుబాటు బావుటా' అనేది కేవలం ప్రతిఘటనకు మాత్రమే కాదు, సమానత్వం, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, న్యాయం కోసం జరిగే సామాజిక ఉద్యమానికి

ప్రతీక. 'బాధల గాథలు', 'గొంతుకలో తారట్లాడే భావాలు', 'తిరుగుబాటు బావుటా' వంటి ప్రతీకలు పద్యానికి భావగాంభీర్యాన్ని, ఉద్యమ స్ఫూర్తిని అందించాయి. వ్యక్తిగత అనుభవాన్ని సామాజిక చైతన్యంగా విస్తరింపజేయడం ఈ కవిత ప్రత్యేకత.

'ఓ నారీ ఉద్యమించు' అనే కవితలో సుధాదేవి స్త్రీలను చైతన్యవంతులుగా, ఆత్మగౌరవంతో జీవించే వ్యక్తులుగా తీర్చిదిద్దే సందేశాన్ని చిత్రించారు. పురుషాధిక్యాన్ని ధిక్కరించి, మోసపూరిత వాగ్దానాలను గుర్తించి, తన హక్కుల కోసం ధైర్యంగా పోరాడాలని ప్రతి మహిళకు పిలుపునిచ్చే సామాజిక చైతన్య గీతంగా ఈ పద్యం నిలుస్తుంది. స్త్రీ సమానత్వం, స్వేచ్ఛ, రాజకీయ సాధికారత వంటి ఆధునిక విలువలను బలంగా ప్రతిపాదించిన రచనగా ఇది విశిష్ట స్థానం పొందుతుంది.

"యుగాలుగా నీ ఉనికిని పరికించు
పురుషాధిక్యం నిరాకరించు
ఓ నారీ ఇక నీ సహనం చాలంచు
పాగడ్తలకు పొంగిపోకు
లొంగిపోకు క్రుంగిపోకు
సంస్కర్తలమంటూ
గొంతు చించుకునే నేతలు
మహిళల రాజ్యాధికార హక్కు
మాయ చేసి మంట గలుపుతున్నారు
మోకాలొడ్డి మోసం చేస్తున్నారు" (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:79, 80).

ఇందులో తెన్నేటి సుధాదేవి స్త్రీని జాలిపడే వ్యక్తిగా కాకుండా, తన హక్కుల కోసం పోరాడగల శక్తిగా చిత్రించారు. పురుషాధిక్య వ్యవస్థను ఎదిరించడం, మౌనాన్ని వీడటం, ఆత్మగౌరవంతో జీవించడం, రాజకీయ మరియు సామాజిక రంగాల్లో సమాన అవకాశాలను సాధించడం వంటి అంశాలను కవయిత్రి ప్రధానంగా ప్రస్తావించారు. 'పాగడ్తలకు పొంగిపోకు, లొంగిపోకు, క్రుంగిపోకు' అనే పునరుక్తి ప్రయోగం పద్యానికి లయను, సందేశానికి బలాన్ని అందించింది. స్త్రీలల్లో పోరాట స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు. రాజకీయ నాయకుల ద్వంద్వ వైఖరిని విమర్శించడం ద్వారా మహిళా సాధికారత కేవలం ప్రసంగాల్లో కాకుండా ఆచరణలోనూ అమలు కావాలని సుధాదేవి స్పష్టం చేశారు. 'పాగడ్తలకు పొంగిపోకు, లొంగిపోకు, క్రుంగిపోకు' అనే పాదాల ద్వారా కవయిత్రి స్త్రీలకు ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తున్నారు. తాత్కాలికమైన ప్రశంసలకు మురిసిపోకుండా, బత్తిడికి తలవంచకుండా, అవమానాలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడాలని చెబుతున్నారు. 'సంస్కర్తలమంటూ గొంతు చించుకునే నేతలు మహిళల రాజ్యాధికార హక్కును మాయ చేసి మంట గలుపుతున్నారు, మోకాలొడ్డి మోసం చేస్తున్నారు' అని పేర్కొంటూ, మహిళా సాధికారత గురించి గొప్పగా మాట్లాడే నాయకులు కూడా ఆచరణలో మహిళలకు రాజకీయ అధికారం కల్పించడంలో నిజాయితీగా వ్యవహరించడం లేదని విమర్శించారు. మహిళలకు రావలసిన హక్కులను వాయిదా వేస్తూ, తప్పుడు హామీలతో మోసం చేస్తున్న రాజకీయ వ్యవస్థను సుధాదేవి ఈ పద్యం ద్వార ప్రశ్నిస్తున్నారు.

అదే కవితలో మరికొన్ని పంక్తులలో స్త్రీపై జరుగుతున్న ప్రతి అన్యాయాన్ని నిరసిస్తూ, సమాజం తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, స్త్రీకి గౌరవం, భద్రత, సమానత్వం కల్పించినప్పుడే నిజమైన నాగరిక సమాజం నిర్మితమవుతుందని తెన్నేటి సుధాదేవి ఈ పద్యం ద్వారా బలమైన సందేశాన్ని అందించారు.

"అత్యాచారాలో, ఆత్మహత్యలో
వార్తల్లో లేనిరోజు ఉంటుందా?
నారీ! నీ మనుగడ సర్వం
సమస్యలకు నిలయం
నీ చుట్టూ దరికానని బాధా వలయం
నయవంచనలూ దుర్మార్గాలూ
నీ బతుకు బాట పొడుగూతా
గతుకులు, అవహేళనలు
నీ పై సానుభూతి లేదు
సమాజమూ నిన్నే అపహసిస్తుంది
కీచకుడూ, దుశ్శాసనుడూ కూడా
అన్యాయాన్నెదిరించాలని
వేదికపై గర్జించేవాడే
కట్నాలపైన యుద్ధభేరి మోగించేవాడే" (సుధాదేవి తెన్నేటి, అమ్మ కవితా సంపుటి, పుట:81).

అత్యాచారాలో, ఆత్మహత్యలో వార్తల్లో లేని రోజు ఉంటుందా?' అనే ప్రశ్నతో సుధాదేవి సమాజాన్ని నిలదీస్తుంది. ప్రతిరోజూ స్త్రీలపై జరిగే అత్యాచారాలు, ఆత్మహత్యలు వార్తల్లో కనిపిస్తూనే ఉండడం నేటి సమాజం ఎంత దయనీయ స్థితిలో ఉందో సూచిస్తుంది. స్త్రీపై అన్యాయం జరిగినప్పుడు సమాజం నిజమైన సానుభూతి చూపక, బాధితురాలినే నిందించే ధోరణిని స్పష్టంగా విమర్శించారు. మహాభారతంలోని కీచకుడు, దుశ్శాసనుడు వంటి పాత్రలను ప్రస్తావిస్తూ, నేటి సమాజంలో కూడా అలాంటి మనస్తత్వం ఇంకా కొనసాగుతోందని కవయిత్రి తెన్నేటి సుధాదేవి సూచిస్తుంది.

"కట్టుకున్న ఇల్లాలికి
నరకం చూపిస్తున్నాడు
కుటుంబ హింస భరించలేక
బలవంతపు చావుల పాల్చేస్తున్నాడు
నీ చుట్టూ పంజరాలు
సాలె గూళ్లు వలలూ
అధికాదికమవుతున్నై" (అదే పుట).

వేదికలపై మహిళా హక్కుల గురించి గొప్పగా మాట్లాడే వ్యక్తులే ఇంట్లో భార్యలను హింసించడం ద్వారా వారి ద్వంద్వ నీతిని ఎత్తిచూపింది. కట్న వ్యతిరేక ఉద్యమాల గురించి గొంతెత్తేవారే తమ కుటుంబాల్లో స్త్రీలను వేధించడం, కుటుంబ హింసకు గురిచేయడం వల్ల అనేక మంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దారుణ వాస్తవాన్ని రచయిత్రి ఆవిష్కరించారు. 'పంజరాలు', 'సాలెగూళ్లు', 'వలలు' వంటి ప్రతీకల ద్వారా స్త్రీ స్వేచ్ఛను బంధించే సామాజిక వ్యవస్థను కవయిత్రి కళాత్మకంగా ఆవిష్కరించారు. పద్యంలో భావోద్వేగ తీవ్రతతో పాటు సామాజిక చైతన్యం సమన్వయమై ఉంది.

'ఈనాడు అంతే' కవితలో తెన్నేటి సుధాదేవి ప్రాచీన మనుధర్మంలోని స్త్రీ వ్యతిరేక భావజాలాన్ని మరియు ఆధునిక సమాజంలోని ఆచరణాత్మక అసమానతలను సమాంతరంగా ఉంచి, 'చట్టపరమైన హక్కులు ఉన్నా, సామాజిక న్యాయం ఇంకా అసంపూర్ణమే' అనే సత్యాన్ని బలంగా ప్రతిపాదించారు. ఈ పద్యం స్త్రీ హక్కుల కోసం

సాగాల్సిన పోరాటం ఇంకా పూర్తికాలేదని గుర్తుచేస్తూ, నిజమైన స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం కలిగిన సమాజ నిర్మాణానికి పిలుపునిచ్చే చైతన్య గేయంగా నిలుస్తుంది.

"స్త్రీకి స్వాతంత్ర్యార్హత లేదని నాడు మనువంటే
మండిపడ్డాం కానీ ఈ సమాజంలో మనం
నేడు సాధించిన హక్కులేవీ? స్వేచ్ఛా వాసనలేవి?
నేటివరకూ స్త్రీ ఇంకా వరకట్నాల సంకెళ్ళలో బందీగా
అప్పుడప్పుడూ సజీవ దహనాలకు మానభంగాలకు
ఆలవాలమవుతూ ఆమె అవమానాలన్నీ
విశృంఖలంగా విజయ దుందుభులు మ్రోగిస్తుంటే
పత్రికల్లో పతాక శీర్షిక
ఆ ఔన్నత్యానికి పతాకగా సాక్ష్యం చెప్తుంటే" (సుధాదేవి తెన్నేటి, ఉదయకాంత కవితా సంపుటి, పుట:45).

ఈ పద్యం స్త్రీ జీవితంలోని సామాజిక వైరుధ్యాలను అత్యంత ప్రభావవంతంగా ప్రతిబింబిస్తుంది. రాజ్యాంగం సమాన హక్కులను ప్రకటించినప్పటికీ, సమాజం మాత్రం స్త్రీని ఇంకా వివక్షతోనే చూస్తోందని కవయిత్రి తెలియజేస్తారు. 'నేటివరకూ స్త్రీ ఇంకా వరకట్నాల సంకెళ్లలో బందీగా' అనే పాదంలో వరకట్న వ్యవస్థను సంకెళ్లతో పోల్చడం ద్వారా అది స్త్రీ స్వేచ్ఛను ఎలా బంధించిందో సూచించారు. స్త్రీలపై జరుగుతున్న అమానుష హింసను సూచిస్తుంది. కుటుంబంలోనూ, సమాజంలోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ మహిళలు భద్రతను కోల్పోతున్న దుస్థితిని ఇది ప్రతిబింబిస్తుంది. 'పత్రికల్లో పతాక శీర్షిక' అనే ప్రయోగం ఎంతో వ్యంగ్యాత్మకంగా ఉంది. ప్రతిరోజూ మహిళలపై జరిగే దారుణాలు వార్తల్లో ప్రధాన శీర్షికలుగా నిలుస్తున్నా, వాటిని అరికట్టే సమాజ సంకల్పం మాత్రం కనిపించడం లేదని సుధాదేవి విమర్శిస్తున్నారు. ఇది మీడియా పాత్రను కాదు, అలాంటి సంఘటనలు సాధారణ వార్తలుగా మారిపోయిన సామాజిక పరిస్థితిని ప్రశ్నిస్తుంది.

"ఎక్కడుంది ప్రగతి? అంతా అంధకారమే
మరి ఎక్కడుంది కాంతి?
నాడు మనువన్న మాటనూ
నేడు జరుగుతున్న దానినీ
క్షుప్తంగా సమీక్షించ నిర్ణయించి
హక్కూ, స్వేచ్ఛ సమానతల
అర్థమేమిటో అర్థంకాక
నింఘంటువు చూస్తున్నాను
ఇప్పుడు నాకదే పని" (సుధాదేవి తెన్నేటి, ఉదయకాంత కవితా సంపుటి, పుట:46)

'ఎక్కడుంది ప్రగతి? అంతా అంధకారమే-మరి ఎక్కడుంది కాంతి?' అనే ప్రశ్నలు ఈ పద్యానికి హృదయం వంటివి. సాంకేతిక అభివృద్ధి, ఆర్థిక పురోగతి, విద్యాభివృద్ధి జరిగినా, మహిళల భద్రత, గౌరవం, సమానత్వం లేకపోతే ఆ అభివృద్ధి అసంపూర్ణమని సుధాదేవి స్పష్టం చేస్తున్నారు. 'హక్కూ, స్వేచ్ఛ, సమానతల అర్థమేమిటో అర్థంకాక నిఘంటువు చూస్తున్నాను' అనే పాదం అత్యంత గాఢమైన వ్యంగ్యోక్తి. రాజ్యాంగంలో ఉన్న పదాలు వాస్తవ జీవితంలో కనిపించక పోవడంతో వాటి అర్థాన్నే నిఘంటువులో వెతకాల్సిన పరిస్థితి వచ్చిందని సుధాదేవి ఈ పద్యంలో చెప్పడం ద్వారా సమాజ వైఫల్యాన్ని ఎత్తిచూపారు.

తెన్నేటి సుధాదేవి రచించిన ఏ పద్యాన్ని పరిశీలించిన స్త్రీ విముక్తి అనేది కేవలం చట్టాల్లో ఉండే హక్కులతో సాధ్యం కాదని, సమాజపు ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే నిజమైన స్వేచ్ఛ, సమానత్వం సాధ్యమవుతాయని చెబుతున్నారు. మహిళలపై హింస, వరకట్నం, లింగవివక్ష పూర్తిగా అంతరించిపోయినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తన పద్యాల ద్వార రచయిత్రి సుధాదేవి తెలియజేశారు.

ముగింపు

తెన్నేటి సుధాదేవి కవిత్వం ఆధునిక తెలుగు స్త్రీవాద సాహిత్యంలో ఒక చైతన్యవంతమైన స్వరంగా నిలుస్తుంది. ఆమె కవితల్లో స్త్రీల బాధ, వేదన మాత్రమే కాకుండా ఆ బాధను అధిగమించి స్వేచ్ఛ, ఆత్మగౌరవం, సమానత్వం సాధించాలనే సంకల్పం కూడా వ్యక్తమవుతుంది. స్త్రీకి విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమే కాకుండా కుటుంబంలో, సమాజంలో, రాజకీయ రంగంలో సమానమైన గౌరవం మరియు నిర్ణయాధికారం కూడా అవసరమని ఆమె స్పష్టం చేశారు. పురుషాధిక్య భావజాలం, గృహహింస, వివక్ష, మూఢాచారాలు, స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ స్త్రీలు మౌనాన్ని వీడి తమ హక్కుల కోసం పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. వ్యక్తిగత అనుభవాన్ని సామాజిక చైతన్యంగా మార్చడం ఆమె కవిత్వంలోని ప్రధాన లక్షణం. అందువల్ల తెన్నేటి సుధాదేవి కవిత్వం స్త్రీ విముక్తి, సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం వంటి విలువలకు బలమైన ప్రతినిధిగా నిలుస్తుంది. ఆమె కవితా దృక్పథం స్త్రీలకే కాకుండా సమానత్వ సమాజాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికీ చైతన్యాన్ని అందిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు

1. నారాయణరెడ్డి సి, ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు ప్రయోగములు-విశాలాంధ్ర పబ్లికేషన్స్ హౌస్, హైదరాబాద్, 2015.
2. బాపూరెడ్డి. జె, హృదయ పద్యం, జాబిలి పబ్లికేషన్స్, ప్లాట్ నెం.10, జూబ్లిహిల్స్, హైదరాబాద్-500033, రెండవ ముదద్రణ, 2003.
3. శ్రీశ్రీ, మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్, 2008.
4. సుధాదేవి తెన్నేటి, అమ్మ-కవితా సంపుటి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్-500027.
5. సుధాదేవి తెన్నేటి, ఉదయకాంత-కవితా సంపుటి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్- 500027.

★★★

భావవీణ
కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002, Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-9 | September 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Line : https://www.bhavaveena.com/

IMPORTANCE OF THE MOTHER TONGUE IN THE NEW EDUCATION POLICY NEP 2020 - CHALLENGES



RAMADEVI KANNEKANTI
M.sc(maths), M. Ed, M.A(psychology),
A.P SET(Edn), TG SET(Maths)
Junior lecture in mathematics
Telangana Minority Residential Educational Institutions
Nalgonda Girls Junior college
Nalgonda (Dst).

Language is like a lifeline for a human being. Just as breathing is necessary for a human being to survive, language is equally necessary for the conduct of life. Language is what separates a human being from all living beings. Today, human beings are living in the world with this language. Without language, human survival is questionable. Language is very crucial in acquiring knowledge. Language plays a major role in education, teaching and learning. No kind of education is possible without language. Mother tongue is the language that a child learns effortlessly from the mother's lap. Mother tongue is the language that every human being learns naturally without being aware that he is learning. There are thousands of languages in the world. Today, many of them are in danger due to the influence of modern technology and English. Linguists emphasize the importance of mother tongues and the need to continue them as the language of instruction.

India is home to many languages, great culture and literature. All the commissions mentioned about the education system in India have been highlighting the importance of mother tongues. A comprehensive National Education Policy came into effect in India in 1986. It was announced by the Ministry of Human Resource Development under the leadership of Prime Minister Narendra Modi

after almost 34 years. It was formulated on the basis of the Kasturi Rangan Commission. Through this education policy, modernity was added to the education system of the country and complete new changes were initiated. In this, a special place was given to the mother tongue while mentioning all the aspects. The main purpose of this article is to analyze the changes mentioned in this new National Education Policy, the importance given to the mother tongue, the possibilities of their implementation, and the challenges faced by mother tongues at present.

Keywords: New National Education Policy 2020. Mother tongue. Importance of mother tongue. Challenges faced by mother tongue. The way region languages is being implemented at the field level.

Definition of Mother Tongue

'Education should be taught in the mother tongue until the child grows up and becomes mature enough to understand education independently. Thus, the mental powers of the child can be fully developed.'

'Loving the mother tongue indicates our love for our nation,' said Mahatma Gandhi. 'Mother tongue is like mother's milk, foreign language is like milk from a bottle,' said the famous language philosopher Komraraju Lakshmana Rao.

'Mother tongue is like eyesight, other languages are like spectacles,' said former Vice President Venkaiah Naidu.

Language is a great gift to mankind. All the culture, literature and arts of every person are hidden in this language. However, when a person is a baby, he learns the language easily and naturally by drinking milk in his mother's lap, listening to the sounds coming out of his mother's mouth, and by the family and society around him. This becomes the mother tongue of that person. That is why every person has a strong hold on his mother tongue. No matter how many languages he learns, he first applies that feeling in his mother tongue and then expresses that feeling in the language he wants to express. That is why mother tongue is equal to any mother. Linguists say that we should respect our mother tongue as much as we respect our mother. It may be Telugu, English, Hindi, or any other language. That is why someone's language is called great.

Points mentioned by various commissions on mother tongue

Every commission on the education system in India has strongly emphasized the importance of mother tongue, which shows how important mother

tongue is. Starting from the Woods Dispatch Commission on education in India in 1854, the Hunter Commission in 1882, and the Basic Education Policy in 1937 also stated that functional education should be taught in the mother tongue with knitting needles. The Sargent Commission of 1944, the Radhakrishna Commission of 1948, and the Mudaliar Commission of 1952 also specifically mentioned the importance of the mother tongue. The Kothari Commission of 1964 proposed the three-language principle. It stated that the mother tongue should be continued as the first language. It proposed to implement the national language Hindi as the second language and the international language English as the third language. The first National Education Policy of India, which came in 1968, stated that this three-language principle should be strictly implemented by all the states of the country. The second National Education Policy of 1986 also supported this three-language principle and stated that the importance of teaching in the mother tongue at the primary stage should not be reduced. Later, the Unburdened Education Commission of 1993 also stated the importance of the mother tongue.

Importance of mother tongue in curriculum

The NCERT National Council of Educational Research and Training, formed in 1961, formulates and implements educational policies in the country, and provides suggestions and advice to the central and state governments. NCERT and SCERT are the institutions that prepare curriculum in India and provide it to the central and state governments. These institutions are guiding the education system in India, from a textbook-based approach to action-based, from memorization and reading for marks to thinking, and are constantly formulating new curriculums. This NCERT institution has revised the national curriculum from time to time and has suggested many changes in the education system so far. The first National Curriculum Framework was announced in the country in 1975. The National Curriculum Framework (NCF) that came out in 2005 proposed a shift from textbook-based to action-based education. It is the most important of the national curriculum frameworks. In this, in addition to introducing separate periods for each subject, separate periods and curriculum for language were mentioned. In it, a separate time period was mentioned for the mother tongue at each level. It was stated that the mother tongue should definitely be the medium of instruction in the primary education system. Priority was given to non-stressful education. Three hours a week were allocated to the mother tongue in the primary stage, five hours a week in the upper primary stage, and 6 hours a week in the higher stage.

New National Education Policy 2020

Maulana Abul Kalam Azad, the first Education Minister of India after independence, designed a strong central government control over education and a unified education policy across the country. While a comprehensive National Education Policy was announced in India in 1986, 34 years later, the National Education Policy was announced by the Union Ministry of Human Resource Development (MHRD) of the Government of India in 2020. This has brought about revolutionary changes by eliminating many gaps in the education system, including modern education trends, technical education, and today's modern education.

The National Education Policy was made to build a comprehensive education system in the country. The proposals made by these commissions are implemented from primary education to higher education in rural and urban areas of the country. The first National Education Policy in India was announced by Prime Minister Indira Gandhi in 1968, and the second National Education Policy was announced under the leadership of Prime Minister Rajiv Gandhi in 1986. The third National Education Policy 2020 was announced under the leadership of Prime Minister Narendra Modi.

The Kothari Commission recommended comprehensive changes in the education system in India in 1964-66. It called for a radical restructuring of the education system. It stated that equal opportunities should be provided to all and free and compulsory education should be provided to all children up to the age of 14. It proposed the three-language principle in school education. It suggested that education should be increased to six percent of the national income. The subsequent National Education Policy of 1986 stated that special attention should be paid to the educational development of women, Scheduled Castes and Scheduled Tribes in the country while eliminating social inequalities in the country. It emphasized the student-centered approach. The central government has brought NEP 2020 with the aim of bringing about radical changes in education to make quality education accessible to all to lead on the global stage. It has been stated that the best education is the best way to move forward by developing the rich capabilities and resources of the country for the well-being of the individual, society, the country and the world. It has been announced that the aim is to make inclusive, impartial and quality education available by 2030. This is to achieve the Sustainable Development Goals (SDGs). 'The first NEP 2020 was released in

the 21st century with the aim of meeting the many development challenges and needs growing in our country. This education system has been shaped by learning through observation and learning for exams, not by conceptual learning, but by logical critical thinking.'

School Education

Mother tongue is very important in school education.It emphasized that education and teaching should be carried out completely in the mother tongue of every person in the country from the time he enters school to the primary level, and if possible, the home language/mother tongue/local language should be the medium of instruction up to the eighth grade and thereafter. The NEP 2020 stated that the mother tongue can be continued as a special feature even after that. It directed that this policy should be followed by government and private schools. It stated that there should be no gap between the language spoken by the children and the language used as the medium of instruction.The NEP 2020 suggested changing the 10 + 2 school education plan already in force in schools. In its place, it was decided to introduce a curriculum in four levels in the 5 + 3 + 3 + 4 method for students from the age of 3 to 18 years.

Currently, the teaching of mother tongues in schools in the country

Currently, the teaching of mother tongues in schools in the country has become a village due to the influence of English. This poses a serious threat to the mother tongue in this society. People are eager to learn English in view of employment and opportunities. At that time, they are forgetting that they are reducing the importance of their mother tongue like their mother. However, the responsibility of seeing to it that the mother tongue is strictly implemented in schools lies with the governments.

Currently, at least in the primary stage, there are no schools that continue to use the mother tongue as the medium of instruction, both in government and private schools. The same situation continues in government and private schools. However, students who are learning English as the medium of instruction from the primary stage are learning Telugu only as a syllabus. With great difficulty, Telugu is being taught only as a subject in the primary and higher stages. Teaching is not done through Telugu medium. Then, the student reaches a situation where he is afraid if Telugu is seen in the higher stages.

Implementation of mother tongues

If we look at the current school education system in the country, the mother tongue is only seen in words and in the proposals of the commissions. The governments that should have implemented it strictly are continuing teaching in English medium in government schools from the primary stage. In this situation, we should think about how the mother tongue can survive. However, according to the original mother tongue rules, the mother tongue should be taught as the first language to the student. But as the importance of the mother tongue has decreased in schools, the mother tongue that should be taught as the first language is being taught as the second and third languages even in intermediate and degrees. This is like giving an axe to the mother tongues.

Challenges in the implementation of mother tongues

No state has announced that it will implement the regulations of the education commissions and the NEP 2020 proposals regarding the mother tongue as the medium of instruction at the primary, primary, upper secondary and higher levels. In no state has the mother tongue been fully implemented at the primary level. At least, government and private schools are not even thinking about that. In that case, it remains to be seen to what extent these proposals will protect the language. It is very important to teach children in their mother tongue. Because a child can express his joy and creativity in a language that is naturally and easily learned. But today, instead of teaching the mother tongue at the primary stage, ABCDs are being taught before A and A are being taught. Such a happy and pleasant environment is being deprived of students in schools.

Challenges of Telugu Language Teaching

Andhra Pradesh is the first state in India to fully implement the three-language principle proposed by the Kothari Commission. Telugu is the regional language of Andhra Pradesh and Telangana. Telugu is the mother tongue of about 10 crore people in the two Telugu states. Telugu is the fourth most spoken language in India after Hindi, Bengali and Marathi. In terms of teaching and learning in schools, Telugu is taught as a first language, second language and third language. For those whose mother tongue is Telugu, Telugu is taught as a first language. Telugu literature, culture and traditions are taught in this first language.

But when they have to teach Telugu along with their mother tongue, the Telugu language they are taught is taught as a second language. When the regional language is different, the language spoken by the less people in that area is different, and when the mother tongue is different, they have to learn the regional language spoken by the more people as a second language. This is a must for their daily lives. For such people, Telugu language or the local official language of that region is learned as a second language.

For example, in the Telugu states, the regional language and official language is Telugu. Since the mother tongue of the majority of the people here is Telugu, the people who speak Urdu, which is a minority, are learning Telugu as a second language. However, Telugu taught as a second language is very easy and is suitable for public affairs. This language does not have in-depth chapters, lessons, and analyses related to culture, traditions, customs, and literature.

With today's modern trends, with the influence of science, technology, and English, priority is being given to English language from the moment they enter school. Due to this, school students do not have a proper grasp of Telugu language literature. Thus, since students studying in English medium do not have a proper grasp of Telugu language, Telugu, which should be taught as a second language to those whose mother tongue is another language, is being taught as a second language instead of Telugu, which should be taught as a first language to those whose mother tongue is Telugu. This is not a matter for those whose mother tongue is Telugu at all.

Suggestions

To protect the mother tongue, as stated in the NEP 2020, it should be strictly implemented in government and private educational institutions through mother tongue teaching in schools. Government orders and court judgments should be issued in the mother tongue. The people should be made aware of the importance of the mother tongue. The people should be made aware of the need to preserve their culture and traditions and the consequences of reducing the language.

Everyone should work for the development of the Telugu language. Telugu must be used in their daily lives. If we speak Telugu at home, teach children to read and write in Telugu, read Telugu books, watch Telugu movies, listen to Telugu songs, participate in Telugu programs, use websites and apps related to

Telugu literature and language development, and support organizations working for the development of the Telugu language, the mother tongue will flourish for four periods.

Conclusion

Language is the supreme weapon that makes a person great. Therefore, the mother tongue, which is easily learned in the mother's lap, contributes greatly to the overall mental development of the person. The mother tongue, which is so important, should be implemented in the primary stage of the child. Until the last decade, teaching in the mother tongue was implemented to some extent in government and private schools as mentioned in the three-language principle. Today's modernity, the exponential growth of technology, and the influence of English have caused immense damage to mother tongues. Although the education commissions have mentioned the importance of this mother tongue, it must be said that it is not being implemented at the field level. One reason for the lack of implementation is that private educational institutions continue to be completely in English. Another reason is that teaching in English is implemented even in government educational institutions.

Reference books:

1. Telugu Literary Teaching Methods B.Ed. Telugu Academy.

2. National Education Policy 2020 Report.

3. Language, Society and Culture - Badriraju Krishnamurthy

★★★

సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్

వారి ఆధ్వర్యంలో

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభ పురస్కారం - 2026



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం - 2026 కార్యక్రమానికి
ముఖ్య అతిథిగా హాజరైన డా॥. బూసి వెంకటస్వామి గారు తెలుగు శాఖాధిపతి
శ్రీ ఎ.ఎస్.ఎన్.ఎం.ప్రభుత్వ కళాశాల, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా. ఆం.ప్ర.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం - 2026 అందుకుంటున్న
ప్రొఫెసర్ జి. శ్రీనివాసరావు, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, (స్వ.ప్ర), సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002.
Andhra Pradesh, Cell : 7386529274, 7989781963, Web : www.bhavaveena.com,
E-mail : parisodhanatelugu@gmail.com, Printed at : GLS Enterprises,
Guntur - 522 002. Ph. 9494 660 509.